

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50


సంపుటి: 15
సంచిక: 161



బుధవారం 31-8-2022

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


పాఠకులు, ఏజెంట్లు, ప్రకటనకర్తలు, శ్రేయోభిలాషులకు
సాక్షి
వినాయక చవితి శుభాకాంక్షలు



ఆజాద్‌తో జి-23 నేతల భేటీ

కాంగ్రెస్‌లోని జి-23 గ్రూప్‌నకు చెందిన పలువురు నేతలు మాజీ కాంగ్రెస్ నాయకుడు గులాంనబీ ఆజాద్‌తో సమావేశమయ్యారు.

వివరాలు 6లో



బాబ్రీ ధిక్కరణ కేసుల కొట్టివేత

బాబ్రీ మసీదు కూల్చివేత తర్వాత యూపీ ప్రభుత్వంతో పాటు ఇతరులపై నమోదైన ధిక్కరణ కేసులను సుప్రీంకోర్టు కొట్టివేసింది.

వివరాలు 6లో



అంధుడికి 47 లక్షల వేతనం

అంధుడైన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు మైక్రోసాఫ్ట్ కంపెనీలో రూ.47 లక్షల వేతన ప్యాకేజీతో ఉద్యోగం వచ్చింది.

వివరాలు 6లో



బుల్ బౌన్స్ బ్యాక్

స్టాక్ సూచీలు పుంజుకున్నాయి. ఈ ఏడాదిలో రెండో అతిపెద్ద లాభాన్ని ఆర్జించాయి. సెన్సెక్స్ 1,564 పాయింట్లు లాభపడింది.

వివరాలు 15లో

న్యూస్‌రీల్

ఫోన్ యాప్ ద్వారానే టీచర్ల హాజరు



రాష్ట్రంలోని ప్రభుత్వ టీచర్లు సెప్టెంబర్ 1 నుంచి ఇంటిగ్రేటెడ్ అటెండెన్స్ మొబైల్ యాప్ ద్వారా 'ఫేషియల్ రికగ్నిషన్' విధానంలో హాజరు వేయాలని పాఠశాల విద్యా శాఖ మంగళవారం ఆదేశాలిచ్చింది. దృష్టి లోపం ఉన్న ఉద్యోగులకు మాత్రం ప్రత్యేక మినహాయింపు ఇచ్చింది.

వివరాలు 2లో ▸

రేపు పింఛన్ పంపిణీకి సర్వం సిద్ధం



రాష్ట్రంలో గురువారం పింఛన్లు పంపిణీ చేయడానికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. 62.70 లక్షల మంది లబ్ధిదారులకు రూ.1,594.66 కోట్లు అందజేయనుంది. వలంటీర్లు గురువారం తెల్లవారుజాము నుంచే లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ సొమ్మును పంపిణీ చేస్తారు.

వివరాలు 2లో ▸

బొగ్గు కుంభకోణంలో అభిషేక్ బెనర్జీకి సమన్లు



బొగ్గు స్మగ్లింగ్ కుంభకోణం కేసులో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీకి ఈడీ సమన్లు జారీ చేసింది. సెప్టెంబర్ 2వ తేదీన విచారణకు హాజరు కావాలని ఆదేశించింది.

వివరాలు 6లో ▸

సెలవు

వినాయక చవితి సందర్భంగా నేడు 'సాక్షి' కార్యాలయానికి సెలవు. కావున గురువారం సంచిక వెలువడదు. పునర్దర్శనం శుక్రవారం.

ఇదండీ సంగతి



యూ ఆర్ అండర్ అరెస్ట్!

'కాకినాడ'లో..

బల్క్ డ్రగ్ పార్క్

తొండంగి మండలం కేపీ పురం-కోదాడ వద్ద ఏర్పాటు

రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం

- 90 రోజుల్లోగా డీపీఆర్ అందచేయాలని లేఖ
- దేశంలో 3 బల్క్ డ్రగ్ పార్క్‌ల కోసం కేంద్రం ప్రత్యేక పథకం
- తమిళనాడు, తెలంగాణతో పోటీపడి సాధించిన రాష్ట్ర ప్రభుత్వం
- ఫార్మా వ్యర్థాల నిర్వహణలో అగ్రగామి, ఫార్మా సిటీ ఉన్నందున ఏపీ వైపే కేంద్రం మొగ్గు
- మిగిలిన 2 బల్క్ డ్రగ్ పార్క్‌లు గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్‌కు..
- బల్క్ డ్రగ్ పార్క్‌తో భారీ పరిశ్రమలు, పెట్టుబడుల రాక
- ఫార్మాలో చిన్న పరిశ్రమలను ప్రోత్సహించేందుకు జగ్గయ్యపేట వద్ద ఎంఎస్‌ఎంఈ పార్క్ ఏర్పాటు
- ఫార్మా రంగంలో రాష్ట్రం అగ్రగామిగా నిలుస్తుందంటున్న పారిశ్రామికవేత్తలు



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. కాకినాడ జిల్లా తొండంగి మండలం కేపీ పురం, కోదాడ గ్రామాల పరిధిలో ఇది ఏర్పాటు కానుంది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనకు కేంద్ర ఎస్‌ఎస్‌సీ (స్కీమ్ స్టీరింగ్ కమిటీ) గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుకు సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదికను (డీపీఆర్) 90 రోజుల్లోగా ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ ఏజెన్సీ అయిన ఐఎఫ్‌సీఐ(ఇండస్ట్రియల్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)కు పంపాలని కేంద్రం కోరింది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్ శర్మకు కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ పరిధిలోని ఫార్మాస్యూటికల్స్ విభాగం సంయుక్త కార్యదర్శి ఎన్.యువరాజ్ మంగళవారం లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బల్క్ డ్రగ్స్ పార్క్‌ల ప్రోత్సాహక పథకం ద్వారా దీన్ని చేపట్టేందుకు అంగీకరిస్తూ వారం రోజుల్లోగా తమకు లేఖ పంపాలని అందులో కోరారు.

రూ.వేల కోట్ల పెట్టుబడులు..

బల్క్ డ్రగ్ పార్కుల ఏర్పాటును ప్రోత్సహించేందుకు 2020లో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక పథకాన్ని ప్రకటించింది. ఈ పథకం కింద

మిగతా 2వ పేజీలో ▶

సీఎం జగన్‌కు విమానం నమూనాను అందజేస్తున్న టాటా ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ హెడ్ మసూద్



ఏపీలో పెట్టుబడులకు ▸ టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ఆసక్తి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఆ సంస్థ ప్రతినిధుల భేటీ

రక్షణ, వైమానిక రంగంలో తయారీ, నిర్వహణ తదితర అంశాలపై చర్చ

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ ప్రతినిధులు భేటీ అయ్యారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో మంగళవారం సంస్థ కార్పొరేట్ ఎఫైర్స్, రెగ్యులేటరీ హెడ్ జె.శ్రీధర్, టాటా ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ హెడ్ మసూద్ హుస్సేనీలు సీఎంను కలిసి ఏపీలో పెట్టుబడులు, అవకాశాలపై చర్చించారు. రక్షణ, వైమానిక రంగంలో తయారీ, నిర్వహణ తదితర అంశాల్లో పెట్టుబడులు, అవకాశాలపై కూడా వారి మధ్య చర్చ జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయ సహకారాలు అందించడానికైనా సిద్ధంగా ఉన్నామని సీఎం జగన్ వారికి చెప్పారు. పారిశ్రామికంగా అనుసరిస్తున్న పారదర్శక విధానాలను ఆయన వారికి వివరించారు. సుశిక్షితులైన మానవ వనరులు, మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని సీఎం తెలిపారు. సమావేశంలో పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వేగంగా రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల డిజిటలీకరణ

150 ఏళ్ల నుంచి కాగితాల్లోనే రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల డేటా

- అవి పాడైపోవడంతో డిజిటలీకరణ చేపట్టిన ప్రభుత్వం
- 15 కోట్లకు పైగా పేజీలను స్కానింగ్ చేసి కంప్యూటర్లలో భద్రపరుస్తున్న రిజిస్ట్రేషన్ల శాఖ
- ఆర్నెలల్లో ఈ ప్రక్రియ పూర్తిచేసేందుకు కసరత్తు
- ఆ తర్వాత 1999కి ముందు డాక్యుమెంట్లు కూడా వెంటనే పొందే సౌలభ్యం



సాక్షి, అమరావతి: స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో 150 ఏళ్ల నుంచి ఉన్న పాత రికార్డులను డిజిటలీకరణ చేసే ప్రక్రియ వేగంగా జరుగుతోంది. దస్తావేజులు, వాటికి సంబంధించి మొత్తం 15 కోట్ల పేజీలను స్కానింగ్ చేసి కంప్యూటరైజ్ చేస్తున్నారు. రాష్ట్రంలో 1850 నుంచి ఆస్తుల రిజిస్ట్రేషన్ల వ్యవస్థ అమల్లో ఉంది. 1999 వరకు రిజిస్టర్ అయిన ప్రతి డాక్యుమెంట్‌ను ఒక పెద్ద వాల్యూమ్‌లో (పుస్తకం) ఎత్తిరాసి ఒరిజినల్ డాక్యుమెంట్‌ను రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారికి ఇచ్చేవారు. అమ్మినవాళ్లు, కొన్నవాళ్ల వివరాలను ఇండెక్స్ పుస్తకాల్లో నమోదు చేసేవారు. ప్రతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ వాల్యూమ్, ఇండెక్స్ పుస్తకాలు గుట్టలు గుట్టలుగా పడి ఉన్నాయి. మరోవైపు.. 1999 నుంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల కంప్యూటరీకరణ జరిగింది. దస్తావేజులను స్కాన్‌చేసి ఒరిజినల్స్‌ను వినియోగదారులకు ఇస్తున్నారు.

శిథిలమైన 150 ఏళ్ల నాటి రికార్డులు

ఇక అంతకుముందు జరిగిన రిజిస్ట్రేషన్ల ఈసీ నకలు కాపీ కావాలని అడిగితే ఈ వాల్యూమ్‌లో వెతికి ఇస్తున్నారు. ఇది చాలా క్లిష్టతరంగా మారింది. 150 ఏళ్ల నాటి రికార్డు కావడంతో అవన్నీ పాత పడిపోయాయి. వాల్యూమ్‌లు పట్టుకుంటే పేజీలు చిరిగిపోతూ, చిల్లులు పడి, పాడిపాడి అయిపోతూ

మిగతా 2వ పేజీలో ▶

అది పూర్తిగా ప్రభుత్వ విధానపరమైన నిర్ణయం

పాఠశాలల విలీనం, ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణపై హైకోర్టు

- అందులో జోక్యం చేసుకోలేం
- అధికరణ 226 కింద మేం ప్రభుత్వాన్ని నడపడంలేదు
- మేమున్నది ప్రభుత్వాన్ని నడపడానికి కాదు.. తదుపరి విచారణ సెప్టెంబర్ 13కి వాయిదా



సాక్షి, అమరావతి: పాఠశాలల విలీనం, ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ పూర్తిగా ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని, అందులో తాము ఏ రకంగానూ జోక్యం చేసుకోజాలమని హైకోర్టు తేల్చి చెప్పింది. అధికరణ 226 కింద తాము ప్రభుత్వాన్ని నడపడంలేదని స్పష్టం చేసింది. తామున్నది ప్రభుత్వాలను నడిపేందుకు కాదని తెలిపింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 13కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. పాఠశాలల విలీనం, ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ జీవోలను సవాలు చేస్తూ ఏపీ విద్యా పరిరక్షణ కమిటీ కన్వీనర్ డి.రమేశ్‌చంద్ర సింహగిరి పట్నాయక్ తాజాగా హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంతో పాటు ఇదే అంశంపై గతంలో దాఖలైన వ్యాజ్యాలు మంగళవారం సీజే ధర్మాసనం ముందు విచారణకు వచ్చాయి. కొందరు పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది అప్పారి సత్యప్రసాద్ వాదనలు వినిపిస్తూ, ప్రభుత్వ పాఠశాలల్లో కేవలం ఇంగ్లిష్ మీడియంలో బోధనకు ప్రభుత్వం సర్వం సిద్ధం చేస్తోందన్నారు. దీనివల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఈ వ్యాజ్యాలన్నింటిపై వీలైనంత త్వరగా విచారణ చేపట్టాలని ధర్మాసనాన్ని కోరారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ, ఇది పూర్తిగా ప్రభుత్వ విధాన నిర్ణయమని చెప్పారు. తరువాత ప్రభుత్వ న్యాయవాది (పాఠశాల విద్య) ఎల్వీఎస్ నాగరాజు స్పందిస్తూ, తాజా వ్యాజ్యంలో కౌంటర్ దాఖలుకు సమయం కావాలని కోరారు. ఏ వ్యాజ్యాల్లో కౌంటర్లు దాఖలు చేయలేదో వాటన్నింటిలో కౌంటర్లు దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశించింది.



ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

■ ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. మొత్తం 3,66,543 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 1,28,705 మంది ఉత్తీర్ణులయ్యారు. విద్యార్థులు సెప్టెంబర్ 10లోగా రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని బోర్డు అధికారులు సూచించారు.

12లో

వైట్ కాలర్ క్రిమినల్ రామోజీ



- మార్గదర్శి ఫైనాన్స్ కుంభకోణంలో అది సుస్పష్టం: మంత్రి అంబటి
- యథేచ్ఛగా ఆర్బీఐ నిబంధనల ఉల్లంఘన.. ఏకంగా రూ.2,600 కోట్ల డిపాజిట్ల సేకరణ
- మార్గదర్శిపై సుప్రీంకోర్టులో ఎస్‌ఎల్‌పీ దాఖలు చేయడం వల్లే రోజూ ప్రభుత్వంపై విషపు రాతలు
- టీడీపీకి అసలు అధ్యక్షుడు రామోజీనే

12లో

పెరిగిన భద్రత.. తగ్గిన నేరాలు

- రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణలో మెరుగైన పనితీరు
- కేసుల సత్వర దర్యాప్తులో దేశంలోనే మొదటి స్థానంలో ఏపీ
- నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో నివేదిక-2021 వెల్లడి

2లో

విధులు పక్కాగా..

ప్రభుత్వాస్పత్రుల పర్యవేక్షణ, నిర్వహణపై వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేక దృష్టి

- అక్కడ పనిచేసే అధికారులు, ఉద్యోగుల జాబ్‌చార్ట్‌కు రూపకల్పన
- సూపరింటెండెంట్, ఆర్ఎంఓ, ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్.. ఇలా ఎవరి విధులు ఏమిటనే దానిపై స్పష్టత
- ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా మార్పులు, చేర్పులు
- సెక్యూరిటీ, శానిటేషన్, ఇతర ఉద్యోగుల హాజరుకూ 'ఫేషియల్ రికగ్నిషన్'
- ప్రత్యేక సెల్ ద్వారా హాజరు పర్యవేక్షణ
- రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించడమే అంతిమ లక్ష్యం



సాక్షి, అమరావతి: ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అనేక సంస్కరణలు చేపడుతున్న రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు మరో అడుగు ముందుకేసి వాటికి మరింత పదును పెడుతోంది. నాడు-నేడు కింద ఇప్పటికే రూ.16వేల కోట్లతో 16 కొత్త వైద్య కళాశాలల ఏర్పాటుతో పాటు, ప్రస్తుతమున్న ఆస్పత్రుల్లో పెద్దఎత్తున మౌలిక సదుపాయాల కల్పన చేపడుతున్న విషయం తెలిసిందే. అలాగే, 40 వేలకు పైగా పోస్టుల భర్తీని చేపట్టారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి ప్రభుత్వం ఇన్ని చర్యలు తీసుకున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఇంకా పలు సమస్యలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో వాటి పరిష్కారానికి ప్రణాళికలు రచిస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వాస్పత్రుల్లో పనిచేసే ఉద్యోగులకు ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా

మిగతా 2వ పేజీలో ▶

> **మెరుగైన వైద్య సేవలే లక్ష్యం**
>
> ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం. ఇందులో భాగంగా ఆస్పత్రుల నిర్వహణ, పర్యవేక్షణలో ప్రస్తుతమున్న లోపాలను సరిదిద్దుతున్నాం. ఆయా అధికారులు, ఉద్యోగులకు జాబ్‌చార్ట్‌లు రూపొందిస్తున్నాం. వైద్యులు, వైద్య సిబ్బంది పనివేళల్లో విధిగా ఆస్పత్రిలో అందుబాటులో ఉండాల్సిందే. ప్రతిఒక్కరూ ఫేషియల్ రికగ్నిషన్ హాజరు వేయాల్సిందే. కుంటి సాకులతో పనివేళల్లో ఎవరైనా ఆస్పత్రుల నుంచి బయటకు వెళ్తే చర్యలు తీసుకుంటాం.
>
> – జె. నివాస్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్

పెరిగిన భద్రత.. తగ్గిన నేరాలు

నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో నివేదిక-2021 వెల్లడి

- రాష్ట్రంలో సత్ఫలితాలిస్తున్న టెక్ పోలీసింగ్
- మహిళల భద్రతకు భరోసా
- ఎస్సీ, ఎస్టీల వేధింపులపై ప్రభుత్వం కఠిన చర్యలు
- శాంతిభద్రతల పరిరక్షణలోనూ మెరుగైన పనితీరు
- రైతుల ఆత్మహత్యలపై ఎల్లో మీడియా వక్రీకరణ
- వాస్తవంగా మూడేళ్లలో తగ్గిన రైతుల ఆత్మహత్యలు
- కేసుల సత్వర దర్యాప్తులో దేశంలోనే మొదటి స్థానంలో ఏపీ



సాక్షి, అమరావతి : ఆధునిక సమాచార, సాంకేతిక పరిజ్ఞానంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న టెక్ పోలీసింగ్ విధానం సత్ఫలితాలిస్తోంది. రాష్ట్రంలో నేరాలు తగ్గుతున్నాయి. సైబర్ నేరాల కట్టడిలోనూ రాష్ట్ర పోలీసు యంత్రాంగం విజయవంతమైంది. రాష్ట్ర ప్రభుత్వం ఆవిష్కరించిన దిశ యాప్ సత్ఫలితాలిస్తోంది. పోక్సో ప్రత్యేక న్యాయస్థానాల ఏర్పాటు, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ల నియామకం తదితర చర్యలతో పోలీసుల పనితీరు గణనీయంగా మెరుగుపడుతోంది. శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో ఆంధ్రప్రదేశ్ మంచి పనితీరు కనబరిచిందని జాతీయ నేర గణాంకాల నివేదిక (నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్సీఆర్బీ)-2021) వెల్లడించింది. టీడీపీ ప్రభుత్వ హయాంతో పోలిస్తే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నేరాలు గణనీయంగా తగ్గాయని ఆ నివేదిక గణాంకాలు చెబుతున్నాయి. ఎన్సీఆర్బీ నివేదికలోని ప్రధాన అంశాలు ఇలా ఉన్నాయి.

తగ్గిన హత్యలు

- రాష్ట్రంలో హత్యలు గణనీయంగా తగ్గాయి. చంద్రబాబు ప్రభుత్వంలో 2014లో 1,175, 2015లో 1,099, 2016లో 1,123, 2017లో 2,154, 2018లో 935 హత్యలు జరిగాయి. అంటే ఏడాదికి సగటున 1,077 మంది హత్యకు గురయ్యారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత 2019లో 870, 2020లో 853, 2021లో 956 హత్య కేసులు నమోదయ్యాయి. అంటే సగటున 893 హత్యలు జరిగాయి. ఏడాదికి సగటున 63 వరకు తగ్గినట్టు ఎన్సీఆర్బీ వెల్లడించింది. రాష్ట్రంలో అల్లర్లు, అలజడుల కేసులు 2019లో 492 నమోదు కాగా 2021లో 444కు తగ్గాయి.
- రాష్ట్రంలో కిడ్నాప్ కేసులూ తగ్గాయి. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో 2014లో 1,066, 2015లో 917, 2016లో 917, 2017లో 1,018, 2018లో 1,055 కిడ్నాప్ కేసులు నమోదయ్యాయి. అంటే ఏడాదికి సగటున 944 మంది కిడ్నాప్‌నకు గురయ్యారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత 2019లో 902, 2020లో 737, 2021లో 835 కేసులు నమోదయ్యాయి. అంటే ఏడాదికి సగటున 824 కిడ్నాప్‌లు జరిగాయని ఎన్సీఆర్బీ నివేదిక పేర్కొంది. డబ్బుల కోసం 2019లో 15 కిడ్నాప్‌లు జరగ్గా.. 2021లో 9 కేసులే నమోదయ్యాయి.

మహిళా భద్రతకు భరోసా

- దిశ యాప్ ద్వారా మహిళల భద్రతకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భరోసానిస్తోంది. 2019 నుంచి వారిపై నేరాలు పెరగకుండా సమర్థంగా కట్టడి చేస్తోంది. టీడీపీ ప్రభుత్వ హయాంలో 2016లో మహిళలపై నేరాల కేసులు 16,362 నమోదు కాగా... 2017లో 17,909 నమోదయ్యాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 2021లో మహిళలపై నేరాల కేసులు 17,752కు తగ్గాయని నివేదిక వెల్లడించింది.
- తెలంగాణ, కేరళ వంటి రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో మహిళలపై నేరాల సంఖ్య చాలా తక్కువగా ఉంది. ప్రతి లక్ష జనాభాకు తెలంగాణలో మహిళలపై నేరాల కేసులు 111.2 నమోదు అవుతుండగా కేరళలో 73.3 కేసులు ఉన్నాయి. కాగా ఏపీలో 67.2 కేసులు నమోదవుతున్నాయి.
- ఆంధ్రప్రదేశ్‌లో మహిళలపై అత్యాచారం-హత్య కేసులు గణనీయంగా తగ్గాయి. 2019లో ఆరు, 2020లో ఐదు కేసులు నమోదు కాగా 2021లో రెండు కేసులు నమోదయ్యాయి. అత్యాచారయత్నం కేసులు 2019లో 177, 2021లో 162 కేసులు నమోదయ్యాయి. బాలికలపై అత్యాచార యత్నం కేసులు 2019లో 45, 2020లో 40, 2021లో 35 నమోదయ్యాయి. మహిళలపై దాడుల కేసులు 8 శాతం తగ్గాయి. 2020లో 2,541 కేసులు నమోదు కాగా 2021లో 2,330 కేసులు నమోదయ్యాయి.

బడుగులకు భద్రత

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణకు చిత్తశుద్ధితో కృషిచేస్తోంది. అవగాహన సదస్సుల ద్వారా వారిలో చైతన్యం కలిగిస్తోంది. దాంతో ఎస్సీ, ఎస్టీలు తాము వేధింపులకు గురైతే ఇప్పుడు ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయగలుగుతున్నారని ఎన్సీఆర్బీ నివేదిక గణాంకాలు వెల్లడించాయి.
- చంద్రబాబు ప్రభుత్వ హయాంలో ఎస్సీలకు సంబంధించి 2014లో 2,113 కేసులు, 2015లో 2,263 కేసులు, 2016లో 2,335 కేసులు, 2017లో 1,969 కేసులు నమోదయ్యాయి. మొత్తం మీద టీడీపీ ప్రభుత్వ హయాంలో సగటున ఏడాదికి 2,103 కేసులు నమోదయ్యాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 2019 నుంచి 2021 వరకు సగటున 2,011 కేసులు నమోదయ్యాయి. ఇక 2021లో 2,014 కేసులు నమోదయ్యాయని ఎన్సీఆర్బీ నివేదిక వెల్లడించింది.
- టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎస్టీలకు సంబంధించి 2014లో 390 కేసులు, 2015లో 362 కేసులు, 2016లో 405 కేసులు, 2017లో 341 కేసులు నమోదయ్యాయి. మొత్తం మీద టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏడాదికి సగటున 365 కేసులు నమోదయ్యాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 2021లో 361 కేసులే నమోదయ్యాయి. ఇక 2019 నుంచి 2021వరకు సగటున ఏడాదికి కేసుల సంఖ్య 337కు తగ్గింది.
- ఎస్సీ, ఎస్టీల సంక్షేమం, రక్షణకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోంది. వేధింపులకు గురైన ఎస్సీ, ఎస్టీలకు టీడీపీ ప్రభుత్వ హయాంలో 2014 నుంచి 2019వరకు రూ.52.32కోట్లే పరిహారంగా అందించారు. కాగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2019 నుంచి 2022 వరకు మూడేళ్లలోనే బాధితులైన ఎస్సీ, ఎస్టీలకు పరిహారంగా రూ.120 కోట్లు ఇవ్వడం విశేషం.

బాలలపై నేరాలు తగ్గుముఖం

బాలలపై నేరాలకు రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకట్ట వేస్తోంది. 18ఏళ్ల లోపు వారిపై వేధింపుల కేసులు రాష్ట్రంలో తగ్గాయని ఎన్సీఆర్బీ నివేదిక వెల్లడించింది. బాలికలపై దాడుల కేసులు 2020లో 513 నమోదు కాగా 2021లో 493కు తగ్గాయి. బాలలను వేధించే వారిపై పోక్సో చట్టం కింద నమోదు చేసే కేసులు 7శాతం తగ్గాయని నివేదిక పేర్కొంది. ఈ కేసులు 2019లో 502, 2021లో 466 నమోదయ్యాయి.

రైతు ఆత్మహత్యలపై తప్పుదోవ పట్టిస్తున్న ఎల్లో మీడియా

రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యల సంఖ్యపై ఎల్లో మీడియా ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తోంది. ఎన్సీఆర్బీ నివేదికలో ఆత్మహత్యల సంఖ్యనే పేర్కొంటుంది. కానీ అందుకు కారణాలను ప్రత్యేకంగా పేర్కొనదు. ఆత్మహత్యకు దారితీసిన కారణాలతో నిమిత్తం లేదని కూడా ఎన్సీఆర్బీ స్పష్టం చేసింది. కానీ ఎల్లో మీడియా మాత్రం ఈ విషయాన్ని వక్రీకరిస్తూ వాస్తవ విరుద్ధమైన కథనాలను ప్రచురిస్తోంది. వాస్తవానికి రాష్ట్రంలో వ్యవసాయ రంగంలో నిమగ్నమైన వ్యక్తుల ఆత్మహత్యలు తగ్గాయి. 2019లో 628 మంది, 2020లో 564 మంది ఆత్మహత్య చేసుకోగా 2021లో ఆత్మహత్యలు 481కు తగ్గాయి. భూమి కలిగిన రైతుల ఆత్మహత్యల కేసులు 2019లో 438, 2020లో 424 నమోదు కాగా 2021లో 359కు తగ్గాయి. కౌలు రైతుల ఆత్మహత్యలు 2019లో 190, 2020లో 140 కేసులు నమోదు కాగా 2021లో 122కు తగ్గాయి.

పోలీసు సిబ్బందిపై కేసులు తగ్గుదల

రాష్ట్రంలో పోలీసు సిబ్బందిపై కేసులు కూడా తగ్గాయి. 2020లో 261 కేసులు నమోదు కాగా 2021లో 185 కేసులే నమోదయ్యాయి. లాకప్ మరణాలు 2020లో 8 జరగ్గా, 2021లో ఆరుకు తగ్గాయని నివేదిక వెల్లడించింది.

చార్జిషీట్ల నమోదులో అగ్రస్థానం

కేసుల దర్యాప్తు, నేరస్తులకు న్యాయస్థానాల ద్వారా శిక్షలు విధించడంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ప్రథమ స్థానంలో ఉంది. నేర నిరూపణలో కీలకమైన చార్జిషీట్లను సకాలంలో దాఖలు చేయడంలో అగ్రస్థానాన్ని సాధించింది. గడువులోగా దేశంలో 77.1శాతం కేసుల్లో చార్జిషీట్లు దాఖలు చేస్తున్నారు. రాష్ట్రంలో ఏకంగా 93.7 శాతం కేసుల్లో చార్జిషీట్లు దాఖలు చేస్తుండటం విశేషం. ఒక కేసు దర్యాప్తునకు 2018లో సగటున 164 రోజుల సమయం పట్టగా.. 2021లో 42 రోజుల్లోనే పూర్తి చేస్తుండటం ప్రాధాన్యతను సంతరించుకుంది. అత్యాచారం, లైంగిక వేధింపుల కేసుల్లో ఏడు రోజుల్లోనే దర్యాప్తు పూర్తి చేసి చార్జిషీట్లు దాఖలు చేయడం పోలీసు శాఖ సమర్థతకు నిదర్శనం. పోక్సో కేసుల్లో 60 రోజుల్లోనే చార్జిషీట్లు దాఖలు చేస్తున్నారు. 2019లో 14శాతం కేసుల్లోనే 60 రోజుల్లో చార్జిషీట్లు దాఖలు చేయగా.. 2021లో ఏకంగా 92.5 శాతం కేసుల్లో దాఖలు చేశారు.

క్లుప్తంగా

ఎన్నికల సంస్కరణలకు ప్రజలు సహకరించాలి

- గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్
- గవర్నర్ దంపతుల ఓటరు ఐడీ ఆధార్‌తో అనుసంధానం



సాక్షి, అమరావతి: ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఉద్దేశించిన ఎన్నికల సంస్కరణలకు ప్రజలు సహకరించాలని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ పేర్కొన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ఓటరు ఐడీని ఆధార్ నంబరుతో అనుసంధానం చేసుకోవాలని చెప్పారు. విజయవాడలోని రాజ్‌భవన్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనా గవర్నర్ దంపతుల ఓటరు ఐడీలని వారి ఆధార్ నంబర్లతో అనుసంధానించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ ఓటరు ఐడీ, ఆధార్ నంబరు అనుసంధానం తప్పనిసరి కానప్పటికీ, పౌరులు బాధ్యతగా భావించి ఈ ప్రక్రియను విజయవంతం చేయాలని చెప్పారు. ఈ ప్రక్రియ పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనా చెప్పారు. ఓటరు ఐడీలను ఆధార్‌తో అనుసంధానించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా, రాజ్‌భవన్ సంయుక్త పాలనాధికారి నుపూర్ అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ వినాయక చవితి శుభాకాంక్షలు

రాష్ట్ర ప్రజలకు గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ వినాయక చవితి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. శాంతి, సామరస్యాలతో కూడిన జీవనం గడిపేందుకు రాష్ట్ర ప్రజలకు విఘ్నేశ్వరుడు ఆశీస్సులు అందించాలని గవర్నర్ ఆకాంక్షించారు.

ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్



సాక్షి,అమరావతి: వినాయక చవితి పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నేశ్వరుడి అనుగ్రహంతో మంచి పనులకు విఘ్నాలు తొలగిపోయి, ప్రజలందరికీ సకల శుభాలు కలగాలని, విజయాలు సిద్ధించాలని ఆకాంక్షించారు. గణనాథుని కరుణాకటాక్షాలతో రాష్ట్రంలోని ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో అభివృద్ధి చెందాలని ఆయన అభిలషించారు.

పవర్ లిఫ్టర్ చంద్రకళకు రూ.2 లక్షల ఆర్థికసాయం

అందించిన గ్లాండ్ ఫార్మా సంస్థ

సాక్షి, అమరావతి: రాష్ట్రానికి చెందిన ఏషియన్ పవర్ లిఫ్టర్ చంద్రకళకు విశాఖపట్నానికి చెందిన గ్లాండ్ ఫార్మా సంస్థ మంగళవారం రూ.2 లక్షల ఆర్థికసాయం అందించింది. విజయవాడలో ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న చంద్రకళ ఇప్పటివరకు మూడు ఏషియన్ గేమ్స్‌లో ఏడు పతకాలు సాధించింది. జూన్‌లో కోయంబత్తూర్‌లో జరిగిన ఏషియన్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో చాంపియన్‌గా నిలిచిన ఆమె డిసెంబర్‌లో జరగనున్న ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీలకు సన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో ఆమెకు గ్లాండ్ ఫార్మా తరఫున సీనియర్ మేనేజర్ కె.గణేష్‌కుమార్ రూ.2 లక్షల చెక్కును రాష్ట్ర బెవరేజస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డి సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా చంద్రకళ మాట్లాడుతూ తనకు ఆర్థికసాయం అందజేసిన గ్లాండ్ ఫార్మా లిమిటెడ్ యజమాని కెప్టెన్ రఘురామ్‌కి కృతజ్ఞతలు తెలిపారు.

ఓటర్ల జాబితాతో సంబంధం ఉన్న అధికారుల బదిలీలపై నిషేధం

సాక్షి, అమరావతి: ఫొటోతో కూడిన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా కీలక ప్రభుత్వ అధికారుల బదిలీలు, పోస్టింగ్‌లపై కేంద్ర ఎన్నికల సంఘం నిషేధం విధించింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముకేశ్‌కుమార్ మీనా మంగళవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఓటర్ల జాబితా సవరణతో సంబంధం ఉన్న అధికారుల పోస్టుల్లో ఖాళీగా ఉన్నవాటిని వెంటనే భర్తీచేయాలని ప్రభుత్వానికి సూచించినట్లు ఆయన తెలిపారు.

కాకినాడలో బల్క్ డ్రగ్ పార్క్

▶ మొదటి పేజీ తరువాయి

దేశంలో మూడు ప్రాంతాల్లో బల్క్ డ్రగ్ పార్క్‌లను ఏర్పాటు చేస్తామని, అందుకోసం ప్రతిపాదనలు పంపాలని రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. కాగా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నూతన పారిశ్రామిక విధానం 2020-23 ప్రకటించింది. ఇందులో భాగంగా కాకినాడ జిల్లా తొండంగి మండలం కేపీ పురం, కోదాడ గ్రామాల పరిధిలో 2వేల ఎకరాల్లో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. దీనిద్వారా రూ.6,940 కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉంది. రానున్న ఎనిమిదేళ్లలో పార్క్ ద్వారా రూ.46,400 కోట్ల మేర వ్యాపారం జరుగుతుందని, 10 వేల నుంచి 12 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా. కేంద్రం ప్రకటించిన పథకం కింద బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుకు ప్రతిపాదన పంపాలని, ఒకవేళ ఆమోదించకుంటే సొంతంగా చేపట్టాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది.

తీవ్ర పోటీలో రాష్ట్రం విజయం..

కేంద్రం ప్రకటించిన పథకం కింద తొండంగి మండలం కేపీ పురం, కోదాడలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు చేయాలని కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖకు రాష్ట్ర ప్రభుత్వం 2020 అక్టోబర్ 15న ప్రతిపాదనలు పంపింది. బల్క్ డ్రగ్ పార్క్‌ను దక్కించుకునేందుకు మనతోపాటు తమిళనాడు, తెలంగాణ ప్రభుత్వాలు తీవ్రంగా పోటీ పడ్డాయి. దేశంలో అత్యాధునిక ఫార్మా సిటీని విశాఖకు సమీపంలోని పరవాడ వద్ద దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 2008లో ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఫార్మా వ్యర్థాల నిర్వహణలో ఏపీని సీఎం వైఎస్ జగన్ అగ్రగామిగా నిలిపారు. ఈ రెండు అంశాలు రాష్ట్రంలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుకు కేంద్రం ఆమోదముద్ర వేయడంలో కీలకపాత్ర పోషించాయి. కాగా, మూడు పార్కులలో మిగిలిన రెండు గుజరాత్‌కు, హిమాచల్‌ప్రదేశ్‌కు దక్కాయి.

ఫార్మాలో అగ్రగామిగా రాష్ట్రం..

కాకినాడ జిల్లాలో బల్క్ డ్రగ్ పార్క్ డీపీఆర్‌ను కేంద్రం ఆమోదించాక రాష్ట్ర ప్రభుత్వం వేగంగా మౌలిక సదుపాయాలను కల్పించనుంది. తద్వారా భారీ పరిశ్రమల ఏర్పాటుకు మార్గం సుగమం కానుంది. ఫార్మా రంగంలో పెద్ద పరిశ్రమలను ఏర్పాటు చేయడంతోపాటు చిన్న పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట వద్ద ఎంఎస్ఎంఈ ఫార్మా పార్క్‌ను రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. అటు బల్క్ డ్రగ్ పార్క్.. ఇటు ఎంఎస్ఎంఈ ఫార్మా పార్క్‌ల ద్వారా ఫార్మా రంగంలో ఏపీ అగ్రగామిగా నిలుస్తుందని పారిశ్రామికవేత్తలు పేర్కొంటున్నారు.

వేగంగా రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల డిజిటలీకరణ

▶ మొదటి పేజీ తరువాయి

అస్తవ్యస్తంగా తయారయ్యాయి. వాటిని భద్రపరచడం కూడా చాలాకష్టంగా మారిపోయింది. భూముల విలువ పెరిగిన నేపథ్యంలో వాటిని ట్యాంపరింగ్ చేసే అవకాశాలు కూడా ఉన్నాయి. కొన్ని రోజులుపోతే వాటిని తీసి చూడడం కూడా సాధ్యంకాని పరిస్థితి. అన్నింటికీ మించి ఎవరైనా తమ పాత దస్తావేజు నకలు కావాలని అడిగితే దాన్ని గుర్తించే పరిస్థితి లేకుండాపోయింది. ఆ వాల్యూమ్ నెంబర్, పేజీ నెంబర్ చెబితే తప్ప వెతికి ఇచ్చే పరిస్థితిలేదు.

ఐడీఎంఆర్ఎస్ విధానంలో డిజిటలీకరణ

ఈ నేపథ్యంలో.. ప్రభుత్వం బ్రిటీష్ కాలం నుంచి 1999 వరకు రిజిస్టర్ అయిన దస్తావేజులు, ఇతర రిజిస్టర్డ్ డాక్యుమెంట్ల డిజిటలీకరణ చేపట్టింది. ప్రస్తుతం రాష్ట్రంలోని 269 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ పని వేగంగా జరుగుతోంది. ఉమ్మడి జిల్లాల వారీగా రాష్ట్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను నాలుగు జోన్లుగా విభజించి డిజిటలీకరణ కోసం టెండర్లు పిలిచారు. రైటర్స్ బిజినెస్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ నాలుగు జోన్ల టెండర్లు దక్కించుకుని పని మొదలుపెట్టింది. ఇంటిగ్రేటెడ్ డాక్యుమెంట్ మేనేజ్‌మెంట్ రికార్డ్ సిస్టమ్ (ఐడీఎంఆర్ఎస్) విధానంలో డిజిటలీకరణ చేస్తున్నారు. మొదట అన్ని కార్యాలయాల్లో పాత రికార్డులను స్కానింగ్ చేసి ఆ తర్వాత వాటిని కంప్యూటరీకరిస్తున్నారు. ఆర్నెల్లలో మొత్తం రికార్డుల డిజిటలీకరణ పూర్తయ్యే అవకాశమున్నట్లు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు చెబుతున్నారు.

డిజిటలీకరణ తర్వాత వెంటనే ఈసీ నకలు

ఇక డిజిటలైజేషన్ పూర్తయిన తర్వాత డాక్యుమెంట్ నెంబర్ చెప్పగానే దానిని వెంటనే ఇచ్చే పరిస్థితి ఉంటుంది. దీనివల్ల ఈసీ నకలును ప్రజలు సులభంగా పొందే అవకాశం ఏర్పడుతుంది. అలాగే, విలువైన ఆస్తుల రికార్డులు భద్రంగా ఉంటాయి. ఈ పని వేగంగా జరుగుతోంది.

– వి.రామకృష్ణ, కమిషనర్ అండ్ ఐజీ, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ

విధులు పక్కాగా..

▶ మొదటి పేజీ తరువాయి

మార్పులు, చేర్పులు చేస్తూ నిర్దేశిత జాబ్‌చార్ట్‌ను రూపొందిస్తున్నారు. ఇందులో భాగంగా బోధనాస్పత్రులపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు.

పేషెంట్ కేర్, క్లినికల్ కార్యకలాపాలపై..

రాష్ట్రవ్యాప్తంగా 11 ప్రభుత్వ వైద్య కళాశాలలున్నాయి. వీటికి అనుబంధంగా బోధనాస్పత్రులు నడుస్తున్నాయి. స్పెషలిస్టు వైద్య సేవల కోసం రోజూ వేలాది మంది రోగులు ఇక్కడకు వస్తుంటారు. ప్రభుత్వం ఎన్ని చేస్తున్నా బోధనాస్పత్రుల నిర్వహణ, పర్యవేక్షణ, వసతులు, అందుబాటులో వైద్యులు-సిబ్బంది తదితర అంశాల్లో లోటుపాట్లు ఎదురవుతూనే ఉన్నాయి. వీటిని చక్కదిద్దడం కోసం ఆస్పత్రి నిర్వహణ, పర్యవేక్షణ విధుల్లో అసిస్టెంట్ డైరెక్టర్/డిప్యూటీ డైరెక్టర్‌లు, ఏటలను భాగస్వామ్యం చేస్తూ జాబ్‌చార్ట్ సిద్ధం చేస్తున్నారు. వీరిని భాగస్వాముల్ని చేయడం ద్వారా పేషెంట్ కేర్, క్లినికల్ కార్యకలాపాలపై సూపరింటెండెంట్‌లు, ఆర్ఎంఓలు దృష్టి కేంద్రీకరించేలా చర్యలు చేపడుతున్నారు.

ఫేషియల్ రికగ్నిషన్ హాజరు అమలు

మరోవైపు.. వైద్య, ఆరోగ్య శాఖలోని డీఎంఈ విభాగంలో బయోమెట్రిక్ హాజరు విధానం ఇంకా గాడినపడలేదు. ఈ విభాగంలో 15 వేల మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. అయితే, ఇటీవల వరకూ చాలామంది ఉద్యోగులు బయోమెట్రిక్ హాజరువేయడంలో ఎన్‌రోల్ కాలేదు. ఈ నేపథ్యంలో.. డీఎంఈ కార్యాలయంలో ఓ ప్రత్యేక సెల్‌ను ఏర్పాటుచేసి ఉన్నతాధికారులు బయోమెట్రిక్ హాజరును పర్యవేక్షిస్తున్నారు. దీనికితోడు.. ఇటీవల కాలంలో ఆస్పత్రుల్లోని సెక్యూరిటీ, శానిటేషన్, పెస్టిసైడ్ కంట్రోల్ కార్మికులను కాంట్రాక్టర్లు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచడం లేదన్న ఫిర్యాదులు అధికారులు, వైద్యశాఖ మంత్రికి అందాయి. దీంతో.. వీరికి కూడా ఫేషియల్ రికగ్నిషన్ హాజరును అమలుచేయనున్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది తరహాలో శానిటేషన్, పెస్టిసైడ్ కంట్రోల్, సెక్యూరిటీ ఉద్యోగుల నుంచి రోజూ ఫేషియల్ రికగ్నిషన్ హాజరుకు చర్యలు తీసుకుంటున్నారు. వీరందరి వివరాలు సేకరించి అంతా ఎన్‌రోల్ అయ్యారో లేదో అన్నది పర్యవేక్షిస్తున్నారు.

రెడ్‌క్రాస్‌కు చంద్రశేఖర్‌రెడ్డి రూ.25 లక్షల విరాళం

అభినందించిన గవర్నర్ విశ్వభూషణ్

నెల్లూరు(అర్బన్): రెడ్‌క్రాస్‌కు ఆ సంస్థ నెల్లూరు చైర్మన్ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి రూ.25 లక్షల విరాళమిచ్చారు. మంగళవారం దీనికి సంబంధించిన చెక్కును విజయవాడ రాజ్‌భవన్‌లో గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌కు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. విపత్తుల సమయంలో చంద్రశేఖర్‌రెడ్డి నేతృత్వంలో సభ్యులు చేసిన సేవలు ప్రశంసనీయమన్నారు. రెడ్‌క్రాస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, ఏకే ఫరీదా మాట్లాడుతూ.. నెల్లూరు రెడ్‌క్రాస్‌తో పాటు చంద్రశేఖర్‌రెడ్డి అందిస్తున్న సేవలు అందరికీ ఆదర్శనీయమన్నారు. తలసేమియాతో బాధపడుతున్న చిన్నారుల కోసం, దివ్యాంగుల సెంటర్ కోసం ఈ విరాళం అందించినట్లు చంద్రశేఖర్‌రెడ్డి చెప్పారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా, రాజ్‌భవన్ సంయుక్త కార్యదర్శి సూర్యప్రకాష్, చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబసభ్యులు సుజాతమ్మ, ప్రవీణ, చంద్రహాస తదితరులు పాల్గొన్నారు.



గవర్నర్‌కు చెక్కును అందిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

సీఎంని కలిసిన క్రీడాకారులు బేబిరెడ్డి, అర్షద్

అభినందించిన సీఎం వైఎస్ జగన్



అంతర్జాతీయ ఫెన్సింగ్ క్రీడాకారిణి బేబిరెడ్డిని అభినందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి. చిత్రంలో బేబిరెడ్డి తండ్రి రామకృష్ణారెడ్డి



పారా ఏషియన్ ట్రాక్ సైక్లింగ్ క్రీడాకారుడు షేక్ అర్షద్‌ను అభినందిస్తున్న సీఎం జగన్, పక్కన కోచ్ ఆదిత్య మెహతా

సాక్షి, అమరావతి: రాష్ట్రానికి చెందిన అంతర్జాతీయ ఫెన్సింగ్ క్రీడాకారిణి మురికినాటి బేబిరెడ్డి, పారా ఏషియన్ ట్రాక్ సైక్లింగ్ చాంపియన్ షేక్ అర్షద్ మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో కలుసుకున్నారు. అంతర్జాతీయ వేదికలపై తెలుగువారి ఖ్యాతిని నిలబెడుతున్న క్రీడాకారులను సీఎం జగన్ అభినందించారు. జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో పతకాలు సాధించిన వారిని రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, క్రీడలకు మరింతగా ప్రాధాన్యతనిస్తున్నామని చెప్పారు. ఇటీవల జరిగిన కామన్వెల్త్ గేమ్స్ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్‌లో (జూనియర్స్ టీమ్)లో బేబిరెడ్డి టీమ్ కాంస్య పతకాన్ని గెల్చుకుంది. అన్నమయ్య జిల్లా చెన్నముక్కపల్లెకు చెందిన బేబిరెడ్డి తాను సాధించిన పతకాలను సీఎం జగన్‌కు చూపించారు. జాతీయస్థాయిలో టీమ్ పరంగా, వ్యక్తిగతంగా పతకాలు సాధించినట్లు సీఎంకు చెప్పారు. నంద్యాలకు చెందిన షేక్ అర్షద్ ఇటీవల ఢిల్లీలో జరిగిన పారా ఏషియన్ ట్రాక్ సైక్లింగ్‌లో వెండి, కాంస్య పతకాలు సాధించారు. అర్షద్ తాను జాతీయస్థాయిలో సాధించిన పతకాలను కూడా సీఎం జగన్‌కు చూపించారు. అక్టోబర్‌లో ఫ్రాన్స్‌లో జరగనున్న ట్రాక్ వరల్డ్‌కప్‌లో పాల్గొంటున్నట్లు తెలిపారు. తమకు ప్రభుత్వం నుంచి సహకారం ఇవ్వాలని సీఎం జగన్‌ని బేబిరెడ్డి, అర్షద్ కోరారు. దీనికి సీఎం సానుకూలంగా స్పందించారు. సీఎంని కలిసిన వారిలో బేబిరెడ్డి తండ్రి రామకృష్ణారెడ్డి, కుటుంబసభ్యులు శ్రీనివాసులురెడ్డి, వెంకట్రామిరెడ్డి, అర్షద్ కోచ్ ఆదిత్య మెహతా ఉన్నారు.

రేపు పింఛన్ పంపిణీకి సర్వం సిద్ధం

- 62.70 లక్షల మందికి రూ.1,594.66 కోట్లు విడుదల
- 2.66 లక్షల మంది వలంటీర్ల ద్వారా లబ్ధిదారుల ఇళ్ల వద్దే పంపిణీ
- ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు



సాక్షి, అమరావతి/దేవరాపల్లి: రాష్ట్రంలో సెప్టెంబర్ 1న 62.70 లక్షల మంది లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేయడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు తెలిపారు. అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం తారువలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బుధవారం వినాయక చవితి పండుగ అయినప్పటికీ.. ఒకటో తేదీ (గురువారం) తెల్లవారుజాము నుంచే పింఛన్ల పంపిణీ చేస్తామన్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయానికే రూ.1,594.66 కోట్ల మొత్తాన్ని ఆయా గ్రామ, వార్డు సచివాలయాల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందని చెప్పారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఎక్కడికక్కడ మంగళవారం సాయంత్రానికే బ్యాంకుల నుంచి డబ్బులు డ్రా చేశారన్నారు. గురువారం తెల్లవారుజాము నుంచే పంపిణీకి సిద్ధంగా ఉండాలని సెర్ప్ అధికారులు కింది స్థాయి సిబ్బందికి ఆదేశాలు కూడా జారీ చేశారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా లబ్ధిదారులకు పింఛన్లు అందజేసేందుకు 2.66 లక్షల మంది వలంటీర్లు సిద్ధంగా ఉన్నారన్నారు. ఐదు రోజుల్లోగా వంద శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. లబ్ధిదార్లకు పింఛన్లు అందజేసే సమయంలో గుర్తింపు కోసం బయోమెట్రిక్, ఐరిస్ విధానాలను అమలు చేస్తున్నామన్నారు. అలాగే రియల్ టైమ్ బెనిఫిషరీ ఐడెంటిఫికేషన్ సిస్టమ్ (ఆర్‌బీఐఎస్) విధానాన్ని కూడా అందుబాటులోకి తెచ్చామన్నారు. సాంకేతిక కారణాలతో ఏ ఒక్కరికీ పింఛన్ అందలేదన్న ఫిర్యాదులు రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు. రాష్ట్రంలోని 26 జిల్లాల డీఆర్‌డీఏ కార్యాలయాల్లోని కాల్‌సెంటర్ల ద్వారా పింఛన్ల పంపిణీని పర్యవేక్షిస్తామన్నారు.

ఫోన్ యాప్ ద్వారానే టీచర్ల హాజరు

- రేపటి నుంచే ప్రారంభం
- దృష్టి లోపం ఉన్నవారికి మినహాయింపు
- టీచర్లంతా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి
- పాఠశాల విద్యా శాఖ ఆదేశాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ మినహా అన్ని యాజమాన్యాల పరిధిలోని ఉపాధ్యాయులు, ఉద్యోగులందరూ సెప్టెంబర్ 1 నుంచి ఇంటిగ్రేటెడ్ అటెండెన్స్ మొబైల్ యాప్ ద్వారా ఫేషియల్ రికగ్నిషన్ విధానంలో హాజరు నమోదు చేయాలని పాఠశాల విద్యా శాఖ మంగళవారం సర్క్యులర్ జారీ చేసింది. ఫోన్ యాప్ ద్వారా మాత్రమే ఉపాధ్యాయులు హాజరును వేయాలని తెలిపింది. వీరితో పాటు పాఠశాల విద్యా శాఖ నియంత్రణలో ఉన్న అన్ని కార్యాలయాల్లోని బోధనేతర సిబ్బంది కూడా ఈ యాప్‌లో హాజరు నమోదు చేయాలని వెల్లడించింది. సెప్టెంబర్ 1 నుంచి ఏ కార్యాలయాల్లోనూ మాన్యువల్ హాజరును నమోదు చేయకూడదని స్పష్టం చేసింది. వికలాంగుల సంక్షేమ శాఖ నిబంధనల ప్రకారం.. దృష్టిలోపం ఉన్న ఉద్యోగులకు ప్రత్యేక మినహాయింపు ఉంటుందని వివరించింది. వారు ప్రత్యేకంగా మాన్యువల్ రిజిస్టర్లలో హాజరు నమోదు చేయాలని పేర్కొంది. కాగా, ఫేషియల్ రికగ్నిషన్ హాజరు విధానాన్ని నెల రోజుల్లో అన్ని విభాగాల్లో అమలు చేయనున్నారు.

ఆండ్రాయిడ్ ఫోన్ లేకపోతే..

ఆండ్రాయిడ్ ఫోన్‌లేని టీచర్లు, ఉద్యోగులు తమ హాజరును హెడ్మాస్టర్ లేదా ఇతర ఉపాధ్యాయుల మొబైల్స్ ద్వారా నమోదు చేయాలని పాఠశాల విద్యాశాఖ సూచించింది. యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఉపాధ్యాయులు, ఉద్యోగుల రిజిస్ట్రేషన్లను బుధవారంలోపు పూర్తి చేయాలని తెలిపింది. యాప్ ద్వారా హాజరు నమోదు.. విద్యా శాఖ రాష్ట్ర ప్రధాన కార్యాలయాలు, జోన్, జిల్లా కార్యాలయాలు, డైట్స్, ఎంఈవో తదితర కార్యాలయాలకు కూడా వర్తిస్తుందని వెల్లడించింది. ఉపాధ్యాయులు, ఉద్యోగులు హాజరు నమోదు కోసం యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకునేలా చూడాలని పాఠశాల విద్య ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్లు, డీఈవోలు, హెడ్మాస్టర్లను ఆదేశించింది. హాజరును క్రమం తప్పకుండా యాప్ ద్వారా నమోదు చేసేలా చూడాలని పేర్కొంది.



Reliance
Reliance digital
PERSONALISING TECHNOLOGY
మై కైండ్ ఆఫ్ పండుగ మొదలు. మై కైండ్ ఆఫ్ డీల్స్.
వినాయక చవితి శుభాకాంక్షలు
10% తక్షణ తగ్గింపు*
₹2000 వరకు తక్షణ తగ్గింపు* SBI card
*కనీస లావాదేవీలు: ₹10000; ప్రతీ కార్డుకు ఒకసారి వర్తిస్తుంది. అలాగే EMI ట్రాన్సాక్షన్స్ కూడా వర్తిస్తాయి
వర్తిస్తుంది : 17 ఆగస్ట్ – 31 ఆగస్ట్ 2022 వరకు. నియమ నిబంధనలు వర్తిస్తాయి.
NEVER BEFORE PRICES
AKAI
ULTRA BRIGHT PANEL
BEZEL-LESS DESIGN | SCREEN MIRRORING | IR REMOTE
80CM (32) SMART LED TV ₹9990
SANSUI 2 Year
UHD ANDROID TV
164 CM (65) JSW65ASUHDFF ₹49990 EMI's of ₹4166*
139 CM (55) JSW55ASUHD ₹32990 EMI's of ₹2749*
Windows 11
Reliance digital SELECT
HP SMART SIM LAPTOP
• 8GB RAM • 512GB SSD
CORE i3 ₹44999 EMIs of ₹5000/-
CORE i5 ₹55999
MS OFFICE 21
Jio 100GB Free data for 1 year
NEW LAUNCH
VIVO V25 PRO
• 16.66cm (6.56) 120Hz AMOLED Display
• 32MP Eye AF Selfie Camera
• MTK Dimensity 1300 Processor
• 66W Flash charge
Starting from ₹35999*
SAMSUNG 5 Year Neo QLED
139 CM (55) & ABOVE EMI's of ₹1990*
MAX 20% CASHBACK UPTO ₹20 000/-*
itel 2 Year UHD ANDROID TV
SUPER BRIGHT DISPLAY | 24W DOLBY AUDIO | 5000+ APPS
108 CM (43) UHD ₹19990 EMI's of ₹1666*
Limited Stocks*
LG 2 Year NanoCell
139 CM (55) 55NAN083 ₹70990
BENEFITS LG Tone Free Wireless Earbuds FN5 worth ₹19,990/-
MAX CASHBACK UPTO 10% MAX VALUE ₹7 500/-*
Windows 11
LENOVO
• 8GB RAM • 512 GB SSD
CORE i3 ₹42499 EMIs of ₹4722/-
CORE i5 ₹53699
MS OFFICE 21
THIN & LIGHT | DEFAULT 2 YEARS WARRANTY
BENEFITS Get 3 Years Extended Warranty at ₹1499/-
Reliance digital SELECT Windows 11
ASUS TUF HN356W
• 10th Gen Core i5
• 16GB RAM • 512GB SSD
• Upto 144Hz Refresh + Wifi 6
Starting from ₹58999 EMIs of ₹6555/-
4GB GTX 1650 GRAPHICS
BENEFITS Get Upto 2 Years Warranty at ₹999/- + Students Get 1TB HDD Storage at ₹1999/-*
BEST DEAL
SAMSUNG M53 5G
₹28999 Starting from ₹23999*
*Price post in store discount & ICICI Bank cashback
OnePlus 9 5G ₹49999 Starting from ₹34999*
*Price post bank cashback
OnePlus 9 Pro 5G ₹64999 Starting from ₹46499*
*Price post bank cashback
SAMSUNG
Introducing Galaxy Z Fold4 | Z Flip4
Galaxy Watch4 Classic* worth ₹34999* at ₹2999*
Benefits up to ₹8000*
Prebook Now
*T&C Apply. Applicable till stock lasts.
FROST-FREE
KELVINATOR 252L ₹19190* EMIs of ₹1599/-*
LG 260L ₹23990* EMIs of ₹1999/-*
SAMSUNG 324L ₹35490* EMIs of ₹2958/-*
SIDE BY SIDE
KELVINATOR 584L ₹57990* EMIs of ₹4833/-*
SAMSUNG 700L ₹92990* EMIs of ₹7749/-*
LG 694L ₹109990* EMIs of ₹9166/-*
BENEFITS Get Freebies worth upto ₹72990
DISHWASHER SAMSUNG 13 PLACE ₹31990* EMIs of ₹2666/-*
BENEFITS Get Philips Mixer Grinder worth ₹6495
FRONT LOAD
SAMSUNG 7kg ₹33990* EMIs of ₹2833/-*
SAMSUNG 8kg ₹39490* EMIs of ₹3291/-*
IFB 8kg ₹39990* EMIs of ₹3333/-*
iPad
9th Gen Wi-Fi 64GB
• 25.91cm (10.2) Retina Display
• 12MP Ultra Wide Front Camera
₹30900 ₹27890
UP TO 15% CASHBACK
WATER PURIFIER RANGE
Starting from ₹8999
BENEFITS Freebies worth ₹4495 on select models
EMI STARTS AT 999 AND ATTRACTIVE CASH BACK UPTO 20%
kotak HDFC BANK ICICI Bank SBI citibank
SHOP ANY ELECTRONICS AT MY JIO STORE Jio DIGITAL LIFE
Reliance resQ మీ ఎలక్ట్రానిక్స్ యొక్క సంపూర్ణ సంరక్షణ 3 స్టెప్స్‌లో
1 డౌన్‌లోడ్ ద RESQ యాప్
2 మీ ఎలక్ట్రానిక్స్‌లో నా ప్రొడక్ట్ సెక్షన్‌ని చేర్చుకోండి
3 యాడెడ్ బుక్ సర్వీస్ చేర్చుకున్న తర్వాత
JioMart.com reliancedigital.in
INSTA DELIVERY
VISIT US AT: ANANTHAPUR: SUBHASH ROAD, NEAR CLOCK TOWER, PH: 8591402848/49 | GUNTAKAL: BUS STAND ROAD, OPPOSITE BHARAT PETROL PUMP. PH: 7977582680/753 | NELLORE: LECTURERS COLONY, MINI BYPASS ROAD PH: 8591404512/13 | NELLORE: OPPOSITE KASTURIBA KALAKSHETRAM, BESIDE POLICE GROUNDS, DURGAMITTA PH: 8594102738/55 | CHIRALA: MUNTAVARI CENTER CHIRALA TOWN, PH: 08594 - 232211 | ONGOLE: 1ST FLOOR, PMK NAIDU PROPERTY, BESIDE NAVABARATH THEATRE, GUNTUR ROAD PH: 08592–283601/ 283603 |VIZIANAGARAM: KASPA WEST WARD, KODUGATIVARI STREET PH: 8591402699/96 |ALSO VISIT US AT: VIJAYAWADA | VIZAG | TIRUPATI | NELLORE | RAJAHMUNDRY | KAKINADA | GUNTUR | ADONI | MADANAPALLI | CHITTOOR | KADAPA | PRODDATUR | ANANTHAUR | GUNTAKAL | KURNOOL |PIDUGURALLA | ONGOLE | CHIRALA | ELURU | VIZIANAGARAM | TADEPALLIGUDEM | BHEEMAVARAM | ANAKAPALLI | AMALAPURAM | TO LOCATE YOUR NEAREST MYJIO STORE SMS LOCATE <PINCODE> TO 56161



ఎక్కడ చదివినదైనా, ఎవరు చెప్పినదైనా, ఆఖరికి అది నేను చెప్పినదైనా సరే - మీ సొంత తర్కంతోనూ, మీ సొంత విచక్షణ జ్ఞానంతోనూ పొసగకపోతే దాన్ని నమ్మవద్దు.
- గౌతమ బుద్ధుడు

సాక్షి

బుధవారం, ఆగస్టు, 31

పరిష్కార ప్రయత్నం

రెండున్నర నెలలు... అంతా కలిపితే 74 రోజులు. ఈ పరిమిత కాలంలో ఏ వ్యవస్థలోనైనా పెనుమార్పులు తీసుకురావడం సాధ్యమేనా? ఎవరికి ఎలాంటి అనుమానాలున్నా, భారత సర్వోన్నత న్యాయాధిపతి (సీజేఐ)గా కొత్తగా నియుక్తులైన జస్టిస్ యు.యు. లలిత్ మాత్రం అవేవీ పట్టించుకోవడం లేదు. న్యాయవ్యవస్థలో సమూల సంస్కరణలకు సిద్ధమవుతున్నారు. భారత 49వ ప్రధాన న్యాయమూర్తిగా సోమవారం నుంచి పని ప్రారంభించిన లలిత్ కొన్నేళ్ళుగా సుప్రీమ్ కోర్టులో అశ్రద్ధకు గురైన వ్యవహారాలపై దృష్టి సారించారు. కోర్ట్ సామర్థ్యాన్ని మెరుగుపరిచేలా పాలనాపరమైన సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నారని వార్తాకథనాల మాట. ఏడాది పొడుగూతా రాజ్యాంగ కేసుల్ని వినేందుకు ప్రత్యేక రాజ్యాంగ ధర్మాసనాలను పునరుద్ధరించాలనీ, అలాగే కోర్ట్ సమయాన్ని వృథా చేసే 'పనికిమాలిన' దావాలపై చర్యలు చేపట్టాలనీ లలిత్ భావన. ఆ ఆలోచన మంచిదంటూనే, ఆచరణలో కష్టనష్టాలపై చర్చలు మొదలయ్యాయి.

ప్రస్తుతానికైతే, ఆగస్ట్ 29 నుంచి ప్రతిరోజూ వాదోపవాదాలు వినేందుకు గాను పాతిక రాజ్యాంగ ధర్మాసన అంశాలను లిస్ట్ చేస్తున్నట్టు సీజేఐ ప్రకటించారు. ఈ ప్రకటన కీలకమైనది. కేవలం తన దాకా వచ్చిన అప్పీలుపై తీర్పు చెప్పడమే కాదు, రాజ్యాంగ అంశాలను కూలంకషంగా పరిశీలించి, వాటికి వ్యాఖ్యానం చెప్పడం సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన బాధ్యత. అనేక ఇతర పెండింగ్ అంశాల పనిలో పడిపోయి, కొంతకాలంగా అది విస్మరణకు గురైంది. 1960లలో సగటున ఏటా 134 రాజ్యాంగ ధర్మాసన తీర్పులు వెలువడితే, ఆ సంఖ్య నిరుడు 2కు పడిపోయింది. దీన్ని గుర్తించిన నూతన ప్రధాన న్యాయమూర్తి ఈ బాధ్యతను భుజానికెత్తుకోవడం హర్షణీయం.

అపరిష్కృత కేసుల సమస్య దేశాన్ని చాలాకాలంగా పీడిస్తోంది. కరోనా దెబ్బతో ఈ సమస్య ద్విగుణం, బహుళం అయింది. 2017 నాటికి సుప్రీమ్‌లో 55 వేల పైచిలుకు కేసులు పెండింగ్. ఇప్పుడు వాటి సంఖ్య 71 వేలు దాటేసింది. ఇవన్నీ రాజ్యాంగేతర అంశాలకు సంబంధించినవే. న్యాయ సంస్కరణల్లో భాగంగా ఈ సమస్యను ఓ కొలిక్కి తేవడం ప్రధానం. తగినంత మంది న్యాయమూర్తులు లేరనడానికి వీల్లేదు. 2019 ఆగస్ట్ నాటికే సుప్రీమ్ జడ్జీల సంఖ్య 34కు పెరిగింది. ఎప్పటికప్పుడు జడ్జీల సంఖ్య పెరుగుతున్నా, 1950 నుంచి పెండింగ్ కేసులూ పెరుగుతూ పోతుండడం విడ్డూరం. దీనికి పరిష్కారంగా జోన్ల వారీగా కోర్ట్‌ను విభజించి, పదిహేనేసి మంది జడ్జీలతో 4 ప్రాంతీయ బెంచ్‌లు ఏర్పాటు చేసి, సుప్రీమ్ కోర్ట్‌కూ – హైకోర్ట్‌లకూ మధ్య అప్పిలేట్ కోర్ట్‌గా సదరు బెంచ్‌లు పనిచేయాలని ఒక ప్రతిపాదన. దీనివల్ల రాజ్యాంగ అంశాలపై దృష్టి పెట్టడానికి న్యాయమూర్తులకు మరింత సమయం దొరుకుతుందని వాదన. కానీ, ఈ జోనల్ కోర్ట్‌ల ఏర్పాటు రాజ్యాంగకర్తల ఆలోచనకు విరుద్ధమంటూ 1974లోనే 58వ న్యాయ సంఘం కొట్టిపారేసింది.

ప్రస్తుతం సుప్రీమ్ ఎదుట 492 రాజ్యాంగ ధర్మాసన అంశాలు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిలో దాదాపు 53 కేసులు ప్రభావశీల రాజ్యాంగ అంశాలకు సంబంధించినవి. పౌరసత్వ సవరణ చట్టం, ముస్లిమ్ వివాహ చట్టాల రాజ్యాంగబద్ధత, ఆర్టికల్ 370 రద్దు లాంటి అంశాలకు విస్తృత ధర్మాసనాలు అవసరమైనవి. ఇవన్నీ కోర్ట్ నిర్ణయం కోసం నిరీక్షిస్తున్నాయి. ఇలాంటి 53 కేసుల్లో ప్రస్తుతం 25 కేసులను వినే ప్రక్రియకు కొత్త సీజేఐ శ్రీకారం చుట్టారు. 1960లలో ఏటా సగటున వందకు పైగా రాజ్యాంగ ధర్మాసనాలు ఏర్పాటయ్యేవి. 2000 నాటికి వచ్చేసరికి వాటి సంఖ్య దాదాపు 10కి పడిపోయింది. సాధారణంగా అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనాలను చూస్తుంటాం. కొన్నిసార్లు ఏడుగురు, తొమ్మిదిమంది జడ్జీలతోనూ ధర్మాసనాలు ఏర్పాటవుతుంటాయి.

సుప్రీమ్ కోర్ట్ పని ఒత్తిడిని పరిమాణాత్మకంగా విశ్లేషించి చూస్తే, కోర్టు సమయంలో 85 శాతం దేశం నలుమూలల నుంచి వస్తున్న అప్పీళ్ళను వినడానికే సరిపోతోంది. ప్రస్తుతం 31 మందే ఉన్న నేపథ్యంలో ఈ కార్యభారం మధ్య విస్తృత రాజ్యాంగ ధర్మాసనాల ఏర్పాటు కొంత కష్టమని ఓ వాదన. అవసరానికి తగ్గట్టు జడ్జీల నియామకాలు పెంచుకోవడం దీనికి పరిష్కారం. ఇక శాశ్వత రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు వల్ల కీలక అంశాలపై సత్వర నిర్ణయం సాధ్యం. కానీ, అదొక్కటే అన్ని సమస్యల్నీ పరిష్కరించలేదని గుర్తించాలి. 'శాశ్వత'మనే ఆలోచన కొత్తదేమీ కాదు. 2019 సెప్టెంబర్‌లోనే అప్పటి ఛీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్ ప్రకటన చేసినా, ఆచరణలోకి రాలేదు. అయితే, కార్యనిర్వాహక వ్యవస్థతో పారదర్శక చర్చలతోనే శాశ్వత ధర్మాసనం సాధ్యం.

ఇప్పుడు సమగ్ర న్యాయ సంస్కరణలు అవసరం. అవి ఎంత సమగ్రంగా ఉంటే, అంత సమర్థ పరిష్కారం లభిస్తుంది. ఆధునిక సాంకేతికతనూ, కృత్రిమ మేధ లాంటివీ వాడుకుంటే న్యాయ వ్యవస్థ పనితీరు మరింత మెరుగవుతుంది. పెండింగ్ కేసుల పరిష్కారం సుకరమవుతుంది. అనేక దేశాలు చాలాకాలంగా వర్చ్యువల్ సాంకేతికతతో సత్వర న్యాయం అందిస్తున్నాయి. కరోనా వేళ వర్చ్యువల్ దోవ పట్టిన మన కోర్టులు ఇకపైనా దాన్ని విస్తృతంగా అనుసరించాలి. కోర్టుల ఆధునికీకరణ, డిజిటలీకరణకు ప్రాధాన్యమివ్వాలి. అదే సమయంలో ధర్మాసనాలు నిర్ణీత కేసుల్లో కీలక రాజ్యాంగ అంశాలపై స్పష్టతనిస్తే, దిగువ కోర్టులకు మార్గదర్శకంగా పనిచేస్తుంది. అప్పీళ్ళ ప్రవాహానికి అడ్డుకట్ట పడుతుంది. ఇక, కేసుల లిస్టింగ్‌లోనూ మరింత పారదర్శకత తెస్తానంటున్న లలిత్ మాటలు కొత్త ఆశలు చిగురింపజేస్తున్నాయి.

గ్రహం అనుగ్రహం

శ్రీశుభకృత్‌నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** శు.చవితి ప.1.56 వరకు, తదుపరి పంచమి **నక్షత్రం:** చిత్త రా.11.47 వరకు, తదుపరి స్వాతి, **వర్జ్యం:** ఉ.7.46 నుండి 9.22 వరకు, తదుపరి తె.5.16 నుండి 6.53 వరకు (తెల్లవారితే గురువారం) **దుర్ముహూర్తం:** ప.11.34 నుండి 12.25 వరకు **అమృతఘడియలు:** సా.5.22 నుండి 6.57 వరకు, **వినాయక చవితి.**

సూర్యోదయం : 5.48
సూర్యాస్తమయం : 6.13
రాహుకాలం : ప. 12.00 నుంచి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుంచి 9.00 వరకు

చెప్పుకోవడానికే గొప్ప మాటలు...

విశ్లేషణ



కొమ్మినేని శ్రీనివాసరావు

కులం గురించి మాట్లాడినవారికి చెప్పు చూపాలని చంద్రబాబు నాయుడు కొద్ది రోజుల క్రితం సూచించారు. కులం పునాదుల మీద రాజకీయాలలోకి వచ్చి, కులం గోడలను అడ్డు పెట్టుకుని రాజకీయాలలో కొనసాగుతున్న చంద్రబాబు ఇలా మాట్లాడటం ఆసక్తికరమైన అంశమే. ఇది ఆహ్వానించదగ్గ పరిణామం కూడా! కాకపోతే ఇందులో ఆయనకు ఉన్న చిత్తశుద్ధి ఎంతన్నదే చర్చనీయాంశం. ఒకవైపు కులం, మతం గురించి మాట్లాడవద్దని అంటారు. మరోవైపు తానే ఆ విషయాలను ప్రస్తావిస్తుంటారు. ఆయన లెక్కలో తాను మాట్లాడితే అది దేశం, సమాజం హితవు గురించి అని జనం అనుకోవాలి! ఇతరులు మాట్లాడినా, మాట్లాడకపోయినా వీలైనంత బురద రాయాలి. ఇదే ఆయన థియరీ.

అధికారంలో ఉంటే సుద్దులు, అధికారంలో లేకపోతే శాపనార్థాలు. ఈ రకంగా విజయవంతంగా రాజకీయం సాగిస్తున్న ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడుకు గత మూడేళ్లుగా ఇబ్బందికర పరిస్థితి ఏర్పడింది. ఆయన మాట్లాడే మాటలలోని వైరుధ్యాలను, గతంలో ఆయన అవే అంశాలపై భిన్నంగా మాట్లాడిన తీరును గుర్తు చేస్తూ సోషల్ మీడియాలో విపరీతంగా కామెంట్లు వచ్చేస్తున్నాయి. విశేషం ఏమిటంటే, ఏ సభలో అయితే కులం గురించి మాట్లాడితే చెప్పు చూపాలని చంద్రబాబు అన్నారో, అదే సభలో వైసీపీని విమర్శిస్తూ, ఆయనే కుల ప్రస్తావనను పదే పదే తేవడం! తన కులం వారితోనే తనను తిట్టిస్తున్నారని చెప్పడం! అక్కడితో ఆగలేదు. పవన్ కల్యాణ్‌ను కూడా ఆయన కులంవారితో తిట్టిస్తున్నారట. తన గురించి చెప్పుకున్నారంటే పోనీలే అనుకోవచ్చు. పవన్‌ను వైసీపీ వారు ఎవరో విమర్శిస్తే, అది కూడా కులం కోణంలోనే చంద్రబాబు చూడడం, తన పార్టీవారు కాకపోయినా, ఆయనతో ఇంకా పొత్తు లేకపోయినా, ఇప్పటినుంచే కాకా పడుతున్నట్లుగా మాట్లాడటం దేనికి సంకేతం? అసలు కులం గురించి, మతం గురించి ఈ మూడేళ్లలో చంద్రబాబు గానీ, ఆయన దత్తపుత్రుడని వైసీపీ విమర్శించే జనసేన అధినేత పవన్ కల్యాణ్ గానీ మాట్లాడినంతగా మరొకరు మాట్లాడలేదని చెప్పవచ్చు. పవన్ ఒకసారి అచ్చంగా కులభావన ఉండాలనీ, మరోసారి వద్దనీ, ఇంకోసారి ఫలానా ఫలానా కులాలవారు తనకు మద్దతు ఇవ్వాలనీ అంటుంటారు. మరి ఆయనకు చంద్రబాబు చెప్పు చూపిస్తారా? లేక, ఎస్సీలలో ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా అని అన్నందుకు... తాను కమ్మ కాబట్టే ప్రభుత్వం ఇలా చేస్తోంది, అలా చేస్తోందని అన్నందుకు తనకు తాను చెప్పు చూపించుకుంటారో తెలియదు.

నిజానికి చంద్రబాబు రాజకీయ జీవితం ఆరంభం అయిందే కులం పునాదుల మీద. ఆయన ఎస్వీ యూనివర్సిటీలో చదువుకునే రోజుల్లోనే కమ్మ కులం తరపున వకాల్తా పుచ్చుకుని ఆ వర్గం నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. అదే కోటాలో ఆయన కాంగ్రెస్(ఐ) తరపున 1978లో టికెట్ పొందారు. అప్పటి ప్రముఖ నేత రాజగోపాలనాయుడు ఆశీస్సులతో టికెట్ పొందగలిగారు. సీపీఐ నేత నారాయణ కూడా యూనివర్సిటీలో చంద్రబాబు కుల రాజకీయాలు చేశారని చెప్పారా, లేదా? చంద్రబాబు 1983లో చంద్రగిరిలో ఓడిపోయిన తర్వాత కుప్పం నియోజకవర్గానికి ఎందుకు మారారు? అప్పటికే అక్కడ ఉన్న కమ్మ వర్గానికి చెందిన రంగస్వామి నాయుడును తప్పించి తను ఎందుకు పోటీ చేశారు? అక్కడ బీసీ వర్గాలవారికి ఎన్టీఆర్‌పై ఉన్న అభిమానాన్ని తాను క్యాష్ చేసుకోవడానికి కాదా? ఒకవేళ నిజంగానే చంద్రబాబుకు బీసీ వర్గాలవారిపై అంత ప్రేమ ఉండి ఉన్నట్లయితే ఆ సీటును వారికి వదిలిపెట్టి, చంద్రగిరి కాకపోతే, తాను చదువుకున్న తిరుపతిలోనో, చిత్తూరు, శ్రీకాళహస్తి వంటి చోటో ఎందుకు పోటీ చేయలేదు?

టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ కులాలకు అతీతంగా గుడివాడతో పాటు తిరుపతి, నల్లగొండ, టెక్కలి, హిందుపూర్, కల్వకుర్తిలలో పోటీచేశారు. కల్వకుర్తిలో మాత్రం ఓడిపోయారు. హిందుపూర్ నుంచే ఆయన మూడుసార్లు ఎన్నికయ్యారు. ఆయన మరణం తర్వాత ఆ గుడ్ విల్‌ను ఆయన కుమారులు హరికృష్ణ, ఇప్పుడు బాలకృష్ణ వాడుకోగలుగుతున్నారు. ఎన్టీఆర్ ఏ కులం వారు ఎక్కడ ఉన్నారో చూసి పోటీ చేయలేదు. ధైర్యంగా ఎక్కడైనా తనకు ఆదరణ లభిస్తుందని నమ్మి రాజకీయం చేశారు. మరి చంద్రబాబు అలా ఎన్నడైనా చేయగలిగారా? ఒకే చోటు నుంచి పోటీచేయడం తప్పని అనడం లేదు. కానీ కులం సుద్దులు చెబుతున్నారు కనుక ఇవన్నీ ప్రస్తావించవలసి వస్తోంది. బహుశా ఇప్పుడు కుప్పంలో ఏర్పడిన గడ్డు పరిస్థితి నేపథ్యంలో నియోజకవర్గం మారతారేమో చూడాలి.



మరికొన్ని విషయాలు కూడా చెప్పుకోవాలి. వంగవీటి రంగా హత్య తర్వాత కమ్మవర్గం వారిపై ఎందుకు దాడులు జరిగాయి? చంద్రబాబుకు కులతత్వం లేకపోతే రంగా హత్యకు ఎందుకు కమ్మ వర్గం నేతలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారన్న ఆరోపణకు గురయ్యారు? ఈ విషయాన్ని కాపు నేత, మాజీ మంత్రి చేగొండి హరిరామజోగయ్య స్వయంగా తన పుస్తకంలో రాసుకున్నారు కదా! హైదరాబాద్, అనంతపురంలలో తాను చేసిన అభివృద్ధి గురించి ప్రస్తావిస్తున్నారు. హైదరాబాద్‌లో హైటెక్ సిటీ భవనం నిర్మించారు, నిజమే. కానీ ఆ చుట్టు పక్కల భూములన్నీ ముందుగానే ఎక్కువ మంది తన వర్గానికి చెందినవారు ఎందుకు కొనుగోలు చేశారని ప్రశ్నిస్తున్నవారు ఇప్పటికీ ఉన్నారు. ఫ్రాన్స్‌కు చెందిన ఒక పరిశోధకురాలు తన వ్యాసంలో ఈ విషయాన్ని ఎందుకు చెప్పారు? అనంతపురం జిల్లా పెనుగొండ వద్ద కియా ఫ్యాక్టరీ రావడానికి ముందు టీడీపీ నేతలు, ముఖ్యంగా కమ్మ వర్గం నేతలే భూములు కొనుగోలు చేశారనీ, ఆ దందా వల్లే పెనుగొండలో టీడీపీ ఓడిపోయిందన్న విమర్శ వాస్తవమో, కాదో చంద్రబాబే చెప్పాలి. తాను కమ్మ కులం కాబట్టే అమరావతిలోని రైతులను ప్రభుత్వం ఇబ్బంది పెడుతోందని చెప్పింది చంద్రబాబు కాదా? అమరావతిలో ఇన్‌సైడ్ ట్రేడింగ్ కింద భూములు కొనుగోలు చేసిన వారిలో అధికులు ఆ వర్గం వారే ఎందుకు ఉన్నారు?

ముఖ్యమంత్రి జగన్‌కు రెడ్డి వర్గంతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ తదితర వర్గాలు అత్యధిక సంఖ్యలో ఎందుకు సపోర్టు చేస్తున్నాయి? జగన్ కుటుంబంలో వివిధ కులాలకు చెందినవారు ఉన్న విషయం మర్చిపోకూడదు. జగన్‌ను క్రిస్టియన్ అని ఎన్నోసార్లు మతపరంగా ప్రస్తావించి దూషించిన బాబు ఇప్పుడు కులం, మతం అంటూ నీతులు చెబుతున్నారు. కొన్ని ఆలయాలపై దుండగులు దాష్టీకాలకు పాల్పడితే జగన్ ప్రభుత్వంపై ఎన్ని మతపరమైన ఆరోపణలు చేశారు? మరో సంగతి చెప్పాలి. బాబుకు తన కులానికి చెందిన మీడియా సంస్థలే ఎందుకు అంత ప్రముఖంగా మద్దతు ఇస్తున్నాయి? రామోజీరావు, రాధా కృష్ణ, బీఆర్ నాయుడు వంటివారు కులంతో కాకుండా మెరిట్ ప్రకారం చంద్రబాబుకు మద్దతు ఇస్తున్నారా? కడుపు చించుకుంటే కాళ్లమీద పడుతుందన్న చందంగా చంద్రబాబు అనవసర విషయాలు పదే పదే ప్రస్తావిస్తున్నారు.

హిందూపూర్ ఎంపీ గోరంట్ల మాధవ్ వీడియో గురించి మాట్లాడుతూ, బట్టలిప్పితే కేంద్ర మంత్రి పదవి ఇస్తారా అని అంటున్నారు. పోలీసుల వివరణ తర్వాత కూడా చంద్రబాబు ఈ విషయం పదే పదే మాట్లాడడం సరైనదేనా? ఓటుకు నోటు కేసులో చంద్రబాబు ఆడియో ఒరిజినల్ కాదని ఏ పోలీసు వ్యవస్థ అయినా నిర్ధారించిందా? కనీసం తాను అయినా అది తన వీడియో కాదని చెప్పగలిగారా? తన ఫోన్ టాప్ చేస్తారా అని అన్నారే తప్ప తాను టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని పడగొట్టే యత్నం చేయలేదని చెప్పలేకపోయారే! మరి తన బావమరిది నందమూరి బాలకృష్ణ ఏకంగా ఆడపిల్ల కనిపిస్తే ముద్దు అయినా పెట్టాలి, లేదా కడుపు అయినా చేయాలని సలహా ఇచ్చారు కదా? అలాంటి వ్యక్తికి టికెట్ ఇచ్చి హిందుపూర్ ఎమ్మెల్యేను చేశారు కదా. తన కుమారుడు లోకేశ్ అరడజను మంది విదేశీ యువతులతో చిందులు వేసిన ఫొటోలను సభ్య సమాజం ఆమోదించిందని ఆయనకు మంత్రి పదవి ఇచ్చారా? ఇలా చెప్పుకుంటూ పోతే అనేక ఉదాహరణలు ఉన్నాయి.

ఏ రాజకీయ పార్టీ అయినా బాధ్యతగా ఉండాలి. ఏ నేత అయినా జవాబుదారీగా ఉండాలి. సుదీర్ఘకాలం రాజకీయాలలో ముఖ్యమైన పదవు లలో ఉన్న చంద్రబాబు వంటివారు హద్దులు మీరి మాట్లాడితే పోయేది వారి పరువే. జగన్ ప్రభుత్వంపై విధాన పరమైన విమర్శలు చేయలేక, ఇలాంటి దిక్కుమాలిన విషయాలపై చంద్రబాబు ఆధార పడే దీన పరిస్థితి ఏర్పడిందని ప్రజలు అనుకుంటే అందులో తప్పేం ఉంటుంది!

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయులు

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

దుఃఖకరం



(జార్ఖండ్‌లో అంకితా సింగ్ మీద పెట్రోల్ పోసి నిప్పంటించి ఆమె చావుకు కారణమయ్యాడు షారుఖ్ హుస్సేన్.) అంకితా! మేము సిగ్గు పడుతున్నాం చెల్లెలా!

– కఫీల్ ఖాన్, పిల్లల వైద్యుడు

పండగ సంబరం



గణేశ్ ఉత్సవానికి సిద్ధం అవుతున్నాం. ప్రతిదీ మా సొంతంగా చేసుకోవడానికి ఇష్టపడతాం. ఇంటిని శుభ్రం చేయడం, అలంకరించడం, వినాయకుడికి మండపం నిర్మించడం, ప్రసాదాలు వండటం, మహిళలం 16 రకాల ఆభరణాలతో సింగారించుకోవడం (సోలా శృంగార్) ... ఎంతో ఉత్సాహంగా ఉంది. గణపతి బప్పా మోరియా (గణపతి దేవుడా, దీవించు)!

– కవితా కౌశిక్, నటి, యోగా టీచర్

మేము నడవొద్దా?



పాకిస్తాన్ వాయవ్య నగరం బన్నూలోని మహిళలకు ప్రత్యేకమైన ఏకైక పార్కు 'జిన్నా ఫ్యామిలీ పార్కు'ను ఇస్లామిస్టుల నిరసనలతో మూసేశారు. పార్కు అశ్లీలాన్ని వ్యాప్తి చేస్తోందని మతవాదులు ఆరోపిస్తున్నారు. పాకిస్తాన్‌ను తాలిబనీకరణ చేస్తున్నారని మహిళా హక్కుల కార్యకర్తలు మండిపడుతున్నారు.

– అబు బక్ర్ సిద్ధిఖ్, పాత్రికేయుడు

ఇద్దరు చాలు



చాలా విషయాలను చూసుకోవడానికి ఇద్దరు గుజరాతీలు సరిపోతారు. రాజకీయాలు: మోదీ, షా. వ్యాపారం: అంబానీ, అదానీ. క్రికెట్: జడేజా, పాండ్యా.

– హర్ష్ గోయెంకా, వ్యాపారవేత్త

మింగేస్తుంది



ప్రపంచంలో అత్యధిక ఆదరణ ఉన్న బ్రౌజర్: గూగుల్ క్రోమ్. దురదృష్టవశాత్తూ అది మన కంప్యూటర్ మెమరీని లాగేసుకుని, దాన్ని చాలా నెమ్మదిగా నడిచేట్టు చేస్తుంది.

– టెస్సా డేవిస్, సాంకేతికాంశాల వ్యాఖ్యాత

ధైర్యం లేదా?



ఇండియాకు వ్యతిరేకంగా చైనా చేస్తున్న భూ ఆక్రమణకు సంబంధించి అత్యంత స్పష్టమైన, శక్తిమంతమైన ప్రకటనల్లో ఒకటి జర్మనీ దౌత్యవేత్త నుంచి వచ్చిందిగానీ, ఒక భారత మంత్రి నుంచి కాదు.

– హ్యాపీమాన్ జాకబ్, ప్రొఫెసర్

వెల్కమ్ ఇండియా



యూకేకు ప్రయాణమవుతున్న భారతీయ విద్యార్థుల కోసం అప్‌డేట్: విద్యార్థుల కోసం ప్రాధమ్య, అతి ప్రాధమ్య వీసాలను యూకే ఇప్పుడు అందుబాటులోకి తెచ్చింది. దీనికి డిమాండ్ చాలా ఎక్కువగా ఉంది. కాబట్టి వీలైనంత త్వరగా తగిన డాక్యుమెంట్లతో వీసాలకు అప్లై చేసుకొమ్మని సిఫారసు చేస్తున్నాం.

– అలెక్స్ ఎల్లిస్, ఇండియాలో బ్రిటిష్ హైకమిషనర్

నేర్చుకుంటున్నా!



ఒక అచ్చు ప్రతిని చదవడానికి నేను 'ట్రాక్ ఛేంజెస్' వాడుతున్నాను. వయసు పైబడినా కొత్త ట్రిక్కులు నేర్వలేమని ఎవరు అనగలరు? అన్నట్టూ, నేను యూట్యూబులో ఒక ట్యుటోరియల్ చూశాను.

– స్టీఫెన్ కింగ్, హాలీవుడ్ రచయిత

ఉపాధి, ఉత్పత్తులే లక్ష్యంగా...

సందర్భం




డాక్టర్ పూనూరు గౌతమ్ రెడ్డి

ప్రపంచాన్ని పట్టి పీడించిన కోవిడ్ సంక్షోభం తగ్గుముఖం పట్టడంతో పారిశ్రామికాభివృద్ధిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. కొత్త పెట్టుబడులను ఆకర్షిస్తూనే ఇప్పటికే రాష్ట్రంలో పెట్టిన యూనిట్లను త్వరిత గతిన పూర్తి చేసి ఉత్పత్తి ప్రారంభించేలా చర్యలు చేపట్టింది. ప్రతి నెలా రాష్ట్రంలో పరిశ్రమల ప్రారంభోత్సవాలు, శంకు స్థాపనలు నిర్వహించేలా పరిశ్రమల శాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. ఇది సత్ఫలితాలనిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వానికి చెందిన డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీస్ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డీపీఐఐటీ) తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు అంటే ఆర్నెల్ల వ్యవధిలో రాష్ట్రంలో 22 భారీ యూనిట్లు ఉత్పత్తి ప్రారంభించగా, వీటి ద్వారా రూ. 20,682 కోట్ల విలువైన పెట్టుబడులు వాస్తవ రూపంలోకి వచ్చినట్లు డీపీఐఐటీ తన తాజా నివేదికలో వెల్లడించింది. తొలి ఆరు నెలల్లో ఉత్పత్తి ప్రారంభించిన ప్రధాన కంపెనీల్లో గ్రాసిం ఇండస్ట్రీస్, పానా సోనిక్ లైఫ్ సైన్స్ సొల్యూషన్స్, కాప్రికాన్ డిస్టిలరీ, ఆంజనేయ ఫెర్రో అల్లాయిస్, నోవా ఎయిర్, తారక్ టెక్స్‌టైల్స్, టీహెచ్‌కే ఇండియా, కిసాన్ క్రాఫ్ట్, తారకేశ్వర స్పిన్నింగ్ మిల్ లాంటివి ఉన్నాయి.

కోవిడ్ సంక్షోభం కుదిపివేసిన 2020, 2021తో పోలిస్తే ఈ ఏడాది తొలి ఆర్నెల్లలో రెట్టింపు పెట్టుబడులు వాస్తవ రూపంలోకి వచ్చాయి. 2019లో 42 యూనిట్లు ఉత్పత్తిని ప్రారంభించడం ద్వారా రూ. 9,840 కోట్ల పెట్టుబడులు వాస్తవ రూపంలోకి రాగా... 2021లో రూ. 10,350 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. గత రెండున్నరేళ్లలో మొత్తం 111 యూనిట్లు ఉత్పత్తిని ప్రారంభించడం ద్వారా మొత్తం రూ. 40,872 కోట్ల విలువైన పెట్టుబడులు వాస్తవ రూపంలోకి వచ్చాయి.

పారిశ్రామికవేత్తల నుంచి కంపెనీ ఏర్పాటు ప్రతిపాదన అందిన నాటి నుంచి యూనిట్‌లో ఉత్పత్తి ప్రారంభించిన తర్వాత కూడా పూర్తి స్థాయిలో చేయూత అందించేలా 'వైఎస్సార్ ఏపీ వన్' ద్వారా రాష్ట్ర ప్రభుత్వం సదుపాయాలు, సేవలు అందిస్తోంది. తాజాగా విశాఖ వద్ద ప్రముఖ జపాన్ కంపెనీ యకహోమా గ్రూపు సంస్థ ఏటీసీ టైర్స్ యూనిట్ ప్రారంభం సందర్భంగా సంస్థ సీఈవో నితిన్... మంత్రి, రాష్ట్ర ప్రభుత్వ తోడ్పాటును కొనియాడారు. సాధారణంగా అనుమతుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి ఉంటుందనీ, రాష్ట్రంలో మాత్రం 'సింగిల్ డెస్క్' విధానంలో వేగంగా మంజూరయ్యాయనీ తెలిపారు. దీంతో రికార్డు సమయంలో 15 నెలల్లోనే తొలిదశ యూనిట్‌ను ప్రారంభించడమే కాకుండా రెండో దశ పనులు మొదలుపెట్టినట్లు చెప్పారు. కోవిడ్ సమయంలో లాక్‌డౌన్ ఆంక్షలు ఉన్నప్పటికీ నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా రాష్ట్ర ప్రభుత్వ అధికారులు పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందించినట్లు నోవా ఎయిర్ ప్రతినిధులు వెల్లడించారు. 2020 డిసెంబర్‌లో నిర్మాణం ప్రారంభించి 11 నెలల్లోనే పనులు పూర్తి చేశామనీ, దీనివల్ల 250 టన్నుల ఆక్సిజన్ రాష్ట్ర ప్రజలకు అందుబాటులోకి వచ్చిందనీ తెలిపారు.

గత రెండున్నర ఏళ్లలో రాష్ట్రంలోకి కొత్తగా రూ. 24,956 కోట్ల విలువైన పెట్టుబడులు వచ్చినట్లు డీపీఐఐటీ నివేదిక పేర్కొంది. 2020 జనవరి నుంచి 2022 జూన్ నాటికి కొత్తగా 129 భారీ యూనిట్లు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేలా ఒప్పందాలు చేసుకున్నాయి. ఈ ఏడాది ఆరునెలల కాలంలో కొత్తగా 23 కంపెనీలు రూ. 5,856 కోట్ల విలువైన పెట్టుబడులు పెట్టడానికి రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నాయి. పారిశ్రామికీకరణ విధానాలను పునః సమీక్షిస్తూ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈలు) ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని



నోవా ఎయిర్ ప్లాంట్

అందిస్తూ, ఉత్పత్తి పెంచుతూ, ఆర్థిక చేయూతను ఇస్తూ ఉద్యోగ, ఉపాధులు కల్పిస్తోంది ప్రభుత్వం.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూడేళ్లలో 28,343 యూనిట్లు ఉత్పత్తిని ప్రారంభించాయి. వీటిద్వారా రూ. 47,490.28 కోట్ల విలువైన పెట్టుబడులు రావడమే కాకుండా 2,48,122 మందికి ఉపాధి లభించింది. ఇందులో 28,247 ఎంఎస్ఎంఈలు ఉండగా 96 భారీ యూనిట్లు ఉన్నాయి. ఇవి కాకుండా మరో రూ. 1,51,372 కోట్ల విలువైన పెట్టుబడులకు సంబంధించిన 61 యూనిట్ల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఇవి ఉత్పత్తిని ప్రారంభిస్తే మరో 1,77,147 మందికి ఉపాధి లభించనుంది. ఈ ఏడాది కొత్తగా 1.25 లక్షల ఎంఎస్ఎంఈలను 'ఉదయం' పోర్టల్‌లో నమోదు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా ఇప్పటికే 40,000 యూనిట్లు నమోదయ్యాయి.

రాష్ట్రంలో ప్రతి విద్యార్థినీ అత్యుత్తమ నైపుణ్యాలతో ప్రపంచస్థాయిలో తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలు మంచి ఫలితాలనిస్తున్నాయి. ఉద్యోగాన్వేషణలో అత్యంత కీలకమైన సాఫ్ట్‌స్కిల్స్ పెంపొందించడంపై 1.62 లక్షల మంది విద్యార్థులకు ఐటీ దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం శిక్షణ అందజేస్తోంది. రూ. 465 కోట్ల వ్యయమయ్యే ఈ శిక్షణను మైక్రోసాఫ్ట్ సంస్థ రాష్ట్ర విద్యార్థులకు దాదాపు రూ. 32 కోట్లకే అందిస్తోంది. అది కూడా విద్యార్థులపై నయాపైసా భారం లేకుండా ఆ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే పూర్తిగా భరిస్తోంది. శిక్షణకు ఎంపికైన విద్యార్థులకు మైక్రోసాఫ్ట్ కోర్సులే కాకుండా 'లింక్డిన్' ప్లాట్‌ఫాంతో అనుసంధానం చేస్తున్నారు. దీని ద్వారా లింక్డిన్‌లోని టెక్నాలజీ, క్రియేటివిటీ, బిజినెస్ విభాగాల్లో 8 వేలకు పైగా కోర్సులు విద్యార్థులకు ఉచితంగా అందుబాటులోకి వచ్చాయి.


వచ్చే ఏడాది విశాఖపట్నంలో నిర్వహించే ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సు–2023లో పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చేలా పటిష్ట ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాష్ట్రంలోకి పెట్టుబడులను ఆకర్షించేలా కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ (సీఐఐ) భాగస్వామ్యంతో భారీస్థాయి పెట్టుబడి దారులతో జనవరి తర్వాత ఈ సదస్సు నిర్వహించనున్నారు. ఈ ప్రయత్నం విజయవంతమైతే మరిన్ని ఉద్యోగాలు అందు బాటులోకి వస్తాయి.

వ్యాసకర్త ఏపీ ఫైబర్ నెట్ ఛైర్మన్
మొబైల్: 98481 05455

తొలిపూజ ఆయనకే!

మనిషికి వైవిధ్యం అంటే మహాప్రీతి. అందుకే తనను సృష్టించిన భగవంతుడిని పూజించేటప్పుడు కూడా, భగవత్తత్త్వం ఒక్కటే అని తెలిసినా, దానికి ఎన్నెన్నో పేర్లు పెడతాడు. ఎన్నెన్నో రూపాలను కల్పించుకొంటాడు. ఒక్కొక్క రూపానికి కొన్ని ప్రత్యేక లక్షణాలనూ, మహిమలనూ, వేషభాషలనూ, అభిమాన పూజా ద్రవ్యాలనూ, ప్రీతికరమైన నైవేద్యాలనూ తానే ఊహించి, ఎన్నెన్నో విధాలుగా పూజలు చేసుకొంటాడు.

అయితే, భారతీయ సనాతన సంప్రదాయం ప్రకారం దేవుళ్లందరిలోనూ ఎక్కువ పూజలు అందుకొనే దేవుడు మాత్రం నిస్సందేహంగా అందరికీ అభిమానదైవం అయిన వినాయకుడు. కారణం – మీరు ఏ దేవీ దేవతలను పూజించుకొన్నా, నిత్య పూజలైనా, నైమిత్తిక పూజలైనా, వ్రతాలైనా, జపాలైనా, తపాలైనా – తొలుత 'అవిఘ్నమస్తు' అంటూ, ధూర్జటి నందను'డైన గణనాథుడిని పూజించిన తరవాతే. అలాగే, 'విద్యారంభే, వివాహే చ, ప్రవేశే, నిర్గమే, తథా, సంగ్రామే, సర్వకార్యేషు...' అని ఏ కార్యం మొదలెట్టినా, కోటి సూర్య సమ ప్రభుడైన వక్రతుండుడికీ, లంబోదరుడికీ 'నిర్విఘ్నం కురు మే దేవ!' అని మ్రొక్కి కదలాల్సిందే. అంతెందుకు, వినాయక చవితి నాడు సాక్షాత్తూ వినాయకుడినే పూజించాలన్నా, ముందు వినాయకుడిని పూజించి విఘ్నాలు లేకుండా పూజ జరిపించమని వేడుకోవాల్సిందే! పసుపు వినాయకుడి అనుమతి పొందిన తరవాతే, అసలు వినాయకుడి పూజ. ఈ రోజుల్లో మనకు దేవుడి శ్లోకాలు ఎక్కువగా ఏమీ నోటికి రావు. 'శుక్లాంబర ధరం..' అన్న శ్లోకం వస్తుంది. 'అగజానన పద్మార్కం..' శ్లోకం వస్తుంది. రెండూ వినాయకుడి స్తుతులే. 'అ-గము' అంటే కదలనిది. పర్వతం. అగ-జ అంటే పర్వతపుత్రి పార్వతి. అగజా – ఆనన పద్మ- అర్కుడు... పార్వతి ముఖ పద్మాన్ని వికసింప జేసే సూర్యుడు అంటే గజాననుడు. భక్తానాం అనేక-దం, తం – అంటే భక్తులకు అనేక వరాలు ఇచ్చే ఆ ఏకదంతుడిని అహర్నిశమూ ఉపాసించుదాం.



– ఎం. మారుతి శాస్త్రి

నేటి నుంచి కాణిపాకంలో బ్రహ్మోత్సవాలు



కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయం

కాణిపాకం(యాదమరి): చిత్తూరు జిల్లా కాణిపాకంలోని స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి 21 రోజుల పాటు వేడుకగా నిర్వహించనున్నారు. వినాయకచవితి నుంచి తొమ్మిది రోజులు నవరాత్రి బ్రహ్మోత్సవాలు, అనంతరం 11 రోజుల పాటు ప్రత్యేక ఉత్సవాలు నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం వినాయక చవితి, గ్రామోత్సవం నిర్వహిస్తారు. సెప్టెంబర్ ఒకటో తేదీ ఉదయం ధ్వజారోహణం, రాత్రి హంస వాహనం, 2న నెమలి వాహనం, 3న మూషిక వాహనం, 4వ తేదీ ఉదయం చిన్నశేష వాహనం, రాత్రి పెద్ద శేష వాహనం, 5వ తేదీ ఉదయం చిలుక, రాత్రి వృషభ వాహనం, 6న గజవాహనం, 7న రథోత్సవం, 8వ తేదీ కల్యాణం, రాత్రి అశ్వవాహనం, 9న ధ్వజావరోహణం, వడాయిత్తు ఉత్సవం, ఏకాంత సేవలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. సెప్టంబర్ 10 నుంచి 20వ తేదీ వరకు ప్రత్యేక ఉత్సవాలు నిర్వహిస్తారు.

రూ.6 కోట్లతో ఉడాయించిన జీడిపప్పు వ్యాపారి



సీఐ శంకరరావుకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

కాశీబుగ్గ: శ్రీకాకుళం జిల్లా పలాస–కాశీబుగ్గ మునిసిపాలిటీకి చెందిన బొరిగి రవికుమార్ అనే జీడిపప్పు వ్యాపారి రూ.6 కోట్లతో పరారైనట్లు స్థానిక వ్యాపారులు మంగళవారం పోలీసులను ఆశ్రయించారు. రవికుమార్ అందరినీ నమ్మించి అప్పులు చేశాడని, దాదాపు 70 మంది వద్ద లావాదేవీలు చేసి మోసగించాడని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు రూ.6.07 కోట్లు ఇవ్వాల్సి ఉందని, సోమవారం రాత్రి నుంచి ఆయన కనిపించడం లేదని తెలిపారు. అతని తమ్ముడు కిషోర్‌కుమార్, వీఎల్ఎన్ రాజు అతనికి సహకరించారని, చర్యలు తీసుకోవాలని సీఐ శంకరావుకు ఫిర్యాదు చేశారు.

16 ఖాతాలు.. రూ.100 కోట్ల లావాదేవీలు

- ఆన్‌లైన్ లోన్ యాప్ ఏజెంట్‌ను అరెస్టు చేసిన విశాఖ సైబర్ పోలీసులు
- యాప్ నిర్వాహకులకు సహకరిస్తున్న కడపకు చెందిన జయసింహారెడ్డి
- చైనా నుంచి కెవిన్ అనే వ్యక్తి ఈ నెట్‌వర్క్ నడుపుతున్నట్లు గుర్తింపు
- వివరాలు వెల్లడించిన విశాఖ సీపీ శ్రీకాంత్

దొండపర్తి (విశాఖ దక్షిణ): రూ.5 వేలు జమ అయిన ఒక బ్యాంక్ ఖాతా.. రూ.100 కోట్ల లావాదేవీల ఆన్‌లైన్ లోన్ యాప్ ఏజెంట్ బండారాన్ని బట్టబయలు చేసింది. ఆ ఖాతాదారుడిని అదుపులోకి తీసుకొని విచారించిన విశాఖ సైబర్ క్రైమ్ పోలీసులు భారీ నెట్‌వర్క్‌ను ఛేదించారు. చైనా నుంచి లోన్‌యాప్ నిర్వహిస్తున్న కెవిన్ అనే వ్యక్తికి కడపకు చెందిన రాజు జయసింహారెడ్డి సహకరిస్తున్నట్లు గుర్తించి మంగళవారం హైదరాబాద్‌లో అరెస్టు చేశారు. విశాఖకు చెందిన యువతి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన సైబర్ క్రైమ్ పోలీసులు కేసును మూడు నెలల్లోనే ఛేదించినట్లు నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ వెల్లడించారు. మంగళవారం విశాఖలో ఈ కేసు వివరాలను ఆయన మీడియాకు వెల్లడించారు. ఆన్‌లైన్ లోన్‌యాప్ అక్రమ వసూళ్లు, వేధింపులపై ఇప్పటివరకు తొమ్మిది కేసులు నమోదైనట్లు చెప్పారు. అందులో ఒక యువతి కేసును తాజాగా ఛేదించినట్లు తెలిపారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న విశాఖ పోలీస్ కమిషనర్ శ్రీకాంత్

షటిల్ లోన్ యాప్ మాయాజాలం

విశాఖకు చెందిన ఒక మహిళ మే 17న గూగుల్ ప్లే స్టోర్ నుంచి 'షటిల్ లోన్' అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంది. దీనిలో రూ.5 వేలు రుణం కోసం అప్లై చేయగా.. మరుసటి రోజు ఆమె బ్యాంకు ఖాతాలో రూ.3,850 జమైంది. తీసుకున్న రుణం తిరిగి చెల్లించేందుకు ఆమెకు మూడు రోజులు గడువు ఇచ్చారు. కానీ గడువుకు ముందే లోన్ యాప్ నిర్వాహకులు రూ.12 వేలు చెల్లించాలని ఆమెను ఫోన్, వాట్సాప్ ద్వారా వేధించడం ప్రారంభించారు. దీంతో సదరు మహిళ రెండు దఫాలలో రూ.5 వేలు, రూ.7 వేలు చెల్లించారు. అప్పటికీ నిర్వాహకులు ఇంకా డబ్బులు చెల్లించాలని.. లేదంటే ఫొటోలను మార్ఫింగ్ చేసి కాంటాక్ట్స్‌లో ఉన్న నంబర్లకు పంపిస్తామని వాట్సాప్ మెసేజ్‌ల ద్వారా ఆమెను బెదిరించారు. దీంతో ఆమె విశాఖ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆమెకు వచ్చిన ఫోన్ కాల్స్, వాట్సాప్ నంబర్ల లొకేషన్స్‌ను పరిశీలించగా.. అవి నేపాల్‌లో ఉన్నట్లు తేలింది. అలాగే మహిళ లోన్ యాప్ నిర్వాహకులకు చెల్లించడానికి ఏ అకౌంట్‌లో రూ.5 వేలు వేసిందో తెలుసుకున్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో ఉన్న కెనరా బ్యాంక్‌లో ఆ నగదు జమైనట్లు గుర్తించారు. దీంతో సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ భవానీ ప్రసాద్ ఆ బ్యాంకు అధికారులను సంప్రదించారు. వారు ఇచ్చిన కేవైసీ ఆధారంగా ఆ ఖాతా ఒక ఫర్మ్ (సంస్థ) అకౌంట్‌తో తెరిచినట్లు తెలుసుకున్నారు. ఆ ఖాతాకు లింకై ఉన్న ఫోన్ నంబర్ ఆధారంగా కడపకు చెందిన రాజు జయసింహారెడ్డి అనే వ్యక్తిని హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకొని విచారించారు.

వివిధ బ్యాంకుల్లో 16 ఖాతాలు

జయసింహారెడ్డికి ఫేస్‌బుక్ ద్వారా చైనాలోని హాంకాంగ్‌కి చెందిన కెవిన్‌తో పరిచయం ఏర్పడింది. చైనా నుంచి కెవిన్ నిర్వహించే రకరకాల లోన్ యాప్స్, కావాల్సిన బ్యాంక్ అకౌంట్లు, ఫర్మ్ అకౌంట్లను జయసింహారెడ్డి తన కేవైసీతో ఓపెన్ చేసి వాటి యాక్సెస్‌ను, ఓటీపీలను కెవిన్‌కు అందించాడు. ఈ క్రమంలో ఇతడి పేరు మీద 11 ఫర్మ్ అకౌంట్లు, వివిధ బ్యాంకుల్లో 16 కరెంట్ ఖాతాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. జయసింహారెడ్డి బ్యాంకు ఖాతాల ద్వారా ఇప్పటివరకు రూ.100 కోట్ల మేర లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. ఇందులో అతడు రూ.1.15 కోట్లు కెవిన్ నుంచి పొందినట్లు తేల్చారు. జయసింహారెడ్డి మరిన్ని ఫర్మ్ అకౌంట్లు తెరిచి చైనా నిర్వాహకులకు అందించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో అతడిని అరెస్టు చేసి బ్యాంక్ ఖాతాలో రూ.కోటి నగదును సీజ్ చేశారు. ఈ కేసును మరింత విస్తృతంగా దర్యాప్తు చేస్తున్నామని కమిషనర్ శ్రీకాంత్ తెలిపారు. అయితే లోన్ యాప్ నిర్వాహకులు ఇతర దేశాల్లో ఉండడంతో కేంద్ర దర్యాప్తు సంస్థల సహకారం అవసరమన్నారు.

శాస్త్రోక్తంగా వరాహస్వామి జయంతి

ఆదివరాహక్షేత్రమైన తిరుమలలోని శ్రీవరాహస్వామివారి ఆలయంలో మంగళవారం వరాహ జయంతిని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం కలశస్థాపన, కలశపూజ, పుణ్యాహవాచనం చేపట్టారు. అనంతరం వేదమంత్రాల నడుమ మూలవర్లకు పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో అభిషేకం నిర్వహించారు. శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకుల్లో ఒకరైన వేణుగోపాల దీక్షితులు ఈ అభిషేకం చేశారు. సాయంత్రం వరాహార్చన నిర్వహించారు. టీటీడీ వైఖానస ఆగమ సలహాదారు మోహనరంగాచార్యులు మాట్లాడుతూ శ్రీ మహావిష్ణువు దశావతారాల విశిష్టతను వివరించారు. అనంతరం నివేదన, మంగళహారతితో ఈ కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో రమేష్‌బాబుతదితరులు పాల్గొన్నారు.

– తిరుమల



వరాహ స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

నేడు మొదటి ఘాట్ రోడ్డులో వినాయక చవితిపూజ

వినాయక చవితి సందర్భంగా బుధవారం టీటీడీ రవాణా విభాగం ఆధ్వర్యంలో తిరుమల మొదటి ఘాట్ రోడ్డులోని శ్రీవినాయక స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి 10 గంటల వరకు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు.

కేవీకే సేవల్ని అందిపుచ్చుకోవాలి

ఐసీఏఆర్–అటారీ డైరెక్టర్ జె.వి.ప్రసాద్

రంపచోడవరం(అల్లూరి సీతారామరాజు జిల్లా): గిరిజన రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) కృషి చేస్తోందని.. శాస్త్రవేత్తలు అందిస్తున్న సేవలను అందిపుచ్చుకోవాలని ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చరల్ రీసెర్చ్–అటారీ(హైదరాబాద్) డైరెక్టర్ డాక్టర్ జె.వి.ప్రసాద్ సూచించారు. మారేడుమిల్లి మండలం వేటుకూరు, పందిరిమామిడి కోట, రంపచోడవరం మండలం ఐ.పోలవరం గ్రామాలను మంగళవారం ఆయన సందర్శించారు. వేటుకూరు, పీఎం కోటలో గిరిజన రైతులతో రబ్బరు సాగు గురించి మాట్లాడారు. రబ్బరు ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలించారు. రైతులకు ఆయిల్ ఇంజన్లు, చిరుధాన్యాలు నిల్వ చేసుకునేందుకు డబ్బాలు పంపిణీ చేశారు. పెద్దగెద్దాడలో కొరమీను చేపల చెరువును, ఐ.పోలవరంలో సమగ్ర వ్యవసాయ విధానాన్ని పరిశీలించారు. పందిరిమామిడి కేవీకే వద్ద ఏర్పాటు చేసిన మన్యం ఆర్గానిక్ కృషి మార్ట్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో కేవీకే కో–ఆర్డినేటర్ లలితాకామేశ్వరి, శాస్త్రవేత్తలు డాక్టర్ పి.ఆదర్శ, డాక్టర్ పి.రాజశేఖర్, చిరంజీవి, వీరాంజనేయులు, క్రాంతి కుమార్, డాక్టర్.ప్రవీణ్, హెచ్‌ఆర్‌సీ శాస్త్రవేత్త డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ సి.పి.వెంగయ్య తదితరులు పాల్గొన్నారు.



వేటుకూరులో రబ్బరు రైతులతో మాట్లాడుతున్న ఐసీఏఆర్ డైరెక్టర్ ప్రసాద్

ప్యారీ సుగర్స్ మృతులకు రూ.60 లక్షల చొప్పున పరిహారం

పరిశ్రమకు తాళాలు వేసిన అధికారులు

కాకినాడ రూరల్: కాకినాడ జిల్లా వాకలపూడి పారిశ్రామికవాడలోని ప్యారీ సుగర్స్ రిఫైనరీలో సోమవారం జరిగిన ప్రమాదంలో మృతుల కుటుంబాలకు రూ.60 లక్షల చొప్పున పరిహారాన్ని అందించనున్నట్టు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ప్రకటించారు. ఆ పరిశ్రమలో సీ పాన్(ట్యాంకు)లో వాక్యూమ్ ప్రెజర్ (అధిక పీడన ఒత్తిడి) ఎక్కువైంది. దీంతో ట్యాంక్ దెబ్బతిని ఒక్కసారిగా లోపలికి కుంగిపోగా.. ప్లాట్‌ఫామ్ దెబ్బతిని ఐరన్ గడ్డర్లు అత్యంత వేగంగా దూసుకువచ్చి పేరూరు సుబ్రహ్మణ్యేశ్వరరావు (33), రాగం ప్రసాద్ (37)పై పడ్డాయి. తీవ్రంగా గాయపడిన వారిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలను కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో ఉంచగా కార్మిక సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధుల డిమాండ్ మేరకు అధికారులు యాజమాన్యంతో జరిపిన చర్చలు మంగళవారం తెల్లవారుజామునకు కొలిక్కి వచ్చాయి. పరిహారం వివరాలను మంగళవారం జిల్లా కలెక్టర్ మీడియాకు తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.40 లక్షల చొప్పున, ఉద్యోగుల కాంట్రీబ్యూషన్ ద్వారా మరో రూ.5 లక్షల చొప్పున చెల్లించేందుకు సంస్థ యాజమాన్యం అంగీకారం తెలిపింది. దీంతోపాటు వర్క్‌స్‌మెన్ కాంపన్సేషన్ చట్టం కింద రూ.10 లక్షలు, వైఎస్సార్ బీమా పథకం కింద రూ.5 లక్షలు చొప్పున పరిహారం అందిస్తామని కలెక్టర్ తెలిపారు. మృతుల కుటుంబాలలో ఒకరికి శాశ్వత ఉద్యోగం కల్పించేందుకు సంస్థ అంగీకారం తెలియజేసిందని కలెక్టర్ వివరించారు.



ప్యారీ షుగర్స్ ఫ్యాక్టరీని సీజ్ చేసిన అధికారులు

తాత్కాలికంగా పరిశ్రమ మూసివేత

ప్యారీ సుగర్స్‌లో ఈ నెల 19న పేలుడు వాటిల్లి ఇద్దరు మృతి చెందగా.. సోమవారం జరిగిన ప్రమాదంలో మరో ఇద్దరు మృతి చెందారు. కార్మికుల భద్రతకు ముప్పు ఉండటంతో ఫ్యాక్టరీల చట్టం–1948, ఏపీ ఫ్యాక్టరీ రూల్స్–1950లోని సెక్షన్ 40(2)ప్రకారం థర్డ్ పార్టీ పరిశీలన ద్వారా సంస్థలోని భద్రతా వ్యవస్థ అమలును ధ్రువీకరించే వరకు ప్యారీ సుగర్స్ కార్యకలాపాలను నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేశామని కలెక్టర్ తెలిపారు. మంగళవారం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాధాకృష్ణ, కాకినాడ ఆర్డీవో బీవీ రమణ, తహశీల్దార్ మురార్జీ తదితర అధికారుల బృందం పరిశ్రమలోని కంట్రోల్ రూమ్, బయట గేట్‌కు తాళాలు వేసి సీజ్ చేశారు.

చవితి ఉత్సవాలపైనా బీజేపీ రాజకీయమా?

మంత్రి చెల్లుబోయిన వేణు

సాక్షి, రాజమహేంద్రవరం: వినాయక చవితి ఉత్సవాలను బీజేపీ రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడం దారుణమని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ విమర్శించారు. రాజమహేంద్రవరంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా గణేష్ ఉత్సవాలపై ఎటువంటి ఆంక్షలు విధించలేదని చెప్పారు. బీజేపీ మాత్రం ఆంక్షలు విధించామంటూ తప్పుడు ప్రచారానికి తెర తీసిందని విమర్శించారు. ఆఖరికి వినాయక చవితి ఉత్సవాలను కూడా రాజకీయాలకు వాడుకోవడం సిగ్గుచేటన్నారు. ఉత్సవాల్లో భాగంగా గతంలో ఉన్న నిబంధనలను పాటించాలని మాత్రమే ప్రజలను కోరినట్లు చెప్పారు. ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఆయన సూచించారు.

ఆ చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగించండి

హైకోర్టు ధర్మాసనం



సాక్షి, అమరావతి: హైకోర్టు ముందుకు ఓ ఆసక్తికరమైన కేసు విచారణకు వచ్చింది. ఇలాంటి కేసు హైకోర్టు ముందుకు రావడం ఇదే తొలిసారి. విజయవాడలో మూడో తరగతి చదువుతున్న చిన్నారిని తల్లి కొట్టింది.. దీనిపై ఇరుగుపొరుగు పోలీసులకు ఫిర్యాదు చేశారు.. దీంతో పోలీసులు ఆ చిన్నారిని శిశు సంక్షేమ అధికారుల సంరక్షణలో ఉంచారు.. దీంతో షాకైన తల్లిదండ్రులు తమ కుమార్తెను తమకు అప్పగించాలని హైకోర్టును ఆశ్రయించారు. చివరకు హైకోర్టు ఆ చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగించింది. సంచలనం సృష్టించిన ఈ కేసు పూర్వాపరాల్లోకి వెళ్తే.. విజయవాడకు చెందిన శ్రీనివాసరావు, సంధ్యారాణికి మూడో తరగతి చదువుతున్న కుమార్తె లీలా కృష్ణశ్రీ ఉంది. బట్టలు లేకుండా మేడపై తిరుగుతోందని ఆ చిన్నారిని తల్లి కొట్టింది. చిన్నారి ఏడుపులు విన్న ఇరుగుపొరుగు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు చిన్నారిని శిశు సంక్షేమ శాఖ అధికారుల సంరక్షణలో ఉంచారు. దీంతో సంధ్యారాణి, శ్రీనివాసరావులు హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తులు జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి ధర్మాసనం విచారణ జరిపింది. న్యాయమూర్తులు ఆ చిన్నారితోపాటు శిశు సంక్షేమ కమిటీ చైర్మన్‌తో విడివిడిగా మాట్లాడారు. తల్లిదండ్రులు తమ చిన్నారి కోసం పరితపించారు. కుమార్తె పట్ల తాను వ్యవహరించిన తీరుపై తల్లి సంధ్యారాణి పశ్చాత్తాపం వ్యక్తం చేసింది. చిన్నారి సైతం తల్లిదండ్రులతో వెళ్లేందుకు ఇష్టపడింది. ఇకపై చిన్నారిని ప్రేమగా, జాగ్రత్తగా చూసుకుంటామని హామీ ఇస్తూ ప్రమాణపూర్వక అఫిడవిట్ దాఖలు చేయాలని తల్లిదండ్రులను ధర్మాసనం ఆదేశించింది. దీంతో వారు అఫిడవిట్ దాఖలు చేశారు. దీంతో చిన్నారి లీలా కృష్ణశ్రీని వెంటనే తల్లిదండ్రులకు అప్పగించాలని శిశు సంక్షేమ అధికారులను ధర్మాసనం ఆదేశించింది. కోర్టుకు చెప్పినట్లు ఆ చిన్నారి పేరు మీద రూ.50 వేలను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి, దాని కాపీని హైకోర్టు రిజిస్ట్రార్ (జ్యుడిషియల్) ముందుంచాలని తల్లిదండ్రులకు విస్పష్ట ఆదేశాలు ఇచ్చింది.

ఏ వ్యక్తికైనా తల్లే ప్రథమ దైవం, గురువు..

ఈ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ.. 'ఈ కేసులో తల్లి సంధ్యారాణి చర్యలు చట్టపరంగా నేరంగా కనిపించొచ్చు. అయితే మన సంస్కృతి ప్రకారం ప్రతి వ్యక్తికీ తల్లే మొదటి దైవం, గురువు. ఏ తల్లీ తన బిడ్డను శిక్షించే సమయంలో హాని చేయాలన్న దురుద్దేశంతో వ్యవహరిస్తుందని మేం అనుకోవడం లేదు. ఈ కేసులో చిన్నారి పట్ల తల్లి ప్రవర్తన దురదృష్టకరం. ఇలాంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తగా చూసుకుంటామని తల్లిదండ్రులిద్దరూ హామీ ఇచ్చారు' అని స్పష్టం చేసింది. కాగా చిన్నారులను ఉంచే శిశు సంరక్షణ కేంద్రాల్లో తగిన సదుపాయాలు ఉండేలా చూడాలని శిశు సంక్షేమ శాఖను ఆదేశించింది. రాష్ట్రంలోని ప్రైవేటు అనాథ శరణాలయాలు, శిశు సంక్షేమ కేంద్రాలు, అందులోని సౌకర్యాల వివరాలను తమ ముందుంచాలని కోరింది. వాటన్నింటినీ పరిశీలించి శిశు సంక్షేమం నిమిత్తం తగిన ఆదేశాలు జారీ చేస్తామని తెలిపింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 8కి వాయిదా వేసింది.

546 కిలోల గంజాయి స్వాధీనం



నిందితులతో ముంచంగిపుట్టు పోలీసులు

రంపచోడవరం/ముంచంగిపుట్టు: అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం, అరకు లోయ నియోజకవర్గాల్లో భారీ ఎత్తున గంజాయి స్వాధీనం చేసుకున్నారు. రంపచోడవరం సెబ్ స్టేషన్ పరిధిలోని మారేడుమిల్లి మండలంలో 421 కిలోలు, ముంచంగిపుట్టు మండలంలో 125 కిలోలు స్వాధీనం చేసుకున్నారు. మారేడుమిల్లి మండలం బోద్లంక గ్రామానికి సమీపంలోని కాలువ పక్కన గల అటవీ ప్రాంతంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్టు రంపచోడవరం సెబ్ సీఐ ఎ.ఆనంద్ తెలిపారు. గంజాయి స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అరెస్ట్ చేశామని, మరో వ్యక్తిపైనా కేసు నమోదు చేశామని చెప్పారు. కాగా, ముంచంగిపుట్టు మండలం మాకవరం సమీపంలో సోమవారం సాయంత్రం కారులో లోడ్ చేస్తున్న 125 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ కె.రవీంద్ర మంగళవారం తెలిపారు. 8 మంది నిందితులను అరెస్ట్ చేసి, కారు, సెల్ ఫోన్లను సీజ్ చేసినట్టు చెప్పారు. మాకవరం గ్రామానికి చెందిన పాంగి భీమన్న, ఇదే పంచాయతీ పరిధిలోని సేబుగూడ గ్రామానికి చెందిన నాయకం సురేంద్రకుమార్, ఒడిశా మల్కన్‌గిరి జిల్లా బలిమెల గ్రామానికి చెందిన ఫగును ఖిల్లా అలియాస్ మీట్టు, కొరాపుట్టు జిల్లా పిత్తముబందు సుకు గ్రామానికి చెందిన టక్కరి త్రినాథ్, కొరాపుట్టుకు చెందిన అహ్మద్ సిరఫీమ్ జ్యోతిస్, సుకు గ్రామానికి చెందిన అనంత కిముడు, బిష్ణు పటానియా, కుంద్ర జిల్లా సామ్‌పూర్ గ్రామానికి చెందిన ప్రసన్న కుమార్ పరిదాలను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ చెప్పారు.

- శ్రీశైలం అభివృద్ధికి కేంద్రం పూర్తి సహకారాన్ని అందిస్తుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను మంగళవారం ఆయన దర్శించుకున్నారు.

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. ఐదు కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 67,950 మంది స్వామి వారిని దర్శించుకోగా, 31,407 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారి హుండీల్లో కానుకల రూపంలో భక్తులు రూ.4.74 కోట్లు వేశారు. శ్రీవారి దర్శనానికి 6 గంటల సమయం పడుతోంది.

క్లుప్తంగా...

బొగ్గు కుంభకోణంలో అభిషేక్ బెనర్జీకి సమన్లు

కోల్‌కతా: బొగ్గు స్మగ్లింగ్ కుంభకోణం కేసులో తృణమూల్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీకి ఈడీ సమన్లు జారీ చేసింది. కోల్‌కతాలోని ఈడీ కార్యాలయానికి సెప్టెంబర్ 2న ఉదయం హాజరు కావాలంటూ ఈడీ అధికారులు ఆదేశాలు చేశారు. అభిషేక్ మరదలు మేనక గంభీర్‌ను ఇదే కుంభకోణంలో ప్రశ్నించేందుకు వచ్చే నెల 5న హాజరు కావాల్సిందిగా నోటీసులు పంపారు. ఆమెను న్యూఢిల్లీలో ఈడీ కార్యాలయానికి రావాలంటూ నోటీసుల్లో పేర్కొన్నారు. లండన్‌లోని మేనక గంభీర్ బ్యాంకు అకౌంట్ నుంచి పలు లావాదేవీలు జరిగాయని వాటిపై విచారణ జరపాల్సి ఉందని ఈడీ అధికారులు చెప్పారు. రాష్ట్రంలోని కునుస్తోరియా, కజోరా, అసనోల్‌లో ఈస్టన్ కోల్‌ఫీల్డ్స్ నుంచి రాజకీయ నాయకుల ప్రమేయంతో భారీ ఎత్తున బొగ్గు అక్రమ రవాణా జరిగిందని 2020లో సీబీఐ ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఈ బొగ్గు లావాదేవీలకు సంబంధించి 1,300 కోట్లు రాజకీయ నేతల జేబుల్లోకి వెళ్లాయని ఆరోపణలున్నాయి. ఈ కేసులో అభిషేక్ బెనర్జీ, ఆయన భార్య రుజిరా ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే.

కేసుల లిస్టింగ్‌పై సుప్రీంకోర్టు సర్క్యులర్

న్యూఢిల్లీ: ధర్మాసనాలు విచారించాల్సిన కేసుల జాబితాను ఎప్పటికప్పుడు తయారు చేయడానికి ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తామని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ యు.యు.లలిత్ ఇటీవలే ప్రకటించారు. కేసుల లిస్టింగ్‌లో మార్పులను నోటిపై చేస్తూ సుప్రీంకోర్టు మంగళవారం ఒక సర్క్యులర్ జారీ చేసింది. ఇకపై శనివారం, సోమవారం, మంగళవారం పరిశీలించి ధ్రువీకరించిన అన్ని తాజా కేసులను మరుసటి సోమవారం విచారించాల్సిన కేసుల జాబితాలో చేర్చనున్నట్లు సర్క్యులర్‌లో పేర్కొన్నారు. బుధవారం, గురువారం, శుక్రవారం ధ్రువీకరించిన కేసులను మరుసటి శుక్రవారం విచారించాల్సిన కేసుల జాబితాలో చేర్చనున్నట్లు వెల్లడించారు. ఒకవేళ సోమవారం, శుక్రవారం పరిమితికి మించిన కేసులు వస్తే వాటిని మరుసటి సోమవారాలు, శుక్రవారాల్లో విచారించనున్నట్లు వివరించారు.

కూల్చేవేళ బ్లాక్ బాక్స్‌లు, సిస్మోగ్రాఫ్‌లు..

నోయిడా: వంద మీటర్ల ఎత్తయిన జంట సౌధాలను నేలమట్టం చేసే సందర్భాన్ని పరిశోధకులు తమ అధ్యయనం కోసం వినియోగించుకున్నారు. భవిష్యత్ పరిశోధనకు కావాల్సిన సమాచారాన్ని రాబట్టేందుకు ఈ బహుళ అంతస్తుల భవంతులను ఎంచుకున్నారు. వాటర్‌ఫాల్ ఇంప్లోజన్ విధానంలో నోయిడా సెక్టార్93ఏలోని జంట భవనాలను ఆదివారం నేలమట్టంచేయడం తెల్సిందే. పేలుడుపదార్థాల ధాటికి భవనం నేలను తాకే క్రమం, శిథిలాలు సమీప ప్రాంతాలపై చూపే ప్రభావం, తదితర సమగ్ర సమాచారం సేకరించారు. డ్రోన్లు, థర్మల్ ఇమేజ్ కెమెరాలతో సంఘటనను అన్ని వైపుల నుంచీ షూట్‌చేశారు. పేలుడు ప్రభావాన్ని అంచనావేసేందుకు 20 అత్యాధునిక సిస్మోగ్రాఫ్‌లు, 10 బ్లాక్ బాక్స్‌లను ఆ భవనాల్లోనే బిగించామని సెంట్రల్ బిల్డింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సీబీఆర్ఐ) శాస్త్రవేత్త దేబీ ప్రసన్న చెప్పారు. పేలుడు ధాటికి భూమి కంపనాలను గణించేందుకు సిస్మోగ్రాఫ్‌లను వాడారు. జెట్ డెమోలీషన్స్ అండ్ ఎడిఫీస్ ఇంజనీరింగ్ సంస్థ ఈ భవనాలకు పేలుడుపదార్థాలు అమర్చి పేల్చేసింది.

2న నావికాదళం నూతన చిహ్నం ఆవిష్కరణ

న్యూఢిల్లీ: భారత నావికా దళానికి బ్రిటిష్ కాలం నాటి చిహ్నమే ఇంకా కొనసాగుతోంది. దీని స్థానంలో కొత్త చిహ్నం రూపొందించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సెప్టెంబర్ 2న ఈ నూతన చిహ్నాన్ని ఆవిష్కరించనున్నారు. తొలిసారిగా దేశీయంగా తయారు చేసిన విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్‌ను అదేరోజు ఉదయం 9.30 గంటలకు కేరళలోని కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో మోదీ చేతుల మీదుగా జలప్రవేశం చేయిస్తారని ప్రధానమంత్రి కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ సందర్భంగా నావికాదళం చిహ్నాన్ని(నిశాన్)ను ఆవిష్కరిస్తారని తెలిపింది.

బెంగళూరు ఈద్గా మైదానంలో.. వినాయక చవితి వేడుకలకు కర్ణాటక హైకోర్టు ఓకే

న్యూఢిల్లీ: కర్ణాటక రాజధాని బెంగళూరులోని ఈద్గా మైదానంలో వినాయక చవితి వేడుకలకు రాష్ట్ర హైకోర్టు సానుకూలంగా స్పందించింది. తొలుత హిందూ సంఘాల విజ్ఞప్తి మేరకు గణేశ్ ఉత్సవాలకు చామరాజపేటలోని ఈద్గా మైదానాన్ని వాడుకోవడానికి కర్ణాటక ప్రభుత్వం అంగీకరించింది. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ సెంట్రల్ ముస్లిం అసోసియేషన్ ఆఫ్ కర్ణాటక, కర్ణాటక వక్ఫ్ బోర్డు రాష్ట్ర హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. ఆ మైదానంలోగణేశ్ ఉత్సవాలకు హైకోర్టు సైతం ఆమోదం తెలియజేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ సెంట్రల్ ముస్లిం అసోసియేషన్ ఆఫ్ కర్ణాటక, కర్ణాటక వక్ఫ్ బోర్డు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. వ్యాజ్యం దాఖలు చేశాయి. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ యు.యు.లలిత్ నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. వివాదం పరిష్కారం కోసం కర్ణాటక హైకోర్టుకే వెళ్లాలని సూచించింది. ఈద్గా మైదానంలో గణేశ్ చతుర్థి జరుపుకోవచ్చంటూ హైకోర్టు మంగళవారం రాత్రి పచ్చజెండా ఊపింది. అధికార వర్గాలు తీసుకున్న నిర్ణయంలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది.

బ్రెజిల్‌లో మరణించిన ఒంటరి మనిషి

అంతరించిపోయిన అరుదైన తెగ

బ్రెజీలియా: బ్రెజిల్‌లోని ఆదివాసీ తెగకి చెందిన ఒక ఒంటరి మనిషి తుది శ్వాస విడిచాడు. ప్రపంచంలోనే ఒంటరి వ్యక్తిగా పిలిచే ఆ మనిషి ఇటీవల మరణించినట్టు బ్రెజిల్ అధికారులు వెల్లడించారు. అతని పేరేంటో తెలీదు. బాహ్య ప్రపంచంతో అతనికి సంబంధాలు లేవు. వయసు 60 ఏళ్ల వరకు ఉంటుంది. గత 26 ఏళ్లుగా అడవిలో ఒంటరిగా జీవిస్తున్నాడు. అడవి జంతువుల్ని బంధించడంతో పాటు ఆత్మ రక్షణ కోసం అడవిలో ఎక్కడికక్కడ గోతులు తవ్వుకుంటూ వెళతాడని అతనిని ''మ్యాన్ ఆఫ్ ది హోల్'' అని పిలుస్తారు. దూరం నుంచే అతని బాగోగుల్ని పర్యవేక్షిస్తున్న బ్రెజిల్ ఆదివాసీ వ్యవహారాల సంస్థ అధికారికి ఆగస్టు 23న ఒక గుడిసెలో అతని మృతదేహం కనిపించింది. అతని మీద దాడి చేసి ప్రాణాలు తీసినట్టుగా ఆధారాలేవీ కనిపించలేదు. అప్పటికే ఆ వ్యక్తి మరణించి 40 నుంచి 50 రోజులై ఉంటుందని అతని


గతంలో తీసిన వీడియోలో ఒంటరి మనిషి(ఫైల్)

మృతదేహం పడి ఉన్న తీరుని బట్టి అంచనా వేశారు. అతని మృతదేహంపైన రంగు రంగుల పక్షి ఈకలు ఉన్నాయి. దీంతో అతను తన మరణాన్ని ముందుగానే ఊహించి ఈకలు కప్పుకొని ఉంటాడని ఆదివాసీ నిపుణుడు మార్సెల్ డోస్ శాంటో తెలిపారు. రోండానియా రాష్ట్రంలోని టనూరు ఆదివాసీ ప్రాంతంలో నివసించే ఒకానొక ఆదివాసీ తెగలో ఇతను చివరి వాడు కావడంతో మానవజాతిలో ఒక తెగ అంతరించినట్టయింది. నాలుగేళ్ల క్రితం అతను బ్రెజిల్ అధికారుల కెమెరాలకు చిక్కాడు. పదునైన ఆయుధంతో చెట్లు నరికే దృశ్యాలు అందులో ఉన్నాయి. ఆ వ్యక్తి అధికారులకి కనిపించడం అదే చివరిసారి. టనూరులో ఆదివాసీ తెగపై కొందరు భూ ఆక్రమణదారులు 1970 నుంచి దాడులు చేస్తూ ఈ తెగకి చెందిన వారిని చాలా మందిని బలి తీసుకున్నారని ఆదివాసీల సంక్షేమం కోసం పని చేసే స్వచ్ఛంద సంస్థ సర్వైవల్ ఇంటర్నేషనల్ వెల్లడించింది. ఆ తెగలో మిగిలిన ఆరుగురిని 1995లో అక్రమ గనుల తవ్వకదారులు దాడులు చేసి చంపేశారు. అతనొక్కడే ప్రాణాలతో మిగిలిపోవడంతో ఒంటరివాడైపోయాడు. అప్పట్నుంచి అతని రక్షణని ఎప్పటికప్పుడు బ్రెజిల్ సంస్థ పర్యవేక్షిస్తోంది. ఆ ప్రాంతంలోకి ఎవరూ వెళ్లకుండా నిషేధం విధించింది. ఇప్పుడు ఈ మిస్టరీ మ్యాన్ మరణించడంతో ఆ తెగకు చెందిన వివరాలన్నీ ఒక మిస్టరీగానే మిగిలిపోయాయి.

అంధుడైన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు..

మైక్రోసాఫ్ట్‌లో 47 లక్షల వేతనం

ఇండోర్: అంధత్వాన్ని లెక్కచేయకుండా చివరికి అనుకున్నది సాధించి చూపారు సామాన్య కుటుంబానికి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. ప్రముఖ ఐటీ కంపెనీ మైక్రోసాఫ్ట్ నుంచి భారీ వేతన ప్యాకేజీ అందుకున్నారు. మధ్యప్రదేశ్‌కు చెందిన యశ్.. సొనాకియా ఇండోర్‌లో బీటెక్ చేశారు. 'స్క్రీన్-రీడర్ సాఫ్ట్‌వేర్ సాయంతో చదువుకున్న నేను, కోడింగ్ నేర్చుకుని ఉద్యోగాన్వేషణ మొదలుపెట్టా. మైక్రోసాఫ్ట్ ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూలో నెగ్గి, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ పోస్ట్‌కు ఎంపికయ్యా'అని చెప్పారు. 'మైక్రోసాఫ్ట్ ఇచ్చిన రూ.47 లక్షల వార్షిక వేతన ప్యాకేజీ ఆఫర్‌కి ఓకే చెప్పాను'అని వివరించారు. యశ్ సొనాకియా తండ్రి యశ్‌పాల్ స్థానికంగా క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. మొదటి సంతానమైన యశ్‌కు పుట్టుకతోనే గ్లూకోమా ఉంది. అప్పట్లో స్వల్పంగా ఉన్న కంటిచూపు క్రమక్రమంగా తగ్గుతూ 8 ఏళ్లు వచ్చేసరికి పూర్తిగా అంధుడైపోయారు. దీంతో, యశ్ 5వ తరగతి వరకు ప్రత్యేక పాఠశాలలో చదివారు. ఆ తర్వాత, తన తోబుట్టువులతోపాటే సాధారణ స్కూలుకు వెళ్లారు. వాళ్లే చదువులో అతడికి సాయం చేసేవారు. 'సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావాలన్న కల సాకారం చేసుకునేందుకు యశ్ ఎంతో కష్టపడ్డాడు. నా కోరికా అదే. చివరికి ఫలించింది'అని యశ్‌పాల్ గద్గదస్వరంతో అన్నారు.


తండ్రితో యశ్(ఎడమ)

ఛత్తీస్‌కు జార్ఖండ్ యూపీఏ ఎమ్మెల్యేలు

- చార్టర్డ్ విమానంలో రాంచీ నుంచి రాయ్‌పూర్‌కు తరలింపు
- మేఫెయిర్ రిసార్ట్‌కు చేరుకున్న 32 మంది సభ్యులు
- ఎమ్మెల్యేలను కాపాడుకోవడానికి యూపీఏ ప్రయత్నాలు
- ఎలాంటి పరిణామాలు ఎదురైనా ఎదుర్కొంటాం
- జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్


రాయ్‌పూర్‌కు వెళ్లేందుకు రాంచీ ఎయిర్‌పోర్ట్‌కు ఎమ్మెల్యేలతో బయల్దేరిన సీఎం సోరెన్

రాంచీ: జార్ఖండ్‌లో రాజకీయ సంక్షోభం నేపథ్యంలో బేరసారాల నుంచి తమ ఎమ్మెల్యేలను కాపాడుకొనేందుకు అధికార యూపీఏ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. 32 మంది ఎమ్మెల్యేలను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌కు మంగళవారం తరలించింది. వీరంతా తొలుత జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ నివాసం నుంచి రెండు బస్సుల్లో రాంచీ ఎయిర్‌పోర్టుకు వచ్చారు. సోరెన్ వెంట వచ్చారు. సోరెన్ మినహా ఇతర ఎమ్మెల్యేలు చార్టర్డ్ విమానంలో సాయంత్రం 4.30 గంటలకు రాంచీ ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి 5.30 గంటలకు రాయ్‌పూర్‌లోని వివేకానంద ఎయిర్‌పోర్ట్ చేరుకున్నారు. దగ్గర్లోని నవ రాయ్‌పూర్‌లోని మేఫెయిర్ రిసార్ట్‌కు చేర్చారు. ఎమ్మెల్యేలు మకాం వేసిన రిసార్ట్ చుట్టూ ఛత్తీస్‌గఢ్ పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎలాంటి పరిణామాలు ఎదురైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ చెప్పారు. జార్ఖండ్ అసెంబ్లీలో మొత్తం ఎమ్మెల్యేల సంఖ్య 81 కాగా, అధికార యూపీఏకు 49 మంది సభ్యులు ఉన్నారు. ప్రభుత్వాన్ని కూల్చేయడానికి తమ ఎమ్మెల్యేలను బీజేపీ కొనుగోలు చేసే అవకాశం ఉందని యూపీఏ అనుమానిస్తోంది. యూపీఏలో జేఎంఎం, కాంగ్రెస్, ఆర్జేడీ భాగస్వామ్య పక్షాలుగా కొనసాగుతున్నాయి. జేఎంఎంకు 30, కాంగ్రెస్‌కు 18, ఆర్జేడీకి ఒక ఎమ్మెల్యే ఉన్నారు. బీజేపీకి 26 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు.

భవిష్యత్తు కార్యాచరణపై చర్చ

జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్‌పై ఎమ్మెల్యేగా అనర్హత వేటు వేయాలంటూ ఎన్నికల సంఘం సూచించినప్పటికీ గవర్నర్ మాత్రం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. రాజ్‌భవన్ మౌనం వహిస్తుండడంపై యూపీఏ ఎమ్మెల్యేల అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యేల కొనుగోళ్లకు ఆస్కారం కల్పిస్తున్నారంటూ గవర్నర్ తీరును ఆక్షేపిస్తున్నారు. త్వరగా నిర్ణయం తీసుకోవాలని, రాజకీయ అనిశ్చితిని తొలగించాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో భవిష్యత్తు కార్యాచరణపై చర్చించేందుకు మంగళవారం హేమంత్ సోరెన్ నివాసంలో ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలంతా సమావేశమయ్యారు. జార్ఖండ్ మంత్రివర్గ సమావేశం సెప్టెంబర్ 1న సాయంత్రం 4 గంటలకు జరుగనుంది.

జార్ఖండ్‌లో దారుణ కుల వివక్ష

50 దళిత కుటుంబాలను తరిమేసిన వైనం

మేదినీనగర్(జార్ఖండ్): సమ సమాజం దిశగా ముందడుగేయాల్సిన భారతావనిలో మరో దారుణ ఘటన చోటుచేసుకుంది. ఒకే కులానికి చెందిన 50 దళిత కుటుంబాలను కొందరు ఊరిలో నుంచి తరిమేశారు. ఈ దళిత కుటుంబాల ఇళ్లను పూర్తిగా ధ్వంసం చేశారు. ఇళ్లలోని వస్తువుల అన్నింటినీ వాహనాల్లోకి ఎక్కించి, వీరిని సమీప అడవిలోకి తరిమేశారు. జార్ఖండ్‌లోని పలాము జిల్లాలోని మరుమటు గ్రామంలో ఈ వివక్షాపూరిత ఘటన జరిగింది. ఘటనపై రాష్ట్ర గవర్నర్ రమేశ్ స్పందించారు. రెండ్రోజుల్లో నివేదిక సమర్పించాలని పలాము డిప్యూటీ కమిషనర్‌ను ఆదేశించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ముషార్ కులానికి చెందిన 50 కుటుంబాలు మరుమటు గ్రామంలో నివసిస్తున్నాయి. సోమవారం హఠాత్తుగా కొందరు వీరు ఉండే ప్రాంతానికి వచ్చి అందరినీ చితకబాది ఇంటిసామగ్రిని బయటపడేసి ఇళ్లను ధ్వంసంచేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు, మేదినీనగర్ సబ్ డివిజినల్ ఆఫీసర్ రాజేశ్ కుమార్ షా, సబ్ డివిజన్ పోలీస్ ఆఫీసర్(ఎస్‌డీపీవో) సుర్జీత్ కుమార్‌లు ఘటనాస్థలికి చేరుకున్నారు. బాధిత కుటుంబాలకు మళ్లీ ఊరిలో వారి స్థలాల్లోనే నివాస సౌకర్యాలు కల్పిస్తామని, ప్రస్తుతం తాత్కాలిక శిబిరాల్లో ఉంచామని అధికారులు తెలిపారు.

సిసోడియా లాకర్లలో సీబీఐ సోదాలు

- వివరాలు బయటపెట్టని అధికారులు
- సోదాల్లో ఏమీ దొరకలేదన్న సిసోడియా
- సీబీఐ తనకు క్లీన్‌చిట్ ఇచ్చిందని వెల్లడి



ఘజియాబాద్: ఢిల్లీ ఎక్సైజ్ విధానంలో అక్రమ కేసులో భాగంగా ఆమ్ ఆద్మీ పార్టీ నేత, ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాకు చెందిన బ్యాంకు లాకర్లలో సీబీఐ అధికారులు మంగళవారం సోదాలు నిర్వహించారు. ఢిల్లీ శివార్లలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ వసుంధర, ఘజియాబాద్ శాఖల్లో సిసోడియా, ఆయన భార్య సమక్షంలో సోదాలు జరిగాయి. సోదాల్లో ఏం బయటపడిందనే దానిపై సీబీఐ ప్రకటన చేయలేదు. సోదాల అనంతరం సిసోడియా మీడియాతో మాట్లాడారు. సీబీఐ తనకు క్లీన్‌చిట్ ఇచ్చిందని చెప్పారు. పై నుంచి వస్తున్న ఒత్తిళ్ల కారణంగానే తనపై దర్యాప్తు జరుపుతున్నారని ఆరోపించారు. ''నా ఇంట్లో ఏమీ దొరకనట్లుగానే లాకర్లలోనూ అధికారులకు ఏమీ దొరకలేదు. వాటిలో నా పిల్లలు, భార్యకు చెందిన రూ.80,000 విలువైన బంగారమే ఉంది. రెండు మూడు నెలల్లో తనను జైలుకు పంపించేలా సీబీఐపై ప్రధాని మోదీ ఒత్తిడి పెంచుతున్నారని సిసోడియా విమర్శించారు.

బీజేపీ బచ్చా చోర్ పార్టీ

కేంద్రంలోని అధికార బీజేపీని బచ్చా చోర్ పార్టీగా సిసోడియా అభివర్ణించారు. ఆయన మంగళవారం ఢిల్లీ అసెంబ్లీలో మాట్లాడారు. ఏడు నెలల చిన్నారి కిడ్నాప్ కేసులో ఇటీవల బీజేపీ కార్పొరేటర్‌ను అరెస్టు చేసిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తన బ్యాంకు లాకర్లలో ఆస్తుల పత్రాలు దొరికాయంటూ మీడియాతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రతిపక్షాలు సంధించే అన్ని ప్రశ్నలకు తాను సమాధానం చెప్తానని అన్నారు. ప్రతిపక్షాల అబద్ధాలకు సమాధానాలు చెప్పలేమని వ్యాఖ్యానించారు. ఢిల్లీలో 'ఆపరేషన్ లోటస్'కు డబ్బు ఎక్కడి నుంచి వస్తోందో తేల్చడానికి సీబీఐ దర్యాప్తు ఎప్పుడు జరిపిస్తారో చెప్పాలని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డాను సిసోడియా నిలదీశారు. లిక్కర్ పాలసీలో అవినీతి జరిగిందంటూ అసెంబ్లీలో బీజేపీ ఎమ్మెల్యేలు ఆందోళనకు దిగారు. వారిని డిప్యూటీ స్పీకర్ రాఖీ బయటకు పంపించారు.

చెత్త రాజకీయాలు ఆపండి: కేజ్రీవాల్

సిసోడియా నిజాయతీ, దేశభక్తిని దేశం మొత్తం గుర్తించిందని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ చెప్పారు. దేశంలో నీచ రాజకీయాలు సాగుతున్నాయని దుయ్యబట్టారు. ఆయన నిజాయతీపరుడన్న విషయం తేలిపోయిందని ఉద్ఘాటించారు. చెత్త రాజకీయాలను ఇకనైనా ఆపాలని, తమను పని చేసుకోనివ్వాలని హితవు పలికారు. ఈ మేరకు కేజ్రీవాల్ ట్వీట్ చేశారు.

ఈడబ్ల్యూఎస్‌కు 10 శాతం కోటా..

రాజ్యాంగబద్ధమేనా?

న్యూఢిల్లీ: విద్యాసంస్థల్లో ప్రవేశాలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు(ఈడబ్ల్యూఎస్) 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రాజ్యాంగబద్ధంగా చెల్లుబాటు అవుతుందో కాదో తొలుత పరిశీలిస్తామని సుప్రీంకోర్టు వెల్లడించింది. ముస్లింలకు విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు(కోటా) కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని కొట్టివేస్తూ రాష్ట్ర హైకోర్టు తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాలు చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతోపాటు పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం దృష్టి సారించింది. సెప్టెంబర్ 6న విధానపరమైన ప్రక్రియ, ఇతర అంశాలను పరిశీలిస్తామని, సెప్టెంబర్ 13 నుంచి ఈ పిటిషన్లపై విచారణ ప్రారంభిస్తామని మంగళవారం స్పష్టం చేసింది. ఈడబ్ల్యూఎస్ కోటా, అనంతరం ముస్లిం రిజర్వేషన్ చట్టంపై విచారణ చేపడతామని సుప్రీంకోర్టు ధర్మాసనం తెలియజేసింది. ఈ రెండు అంశాలపై విచారణకు నోడల్ అడ్వొకేట్లుగా వ్యవహరించాలని నలుగురు న్యాయవాదులకు సూచించింది.

ఆజాద్‌ను కలిసిన జి-23 నేతలు

జమ్మూ: కాంగ్రెస్ పార్టీలోని జి-23 గ్రూప్ నేతలు మాజీ కాంగ్రెస్ నేత గులాంనబీ ఆజాద్‌తో భేటీ అయ్యారు. జి-23 గ్రూప్‌నకు చెందిన భూపీందర్ హుడా, ఆనంద్ శర్మ, పృథ్వీరాజ్ చవాన్ ఢిల్లీలోని ఆజాద్ నివాసానికి వెళ్లారు. భవిష్యత్ వ్యూహాలపై వీరు చర్చించినట్లు సమాచారం. కాంగ్రెస్ పార్టీ సంస్థాగత ఎన్నికలు, జి-23 గ్రూప్‌నకే చెందిన శశిథరూర్ ఆ పార్టీ అధ్యక్ష పదవికి పోటీ పడే అవకాశాలున్నాయనే అంశం వారి చర్చల్లో ప్రస్తావనకు వచ్చినట్లు తెలుస్తోంది. గతంలో కాంగ్రెస్ అధిష్టానంపై అసమ్మతి బావుటా ఎగురవేసిన జి-23 గ్రూప్ నేతల్లో ఆజాద్ ఉన్నారు. త్వరలోనే జాతీయ స్థాయి పార్టీని స్థాపించనున్నట్లు ఆజాద్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఆజాద్‌కు మద్దతుగా జమ్మూకు చెందిన 64 మంది కాంగ్రెస్ నేతలు ఆ పార్టీకి రాజీనామా చేశారు. వీరంతా కాంగ్రెస్ చీఫ్ సోనియా గాంధీకి ఉమ్మడిగా తమ రాజీనామా లేఖను అందజేసినట్లు మీడియాకు తెలిపారు. కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పిన వారిలో మాజీ ఉప ముఖ్యమంత్రి తారాచంద్ సహా మాజీ మంత్రులు అబ్దుల్ మాజిద్ వనీ, మనోహర్ లాల్ శర్మ, ఘరూరామ్, మాజీ ఎమ్మెల్యే బల్వాన్ తదితరులున్నారు. కాంగ్రెస్ కోసం దశాబ్దాలపాటు శ్రమించిన తమను పార్టీ అవమానించిందని తెలిపారు. సెప్టెంబర్ 4న జమ్మూలో ఆజాద్ తన తొలి సమావేశం ఏర్పాటుచేశారు. అదే రోజు ఢిల్లీలో కాంగ్రెస్ ధరలపై సమరశంఖాన్ని పూరించనుంది.


ఎండలు మండిపోతుండటంతో జెరూసలేంలో ఫౌంటేన్ వద్ద సేదతీరుతున్న స్థానికులు

బాబ్రీ అంశంలో ధిక్కరణ కేసుల కొట్టివేత

న్యూఢిల్లీ: అయోధ్యతో బాబ్రీ మసీదు కూల్చివేత తర్వాత ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, ఇతరులపై నమోదై కొనసాగుతున్న ధిక్కరణ కేసుల విచారణను సుప్రీంకోర్టు ముగించింది. అయోధ్యతో వివాదాస్పద స్థలంలో రామమందిరం నిర్మాణానికి మార్గం సుగమం చేస్తూ రెండేళ్ల క్రితం సుప్రీంకోర్టు విస్తృత ధర్మాసనం తుది తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఇక ఈ అంశంపై ధిక్కరణ కేసులను విచారించాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు బెంచ్ ఆ కేసులను మూసేసింది. కాగా, గుజరాత్ అల్లర్ల ఘటనపై స్వతంత్ర్య దర్యాప్తునకు ఆదేశించాలంటూ గతంలో దాఖలైన 11 పిటిషన్లను సుప్రీంకోర్టు మంగళవారం ముగించింది. జాతీయ మానవ హక్కుల సంఘం, సామాజిక మహిళా కార్యకర్త తీస్తా సెతల్వాద్, పలువురు దాఖలుచేసిన పిటిషన్లపై విచారణ అనవసరమంటూ సుప్రీంకోర్టు బెంచ్ ఈ పిటిషన్లను మూసేసింది. 'ఇదే అంశంపై వేరే కేసులు ట్రయల్ కోర్టులో తుది దశలో ఉన్నాయి. కొన్ని అంశాలపై సుప్రీంకోర్టులో, గుజరాత్ హైకోర్టులో తుది తీర్పులు వచ్చిన నేపథ్యంలో ఇప్పుడీ కేసులు పనికిరావు' అని వ్యాఖ్యానించింది.

ఇరాక్‌లో నిరసనలు తీవ్రం

బాగ్దాద్: ఇరాక్‌లో షియా మత పెద్ద మక్తాదా-అల్-సదర్ మద్దతుదారులు రెచ్చిపోయారు. బాగ్దాద్‌లోని ప్రధాన ప్రభుత్వ కార్యాలయాల సముదాయమైన గ్రీన్‌జోన్‌పైకి చిన్నపాటి రాకెట్లు ఎక్కుపెట్టారు. మెషీన్ గన్లతో విరుచుకుపడ్డారు. భద్రతాబలగాలు ప్రతిదాడిచేశాయి. ఆందోళనల్లో మరణించిన వారి సంఖ్య మంగళవారానికి 30కి పెరిగింది. రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు అల్-సదర్ ప్రకటించగానే మద్దతుదారులు గ్రీన్‌జోన్ మీదకు దూసుకురావడం తెల్సిందే. గ్రీన్‌జోన్ నుంచి తన మద్దతుదారులంతా వెనుదిరగాలని అల్-సదర్ ఆదేశించారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో అల్-సదర్ పార్టీ అత్యధిక సీట్లను కైవసం చేసుకుంది. అయితే, మెజారిటీ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడంలో విఫలమైంది. అయితే, ఇరాన్ మద్దతున్న ప్రత్యర్థి షియా వర్గాలతో చర్చలకు అల్-సదర్ ఫుల్‌స్టాప్ పెట్టడంతో దేశంలో అధికార సంక్షోభం తలెత్తింది.

విదేశాల్లో వినాయకుడు


కాంబోడియాలో..

గణేషునికి దేశదేశాల్లో ప్రత్యేక స్థానం

కరోనా మహమ్మారితో విలవిల్లాడిపోయి గత రెండేళ్లుగా గణేశుడి ఉత్సవాలకు దూరంగా ఉన్న ప్రజలు ఈ ఏడాది రెట్టించిన ఉత్సాహంతో పండుగ జరుపుకోవడానికి సిద్ధమవుతున్నారు. కోవిడ్-19 భయాలు అంతగా లేకపోవడం, కరోనా నిబంధనలు పాటించడంలో ప్రజలకి పూర్తిగా అవగాహన రావడంతో హరిద్వార్ నుంచి భువనేశ్వర్ వరకు పెద్ద ఎత్తున విఘ్నాధిపతిని కొలవడానికి ఏర్పాట్లు చేశారు. ఏనుగు తలతో పిల్లల్ని ఆకర్షించే రూపురేఖలతో గణపతి బప్పా కొలువై ఉండడం ఈ పండుగకి విదేశాల్లో కూడా ఎనలేని ప్రాముఖ్యత ఉంది. గణేశుడిపై అధ్యయనం చేసిన కాలిఫోర్నియా ప్రొఫెసర్ రాబర్ట్ ఎల్ బ్రౌన్ ఆగ్నేయాసియాలో 5, 6 శతాబ్దాల్లోనే గణేశుడి ప్రతిమలు శాసనాల్లో కనిపించాయని వెల్లడించారు. పలు ఆసియన్ దేశాల్లో బొజ్జ గణపయ్య ఆరాధన ఎప్పట్నుంచి ఉందో ఆ ప్రొఫెసర్ ఒక ఆర్టికల్‌లో వివరించారు. భారత్‌లో 16వ శతాబ్దంలో ఛత్రపతి శివాజీ పాలనలో గణేశుడి ఉత్సవాలు ఘనంగా జరిగేవి. పుణెలో 18వ శతాబ్దంలో పెషావర్లు గణపతి ఆరాధనోత్సవాలు నిర్వహించారు. ఇక స్వాతంత్య్ర పోరాటం సమయంలో హిందువులందరినీ ఏకం చెయ్యడానికి లోకమాన్య బాలగంగాధర్ తిలక్ వినాయక చవితి ఊరేగింపుల్ని దేశవ్యాప్తం చేశారు.

కాంబోడియా: 7వ శతాబ్దం నుంచే కాంబోడియా ప్రజలు గణేశుడ్ని ప్రథమ దేవుడిగా తొలి పూజలు అందిస్తున్నారు. ఆ దేశంలో ఉన్న ఆలయాలన్నీ వినాయకుడికే అంకితమిచ్చారు. భారత్‌లో గణేశ్ చతుర్థి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ముందే కాంబోడియాలో గణపతిని కొలడం విశేషం. ఈ దేశంలో గణేశ్ ప్రతిమలు ఎక్కువగా నిల్చొనే భంగిమలో మాత్రమే ప్రతిష్టిస్తారు. కొన్ని కూడళ్లలో కూడా భారీ సైజులో గణేశుడి విగ్రహాలు కనిపిస్తాయి.

థాయ్‌లాండ్: థాయ్‌లాండ్‌లో 10వ శతాబ్దం నుంచే గణపతిని కొలుస్తారనడానికి ఆధారాలు కూడా ఉన్నాయి. తమిళం, థాయ్ భాషల్లో రాసిన శాసనాలపై కంచుతో తయారు చేసిన గణేశుడి ప్రతిమ ఫాంగ్ నా ప్రాంతంలో లభించింది. ఈ దేశంలో వ్యాపారస్తులు గణేశుడిని ఎక్కువగా పూజించి బంగారం, మిఠాయిలు సమర్పిస్తూ ఉంటారు. విజయ గణపతిగా కీర్తిస్తారు. సాంస్కృతిక నగరంగా పేరుగాంచిన చాకోఎంగ్సావో నగరం గణేశుడి నగరంగా ఖ్యాతి పొందింది. ఇక్కడ గణేశుడికి 3 ఆలయాలు ఉన్నాయి. బ్యాంకాక్‌లోని సెంట్రల్ వరల్డ్ ఎదురుగా గణేశుడి మండపం ప్రపంచ ప్రసిద్ధి చెందింది. థాయ్ ప్రభుత్వంలోని ఫైన్ ఆర్ట్స్ శాఖ చిహ్నంగా గణేశుడే ఉండడం విశేషం.

చైనా: చైనాలో గణేశుడి పురాతన విగ్రహం తన్ హువాంగ్ ప్రాంతంలోని తవ్వకాలలో బయటపడింది. కుంగ్ హుస్సేన్ ప్రాంతంలోని గణేశుడి ఆలయం ఉన్నాయనడానికి 531 కాలం నాటి శాసనాల ద్వారా తెలుస్తోంది. అయితే ఇప్పుడు మాత్రం చైనాలో గణేశుడి ఒక నెగిటివ్ ఫోర్స్‌గా చూస్తారు. ఏదైనా పనికి అవరోధంగా నిలిచేవాడిగానే చిత్రీకరిస్తూ ఉంటారు.

జపాన్: జపాన్‌లో 8వ శతాబ్దంలోనే గణేశుడిని పూజించినట్టు ఆధారాలున్నాయి. అత్యంత శక్తిమంతుడైన దేవుడిగా చూసేవారు. వ్యాపారులు, జూదగాళ్లు, కళాకారులు ఎక్కువగా గణేశుడిని ఆరాధించేవారు. బౌద్ధ ఆరామాలలో గణేశుడి విగ్రహాలు కూడా కొలువై ఉన్నాయి.


జపాన్‌లో..

అఫ్గానిస్తాన్ : అఫ్గానిస్తాన్‌లోని కాబూల్‌కి సమీపంలో గార్డెజ్‌లో 7-8 శతాబ్దాల్లోనే గణేశుడి విగ్రహం లభ్యమైంది. ఇండో అఫ్గాన్ మధ్య సంబంధాలకు ప్రతీకగా ఈ గణేశుడు ఉండేవాడని పురావస్తు శాస్త్రవేత్తలు, చరిత్రకారులు చెప్పారు.

టిబెట్ : టిబెటన్ బుద్ధిజంలో కూడా గణేశుడి ఆరాధన ఉంది. 11వ శతాబ్దంలో తొలిసారిగా వినాయకుడిపై భారతీయ రచనలు ఎన్నింటినో టిబెటిక్ భాషలోకి అనువదించారు. టిబెట్ పురాణాల్లో కూడా గణేశుడి ప్రస్తావన ఉంది. లామాయిజం వ్యాప్తిలో గణేశుడ్ని కూడా వినియోగించుకున్నట్టు చరిత్రకారులు చెబుతున్నారు.

మతమార్పిడి ఎస్సీల లబ్ధిపై మీ వైఖరేంటి?

న్యూఢిల్లీ: క్రైస్తవం, ఇస్లామ్‌లోకి మారిన షెడ్యూల్డ్ కులాల(ఎస్సీ) వారికి కలిగే రిజర్వేషన్ ప్రయోజనాలపై మీ వైఖరిని మూడు వారాల్లోగా తెలపాలని కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చింది. హిందూయిజం, బౌద్ధం, సిక్కు మతాలను పాటించే దళితులు.. మతం మారినా సరే ఆ దళితులకు గతంలో ఉన్న రిజర్వేషన్ ప్రయోజనాలు కొనసాగాలని కోరుతూ సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలైంది. ఈ పిల్ విచారణ సందర్భంగా జస్టిస్ ఎస్‌కే కౌల్, జస్టిస్ ఏఎస్ ఓకా, జస్టిస్ విక్రమ్‌నాథ్‌ల ధర్మాసనం పై విధంగా ఆదేశాలిచ్చింది. 'సమాజంలో పలు పరిణామాలకు దారితీసే ఇలాంటి అంశాల్లో సమయం వచ్చినపుడు వెంటనే స్పందించాలి. కేంద్రం తన వైఖరేంటో వెంటనే స్పష్టం చేయాలి. ఈ అంశంలో చట్టసంబంధ సమస్య త్వరగా పరిష్కారం కావాలి' అని కేంద్రం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్‌తో ధర్మాసనం వ్యాఖ్యానించింది. బెంచ్ గుర్తుచేసింది. అయితే, ఈ అంశంపై జస్టిస్ రంగనాథ్ మిశ్రా కమిషన్ ఇచ్చిన నివేదికను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదని న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదించారు. తదుపరి విచారణకు కోర్టు అక్టోబర్ 11వ తేదీకి వాయిదావేసింది.

సాక్షి విజయనగరం

బుధవారం । 31 । ఆగస్టు । 2022

టీటీడీ చైర్మన్‌ను కలిసిన స్వాతిరాణి



విజయనగరం ఫూల్‌బాగ్‌: టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని గిరిజన సహకార సంస్థ చైర్‌పర్సన్ డాక్టర్ శోభాస్వాతిరాణి విశాఖపట్నంలోని సర్క్యూట్‌హౌస్‌లో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. టీటీడీ సేవల్లో జీసీసీ ఉత్పత్తుల వినియోగంపై చర్చించారు.

బాధ్యతల స్వీకరణ



విజయనగరం ఫూల్‌బాగ్‌: విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల మైనారిటీ సంక్షేమ శాఖాధికారిగా(ఎఫ్‌ఏసీ) బి.రామానందం మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన సాంఘిక సంక్షేమ శాఖలో అసిస్టెంట్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. రామానందంకు మైనారిటీ సంక్షేమ శాఖతో పాటు సెట్విజ్ సీఈఓగా అదనపు బాధ్యతలను అప్పగించింది.

పుష్పాలంకరణలో పైడితల్లి



విజయనగరం టౌన్‌: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా పూజాదికాలు జరిపారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించారు.

చవితి సందడి



ఆదిదేవుడి పూజకు వేళయింది. జిల్లా వ్యాప్తంగా ఆధ్యాత్మిక శోభ వెల్లివిరుస్తోంది. పూజాసామగ్రి కొనుగోలుదారులుతో మార్కెట్‌లు రద్దీకాగా, వినాయక మండపాలను ముస్తాబుచేయడంలో యువత నిమగ్నమయ్యారు. పట్టణంలో కొనుగోలుచేసిన విగ్రహాలను మంగళవారం సాయంత్రమే తరలించారు. విఘ్నాలన్నీ తొలగిపోయేలా గణపతి పూజకు సర్వం సిద్ధం చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

కొనుగోలుదారులతో రద్దీగా మారిన గంటస్తంభం మార్కెట్



పండ్లు కొనుగోలు చేస్తూ..



వినాయక ప్రతిమలను కొనుగోలు చేస్తున్న భక్తులు

అందరిపైనా గణనాథుని చల్లని కరుణ



ఏ.సూర్యకుమారి, జిల్లా కలెక్టర్

విజయనగరం అర్బన్‌: సకల విఘ్నాలను తొలగించి ప్రజలందరిపైనా గణనాథుని చల్లని కరుణ ఉండాలని, జిల్లా అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు వినాయకచవితి శుభాకాంక్షలు తెలిపారు. బుద్ధికి, జ్ఞానానికి ప్రతీకగా ఆ గణనాథుడిని ఆరాధిస్తామని చెప్పారు. జ్ఞానం, లక్ష్యసాధన, నైతిక విలువలు, ప్రకృతి పరరక్షణ వంటి ఎన్నో సుగుణాలను ఈ పండగ మనకు నేర్పుతుందని పేర్కొన్నారు. హిందువుల తొలి పండగ అయిన గణేష్ చతుర్ధిని ప్రజలంతా భక్తిశ్రద్ధలతో నిర్వహించకోవాలని సూచించారు.

విఘ్నాలు తొలగిపోవాలి



జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం గంటస్తంభం: హిందువుల తొలి పండగ వినాయక చవితిని జిల్లా ప్రజలంతా భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కోరారు. జిల్లా ప్రజలకు గణపతి ఉత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఆ గణనాథుని చల్లని చూపుతో, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, మన జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధిలో దూసుకుపోవాలని ఆకాంక్షించారు. పర్యావరణ హితంగా పండగ జరుపుకోవాలని, మట్టి విగ్రహాలను పూజించాలని విజ్ఞప్తి చేశారు.

120 గ్రామాల్లో భూముల రీసర్వే పూర్తి



మాట్లాడుతున్న కేఆర్‌సీ ఎస్‌డీసీ సూర్యనారాయణ, పక్కన జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ త్రివిక్రమరావు

తెర్లాం: జగనన్న శాశ్వత భూహక్కు–భూ రక్ష పథకం కింద జిల్లాలో చేపట్టిన భూముల రీసర్వేను 120 గ్రామాల్లో పూర్తిచేసినట్టు కోనేరు రంగారావు కమిటీ ప్రత్యేక ఉప కలెక్టర్ ఆర్‌వీ సూర్యనారాయణ, జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ త్రివిక్రమరావు తెలిపారు. తెర్లాం తహసీల్దార్ కార్యాలయంలో విలేకరులతో వారు మంగళవారం మాట్లాడారు. జిల్లాలో భూముల రీసర్వే చురుగ్గా సాగుతోందన్నారు. 983 గ్రామాలకు 583 గ్రామాల్లో డ్రోన్ ఫ్లయింగ్ పూర్తయిందని చెప్పారు. జిల్లాలో 8 గ్రామ కంఠాలకు సంబంధించి భూముల రీసర్వే చేపట్టామన్నారు. బొబ్బిలి డివిజన్ పరిధిలో జరిగిన రీసర్వేలో 198 గ్రామాల్లో డ్రోన్ ఫ్లయింగ్ జరగగా, 116 గ్రామాలకు సంబంధించిన మ్యాప్‌లు వచ్చాయని, వీటిలో 68 గ్రామాల్లో రీసర్వే పూర్తికాగా, మరో 48 గ్రామాల్లో సర్వే జరుగుతోందని తెలిపారు. జిల్లాలో జరుగుతున్న భూముల రీసర్వేలో మండలాల తహసీల్దార్లు, హెచ్‌డీటీలు, టాస్క్‌ఫోర్స్ సర్వేయర్లు, మండల సర్వేయర్లు నిరంతరం కష్టపడి పని చేస్తున్నారని, వీరికి రైతులు, స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధులు పూర్తిస్థాయిలో సహకరిస్తున్నారన్నారు. అనంతరం ఎం.ఆర్.అగ్రహారంలో జరుగుతున్న గ్రౌండ్ ట్రూథింగ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. అక్కడి రైతులు, సచివాలయ సర్వేయర్లతో మాట్లాడారు. సర్వే తీరును తెలుసుకున్నారు. వీరి వెంట డివిజనల్ సర్వే ఇన్‌స్పెక్టర్ రవిశంకర్, తెర్లాం తహసీల్దార్ డోల రాజేశ్వరరావు, ఉప తహసీల్దార్ గొంగాడ సత్యనారాయణ, టాస్క్‌ఫోర్స్ సర్వేయర్లు శ్రీనివాస్, జగన్నాథరావు, మండల సర్వేయర్ వెంకటరమణ తదితరులు ఉన్నారు.

స్థానిక సంస్థల ఖాతాల్లో ఆర్థిక సంఘం నిధులు

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం గంటస్తంభం: జిల్లా, మండల పరిషత్, గ్రామ పంచాయతీలకు విడుదలైన 15వ ఆర్థిక సంఘం నిధులు ఆయా సంస్థల ఖాతాల్లోనే ఉన్నట్టు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2020–21 ఆర్థిక సంవత్సరానికి పూర్తిగానూ, 2021–22 సంవత్సరానికి మొదట విడత నిధులు విడుదలైనట్టు పేర్కొన్నారు. ఈ నిధులు సీఎఫ్‌ఎంఎస్ ఖాతాల నుంచి స్థానిక సంస్థలకు జమ చేస్తారన్నారు. ఇకపై విడుదల కావాల్సిన నిధులు మాత్రమే పీఎఫ్‌ఎంఎస్ ఖాతా నుంచి జిల్లా పరిషత్, మండల పరిషత్, గ్రామ పంచాయతీలకు జమవుతాయన్నారు. మండల పరిషత్‌లకు రూ.18.50 కోట్లు, గ్రామ పంచాయతీలకు రూ.132 కోట్ల నిధులు అందుబాటులో ఉన్నట్టు పేర్కొన్నారు. ఆ మేరకు ఖర్చు చేయాలని ఎంపీడీఓలకు సూచించామన్నారు. నిధుల చాలని చోట జెడ్పీ నిధులు కేటాయిస్తామని తెలిపారు. ఇదే విషయాన్ని జెడ్పీ సీఈఓ ఎం.అశోక్‌కుమార్ కూడా మరో ప్రకటనలో పేర్కొన్నారు. అభివృద్ధి పనులకు సాంకేతిక సమస్యలున్నాయే తప్ప ఆర్థిక సమస్యలు లేవన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు 2020–21 సంవత్సరానికి రెండు విడతలుగా రూ.96.36 కోట్లు, 2021–22లో రూ.35.64కోట్లు ఇప్పటికే పంచాయతీల ఖాతాలకు జమచేసినట్టు జిల్లా పంచాయతీ అధికారి ఇందిరారమణ మరో ప్రకటనలో తెలిపారు. పంచాయతీలు ప్రతిపాదించిన అభివృద్ధి, పారిశుద్ధ్య, తాగునీటి సరఫరా పనులకు కొనసాగించాలన్నారు.

హైజంప్‌లో సత్తాచూపిన చందు



ద్వితీయ బహుమతి అందుకుంటున్న చందు

రామభద్రపురం: ఇటీవల గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో హైజంప్ విభాగంలో రామభద్రపురం ఉన్నత పాఠశాల విద్యార్థి బి.చందు సత్తాచూపాడు. ద్వితీయ స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. విద్యార్థిని పాఠశాల హెచ్‌ఎం కె.కామేశ్వరరావు, పీడీ కొల్లి తవిటినాయుడు, ఉపాధ్యాయ కార్యదర్శి ఎం.మురళీధరరావు తదితరులు మంగళవారం అభినందించారు.

వెబ్‌సైట్‌లో మెరిట్ జాబితా

విజయనగరం ఫోర్ట్‌: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, వైద్య విధాన్ పరిషత్, ప్రభుత్వ వైద్య కళాశాలల ఆధీనంలో 194 పోస్టుల భర్తీకి ప్రొవిజనల్ మెరిట్ జాబితాను విజయనగరం.ఏపీజీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్‌వీ రమణకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటిపై అభ్యంతరాలుంటే వచ్చేనెల 2వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా పూర్తి ఆధారాలతో తెలియజేయాలని కోరారు. హైకోర్టు ఆదేశాల మేరకు మెడికల్ రికార్డు టెక్నీషియన్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేశామన్నారు.

‘సుజల స్రవంతి’కి సహకరించాలి



ఎమ్.వెంకటాపురంలో మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుదర్శన దొర

గజపతినగరం: ఉత్తరాంధ్ర జిల్లాల సాగునీటి ఆదరువు సుజలస్రవంతి ప్రాజెక్టు కాలువల తవ్వకానికి రైతులు సహకరించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుదర్శనదొర కోరారు. గజపతినగరం మండలం ఎం.వెంకటాపురం గ్రామంలో మంగళవారం నిర్వహించిన రైతు సభలో ఆయన మాట్లాడారు. కాలువ తవ్వకానికి గ్రామంలోని సమారు 40 ఎకరాల భూమి అవసరమని చెప్పారు. రైతులకు తగిన పరిహారం అందేలా చూస్తామన్నారు. గ్రామంలో ప్రభుత్వ ధర ప్రకారం ఎకరా రూ.11లక్షలు ఉందని, రైతుల వినతిమేరకు ఎకరాకు రూ.30 లక్షల వరకు పరిహారం చెల్లించే ఏర్పాటు చేస్తానన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.అరుణకుమారి, వీఆర్వో శ్రీరామ్, గ్రామపెద్దలు గురుగుబిల్లి సత్యనారాయణ, వైస్ సర్పంచ్ కర్రి రామునాయుడు, కర్రి నానాజీ తదితరులు పాల్గొన్నారు.

10న కోడూరుమాత యాత్ర

బాడంగి: మండలంలోని కోడూరు మరియమాత యాత్ర సెప్టెంబర్ 10వ తేదీన జరగనుందని చర్చి డైరెక్టర్ యుగల్‌కుమార్ మంగళవారం తెలిపారు. కరోనా ఆంక్షలు లేవని, ఆరాధకులందరూ యాత్రలో పాల్గొనాలని కోరారు. సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి 9వ తేదీ వరకు నవదినప్రార్థనలు నిర్వహిస్తామని, 8, 9, 10 తేదీల్లో సాయంత్రం కోడూరు మరియమాత స్వరూపంతో తేరు ప్రదర్శన ఉంటుందన్నారు. నవశని వారాంజలి గత రెండు నెలలుగా ప్రతీ రెండో శనివారం జరుపుతున్నట్టు చెప్పారు.

క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

విజయనగరం టౌన్: స్థానిక ఎన్‌సీఎస్ వెనుక ఉన్న పంచముఖ హనుమాన్ ఆలయం నిత్య అన్నప్రసాద వితరణ ట్రస్ట్‌కు వ్యాపారవేత్త బండారు చంద్రశేఖర్, ఆనంద్ సోదరులు లక్షా 11వేల 116 రూపాయల నగదు విరాళాన్ని ట్రస్ట్ కార్యదర్శి పెంటపాటి కామరాజుకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కుమ్మరిగుంట శ్రీనివాసరావు, బంగార్రాజు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌పై విచారణ

భోగాపురం: మోడల్ స్కూల్‌లో గత మార్చి 12వ తేదీన తొమ్మిదో తరగతి విద్యార్థి యోగేంద్రరెడ్డి పాఠశాల సమీపంలో చెట్టుకు ఉరేసుకుని చనిపోయిన ఘటనకు సంబంధించి మంగళవారం మళ్లీ విచారణ జరిగింది. అప్పట్లో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించిన సీహెచ్ సంధ్యాపై ఉన్నతాధికారులకు దీనికి సంబంధించి ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో ఆర్‌జేడీ సైతం భోగాపురంలో పర్యటించి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి నివేదికలు తీసుకున్నారు. తాజాగా విద్యార్థి మృతిపై పూర్తి స్థాయి విచారణ కోసం విజయనగరం అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ స్వామినాయుడు, ఇన్‌చార్జి డీఈఓ వెంకటరావుతో కలిసి మోడల్ స్కూల్‌లో మంగళవారం విచారణ చేశారు. విచారణలో ప్రిన్సిపాల్‌తో పాటు అప్పట్లో విధులు నిర్వహించిన సిబ్బంది, విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు. పూర్తి స్థాయి విచారణ జరిగాక నివేదికను ఆర్‌జేడీకి అందజేస్తామని ఏపీసీ తెలిపారు.

ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీసీఎస్ సీఐ కాంతారావు (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్: ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను వన్‌టౌన్, సీసీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు సీసీఎస్ సీఐ కాంతారావు మంగళవారం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన రాకేష్ బెహరా, ఎం.వెంకటరావు అలియాస్ జగన్నాథరెడ్డి ఇటీవల ఒక హోటల్‌లో చోరీకి పాల్పడ్డారు. బాధితులిచ్చిన ఫిర్యాదుతో దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు మంగళవారం ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాల్లో అరెస్టు చేసి వారి నుంచి రూ.4వేలు నగదు, సెల్‌ఫోన్ రికవరీ చేశారు. కేసు ఛేదించడంలో కీలకపాత్ర పోషించిన ఎస్‌ఐ అశోక్, లోవరాజులను అభినందించారు. నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.

మద్యం బాటిళ్లు ధ్వంసం



మద్యం సీసాలను ధ్వంసం చేస్తున్న ఎస్‌ఈబీ పోలీసులు

బొబ్బిలి: వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న 186 లీటర్ల మద్యం సీసాలను ధ్వంసం చేసినట్టు ఎస్‌ఈబీ సీఐ ఆర్.జైభీమ్ మంగళవారం తెలిపారు. సారా ప్యాకెట్లు, మద్యం సీసాలను పారబోశామన్నారు. ఉన్నతాధికారులు అనుమతులు ఇచ్చిన ద్విచక్రాల వేలం పాటలో రెండు వాహనాలు మాత్రమే రూ.12,800 లకు ఔత్సాహికులు కొనుగోలు చేసినట్టు సీఐ చెప్పారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

జామి: మండలంలోని భీమసింగి సుగర్స్ వద్ద మంగళవారం లారీ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. అన్నంరాజుపేట నుంచి వస్తున్న ట్రాక్టర్ భీమసింగి సుగర్స్ వద్దకు వచ్చేసరికి విజయనగరం నుంచి జామి వైపు వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్‌పై ఉన్న అన్నంరాజుపేట గ్రామానికి చెందిన కాళ్ల బంగార్రాజు, హంస సూరప్పడుకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఏఎస్‌ఐ నరసింగరావు కేసు నమోదు చేశారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 425.00
విజయనగరం	రూ. 429.00
శ్రీకాకుళం	రూ. 429.00

బులియన్

విశాఖపట్నం

బంగారం(24సి. 10గ్రా.)	51,430-00
బంగారం(22సి. 10గ్రా.)	47,150-00
వెండి (కిలో)	60,000-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹110	₹190	₹ 200



గురజాడ స్కూల్‌లో వినాయక ప్రతిమల తయారీలో నిమగ్నమైన చిన్నారులు, పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు

- పర్యావరణహితంగా వినాయకచవితి
- సాక్షి గ్రూప్, కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో అవగాహన
- మట్టి ప్రతిమల తయారీలో చిన్నారులకు పోటీ
- మట్టి విగ్రహాలను చూసి మురిసిపోయిన విద్యార్థులు
- విజేతలకు బహుమతుల ప్రదానం

చిట్టి చేతుల్లో మట్టి గణపయ్య

విజయనగరం రూరల్: పర్యావరణ హితంగా వినాయక చవితి వేడుకలు జరుపుకోవాలని పిలుపునిస్తూ... రాష్ట్ర వ్యాప్తంగా 'సాక్షి' మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్తంగా జిల్లా కేంద్రంలోని గురజాడ, చాణక్య పాఠశాలల్లో 'చిన్నారుల చేతుల్లో మట్టి గణపతి' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించాయి. విద్యార్థులకు మట్టిని సమకూర్చి వినాయక ప్రతిమల తయారీపై శిక్షణ ఇచ్చాయి. కార్యక్రమంలో అధికమంది చిన్నారులు పాల్గొన్నారు. ఉత్సాహంగా, భక్తిశ్రద్ధలతో వినాయక ప్రతిమలను తీర్చిదిద్దారు. వాటిని చూసి మురిసిపోయారు. కార్యక్రమాన్ని గురజాడ విద్యా సంస్థల కరస్పాండెంట్ స్వరూప జ్యోతి ప్రజ్వలనచేసి ప్రారంభించారు. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో కాలుష్య నియంత్రణ మండలి కార్యనిర్వహక ఇంజినీర్ టి.సుదర్శనం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వినాయక చవితికి, పర్యావరణానికి విడదీయరాని సంబంధం ఉందన్నారు. కొన్నేళ్లుగా వినాయకుని విగ్రహాలు హానికారక ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేయడంతోపాటు పర్యావరణానికి చేటుక లుగుతోందన్నారు. నీరు కలుషితమవుతోందని చెప్పారు. ఎటువంటి రంగులు పూయని మట్టి విగ్రహాలను పూజించాలని, వీటి వినియోగంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రకృతిని ప్రేమిద్దామని, పర్యావరణాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. విద్యార్థులందరూ పర్యావరణ పరిరక్షణపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. సాక్షి విజయనగరం బ్యూరో ఇన్‌చార్జి అల్లు సూరిబాబు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతోనే భావితరాలకు మేలు కలుగుతుందని, మట్టి గణపతి విగ్రహాలను పూజించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. గురజాడ స్కూల్‌లో నిర్వహించిన విగ్రహ తయారీ పోటీల్లో బిందుప్రియ (గురజాడ స్కూల్), ఎస్.మోసే (మలిచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాల), బి.గుణవర్మ (గురజాడ స్కూల్) విద్యార్థులు మొదటి మూడు బహుమతులను సొంతం చేసుకున్నారు. చాణక్య స్కూల్‌లో నిర్వహించిన పోటీల్లో వరుస రెండు బహుమతులను కె.రాకేష్, ఎస్.నిఖిల్ సాధించారు. కన్సోలేషన్ బహుమతులను తన్మయి శ్రీ, ఎల్.సాగర్, కె.జోషిత, ఎల్.గ్రీష్మ, ఎస్.నాగనూతన, యు.శ్రావ్య (గురజాడ స్కూల్), పి.వేణు (జెడ్పీ హెచ్‌ఎస్) సొంతం చేసుకున్నారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఏఈఈ ఎంవీ పద్మావతి, ఎస్‌బీ లహరి, సాక్షి ప్రకటనల విభాగం విజయనగరం మేనేజర్ ఆర్.నగేష్, జొన్నవలస జెడ్పీ ఉన్నత పాఠశాల చిత్రలేఖనం ఉపాధ్యాయులు కరుణాకర్, చాణక్య పాఠశాల ప్రిన్సిపాల్ జి.చక్రపాణి, ఏఓ కె.కార్తీక్ పాల్గొన్నారు.



గురజాడ స్కూల్‌లో విజేతలతో అతిథులు, సాక్షి సిబ్బంది



విజేతలకు బహుమతులు అందజేస్తున్న చాణక్య స్కూల్ ప్రిన్సిపాల్ చక్రపాణి, ఏఓ కార్తీక్

పర్యావరణంపై అవగాహన కల్పిస్తా



మట్టి గణపతి విగ్రహాలతో కలిగే ప్రయోజనాలు నా స్నేహితులకు వివరిస్తాను. వారితో పాటు, నా చుట్టు పక్కల వారికి మట్టి గణపతిని పూజించమని చెప్పి పర్యావరణ పరిరక్షణకు ఇప్పటి నుంచే నావంతు కృషి చేస్తాను.

– కె.రాకేష్, 10వ తరగతి, చాణక్య స్కూల్

మట్టి గణపతిని పూజిస్తాం



నీటి కాలుష్యం నివారించాలంటే మట్టి గణపతినే పూజించి, నిమజ్జనం చేయాలి. ప్లాస్టిక్ నియంత్రణ, రసాయనాలతో కూడిన రంగుల వినియోగం, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన విగ్రహాలతో పర్యావరణానికి కలిగే అనర్థాలను అందరికీ తెలియజేస్తాను.

– బిందుప్రియ, 8వ తరగతి, గురజాడ స్కూల్

ప్రకృతిని ప్రేమించాలి



ప్రకృతిని ప్రేమించిన నాడే పర్యావరణాన్ని కాపాడిన వారుమవుతాం. పర్యావరణానికి, జీవ వైవిధ్యానికి మేలు చేసే కార్యక్రమాలపై అవగాహన కల్పించడానికి కృషి చేస్తాను. ప్లాస్టిక్ వినియోగంతో కలిగే నష్టాలను అందరికీ వివరిస్తాను.

– ఎస్.మోసే, 9వ తరగతి విద్యార్థి, జెడ్పీ ఉన్నత పాఠశాల, మలిచర్ల

మట్టి విగ్రహాలతో పర్యావరణ పరిరక్షణ

- ఆదిత్య విద్యాలయం ప్రిన్సిపాల్ అమృత



మట్టి విగ్రహాలు తయారుచేస్తున్న ఆదిత్య విద్యాలయం చిన్నారులు



అందమైన విగ్రహం తయారుచేసిన జగన్‌కు బహుమతి అందజేస్తున్న ప్రిన్సిపాల్ అమృత

నెల్లిమర్ల: వినాయక చవితి పర్వదినాన ప్రతి ఒక్కరూ మట్టితో తయారుచేసిన గణపతి విగ్రహాలను పూజించడం వల్ల పర్యావరణ పరిరక్షణకు సహకరించిన వారమవుతామని ఆదిత్య విద్యాలయం ప్రిన్సిపాల్ వి.అమృత అన్నారు. సాక్షి మీడియా గ్రూప్, కాలుష్య నియంత్రణ మండలి సంయుక్తంగా నెల్లిమర్ల పట్టణంలోని ఆదిత్య విద్యాలయంలో 'చిన్నారుల చేతుల్లో మట్టి గణపతి' కార్యక్రమాన్ని నిర్వహించాయి. పాఠశాలలో చదువుతున్న చిన్నారులకు మట్టి అందజేసి వినాయక ప్రతిమల తయారీపై శిక్షణ ఇచ్చాయి. దీనిలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అందమైన వినాయక ప్రతిమలను తయారుచేసిన కోరాడ జగన్ అనే విద్యార్థికి ప్రథమ బహుమతిని 'సాక్షి' తరపున ప్రిన్సిపాల్ అందజేశారు. అలాగే మరో పదిమందికి కన్సొలేషన్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వి.సూరిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కాలుష్య నివారణ అధికారి సుదర్శనం



మట్టితో తయారుచేసిన వినాయక ప్రతిమలతో మురిసిపోతున్న చాణక్యస్కూల్ చిన్నారులు

హరిత రహదారి పనుల పరిశీలన



హరిత రహదారికి సంబంధించి మ్యాప్ పరిశీలిస్తున్న కలెక్టర్ నిషాంత్ కుమార్

పాచిపెంట: మండలంలోని ఆలూరు సమీపంలో చేపడుతున్న జాతీయ హరిత రహదారి పనులను పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. నిర్మాణ పనులకు సంబంధించి జాతీయ రహదారుల నిర్వహణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ రోహిత్‌కుమార్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మ్యాప్ ద్వారా ప్రతిపాదిత రహదారి వివరాలను ఆయన కలెక్టర్‌కు వివరించారు. ప్రాజెక్ట్ పనులు నిర్వహణలో అటవీ ప్రాంతానికి సంబంధించి అటవీ శాఖ అనుమతులు, కాలువల నిర్మాణాలకు జలవనరుల శాఖ అనుమతుల గురించి కలెక్టర్ దృష్టికి ఆయన తీసుకువచ్చారు. పనులను వేగవంతం చేయాలని అవసరమైన మేరకు సహకారం అందిస్తామని కలెక్టర్ తెలియజేశారు. ప్రాజెక్టు ఇన్‌చార్జి రాజశేఖర్, తహసీల్దార్ ఎమ్.రాజశేఖర్, ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరి, ఆర్ఐ పి.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పెద్దగెడ్డ నిర్వాసితులను ఆదుకోవాలి

పెద్దగెడ్డ నిర్వాసిత గ్రామం కొటికిపెంట ప్రజలను ఆదుకోవాలని కొటికిపెంట సర్పంచ్ ఇజ్జాడ అప్పలనాయుడు, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్‌ను కోరారు. హరిత రహదారి పనులు పరిశీలనకు వచ్చిన కలెక్టర్‌కు ఆ గ్రామ ప్రజల సమస్యలను సర్పంచ్ విన్నవించారు. నిర్వాసిత గ్రామంగా గుర్తించి 15 సంవత్సరాలు కావస్తున్నప్పటికీ వేరే చోటకు తరలించలేదని, ఇళ్ల స్థలాలు కూడా కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వాసితులకు స్థలాలు కేటాయించి, ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. స్పందించిన కలెక్టర్ రెవెన్యూ అధికారులను పిలిపించి సమస్య పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

హ్యాకథాన్ పోటీల్లో సత్తాచాటిన జీఎంఆర్ ఐటీ



ప్రైజ్‌మనీ గెలుపొందిన జీఎంఆర్ ఐటీ విద్యార్థులు

రాజాం: రాజాం జీఎంఆర్ ఐటీ కళాశాల విద్యార్థులు స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ పోటీల్లో సత్తాచాటారు. ఈ నెల 25 నుంచి రెండు రోజుల పాటు కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ, ఏఐసీటీఈ, మినిస్ట్రీ ఆఫ్ ఇన్నోవేషన్ సెల్ దేశ వ్యాప్తంగా 75 నోడల్ కేంద్రాల్లో స్మార్ట్ ఇండియా హ్యాక్‌థాన్ – 2022 సాఫ్ట్‌వేర్ గ్రాండ్ ఫినాలే పోటీలు నిర్వహించింది. జీఎంఆర్ ఐటీ సీఎస్ విభాగానికి చెందిన ఎనిమిది టీంలు ఈ పోటీల్లో ఫైనల్‌కు చేరి వివిధ రాష్ట్రాల్లో పాల్గొన్నాయి. ఇందులో రెండు టీంలు విజయం సాధించినట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ గిరీష్, ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్‌ఎస్‌వీ ప్రసాద్ వెల్లడించారు. హైదరాబాద్‌లోని వీఎన్ఆర్ విజ్ఞానజ్యోతి కళాశాల ఒక టీం డేటా వారియర్స్ – ఆర్డీడీ డేటాసెట్‌కు సంబంధించి డేటా ప్రిపరేషన్ ఎలా చేయాలో ఒక వెబ్ యాప్ ద్వారా మెషిన్‌కి అర్థమయ్యేలా ఒక కొత్త పరిష్కారాన్ని కనిపెట్టి రూ.1 లక్ష ప్రైజ్‌మనీ గెలుపొందినట్లు ప్రిన్సిపాల్ వెల్లడించారు. ఈ టీంకు అసిస్టెంట్ ప్రొఫెసర్ శివకృష్ణ మెంటర్‌గా వ్యవహరించినట్లు తెలిపారు. రెండవ టీం రాజాం జీఎంఆర్‌ఐటీ లోని కళాశాలలో జరిగే పోటీల్లో పాల్గొని టీమ్ న్యూరాల్స్ ఆల్ బెస్ట్ టూల్ ఫర్ టాప్ ఫైవ్ ఇనిస్టిట్యూషన్స్ బెస్ట్ ఆన్ ఏఐఎస్‌హెచ్‌ఈకు సంబంధించి ఒక వెబ్‌ను తయారీ చేసినట్లు తెలిపారు. ఈ బృందానికి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అరవింద్ మెంటర్‌గా వ్యవహరించినట్లు వెల్లడించారు. ఈ టీం రూ.లక్ష ప్రైజ్‌మని గెలిచిందని తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు సీఎస్‌ఈ విభాగాధిపతి డాక్టర్ అట్టాడ వెంకటరమణ, ఇతర ప్రొఫెసర్లు మంగళవారం అభినందించారు.

సంక్షేమ పథకాలపై అవగాహన అవసరం

- మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ నిర్మలాకుమారి

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలపై మత్స్యశాఖ ఉద్యోగులు సంపూర్ణ అవగాహన కల్గి ఉండాలని మత్స్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ నేతల నిర్మలాకుమారి అన్నారు. ఏపీ సమీకృత ఇరిగేషన్ వ్యవసాయ పరివర్తన ప్రాజెక్టు 2022–23లో భాగంగా స్థానిక నెహ్రూ యువ కేంద్రం ఆవరణంలో మత్స్యశాఖ ఉద్యోగులకు మత్స్య కార్యకలాపాలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిష్ ఆంధ్ర షాపుల నిర్వహణ ద్వారా స్థానికంగా చేపల వినియోగం పెంచి తద్వారా ఆక్వా రంగంలో మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించబడతాయని చెప్పారు. మత్స్యకారుల జీవన ప్రమాణాల మెరుగుపడతాయని చెప్పారు. ఫిష్ ఆంధ్ర షాపుల ఏర్పాటుకు మహిళలు, ఎస్సీ, ఎస్టీలకు 60 శాతం, ఇతరులకు 40 శాతం రాయితీ ప్రభుత్వం ఇస్తుందన్నారు.

అదే విధంగా ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా రాయితీతో కూడిన ద్విచక్ర వాహనాలు, త్రి చక్ర వాహనాలు, ఫిష్ కియోష్కలు తదితర పథకాలు గురించి మత్స్యకారులు పొందే విధంగా వారితో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయించాలని చెప్పారు. కార్యక్రమంలో ఏపీడీ రామారావు, ప్రకాష్, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి యు.చాందిని తదితరులు పాల్గొన్నారు.

940 లీటర్ల సారా ధ్వంసం



పోలీస్‌స్టేషన్‌లో సారా ధ్వంసం చేస్తున్న పోలీస్ అధికారులు

రామభద్రపురం: స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ శైలజ రాణి, ఎస్‌ఐ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో 940 లీటర్ల సారాను మంగళవారం ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్పీ దీపికా పాటిల్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని వివిధ ప్రాంతాలలో అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన సారా ధ్వంసం చేశామన్నారు. మద్యం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడితే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కేజీబీవీలో నియామకాలకు మౌఖిక పరీక్షలు

- డైట్, గవర్నమెంట్ జూనియర్ కళాశాల అధ్యాపకుల ఆధ్వర్యంలో పరీక్షల నిర్వహణ
- సమగ్రశిక్ష పథక అధికారి డా.స్వామినాయుడు

విజయనగరం పూల్‌బాగ్: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో గెస్ట్ ఫ్యాకల్టీగా దరఖాస్తు చేసుకున్న వారికి మౌఖిక పరీక్షలు నిర్వహించనున్నట్లు సమగ్రశిక్ష పథక అధికారి డా. వేమలి స్వామినాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022 – 23 విద్యాసంవత్సరానికిగాను కేజీబీవీ పాఠశాలల్లో గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తుల పరిశీలన పూర్తయినట్లు పేర్కొన్నారు. దరఖాస్తుల పరిశీలన తరువాత మిగిలి ఉన్న వారిలో బోధనలో అనుభవం ఉన్న అభ్యర్థులకు మౌఖిక పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని వివరించారు. డైట్, గవర్నమెంట్ జూనియర్ కళాశాలల అధ్యాపకుల ఆధ్వర్యంలో ఈ పరీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. మౌఖిక పరీక్షలో ప్రతిభ కనబరచిన అభ్యర్థులకు గెస్ట్ ఫ్యాకల్టీగా నియమించనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం మొత్తం మూడు కేజీబీవీ పాఠశాలల్లో మౌఖిక పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 1న జామి(కేజీబీవీ)లో సీఆర్టీ విభాగంలో ఇంగ్లిష్, తెలుగు, మ్యాథ్స్, ఫిజికల్ సైన్సు, నేచరల్ సైన్సు, సోషల్, పీజీటీ విభాగంలో ఎంపీహెచ్‌డబ్ల్యూ వారికి ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, సెప్టెంబర్ 2న విజయనగరం(కేజీబీవీ) పీజీటీ విభాగంలో తెలుగు, ఇంగ్లిష్, మ్యాథ్స్, కెమిస్ట్రీ, సీఎస్‌ఈ సబ్జెక్టుల వారికి ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మౌఖిక పరీక్షలు నిర్వహిస్తారన్నారు. గంట్యాడ(కేజీబీవీ)లో పీజీటీ విభాగంలో ఫిజిక్స్, బోటని, ఎకనామిక్స్, అలాగే సీఆర్టీ విభాగంలో హిందీ, పీఈటీలకు ఉదయం 9 గంటల నుంచి 5 గంటల వరకు మౌఖిక పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఇప్పటికే అభ్యర్థులు అందరికి ఫోన్ కాల్స్ చేయడం, గ్రూప్ సమాచారం ద్వారా సమాచారం అందజేసినట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించి మౌఖిక పరీక్షకు హాజరుకావలసినదిగా కోరారు. అభ్యర్థుల వివరాలు జిల్లా సమగ్రశిక్షా కార్యాలయం వద్ద ప్రదర్శించడం జరిగిందని తెలిపారు.

రైల్వే రిటైర్డ్ ఉద్యోగుల అపూర్వ కలయిక



పదవీ విరమణ పొందిన వారితో ఎస్ఎస్ఈ వర్క్స్ ఐఓడబ్ల్యూ వర్మ, తదితరులు

విజయనగరం టౌన్: వారంతా 20 సంవత్సరాల క్రితం రైల్వే శాఖలో పనిచేసి పదవీ విరమణ చెందారు. ఎక్కడ ఉంటున్నదీ లేనిదీ తెలియని పరిస్థితి. సెల్ పరిచయం కూడా అంతంత మాత్రమే. అయితే ప్రస్తుతం రైల్వే ఇంజినీరింగ్ ఎస్ఎస్ఈ (వర్క్స్) ఐఓడబ్ల్యూగా విధులు నిర్వహిస్తున్న జీఆర్ కె.వర్మ వారందరినీ గుర్తు పెట్టుకుని, వారికి సమాచారం అందజేసి మంగళవారం గూడ్స్‌షెడ్ వద్దనున్న ఐఓడబ్ల్యూ కార్యాలయం ఆవరణలో కలుసుకున్నారు. ఏడు పదులు దాటినప్పటికీ వారంతా తన తోటి ఉద్యోగులను చూసేందుకు తరలివచ్చారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఉచితరీతిన దుశ్శాలువ, జ్ఞాపికతో అందరినీ సత్కరించారు. అనంతరం ఒకరినొకరు మాట్లాడుకుంటూ నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమను గుర్తుపెట్టుకుని పదేళ్ల తర్వాత తమకు సత్కరించడం, అందరినీ ఒకే చోట చూడటం ఎంతో ఆనందంగా ఉందని, వర్మను అభినందించి ఆశీర్వదించారు. రిటైర్డ్ అధికారులు జగన్, శేషగిరి, మణికేశ్వరరావు, పోలారావు, ప్రస్తుతం పని చేస్తున్న ఉద్యోగులు ఆఫీస్ సూపరింటెండెంట్‌లు సత్యమూర్తి, ఎస్.చంద్రమౌళి, అధిక సంఖ్యలో సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు



అభ్యర్థిని ఇంటర్వ్యూ చేస్తున్న ఎంపీడీఓ గిరిబాల

నెల్లిమర్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టుల భర్తీకి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీడీఓ గిరిబాల నేతృత్వంలో అధికారుల బృందం అభ్యర్థుల ధ్రువపత్రాలు పరిశీలించి, ఇంటర్వ్యూ చేశారు. మొత్తం 9 ఖాళీలకు 12 దరఖాస్తులు అందగా.. 11 మంది ఇంటర్వ్యూకు హాజరైనట్లు చెప్పారు. ఎంపికైన వారి జాబితాను త్వరలో ప్రకటిస్తామన్నారు.

కమ్యూనిటీ స్టేజ్ ప్రారంభం



కమ్యూనిటీ స్టేజ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

డెంకాడ: మండలంలోని చింతలవలస ఏపీఎస్పీ ఐదో బెటాలియన్ వద్ద ఉన్న ఎంప్లాయీస్ సొసైటీ కాలనీలో నిర్మించిన కమ్యూనిటీ స్టేజ్‌ను ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మంగళవారం ప్రారంభించారు. స్థానికుల అవసరాల కోసం రూ.2 లక్షలతో కమ్యూనిటీ స్టేజ్‌ను నిర్మించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వెంకట సత్యవాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, ఎంపీడీఓ డీడీ స్వరూపారాణి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు

- సీఐ కె.కె.వి.విజయ్‌నాథ్

భోగాపురం రూరల్: శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా వినాయక చవితి ఉత్సవాలను ప్రజలంతా ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సీఐ కేకేవీ విజయ్‌నాథ్ కోరారు. సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. మండపాల ఏర్పాటుకు, విద్యుత్ దీపాలంకరణ, లౌడ్ స్పీకర్ల ఏర్పాటుకు ఉత్సవ కమిటీలు ముందుగా అనుమతి తీసుకోవాలని సూచించారు. మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఏదైనా జరిగితే అందుకు ఉత్సవ కమిటీ సభ్యులే బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

గురువులకు సత్కారం

విజయనగరం టౌన్: బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో సెప్టెంబరు 5 ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు సమాఖ్య జిల్లా అధ్యక్షుడు టీవీ శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. వేడుకల్లో భాగంగా గాయత్రీ భవన్‌లో పలువురు విశ్రాంత ఉపాధ్యాయులను సన్మానించనున్నట్లు చెప్పారు. సమాఖ్య సభ్యులంతా కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్ల నియామకం

నెల్లిమర్ల రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా విభాగం కన్వీనర్, కో–కన్వీనర్లుగా జిల్లాకు చెందిన పలువురిని ఎంపిక చేసినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. పార్టీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్‌గా వై.వాసునాయుడు, కో–కన్వీనర్లుగా ముడిలి రామోజీ, కెల్ల సురేష్, చేకూరి రాజేష్‌వర్మ, బాకీ వెంకట కనకారావు నియమితులయ్యారు.

సమన్వయంతో పనిచేయాలి

భోగాపురం రూరల్: గ్రామ వలంటీర్లు సచివాలయ సిబ్బందికి సహకరించాలని, సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలందించాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలం పోలిపల్లి సచివాలయం పరిధిలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టుకు ఎంపికైన కర్రోతు బంగారమ్మకు మంగళవారం నియామక పత్రం అందజేశారు. వలంటీర్లు తమకు కేటాయించిన క్లస్టర్ పరిధిలోని కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్రోతు వెంకటరమణ పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

విజయనగరం టౌన్: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సెప్టెంబరు 4న ఆదివారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహిస్తున్నట్లు విశ్వకళాపరిషత్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు చింతలపూడి త్రినాథరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయ వృత్తికి తలమానికమైన భారత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీ ఉంటుందన్నారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహించే ఈ పోటీల్లో 5వ తరగతి నుంచి పదోతరగతి వరకు చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు 98664 74519 నంబరుకు ఫోన్ చేసి పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు.

నిరుపేదలకు అండగా ప్రభుత్వం

- 'గడపగడపకు మన ప్రభుత్వం'లో ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స



సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరిస్తున్న ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే బడ్డుకొండ, తదితరులు

పూసపాటిరేగ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు కొండంత భరోసా కల్పించిందని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. మండలంలోని తొత్తడాం గ్రామంలో మంగళవారం ×గడపగడపకు మన ప్రభుత్వం‹ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను వివరించారు. సంక్షేమ పథకాల ద్వారా మూడేళ్లలో ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధి, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేశారు.

ఈ సందర్భంగా ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు పారదర్శక పాలన అందుతోందన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలను గడపగడపకు చేరవేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మాట్లాడుతూ కులం, మతం, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ పథకాలు అందుతున్నాయన్నారు. కరోనా కారణంగా రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను ఆపకుండా కొనసాగించారన్నారు. ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు మాట్లాడుతూ..గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు అవకాశం వచ్చిందన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, ఎంపీపీ మహంతి కల్యాణి, జెడ్పీటీసీ మహంతి సీతాలక్ష్మి, వైస్ ఎంపీపీలు అల్లాడ రమేష్, ఎస్.సత్యనారాయణరాజు, రాష్ట్ర టూరిజం డైరెక్టర్ రేగాని శ్రీనివాసరావు, ప్రజా ప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, పుప్పాల లక్ష్మీనారాయణ, ఎడ్ల రామకృష్ణ, ఎడ్ల ఆదిలక్ష్మి, పిన్నింటి ఎల్లంనాయుడు తదితరులు పాల్గొన్నారు.



తొత్తడాం కల్లాల వద్ద ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, తదితరులు

శాంతియుతంగా ఉత్సవాలు నిర్వహించుకోవాలి

- వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు



మాట్లాడుతున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు

విజయనగరం క్రైమ్: స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో గణపతి ఉత్సవాల నిర్వాహకులతో సీఐ బి.వెంకటరావు మంగళవారం సమావేశం నిర్వహించారు. ఉత్సవాల నిర్వహణపై ప్రత్యేకంగా ఎలాంటి ఆంక్షలు లేవని స్పష్టం చేశారు. గతంలో ఉన్న నిబంధనలే ఈ ఏడాది కూడా ఉత్సవ కమిటీ సభ్యులు పాటించాలని సూచించారు. మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇతరులకు ఇబ్బంది కలిగేలా లౌడ్ స్పీకర్లు ఏర్పాటు చేయొద్దని, రోడ్డుపై వాహనాలు నిలపొద్దని సూచించారు. నిమజ్జన సమయంలో అశ్లీల నృత్యాలు, డీజేలు, బాణసంచాకు అనుమతులు లేవన్నారు. శాంతియుతంగా ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించుకోవాలని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుశాఖకు సహకరించాలని కోరారు. ఆయనతోపాటు ఎస్సైలు అశోక్ కుమార్, దుర్గాప్రసాద్, గణేష్ ఉన్నారు.

విద్యార్థిని ఆత్మహత్య

విజయనగరం క్రైమ్: ఇంటర్మీడియట్ పరీక్షలో పాస్‌కాలేదన్న మనస్థాపంతో మంగళవారం రాత్రి విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. దీనికి సంబంధించి వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దుప్పాడ గ్రామానికి చెందిన బొబ్బాది బిందు (17) మంగళవారం విడుదలైన ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో ఫెయిల్‌కావడంతో మనస్థాపానికి గురయింది. ఇంటిలోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు వెంటనే స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి, అనంతరం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతిచెందింది. తండ్రి త్రినాథరావు, తల్లి కుమారి ఫిర్యాదుమేరకు వన్‌టౌన్ సీఐ వెంకటరావు కేసు నమోదుచేశారు.

వర్మీకంపోస్టుతో పంచాయతీలకు ఆదాయం

గజపతినగరం: చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాల్లో(ఎస్‌డబ్ల్యూపీసీ) వర్మీకంపోస్టు ఎరువును తయారు చేసి రైతులకు విక్రయించడం వల్ల పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరు తుందని డీపీఓ ఎస్.ఇందిరారమణ అన్నారు. గజపతినగరం, పురిటిపెంట,మరుపల్లి గ్రామా ల్లోని ఎస్‌డబ్ల్యూపీసీలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. గజపతినగరం ఎస్‌డబ్ల్యూపీసీలో 2,500 కిలోల వర్మీకంపోస్టు తయారు చేయడంపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. ఈనిల్వలను ఎప్పటికప్పుడు రైతులకు విక్రయించాలని సూచించారు.

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది

- కోరుకొండ సైనిక పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.కేశవన్



ఆనందరావు దంపతులను సత్కరిస్తున్న అధ్యాపక సిబ్బంది

విజయనగరం రూరల్: ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని కోరుకొండ సైనిక పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, వింగ్ కమాండర్ ఎస్.కేశవన్ అన్నారు. సైనిక పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా 30 ఏళ్లు సేవలందించిన జేడీ ఆనందరావు ఉద్యోగ విరమణ సభను పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ఆనందరావు చేసిన కృషి, ఆయన సేవలు మరువలేనివని అన్నారు. 2015–16లో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికై నాటి రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ చేతుల మీదుగా అవార్డును అందుకోవడం ఆయన కృషికి ఓ గుర్తింపుగా పేర్కొన్నారు. విద్యార్థుల కోసం ఆయన రూపొందించిన వ్యాకరణ కరదీపిక వృత్తిపట్ల ఆయన చిత్తశుద్ధికి నిదర్శనమని కొనియాడారు. అనంతరం ఆనందరావు దంపతులను పాఠశాల అధ్యాపక సిబ్బంది సత్కరించారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లిమర్ల రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న సహాయకుల పోస్టులకు అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని నెల్లిమర్ల ప్రాజెక్ట్ సీడీపీఓ సత్యవతి మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. ప్రాజెక్ట్ పరిధిలో నెల్లిమర్ల మండలంలోని చిన బూరాడపేట(ఎస్సీ), పెద బూరాడపేట (బీసీ–ఈ), బొప్పడాం(ఓసీ), గుర్ల మండలంలోని మణ్యపురిపేట(ఓసీ–ఈడబ్ల్యూఎస్), కలవచర్ల(ఓసీ) ఖాళీలు ఉన్నాయి. 21 నుంచి 35 ఏళ్ల మధ్య వయసున్న, స్థానికంగా నివాసం ఉంటున్న వివాహిత మహిళలు అర్హులుగా పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు సెప్టెంబర్ 7వ తేదీలోగా దరఖాస్తులను పోస్టు ద్వారా లేదా ఐసీడీఎస్ కార్యాలయంలో నేరుగా అందజేయాలని సూచించారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రాతిపదికన ఖాళీలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు.

పూసపాటిరేగ: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న కార్యకర్తలు, ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు భోగాపురం ఐసీడీఎస్ సెక్టార్ పీఓ సుగుణవతి తెలిపారు. పూసపాటిరేగ మండలంలో పేరాపురం–1 అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త (బీసీ–సీ), పూసపాటిరేగ–2లో సహాయకురాలు (ఎస్సీ), కాలపురెడ్డిపేట కేంద్రంలో సహాయకురాలు (బీసీ–ఏ) పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. అలాగే భోగాపురం మండలంలో జగ్గయ్యపేట అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త (బీసీ–ఈ) పోస్టు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. పదో తరగతి పాసై, స్థానికంగా ఉంటున్న 21 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసున్న మహిళలు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులుగా పేర్కొన్నారు. సెప్టెంబరు 7లోగా దరఖాస్తులు కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ

- ఏపీడీ చిన్నప్పయ్య



మొక్కలు నాటుతున్న డ్వామా ఏపీడీ చిన్నప్పయ్య

భోగాపురం: పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని డ్వామా ఏపీడీ చిన్నప్పయ్య అన్నారు. అమృత్ సరోవర్ కార్యక్రమంలో భాగంగా దల్లిపేట పంచాయతీ చిన్నచెరువు గట్టుపై సర్పంచ్ దల్లి కాంతమ్మ ఆధ్వర్యంలో మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ మనుగడకు మొక్కలే జీవనాధారమన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఓ ఆదిబాబు, కోర్స్ డైరెక్టర్ చిన్నంనాయుడు, ఎంపీటీసీ కొయ్య రాజుకమల, ఉపసర్పంచ్ ముగడ లక్ష్మణ్, మాజీ సర్పంచ్ దల్లి శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో మిమ్స్ విద్యార్థినుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థినులతో కళాశాల చైర్మన్ సత్యనారాయణరాజు, తదితరులు

నెల్లిమర్ల: విజయవాడ సమీపంలోని పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కాలేజీలో ఈ నెల 18 నుంచి 20 వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి మెడికల్ కళాశాలల క్రీడా పోటీల్లో నెల్లిమర్ల మిమ్స్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వాలీబాల్ క్రీడలో ప్రథమ స్థానం, బాల్ బ్యాడ్మింటన్‌లో తృతీయ స్థానంలో నిలిచారు. కళాశాలలో మంగళవారం విద్యార్థుల అభినందన సభ ఏర్పాటు చేశారు. పతకాలు సాధించిన క్రీడాకారులు, వారికి శిక్షణ ఇచ్చిన పీడీ కళావెంకటరావును కళాశాల చైర్మన్ అల్లూరి సత్యనారాయణరాజు, మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ప్రవీణ్‌వర్మ, డీన్ డాక్టర్ లక్ష్మీకుమార్, డాక్టర్ వేణుగోపాలరావు, డాక్టర్ రఘురామ్ తదితరులు అభినందించారు.

అసాంఘిక కార్యకలాపాలపై నిఘా



మాట్లాడుతున్న సీఐ సూర్యారావు

లక్కవరపుకోట(కొత్తవలస): గ్రామాల్లో సారా తయారీ, విక్రయం, గంజాయి రవాణ, అక్రమంగా మద్యం విక్రయం, జూ దం, కోడి పందాలు వంటి అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచాలని సచివాలయ మహిళా పోలీసులకు కొత్త వలస సీఐ బాలసూర్యారావు సూచించారు. కొత్తవలస పోలీస్ స్టేషన్‌లో గ్రామ సచివాలయ పోలీసులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. అలాగే వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో గ్రామాల్లో ఎన్ని వినాయక మండపాలు ఏర్పాటు చేశారు, తదితర సమాచారంఉండాలన్నారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏమైనా అల్లర్లు జరిగే అవకాశం ఉండే గ్రామాలు ఉంటే సమాచారం సేకరించి పోలీసులకు తెలియజేయాలన్నారు. ఎస్‌ఐలు వీర జనార్దన్, హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

మట్టి గణపతిని పూజిద్దాం..



డెంకాడ: అక్కివరం మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన మట్టి గణపతికి పూజలు చేస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు



విజయనగరం ఫోర్ట్: మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న డాక్టర్ భావన



విజయనగరం టౌన్: మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు రఘురామారావు



విజయనగరం పూల్‌బాగ్: మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు

విజయనగరం ఫోర్ట్: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని డీసీఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన పిలుపునిచ్చారు. డీసీఎంఎస్ కార్యాలయం సిబ్బందికి మంగళవారం మట్టి వినాయక ప్రతిమలు, వ్రత కథాపుస్తకాలను పంపిణీ చేశారు. మన సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూనే.. పర్యావరణాన్ని పరిరక్షించాలని, భావితరాలకు ఆరోగ్యకర వాతావరణాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు అవనాపు విక్రమ్, డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ సాయికుమార్, ఏబీఎం శ్రీనివాస్, అకౌంటెంట్ రాఘవులు, పి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ: పర్యావరణ హితం కోసం మట్టి వినాయక విగ్రహాలనే పూజిద్దామని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సంధ్య అన్నారు. అక్కివరం పంచాయతీ గొల్లపేట వద్ద ఉన్న మోడల్ స్కూల్ విద్యార్థులు మట్టి వినాయక విగ్రహాలను తయారు చేసి చుట్టు పక్కల గ్రామాల్లో పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు.

విజయనగరం పూల్‌బాగ్: జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక అయ్యకోనేరు గట్టు(గుమ్చి) వద్ద మంగళవారం మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిటీ జిల్లా అధ్యక్షుడు గదులు వెంకటరావు, నాయకులు మజ్జి అప్పారావు, రామేశ్వరపు రామారావు, ఎస్ఎస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్: స్థానిక మున్సిపల్ కాంప్లెక్స్ ఆవరణలో సుధారాణి మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు ఎంపీజీ ఈశ్వరరావు ఆధ్వర్యంలో మట్టిగణపతి విగ్రహాలను వైఎస్సార్‌సీపీ నాయకులు కనకల రఘురామారావు చేతులమీదుగా పంపిణీ చేశారు.

సీతం కళాశాలలో..

విజయనగరం అర్బన్: గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు విద్యార్థులకు, అధ్యాపక సిబ్బందికి మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలను పూజించాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామ్మూర్తి, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

చేయూత ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

నెల్లిమర్ల: పట్టణంలోని సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు విజయనగరానికి చెందిన చేయూత ఫౌండేషన్ ప్రతినిధులు మంగళవారం మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. డాక్టర్ బి.కిరణ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ మజ్జి సత్యనారాయణ చేతుల మీదుగా 200 విగ్రహాలను పంపిణీ చేశారు. సొసైటీ అధ్యక్షుడు ఎం.రాము, ఎన్ఎస్ఎస్ యూనిట్ పీఓ ఎల్.సంధ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.



నెల్లిమర్ల: విద్యార్థులకు మట్టి విగ్రహాలు అందిస్తున్న కిరణ్‌కుమార్, సత్యనారాయణ



విజయనగరం అర్బన్: పర్యావరణ హిత ప్రతిమలను పంపిణీ చేస్తున్న సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ శశిభూషణరావు

• క్యారెట్ గణపతి



• 'బొజ్జ' గణపయ్య



కాకినాడలోని ఆదిగురు యోగపీఠానికి చెందిన యోగా గురువు సచితానందయోగి మంగళవారం తన పీఠంలో యోగాలోని నౌళిక్రియ భంగిమ ద్వారా తన పొట్ట కండరాలను వినాయకుని ఆకృతిలో ప్రదర్శించి తన భక్తిభావాన్ని చాటుకున్నారు. -కాకినాడ



పర్యావరణానికి హాని కలిగించే రసాయనాలతో కాకుండా మట్టితో చేసిన విగ్రహాలను వినియోగించాలని కోరుతూ సైకతశిల్పి మంచాల సనత్‌కుమార్ 'గో గ్రీన్' పేరుతో తిరుపతి జిల్లా చిల్లకూరు మండలంలోని తీరంలో 20 అడుగుల సైకత గణనాథుడి విగ్రహాన్ని రూపొందించారు. - చిల్లకూరు



ప్రభుత్వ విప్, తుడా చైర్మన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సహకారంతో ఆయన స్వగ్రామం తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలో ఏడువేల పైనాపిల్ పండ్లతో 22 అడుగుల ఎత్తు, 15 అడుగుల వెడల్పుతో సినీ ఆర్ట్ డైరెక్టర్ మురళి ఆధ్వర్యంలో వినాయకుడి విగ్రహాన్ని రూపొందించారు. - తిరుపతి రూరల్



గౌరీ గణేశ పండుగ సందర్భంగా మంగళవారం మైసూరులోని ఓ ఇంట్లో బొమ్మల కొలువు ఏర్పాటైంది. గణపతులతో పాటు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్రమోదీ బొమ్మలతో ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. - మైసూరు

విశాఖలో భారీ వినాయకుడు



విశాఖపట్నంలోని దొండపర్తి రామాలయం వీధిలో వైఎస్ జగన్ యువసేన ఆధ్వర్యంలో వరాహవతారంలో 102 అడుగుల గణనాథుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. గాజువాకలోని లంకా మైదానంలో ఎస్‌వీ ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రతినిధులు 89 అడుగుల ఎత్తయిన విగ్రహాన్ని రూపొందించారు. ఈ విగ్రహాన్ని హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ వినాయకుడిని తయారు చేస్తున్న రాజేంద్రన్ రూపొందించడం విశేషం. - సాక్షి, విశాఖపట్నం

ఏకదంతాయ.. అనేక రూపాయ...

రాష్ట్ర వ్యాప్తంగా వినూత్నంగా విఘ్ననాథుని ప్రతిమలు

ఒకచోట విత్తనాలతో వినాయకుడు... మరోచోట సైకత గణపతి... ఇంకోచోట గోటిపై గణపయ్య... ఇలా వినాయకచవితి పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా వినూత్నంగా విఘ్ననాథుని ప్రతిమలు సిద్ధం చేశారు. కొందరు భారీ విగ్రహాలను ఏర్పాటు చేయగా... మరికొందరు సూక్ష్మ ప్రతిమలను ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. ఒకరిద్దరూ తమ శరీరంపైనే గణపతి రూపాన్ని ప్రదర్శించి భక్తిని చాటుకున్నారు. ఎకో ఫ్రెండ్లీ విగ్రహాలను రూపొందించి పర్యావరణాన్ని పరిరక్షించాలని అవగాహన కల్పిస్తున్నారు.

- సాక్షి నెట్‌వర్క్

విత్తన విఘ్నేశ్వరుడు



వైఎస్సార్ జిల్లా కేంద్రమైన కడపలో వినూత్నంగా వినాయకుడి విగ్రహాన్ని రూపొందించారు. కడపలోని ఊరగాయల సందులో 'మేము సైతం' అనే స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యాన పొద్దుతిరుగుడు విత్తనాలతో గణపతి విగ్రహాన్ని సిద్ధం చేశారు.

• గోటిపై గణేశ్వరుడు



వినాయక చవితిని పురస్కరించుకుని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా మనుబోలు మండలంలోని యాచవరం గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు ఆలూరు రాము తన బొటనవేలి గోటిపై అతి చిన్న గణపతి ప్రతిమను రూపొందించారు. కేవలం 0.7 సెంటీ మీటర్ల సైజులో ఉన్న ఈ ప్రతిమ స్థానికులకు విశేషంగా ఆకట్టుకుంది. – మనుబోలు (శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా)

చిట్టి చేతుల్లో మట్టి గణపయ్య



- సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో 'మనమూ చేద్దాం మట్టి గణపతిని'
- కార్యక్రమంలో పాల్గొన్న 6,500 మంది విద్యార్థులు

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా 'సాక్షి' మీడియా గ్రూప్, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్తంగా చేపట్టిన 'మనమూ చేద్దాం మట్టి గణపతిని' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. సుమారు 130 పాఠశాలల నుంచి 6,500 మందికి పైగా విద్యార్థులు మట్టి గణపతి తయారీలో భాగస్వాములయ్యారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని 5 నుంచి 16 ఏళ్లలోపు చిన్నారులు ప్రత్యేకశిక్షకుల పర్యవేక్షణలో లైవ్‌ప్రాజెక్టర్ సూచనలు గమనిస్తూ మట్టిని గణపతి ప్రతిమలుగా మలిచారు. బంకమట్టిని నిర్వాహకులు ఉచితంగా అందించారు. పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులను ప్రోత్సహించేలా చక్కటి గణపతులను తయారుచేసిన విద్యార్థులకు పాఠశాలల వారీగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల తోపాటు కన్సోలేషన్ ప్రైజులను కూడా బహూకరించారు. విద్యార్థులు ఎవరు తయారుచేసిన ప్రతిమలను వారు ఇంటికి తీసుకువెళ్లడానికి అనుమతి ఇచ్చారు.



'హిందీ భాష వికాసానికి కృషి చేయాలి'



డీఈఓ గార పగడాలమ్మను కలిసిన హిందీ మంచ్ జిల్లాశాఖ బాధ్యులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో హిందీ భాష వికాసానికి సహకరించి, హిందీ భాషాభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకోవాలని హిందీ మంచ్ శ్రీకాకుళం జిల్లాశాఖ నూతన అధ్యక్ష, కార్యదర్శులు దొంతం పార్వతీశం, రొంపివలస రామారావు, గౌరవాధ్యక్షుడు పూడి జనార్దనరావు కోరారు. ఈ మేరకు వారు మంగళవా రం సాయంత్రం డీఈఓ పగడాలమ్మను ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు.

'దివ్యాంగుల చట్టాలు తెలుసుకోవాలి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: దివ్యాంగుల చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, వారికి అన్ని వసతులు సమకూర్చాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. జిల్లా న్యాయ సేవా అధి కార సంస్థ కార్యాలయంలో దివ్యాంగుల చట్టాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులైన పిల్లల కోసం జాతీయ న్యాయసేవాధికా ర సంస్థ న్యూ ఢిల్లీ వారు 2021వ సంవత్సరంలో రూపొందించిన కొత్త స్కీమ్‌పై అవగాహ న కలిగించాలన్నారు. కార్యక్రమంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ అనంతలక్ష్మి, దివ్యాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.కిరణ్ కుమార్, జిల్లా శిశు సంరక్షణ అ ధికారి కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్‌లో మెరిసిన శ్రీకర్

శ్రీకాకుళం న్యూకాలనీ: సిక్కోలు బ్యాడ్మింటన్ యువ తేజం మాదిన శ్రీకర్ మరోసారి మెరిశాడు. కర్నూలులోని నంద్యాల వేదికగా ఈ నెల 26 నుంచి 29 వరకు జరిగిన ఏపీ రాష్ట్ర సీనియర్స్ షటిల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2022 పోటీల్లో డబుల్స్‌లో అ'ద్వితీయ'మైన ఆటతీరుతో శ్రీకర్ రాణించాడు. వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన దత్తాత్రేయరెడ్డితో కలిసి జంటగా ఆడిన శ్రీకర్ అమీతుమీ ఫైనల్ పోరులో ప్రకాశం జిల్లాకు చెందిన వరప్రసాద్-చంద్రకుమార్ చేతిలో 21-17, 21-19 స్వల్పతేడాతో ఓటమిపాలై రన్నరప్‌గా నిలిచారు. శ్రీకర్ తండ్రి మాదిన చిరంజీవి కంచిలి మండలంలోని శ్రీరాంపురం ఎంపీయూపీ స్కూల్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

విద్యార్థులతో మాటామంతీ

- గురుకులాల్లో విద్యార్థులకు కౌన్సెలింగ్
- ఒత్తిడి తగ్గించేందుకు ఏర్పాట్లు



ఎచ్చెర్ల అంబేడ్కర్ గురుకులం



గురుకులంలో విద్యార్థినులు

ఎచ్చెర్ల క్యాంపస్: గురుకులాలు అంటే ఇదివరకు ప్రతిభకు కేరాఫ్ అడ్రస్‌గా ఉండేవి. పిల్లలు చురుకుగా ఉంటూ మంచి ఉత్తీర్ణత సాధించేవారు. కానీ ఇప్పుడు చాలా మంది ఒత్తిళ్లకు లోనవుతూ చిన్న వయసులోనే బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఎచ్చెర్ల అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఇటీవల కాలంలో ఇద్దరు విద్యార్థినులు మృతి చెందటం చర్చనీయాంశంగా మారింది. ఇలాంటి సంఘటనల తర్వాత అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. మరోమారు ఇలా జరగకుండా విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లాలో ప్రస్తుతం 9 అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు ఉన్నారు. ఎచ్చెర్ల, దుప్పలవలస, పెద్దపాడు, నందిగాం, తామరాపల్లి, మందస, కంచిలి, పాతపట్నంల్లో గురుకులాలు నిర్వహిస్తున్నారు. తామరాపల్లిలో ఇంటర్మీడియెట్ కోర్సులు నిర్వహిస్తుండగా, మిగతా చోట్ల పాఠశాల, ఇంటర్మీడియెట్ విద్య కొనసాగుతున్నాయి. 340 నుంచి 625 వరకు విద్యార్థులు చదువుతున్నారు. ప్రస్తుతం గురుకుల విద్యలో కౌన్సెలింగ్ తప్పనిసరి చేస్తున్నారు. విద్యలో వెనుకబాటు, వ్యక్తిగత సమస్యలు, కుటుంబ సమస్యలు వంటి విషయాల్లో కౌన్సెలింగ్ చేయడంపై దృష్టిపెట్టారు. ప్రతి వారం ఒక్కసారైనా మానసిక వైద్యులు వచ్చి కౌన్సెలింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నారు. క్లాస్ టీచర్లు ఒంటరిగా గడిపే విద్యార్థులను గుర్తించటం, చదువుపై ఆసక్తి లేని విద్యార్థులను మార్కులు ఆధారంగా గుర్తించటం వంటివి చేస్తారు. విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇవ్వడం, విద్యలో స్లోలెర్నర్స్‌కు రెమిడియల్ క్లాస్‌లు నిర్వహించటం, తెలుగు మీడియం నుంచి వచ్చి ఇంగ్లిష్ మీడియం చదువుతున్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెడతారు.

కొందరు విద్యార్థుల్లో హోమ్ సిక్ వంటి సమస్యలు గుర్తిస్తున్నారు. ఇలాం విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చిస్తారు. విద్యార్థులకు పూర్తిగా ఆసక్తి లేకపోతే టీసీ ఇచ్చి పంపించి ఇతర చోట్ల చదువుకునే అవకాశం కల్పించేలా చర్యలు తీసుకుంటారు. ఆత్మహత్యకు పాల్పడిన విద్యార్థులను పరిశీలిస్తే ప్రధానంగా వ్యక్తిగత కారణాలు, చదువు ఒత్తిడి, హోమ్ సిక్, మానసిక పరిస్థితి మెరుగ్గా లేకపోవటం వంటి సమస్యలను గుర్తించారు. చిన్న కౌన్సెలింగ్ ఇవ్వటం వల్ల జీవితంలో విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరే అవకాశం లభిస్తుంది. ఎచ్చెర్ల గురుకులాన్ని సందర్శించిన అధికారులు సైతం విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇవ్వాలన్న నిర్ణయానికి వచ్చారు. సమస్య బయటకు చెప్పేందుకు ఇష్టం లేని వారికి నాలుగు గోడల మధ్య కౌన్సెలింగ్ చేస్తారు.

విద్యార్థులకు ప్రత్యేక కౌన్సెలింగ్

అధికారుల ఆదేశాల మేరకు వారంలో ఒక్కసారైనా విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తాం. అర్హత గల వైద్యులు ఈ కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. విద్యార్థుల నడవడికపై దృష్టిపెడతాం. తల్లిదండ్రులు సమక్షంలో అవసమైతే కౌన్సెలింగ్ చేస్తాం. భవిష్యత్‌లో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడకుండా ప్రత్యేకంగా దృష్టి పెడతాం. తల్లిదండ్రులు సహకారం కూడా అవసరం.

– వై.యశోదలక్ష్మి, సమన్వయకర్త జిల్లా అంబేడ్కర్ గురుకులాలు


'కనీసం వేతనం ఉండాలి'



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ రాజేశ్వరి

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో ఎస్‌ఎంఆర్‌లకు చెల్లిస్తున్న జీతాలు కనీస వేతనాలకు తక్కువ కాకూడదని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎస్‌ఎంఆర్‌ల వేతనాల చెల్లింపుపై సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉన్నత నైపుణ్యం గల ఇంజినీర్ గ్రాడ్యుయేట్ (వర్క్ ఇన్‌స్పెక్టర్)కు 2021-22లో పట్టణ పరిధిలో రోజువారీ వేతనం రూ.1040లు ఉండగా దాన్ని 2022-23లో రూ.1103లుగా ప్రతిపాదించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసేవారికి రూ.988లు నుంచి రూ.1048లకు పెంచినట్లు తెలిపారు. గ్రేడ్ -1 కమ్మరి, మేసన్, కార్పెంటర్, ఫిట్టర్, పెయింటర్, వెల్డర్ ఎలక్ట్రీషియన్ లతో పాటు హెవీ వెహికల్ డ్రైవర్, స్టెనో-టైపిస్ట్ గ్రాడ్యుయేట్, దర్జీ, హెడ్ కుక్ తదితరులకు పట్టణంలో రూ.580 నుంచి రూ.615లకు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.551 నుంచి రూ.584లకు పెంపుదల చేసినట్లు చెప్పారు. అదేవిధంగా ఇదే పోస్టుల్లో పాక్షిక నైపుణ్యం గల గ్రేడ్-2 పనివారికి పట్టణ ప్రాంతాల్లో రూ.520 నుంచి రూ.551లకు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.494ల నుంచి రూ.523లకు పెంచినట్లు పేర్కొన్నారు. మహిళ, పురుష మజ్దూర్, మలాథియాన్ స్ప్రేయింగ్ మజ్దూర్, సర్వర్, స్వీపర్, వాచ్‌మెన్ తదితరులకు పట్టణ ప్రాంతాల్లో రూ.458ల నుంచి రూ.486లకు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.435ల నుంచి రూ.462లకు, ఎద్దుల బండి డ్రైవర్‌కు రూ.734 నుంచి రూ.778, అలాగే రూ.697ల నుంచి రూ.739లకు పెంపుదల చేసినట్లు చెప్పారు. డిప్లమా హోల్డర్ (వర్క్ ఇన్‌స్పెక్టర్), కంప్యూటర్ అక్షరాస్యత / డేటా ఎంట్రీ ఆపరేటర్ కమ్ ఆఫీస్ అసిస్టెంట్ల వేతనాలను కూడా పెంపు చేయడం జరిగిందని, వినియోగదారుల ధరల సూచిక ఆధారంగా కనీస వేతనాలు నిర్ణయించడం జరిగిందన్నారు. సభ్యుల ఆమోదంతో కలెక్టర్‌కు సమర్పిస్తామన్నారు. సమావేశంలో ముఖ్య ప్రణాళిక అధికారి వీవీ లక్ష్మీ ప్రసన్న, డ్వామా పథక సంచాలకులు జీవీ చిట్టిరాజు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

24 మండలాల్లో పీఏసీఎస్ గోదాముల నిర్మాణం



జోగన్నపేట వద్ద స్థలం పరిశీలిస్తున్న జిల్లా సహకార అధికారి ఎస్.సుబ్బారావు

పొందూరు: జిల్లాలోని 24 మండలాల్లో పీఏసీఎస్ గోదాముల నిర్మాణాలు చేపట్టనున్నట్లు జిల్లా సహకార అధికారి(డీసీఓ) ఎస్.సుబ్బారావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జోగన్నపేట వద్ద పెట్రోలు బంక్ ఏర్పాటుకు కేటాయించిన పీఏసీఎస్ స్థలాన్ని పరిశీలించారు. పీఏసీఎస్ ఆస్తుల పరిరక్షణలో భాగంగా జిల్లాలో పలుచోట్ల స్థలాలను పరిశీలించి ఆక్రమణలు ఉన్నదీ, లేనిదీ గుర్తిస్తున్నామని చెప్పారు. జిల్లాలో 37 పీఏసీఎస్‌లు ఉన్నాయని, వీటి పరిధిలో మొదటి విడతలో 24 గోదాముల నిర్మాణాలకు నిధులు మంజూరు కాగా పలు చోట్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. రైతులకు ఉపయోగపడే గోదాముల నిర్మాణానికి దాతలు ముందుకు రావాలని కోరారు. ఆయనతో పాటు కోఆపరేటివ్ డిప్యూటీ రిజిస్ట్రార్ దామోదర్, పీఏసీఎస్ సీఈవో ఏర్నేని పాపినాయుడు తదితరులు ఉన్నారు.

సకాలంలో పూర్తి చేయకుంటే కాంట్రాక్టు రద్దు

- కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: రహదారులు, భవనాల శాఖ ద్వారా జిల్లాలో చేపడుతున్న నాడు-నేడు, పీహెచ్‌సీల పనుల్లో జాప్యం జరిగితే సహించేది లేదని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆయన మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నాడు-నేడు, పీహెచ్‌సీల పనులపై ఆర్‌అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. సెప్టెంబర్ 30 నాటికి ఆర్ అండ్ బీ ద్వారా చేపడుతున్న పెండింగ్ పనులన్నీ పూర్తి కావాలని, లేకపోతే సంబంధిత ఇంజినీరింగ్ అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. నాడు-నేడు, పీహెచ్‌సీ పనుల్లో రాష్ట్రస్థాయిలో జిల్లా చివరి స్థానంలో ఉందని, ఇందుకు గల కారణాలపై కలెక్టర్ ఆరా తీశారు. జిల్లాలో రూ.30 కోట్ల పనులకు గాను రూ.20కోట్ల పనులు ఇప్పటికే మంజూరుచేశామని అన్నారు. ఇందులో రూ.17.35 కోట్ల మేర పనులు పూర్తికాగా, రూ.10.86 కోట్ల మేర బిల్లులు అప్‌లోడ్ చేశారని, వాటికి చెల్లింపులు కూడా జరిగాయని తెలిపారు. ఇంకా మిగిలిన జరిగిన పనులకు బిల్లులు పెండింగ్ ఉండడంపై కలెక్టర్ మండిపడ్డారు. ఇంకా జిల్లాలో రూ.2.65 కోట్ల మేర పనులు జరగాల్సి ఉన్నప్పటికీ పనుల్లో జాప్యం జరగడంపై అసహనం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లు సకాలంలో పనులు చేయకపోతే వారిని రద్దు చేసి వేరేవారికి అవకాశం కల్పించాలన్నారు.

సోంపేట డీఈఈ సస్పెన్షన్

అప్పగించిన పనుల్లో ప్రగతి కనబరచని సోంపేట డీఈఈని సస్పెండ్ పర్యవేక్షక ఇంజినీర్ కె.కాంతిమతిని కలెక్టర్ ఆదేశించారు. ఇదేవిధంగా ఎవరైనా ప్రగతి కనబరచకపోతే వారికి కూడా చర్యలు తప్పవని హెచ్చరించారు. కవిటి మండలం మాణిక్యపురం, బూర్జ, లావేరు, ఇచ్ఛాపురం తదితర ప్రాంతాల్లో కూడా ప్రగతి వెనుకంజలో ఉందని, మెరుగు పరచుకోవాలని సూచించారు. సమావేశంలో రహదారులు, భవనాల శాఖ పర్యవేక్షక ఇంజినీర్ కె.కాంతిమతి, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్లు, కార్యనిర్వాహక ఇంజినీర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలోని స్త్రీ, శిశు సంక్షేమశాఖలో అంగన్‌వాడీ హెల్పర్స్ పోస్టుల భర్తీ కోసం అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు శ్రీకాకుళం అర్బన్ ప్రాజెక్టు అధికారి జి.శోభారాణి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం నుంచి దరఖాస్తులు అందుబాటులో ఉంటాయని, దరఖాస్తు చేసుకునేందుకు ఆఖరుతేదీ సెప్టెంబరు 9వ తేదీ అని పేర్కొన్నారు. శ్రీకాకుళం అర్బన్ ప్రాజెక్టు పరిధిలో 9వ వార్డు రైతుబజారు పరిధిలో 1 అంగన్‌వాడీ హెల్పర్, కొన్నావీధి పరిధిలో 1 అంగన్‌వాడీ హెల్పర్ పోస్టు, 26వ వార్డు శ్రీశయనవీధి పరిధిలో 1, 14వ వార్డు చిత్తరంజన్‌వీధి పరిధిలో 1 అంగన్‌వాడీ హెల్పర్ పోస్టు మొత్తం 4 పోస్టుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నా రు. ఈ దరఖాస్తులను 9వ తేదీ సాయంత్రం 5గంటల లోగా శ్రీకాకుళం అర్బన్ ప్రాజెక్టు కార్యాలయానికి అందజేయాలని ఆమె కోరారు. దరఖాస్తుల పరిశీలన(స్క్రూటీ్నీ) అనంతరం శ్రీకాకుళం డివిజన్ పరిధిలోని వారికి సెప్టెంబరు 15వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని శోభారాణి తెలిపారు.

ఆదర్శంగా మహిళా మార్టులు



మాట్లాడుతున్న లక్ష్మణరావు

నరసన్నపేట: మహిళా మార్టులను ఆదర్శంగా నిర్వహించాలని కో ఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ పి.లక్ష్మణరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మహిళా మార్టు ఏర్పాటుకు సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల ప్రతినిధులు, మహిళా మార్ట్ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఇందులో ఆయన మాట్లాడుతూ నిబంధనల మేరకు మార్ట్‌లను నడపాలని కోరారు. ఎప్పటికప్పుడు సరుకుల నిల్వ, అమ్మకాలు, కొనుగోళ్లు, వ్యాపార లావాదేవీలు పరిశీలిస్తామని, తేడాలు రాకూడదని అన్నారు. నిర్వహణలో ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని, వినియోగదారులకు నాణ్యమైన సరుకులు తక్కువ ధరలకు అందివ్వాలని కోరారు. మార్ట్ ఎలా నడపాలి, తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. కార్యక్రమంలో జిల్లా కో ఆపరేటివ్ అధికారులు పి.పద్మ, శ్యామ్, వెలుగు ఏసీ కొండలరావు, ఏపీఎం హేమసుందరరావు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు చింతు శ్రీదేవి, ప్రతినిధులు లుకలాపు కళావతి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశానికి నోటిఫికేషన్

సాక్షి అమరావతి, నూజివీడు: నూజివీడు, ఇడుపులపాయ, శ్రీకాకుళం, ఒంగోలు ట్రిపుల్ ఐటీల్లో ఆరేళ్ల సమీకృత బీటెక్ కోర్సుల్లో ప్రవేశాలకు మంగళవారం రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) నోటిఫికేషన్ విడుదల చేసింది. విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. 2021-22లో మొదటి ప్రయత్నంలోనే పదో తరగతి రెగ్యులర్ విధానంలో ఉత్తీర్ణులైనవారు ఆరేళ్ల సమీకృత బీటెక్ కోర్సుకు అర్హులు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఉత్తీర్ణులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు నాలుగు శాతం మార్కులు డిప్రివేషన్ స్కోర్ కింద కలుపుతారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ 19 వరకు అవకాశముంది. మొత్తం సీట్లలో 85 శాతం లోకల్(ఆంధ్రప్రదేశ్), 15 శాతం ఓపెన్ కోటాలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ విద్యార్థులకు కేటాయిస్తారు. రాష్ట్రంలో నాలుగు ట్రిపుల్ ఐటీలు ఉండగా.. ఒక్కోదానిలో 1,000 చొప్పున 4,000 సీట్లు ఉన్నాయి. ఎంపికైన అభ్యర్థుల జాబితాను సెప్టెంబర్ 29న ఆర్జీయూకేటీ ప్రకటిస్తుంది. కౌన్సెలింగ్‌ను అక్టోబర్ 12 నుంచి 15 వరకు నూజివీడు, ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీల్లో నిర్వహిస్తారు. అక్టోబర్ 17 నుంచి తరగతులు ప్రారంభిస్తారు.

6, 7 తేదీల్లో నర్సరీలపై శిక్షణ

సాక్షి, అమరావతి: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాల డాక్టర్ ఎన్టీఆర్ కాలేజ్ ఆఫ్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్, ఏపీ నర్సరీ గ్రోయర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యాన సెప్టెంబర్ 6, 7 తేదీల్లో నర్సరీల ఏర్పాటు, నిర్వహణపై బాపట్లలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు గోపాలం రవీంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నర్సరీ, ఉద్యానవన రంగాల్లో నిష్ణాతులు హాజరై శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. శిక్షణ పొందినవారికి ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారని తెలిపారు. శిక్షణ తరగతులకు హాజరయ్యేవారికి రవాణా, భోజనం, వసతి సదుపాయాలు కల్పిస్తామని, యువతీ, యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. శిక్షణకు హాజరుకావాలని ఆసక్తి ఉన్నవారు 9440264365 నంబరుకు ఫోన్ చేసి తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

కథలు, కవితల పోటీల్లో విజేతలు వీరే...

సాక్షి, అమరావతి: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌ను పురస్కరించుకుని ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో బాలబాలికలకు నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి కథ, కవితల పోటీల్లో వందలాది మంది పాల్గొనడం ఆనందంగా ఉందని పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్, కార్యదర్శి రెడ్డప్ప ధవేజి, బాల సాహిత్య జాతీయ సంచాలకులు పుల్లా రామాంజనేయులు తెలిపారు. ఈ పోటీల్లో విజేతల వివరాలను వారు మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. కవితల విభాగంలో ప్రథమ బహుమతి పి.ధృవరాజు(9వ తరగతి, రిషివ్యాలీ స్కూల్, అన్నమయ్య జిల్లా), ద్వితీయ బహుమతి జి.అఖిల(10వ తరగతి, జిల్లెల్ల గ్రామం, నంద్యాల జిల్లా), తృతీయ బహుమతి వి.గీతిక(8వ తరగతి, జిల్లా పరిషత్ పాఠశాల, సత్రంపాడు, ఏలూరు జిల్లా) సాధించారు. కథల విభాగంలో ప్రథమ బహుమతి డి.రోహిత(10వ తరగతి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సీతంపేట, పార్వతీపురం మన్యం జిల్లా), ద్వితీయ బహుమతి లతిక(9వ తరగతి, జిల్లా పరిషత్ పాఠశాల, తడపాకల్, నిజామాబాదు జిల్లా, తెలంగాణ), తృతీయ బహుమతి ఇ.సౌమ్య(శ్రీ సరస్వతి శిశుమందిరం, శ్రీశైలం, నంద్యాల జిల్లా) సాధించారు. వీరితోపాటు ఈ రెండు విభాగాల్లో మూడు ప్రోత్సాహక బహుమతులు చొప్పున విద్యార్థులకు అందజేయనున్నట్లు వివరించారు. త్వరలో జూమ్ సమావేశంలో బాల సాహిత్య సదస్సు, బహుమతి ప్రదానోత్సవం నిర్వహిస్తామని తెలిపారు.

'సబల' షార్ట్ ఫిల్మ్ పోటీలకు ఆహ్వానం

సాక్షి, అమరావతి: రాష్ట్ర మహిళా కమిషన్ కార్యాచరణ-2022లో భాగంగా 'సబల' లఘు చిత్ర (షార్ట్ ఫిల్మ్స్) రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించనుంది. ఆ వివరాలను కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ మంగళవారం ఒక ప్రకటన ద్వారా వెల్లడించారు. ఔత్సాహిక దర్శకులు, సంస్థలు క్షేత్ర స్థాయిలో మహిళలకు సంబంధించిన అన్ని అంశాలపై దృష్టి పెట్టి లఘు చిత్రాలు తీసి పంపాలని ఆమె కోరారు. లఘు చిత్రాలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, మరో ఐదు ప్రత్యేక బహుమతులు ఉంటాయని, ఉత్తమ నటి, నటుడు, రచయిత, దర్శకత్వం వంటి వ్యక్తిగత బహుమతులు అందజేస్తామన్నారు. ఉత్తమ ప్రథమ చిత్రానికి రూ.లక్ష, ద్వితీయ చిత్రానికి రూ. 50 వేలు, తృతీయ చిత్రానికి రూ.25 వేలు అందిస్తామని, ఐదు ప్రత్యేక బహుమతుల్లో ఒక్కోదానికి రూ.20 వేలు చొప్పున, వ్యక్తిగత బహుమతులు రూ.20వేల చొప్పున అందజేయాలని నిర్ణయించామన్నారు. సెప్టెంబర్ 25లోపు లఘు చిత్రాలను పెన్ డ్రైవ్ ద్వారా గానీ, లేదా వీడియో లింకును apwcshortfilm2022@gmail.comమెయిల్‌కు గానీ పంపాలన్నారు. అక్టోబర్ 1వ తేదీన రాజమహేంద్రవరంలో బహుమతి ప్రదానోత్సవం జరుగుతుందన్నారు. వివరాలకు 08645-294900, 9381243599, 9441356482 నంబర్లలో సంప్రదించాలన్నారు.

మార్కెట్‌లోకి 10 నూతన వంగడాలు

వరిలో మూడు, పెసలు, చిరుధాన్యాల్లో రెండేసి..

శనగ, వేరుశనగ, మినుముల్లో ఒక్కొక్క వంగడం

- ఉప్పునేలల్లో సాగుకు అనుకూలమైన ఎంసీఎం-103 వరి
- ముంపును తట్టుకునేలా వరిలో ఎంటీయూ 1318, 1232 రకాలు
- ఆమోదం తెలిపిన విత్తన సబ్ కమిటీ
- కొత్త రకాలపై ఆర్బీకేల ద్వారా ప్రచారం



నూతన విత్తనాల వివరాలు వెల్లడిస్తున్న పూనం మాలకొండయ్య

సాక్షి, అమరావతి: రైతులకు కొత్తగా మరో పది వంగడాలు అందుబాటులోకి వచ్చాయి. ఏపీ ఎన్జీ రంగా విశ్వవిద్యాలయానికి అనుబంధంగా పనిచేస్తున్న వివిధ పరిశోధన కేంద్రాలు వీటిని అభివృద్ధి చేశాయి. వరిలో మూడు, పెసలు, చిరుధాన్యాల్లో రెండు చొప్పున విత్తనాలు వచ్చాయి. మినుము, వేరుశనగ, శనగలో ఒక్కొక్కటి చొప్పున కొత్త వంగడాలు తీసుకొచ్చారు. మంగళవారం రాష్ట్ర విత్తన సబ్ కమిటీ 40వ సమావేశంలో వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ పూనమ్ మాలకొండయ్య, స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్, వీసీ విష్ణువర్ధన్‌రెడ్డి వీటిని విడుదల చేశారు. పూనం మాలకొండయ్య మాట్లాడుతూ మంచి గుణగణాలు కలిగిన కొత్త రకాలను శాస్త్రవేత్తలు, విస్తరణ సిబ్బంది కలిసి రైతులకు పరిచయం చేయాలని సూచించారు. రాష్ట్రంలో చిరుధాన్యాలకు ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తున్నందున, ఈ రకాల సాగును ప్రోత్సహించాలని చెప్పారు. కొత్త రకాల ప్రత్యేకతలను ఆర్బీకేల్లో ప్రదర్శించి, రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయ యాంత్రీకరణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తున్న తరుణంలో అందుకు అనువైన రకాలను రూపొందించాలని సూచించారు.

కొత్త వంగడాల ప్రత్యేకతలు...

- వరి.. ఎంటీయూ-1318: మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం నుంచి విడుదల చేసిన ఈ రకం ఎంటీయూ 7029 స్వర్ణ రకానికి బదులుగా అభివృద్ధి చేసింది. మిషన్ కోతకు అనువైనది. ఎక్కువ దిగుబడినిస్తుంది. ముంపును తట్టుకునే శక్తి ఉంటుంది.
- వరి.. ఎంటీయూ1232: ఇది కూడా మార్టేరు పరిశోధన కేంద్రం అభివృద్ధి చేసిందే. నెల రోజుల ముంపును కూడా తట్టుకుంటుంది. 135 నుంచి 140 రోజుల్లో పంట వస్తుంది. అగ్గి, పాముపొడ తెగుళ్లు, సూది దోమను తట్టుకునే రకమిది.
- వరి.. ఎంసీఎం-103 (బందరు సన్నాలు): మచిలీపట్నం వ్యవసాయ పరిశోధన కేంద్రం అభివృద్ధి చేసిన వంగడమిది. ఉప్పు నేలలకు అనువైన రకమిది. అగ్గి తెగులును తట్టుకుంటుంది. సాధారణ నేలల్లో హెక్టార్‌కు 60 నుంచి 65 క్వింటాళ్లు, ఉప్పు నేలల్లో 50 నుంచి 55 క్వింటాళ్లు దిగుబడి ఇస్తుంది.
- రాగులు.. వీఆర్ 1099 (గోస్తనీ): దీన్ని విజయనగరం వ్యవసాయ పరిశోధన సంస్థ అభివృద్ధి చేసింది. అన్ని జిల్లాల్లో సాగుకు అనువైనది. ప్రస్తుతం ఉన్న శ్రీ చైతన్య రకం కంటే 17 నుంచి 22 శాతం అధిక దిగుబడి ఇస్తుంది. అగ్గి తెగులును తట్టుకుంటుంది.
- కొర్రలు.. ఎస్ఐఏ-3150 (మహానంది): దీన్ని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం అభివృద్ధి చేసింది. ఖరీఫ్, రబీతో పాటు వేసవి కాలానికి కూడా అనువైనది. హెక్టారుకు 31 క్వింటాళ్ల దిగుబడి ఇస్తుంది. 20 శాతం ఎక్కువ ప్రొటీన్, కాల్షియం ఉంటాయి.
- మినుములు.. ఎల్‌బీజీ-884: గుంటూరు లాంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం అభివృద్ధి చేసింది. మాగాణి, మెట్ట ప్రాంతాలకు అనువైనది. మొజాయిక్ వైరస్‌ను తట్టుకుంటుంది. హెక్టార్‌కు 20 నుంచి 25 క్వింటాళ్ల దిగుబడినిస్తుంది.
- శనగలు.. ఎన్‌బీఈజీ 776: నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం అభివృద్ధి చేసిన రకమిది. ఎండు తెగులు తట్టుకుంటుంది. హెక్టార్‌కు 28 క్వింటాళ్ల దిగుబడినిస్తుంది. ఎక్కువ కాయలు కలిగి 20.9 శాతం ప్రొటీన్ ఉంటుంది. జేజీ-11 రకానికి బదులుగా సాగుకు అనువైనది. 90 నుంచి 105 రోజుల్లో పంట వస్తుంది. మిషన్ కోతకు అనువుగా ఉంటుంది.
- వేరుశనగ.. టీసీజీఎస్-1694: తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం అభివృద్ధి చేసింది. ఖరీఫ్, రబీ కాలాలకు అనువైన రకం. షెల్లింగ్ పర్సంటేజ్ 72 శాతంగా ఉంటుంది. ఖరీఫ్‌లో హెక్టార్‌కు 35 క్వింటాళ్లు, రబీలో 50 క్వింటాళ్ల దిగుబడినిస్తుంది.
- పెసర.. ఎల్‌జీజీ-574: గుంటూరు లాంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం అభివృద్ధి చేసింది. మాగాణి, మెట్ట ప్రాంతానికి అనువైనది. మొజాయిక్ వైరస్‌ను తట్టుకుంటుంది. హెక్టార్‌కు 15-16 క్వింటాళ్ల దిగుబడినిస్తుంది. మిషన్ కోతకు అనువైనది.
- పెసర.. ఎల్‌జీజీ-607: గుంటూరు లాంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం అభివృద్ధి చేసిన రకమిది. పంట కాలం 60 నుంచి 65 రోజులు. యెల్లో మొజాయిక్ వైరస్‌ను తట్టుకునే శక్తి ఉంటుంది. హెక్టార్‌కు 15-17 క్వింటాళ్ల దిగుబడి ఇస్తుంది. ఒకేసారి పరిపక్వతకు వస్తుంది. మిషన్ కోతకు అనువుగా ఉంటుంది.

రియల్ టైం క్రాప్ మేనేజ్‌మెంట్‌లో
ఏపీ ఫస్ట్

సాక్షి, అమరావతి: ఏ పంట.. ఎంత విస్తీర్ణంలో సాగవుతుందో గుర్తించడంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్ తెలిపారు. కేంద్రం ఇటీవల ప్రవేశపెట్టిన రియల్ టైం క్రాప్ మేనేజ్‌మెంట్ ద్వారా సర్వే నంబర్ల వారీగా సాగవుతున్న పంటల గుర్తింపులో మన రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచిందన్నారు. ఈ విషయాన్ని కేంద్రం అధికారికంగా వెల్లడించిందన్నారు. మూడేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తున్న ఈ-క్రాప్ వల్లే ఇది సాధ్యమైందన్నారు. జిల్లా వ్యవసాయాధికారులు, సహాయ సంచాలకులు, మండల అధికారులతో మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ఆలోచనల నుంచి పుట్టిన ఈ-క్రాప్ విధానం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. జాతీయ స్థాయిలో అగ్రిస్టాక్ డిజిటల్ అగ్రికల్చర్ పేరిట దేశవ్యాప్తంగా అమలు చేసేందుకు కేంద్రం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ-క్రాప్ అమలులో ఏపీని కూడా భాగస్వామిని చేయడం గర్వకారణమన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ, ధాన్యం కొనుగోలు, పంటల బీమా వంటి అన్ని పథకాలు ఈ-క్రాప్ ప్రామాణికంగానే అమలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే ఈ-క్రాప్ నమోదు చేసిన రైతులందరికీ ఈ-కేవైసీ (మీ పంట తెలుసుకోండి) నమోదు ప్రారంభించాలన్నారు. 'వైఎస్సార్ యంత్ర సేవ' కింద కిసాన్ డ్రోన్‌ల మంజూరుకు రైతు గ్రూపుల ఎంపికను సత్వరమే పూర్తి చేయాలన్నారు.

రెచ్చిపోయిన లోకేశ్

'వైఎస్సీపీ వాళ్లను తన్నండి.. మరో పది మంది జైలుకు రండి' అంటూ వ్యాఖ్యలు



చిత్తూరులో లోకేశ్ కాన్వాయ్ చుట్టూ కనిపించని జనం

చిత్తూరు అర్బన్/పూతలపట్టు (యాదమరి): రెచ్చగొట్టే మాటలు, పరుష పదజాలంతో టీడీపీ ఎమ్మెల్సీ నారా లోకేశ్ నోటికొచ్చినట్టు మాట్లాడారు. చంద్రబాబు కుప్పం పర్యటన నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై టీడీపీ నేతలు దాడులకు పాల్పడి చిత్తూరు జిల్లా జైల్లో ఉన్న విషయం తెలిసిందే. వీళ్లతో ములాఖత్ కోసం బుధవారం చిత్తూరు నగరంలోని జిల్లా జైలుకు నారా లోకేశ్‌తో పాటు ఆ పార్టీ నేతలు చినరాజప్ప, అనిత, దొరబాబు, వసంత్ తదితరులు వచ్చారు. రిమాండ్ ఖైదీలతో దాదాపు 40 నిమిషాలు మాట్లాడిన లోకేశ్ జైలు బయట మీడియాతో మాట్లాడుతూ 'చిత్తూరు ఎస్పీ అండతోనే వైసీపీ కుక్కలు రెచ్చిపోయాయి. యుద్ధం మొదలైంది. ఇంకా వాళ్లను తన్ని మరో పది మంది జైలుకు రండి. నేనున్నా.. చూసుకుంటా. నేను పంచాయతీరాజ్ మంత్రిగా ఉన్నప్పుడు కుప్పానికి రూ.300 కోట్లు కేటాయించి అభివృద్ధి చేశాను. రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఆరేళ్లు ఉన్నప్పుడు కూడా కుప్పంలో ఇటువంటి ఘటనలు జరగలేదు' అంటూ టీడీపీ శ్రేణులను రెచ్చగొట్టేలా మాట్లాడారు. కాగా, మంగళవారం సాయంత్రం పూతలపట్టు మండలం వేపనపల్లె గ్రామంలో జైలుపాలైన వారి కుటుంబ సభ్యులను, టీడీపీ నాయకులను లోకేశ్ పరామర్శించారు. మాట్లాడుతూ టీడీపీ నాయకులపై దాడులు చేస్తున్న వారిపై కచ్చితంగా కసి తీర్చుకుంటామని హెచ్చరించారు. టీడీపీ నాయకులపై వైఎస్సార్‌సీపీ నేతలు దౌర్జన్యాలు చేస్తున్నారని, వారికి పోలీసులు సహకారం అందిస్తున్నారని ఆరోపించారు.

లోకేశ్‌వి 'ఉత్తర' ప్రగల్భాలు

- సీఎం జగన్‌ను విమర్శించే స్థాయి ఆయనకు లేదు
- చంద్రబాబు వస్తే ఆయన వెనుక పట్టుమని వెయ్యి మంది కూడా లేరు
- ఆయన కుప్పంలో గొడవలు పెట్టి దాడులు చేయించారు
- పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్కే రోజా



సాక్షి, అమరావతి: కుప్పంలో లోకేశ్ మాటలు వింటుంటే ఉత్తర కుమారుని ప్రగల్భాలు గుర్తొస్తున్నాయని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి రోజా ఎద్దేవా చేశారు. ఈ మేరకు ఆమె మంగళవారం ఓ వీడియో విడుదల చేశారు. వార్డు సభ్యుడిగా కూడా గెలవలేని వ్యక్తి రికార్డు స్థాయిలో సీట్లు గెలిచిన తమ నాయకుడు సీఎం జగన్‌ను విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జగన్ కాలిగోటికి కూడా లోకేశ్ సరిపోడని అన్నారు. చంద్రబాబు కుప్పంలో మూడు రోజులు తిరిగితే ఒక్కరోజు కూడా ఆయన వెనుక వెయ్యి మంది లేరన్నారు. చంద్రబాబు వచ్చి గొడవలు పెట్టి.. దాడులు చేయించడం అందరూ చూశారన్నారు. మంగళగిరిలో ఓడిపోయిన లోకేశ్ ఇప్పుడేదో ఇరగదీస్తానంటూ కుప్పంలో చిందులేస్తున్నారని రోజా మండిపడ్డారు. జగన్‌ను విమర్శించే స్థాయి లోకేశ్‌కు లేదన్నారు.

దాడులు చేస్తే సన్మానిస్తారా?

'ఎంతసేపు రెచ్చగొట్టే వ్యాఖ్యలు, దాడులు చేయించడం, జగన్‌పై నిందలు వేయించడం తప్ప మీరేం (లోకేశ్, చంద్రబాబు) చేస్తున్నారు. కుప్పాన్ని మున్సిపాల్టీ చేసి రెవెన్యూ డివిజన్‌గా మార్చింది మా జగనన్న. అక్కడి నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందిస్తూ.. జలసిరులు తెస్తోంది మా ప్రభుత్వం. ఇది చూసే స్థానిక ఎన్నికల్లో కుప్పం ప్రజలు మీకు బుద్ధి చెప్పారు. ఇక మహిళ అని కూడా చూడకుండా ఎంపీపీ అశ్వినీపై దాడి చేసిన మీపై కేసులు పెట్టకుండా సన్మానిస్తారా? జగన్ సంక్షేమాన్ని తట్టుకోలేకే.. మీ తండ్రి మూడేళ్లుగా కుప్పానికి పరుగులు పెడుతున్నారు.' అని రోజా పేర్కొన్నారు.

గడప గడపకూ భరోసా

సాక్షి, నెట్‌వర్క్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా సాగుతోంది. అన్ని జిల్లాల్లోనూ ప్రజాప్రతినిధులు, అధికారులు మంగళవారం క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లగా, వారికి ప్రజలు ఎదురేగి స్వాగతం పలికారు. సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు తమకు అండగా నిలుస్తున్నాయని, ఆర్థికంగా భరోసా కల్పిస్తున్నాయని చెప్పారు. వైఎస్ జగన్ పాలనలో తామంతా సంతోషంగా ఉన్నామని ప్రజలు చెబుతున్నారు. జగన్‌కు తమ ఆశీస్సులు ఉంటాయని తెలిపారు.



శ్రీకాకుళం జిల్లా శివరాంపురంలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్



శ్రీ సత్యసాయి జిల్లా నార్సింపల్లిలో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరనారాయణ



ప్రకాశం జిల్లా పాదిలిలో సంక్షేమ కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

'ప్రకృతి' రైతులకు
త్వరలో సర్టిఫికెట్లు

సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటిస్తూ సాగు చేస్తున్న 2.5 లక్షల మంది రైతులకు అంతర్గత నియంత్రణ వ్యవస్థ ద్వారా త్వరలో ధ్రువీకరణ పత్రాలను అందిస్తున్నట్లు రైతు సాధికార సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి.రామారావు తెలిపారు. వీరితో పాటు మరో 30 వేల మంది రైతులకు పార్టిసిపేటరీ గ్యారంటీ స్కీమ్ (పీజీఎస్) ఇండియా రీజనల్ కౌన్సిల్ ద్వారా ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రకృతి వ్యవసాయ విధానం, సాగులో మెళకువలు, నియమాలు తెలియజేసి, రైతులకు ధ్రువీకరణ పత్రాలను జారీ చేసేందుకు విజయవాడలో రెండురోజులు నిర్వహించిన శిక్షణ మంగళవారం ముగిసింది. బి.రామారావు మాట్లాడుతూ టీటీడీకి 12 రకాల ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను సరఫరా చేస్తున్న రైతులకు సర్టిఫికెట్లు అందజేస్తామని చెప్పారు.

పర్యాటక పెట్టుబడులకు
ఏపీ స్వర్గధామం

ఆస్ట్రేలియాలో పెట్టుబడిదారుల సమావేశంలో మంత్రి ఆర్కే రోజా

సాక్షి, అమరావతి: పర్యాటక రంగంలో పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ స్వర్గధామమని, ఔత్సాహిక పెట్టుబడిదారులకు ప్రభుత్వం అన్నివిధాలా సహకరిస్తుందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా మంగళవారం మెల్‌బోర్న్‌లో ప్రవాసాంధ్రులతో పాటు స్థానిక వ్యాపార వేత్తలతో సమావేశమయ్యారు. మంత్రి మాట్లాడుతూ.. ఏపీలో ప్రపంచ పర్యాటకులు, పెట్టుబడిదారులను ఆకర్షించేలా అపార పర్యాటక వనరులు ఉన్నాయన్నారు. దేశంలోనే ఉత్తమ పర్యాటక పాలసీని అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు పలు సంస్థలు ముందుకొచ్చాయి. ఇందులో ఆస్ట్రేలియాలోని క్వెస్ట్ సెక్యూరిటీ లిమిటెడ్ సంస్థకు చెందిన గ్రాంట్ రాబర్ట్‌సన్, ప్రవాసాంధ్రుడు బిస్‌కాప్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్ హరీష్ బిశం పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి వ్యక్త చేశారు. గ్రేస్ట్ రాబర్ట్‌సన్ మాట్లాడుతూ భారత్‌తోపాటు ఆంధ్రా ప్రభుత్వంతో దీర్ఘకాలిక సంబంధం కొనసాగించాలని కోరుకుంటున్నానన్నారు. హరీష్ బిశం మాట్లాడుతూ త్వరలోనే ఏపీలో పర్యటించనున్నట్లు తెలిపారు.

అతి త్వరలో గడపగడపకు వైద్యం

- అధికారులు సిద్ధంగా ఉండాలి
- వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ సమీక్షలో మంత్రి విడదల రజని



గుంటూరు మెడికల్: రాష్ట్రంలో అతి త్వరలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్యవిధానాన్ని ప్రారంభించనున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని చెప్పారు. వైద్య ఆరోగ్యశాఖ అమలు చేస్తున్న పథకాలు, అందిస్తున్న సేవలు క్షేత్ర స్థాయిలో ఎలా ఉన్నాయో తెలుసుకునేందుకు తొలిసారిగా మంగళవారం గుంటూరులో ప్రాంతీయ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్య విధానం అమల్లోకి వచ్చాక ప్రభుత్వమే ఇంటింటికి వైద్యసేవలు అందిస్తుందన్నారు. ఫ్యామిలీ ఫిజిషియన్ విధానాన్ని విజయవంతంగా అమలు చేయడం కోసం కొత్తగా 176 మంది మెడికల్ ఆఫీసర్లను, 1,681 మంది మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్లను నియమిస్తామని తెలిపారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లలో 65 రకాల మందులు అందుబాటులో ఉంచామన్నారు. వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా ప్రత్యేక యాప్‌లు కూడా అన్ని స్థాయిల సిబ్బందికి అందుబాటులోకి తెచ్చామన్నారు. ఎంఎంయూ వాహనాలను 45 రోజుల్లో సిద్ధం చేస్తామన్నారు.

ఆరోగ్యశ్రీ రూపు మార్చిన సీఎం వైఎస్ జగన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పరిధిని మరింతగా పెంచారన్నారు. రాష్ట్రంలోని పేదలందరికీ ఉచితంగా కార్పొరేట్ వైద్యాన్ని తమ ప్రభుత్వం అందజేస్తోందని చెప్పారు. ఆరోగ్యశ్రీ కింద చికిత్స పొంది డిశ్చార్జ్ అయిన వారికి ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్య విధానం ద్వారా అదనంగా వైద్యసేవలు అందుతాయన్నారు. వైద్యులు, ఏఎన్ఎంలు వారి ఇళ్లకు సేవలందిస్తారని చెప్పారు. ఆరోగ్యశ్రీ ద్వారా పొందిన వైద్యంపై రోగులు సంతృప్తి చెందకపోతే వారితో మాట్లాడిన వీడియోలను ఏఎన్ఎంలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారని, తద్వారా ఆ ఆస్పత్రులపై చర్యలు తీసుకునే వీలుంటుందని తెలిపారు. తమ ప్రభుత్వం వచ్చిన తరువాత మాతా శిశు మరణాలు దాదాపు సున్నాకు తగ్గాయన్నారు. పీహెచ్‌సీల్లో నెలకు కనీసం పది డెలివరీలు అయినా చేయాలని ఆదేశాలిచ్చినట్లు చెప్పారు. ఈ సమావేశంలో వైద్య ఆరోగ్యశాఖ ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, ఏపీవీవీపీ కమిషనర్ వినోద్‌కుమార్, ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ మురళీధర్‌రెడ్డి, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ నివాస్, గుంటూరు, పల్నాడు జిల్లాల కలెక్టర్లు ఎం.వేణుగోపాలరెడ్డి, ఎల్.శివశంకర్, ఆరోగ్యశ్రీ సీఈవో ఎం.ఎన్.హెచ్.ప్రసాద్, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, ఎన్టీఆర్, కృష్ణా, పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, ఎస్పీఎస్ నెల్లూరు జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం

- భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు
- దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ



మాట్లాడుతున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని, ప్రతి భక్తుడికి అమ్మవారి దర్శనంలో అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ చెప్పారు. ఆయన మంగళవారం విజయవాడలోని తన క్యాంప్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. దుర్గగుడిలో సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 5వ తేదీ వరకు నిర్వహించనున్న దసరా ఉత్సవాల ఏర్పాట్లు, దుర్గగుడి మాస్టర్ ప్లాన్‌పై దేవదాయశాఖ కమిషనర్ హరి జవహర్‌లాల్, ఆర్‌జేసీ చంద్రశేఖర్ ఆజాద్, స్థపతి టి.పరమేశ్వరప్ప, ఎస్ఈ ఎస్.శ్రీనివాస్, దుర్గగుడి ఈవో భ్రమరాంబతో చర్చించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఈ ఏడాది ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారి దర్శనానికి వచ్చే అవకాశం ఉందన్నారు. ఘాట్ రోడ్డు మీదగా ఐదు క్యూలైన్లు ఏర్పాటు చేసి సాధారణ భక్తులకు కూడా త్వరగా దర్శనం అయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అందరికీ ముఖ మండప దర్శనమే కల్పిస్తామని తెలిపారు. భక్తులకు బఫే పద్ధతిలో పులిహోర, చక్కెర పొంగలి, దద్దోజనం అన్నప్రసాదంగా ఇస్తామని తెలిపారు.

ఐదు స్లాట్‌లలో బ్రేక్ దర్శనం

తిరుమల శ్రీవారి ఆలయంలో అమలవుతున్న తరహాలో దసరా ఉత్సవాల్లో కనకదుర్గమ్మ దర్శనానికి ఈ ఏడాది బ్రేక్ దర్శనం ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు తయారుచేసినట్లు చెప్పారు. ఈ ప్రతిపాదనల్లో బ్రేక్ దర్శనం టికెట్ రూ.500గా నిర్ణయించామన్నారు. ఐదు స్లాట్‌లలో తెల్లవారుజామున 3 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు, 6 నుంచి 8 వరకు, 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు, రాత్రి 8 నుంచి 10 గంటల వరకు బ్రేక్ దర్శనం అమలు చేయనున్నట్లు వివరించారు. బ్రేక్ దర్శనానికి ప్రతి ఎమ్మెల్యేకి ఒక లెటర్‌ను సిఫార్సు కింద అంగీకరించి, ఆ లెటరుపై 1+5 దర్శనం ఉచితంగా కల్పిస్తామని చెప్పారు. స్థానిక ప్రజాప్రతినిధులకు రోజుకు 10 లెటర్లు అనుమతిస్తామన్నారు. దసరా ఉత్సవాల తర్వాత అంతరాలయం టికెట్ ధరను రూ.500 చేయనున్నట్లు చెప్పారు. ఈ ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహ పరిశీలనకు ఢిల్లీకి వెళతాం: మంత్రి మేరుగు



పనులను పరిశీలిస్తున్న మేరుగు నాగార్జున

సాక్షి, అమరావతి: విజయవాడ స్వరాజ్ మైదానంలో ప్రతిష్ఠించనున్న 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం నమూనాను పరిశీలించేందుకు మంత్రుల బృందం త్వరలో ఢిల్లీ వెళ్లనుందని మంత్రి మేరుగు నాగార్జున వెల్లడించారు. 'డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్వరాజ్ మైదాన్' ప్రాజెక్టులో భాగంగా స్వరాజ్ మైదానంలో పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. విగ్రహంతో పాటు చేపట్టనున్న ఇతర నిర్మాణ పనులకు సంబంధించిన ప్రగతిని అధికారులు మంత్రికి వివరించారు. పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యం పెంచే బాధ్యత టీచర్లదే..

ఎస్సీ గురుకులాల్లోని విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించే బాధ్యత టీచర్లదేనని మంత్రి నాగార్జున స్పష్టం చేశారు. ఇటీవల విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో గురుకులాలను తనిఖీ చేసి, క్షేత్రస్థాయి పరిస్థితులపై ఆరా తీసి, టీచర్లకు పలు సూచనలు చేసినట్లు మంత్రి ఒక ప్రకటనలో తెలిపారు.

పనీపాట లేని పార్టీలే దేవుడిపై రాజకీయాలు

- బూటు కాళ్లతో పూజలుచేసి హిందూ ధర్మాన్ని కించపరిచిన వ్యక్తి చంద్రబాబు
- చవితి వేడుకల్లో కొత్త ఆంక్షలేమీ లేవు
- ధార్మిక పరిషత్‌ను ఏర్పాటు చేసిన సీఎంకు ధన్యవాదాలు
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కోన రఘుపతి



సాక్షి, అమరావతి: వినాయక చవితి ఉత్సవాలపై వారం రోజులుగా ప్రతిపక్షాలు పనికట్టుకుని ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నాయని.. పనీపాట లేని పార్టీలే దేవుడ్ని అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేస్తున్నాయని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కోన రఘుపతి ధ్వజమెత్తారు. పండగ వేళ స్వార్థపర శక్తులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. బూట్లు వేసుకుని పూజలు చేసి హిందూ ధర్మాన్ని కించపరిచిన చంద్రబాబు కూడా విమర్శలు చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో వినాయక చవితి ఉత్సవాలకు కొత్త ఆంక్షలేమీ లేవని ఆయన స్పష్టంచేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం కోన రఘుపతి మీడియాతో మాట్లాడారు. నీతిమాలిన, దిగజారిన రాజకీయాలు చేస్తున్న చంద్రబాబు విజయవాడలో కూల్చిన దేవాలయాలను సీఎం జగన్ పునర్నిర్మించారని గుర్తుచేశారు.

వారా హిందు ధర్మం గురించి మాట్లాడేది?

ఇక టీడీపీ హయాంలో వినాయక చవితి మండపాలకు కనీస విద్యుత్ చార్జీ రూ.1,000 కాగా, నేడు రాష్ట్ర ప్రభుత్వం ఆ మొత్తాన్ని తగ్గించిందన్నారు. అధికారంలో ఉండి, ధార్మిక పరిషత్‌ను పట్టించుకోని టీడీపీ, బీజేపీ వాళ్లా హిందు ధర్మం గురించి మాట్లాడేది? అని ప్రశ్నించారు. హిందూ ధార్మిక పరిషత్ ఏర్పాటుచేసిన సీఎం జగన్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. సర్వమతాలను ప్రేమిస్తూ, దేవుడిని నమ్మే వ్యక్తి సీఎం జగన్ అని ఆయన తెలిపారు.

పండగ పూటా ఆ మూడు పార్టీల దుష్ప్రచారం

వినాయక చవితి పండగ నేపథ్యంలో మండపాల ఏర్పాటుపై గత వారం రోజులుగా సోషల్ మీడియాలో, ఓ వర్గం మీడియాలో పనిగట్టుకుని ప్రజల్ని పక్కదోవ పట్టించడానికి టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. సీఎం వైఎస్ జగన్ అందరి మనోభావాలను గౌరవిస్తారని.. అలాంటి వ్యక్తిపై నిందలు వేయడమంటే.. ఆకాశంలో సూర్యుడిని చూసి ఉమ్ము వేయడమేనన్నారు. అసత్య ప్రచారాలు చేయడంలో వీళ్ల అత్యుత్సాహం చూస్తుంటే.. వీరు ఏ నీచానికైనా తెగించవచ్చన్న అనుమానం కలుగుతోందని కోన రఘుపతి అన్నారు. కాబట్టి ఉత్సవ కమిటీలు మరింత అప్రమత్తంగా ఉండాలని కోన రఘుపతి సూచించారు.

క్లుప్తంగా


సొర చేపలతో తీర ప్రాంతానికి మేలు

- వేల్ షార్క్ డే సదస్సులో అటవీ దళాల అధిపతి మధుసూదన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: సొర చేపల వల్ల తీర ప్రాంతానికి ఎంతో మేలు కలుగుతుందని అటవీ దళాల అధిపతి వై.మధుసూదన్‌రెడ్డి తెలిపారు. అంతర్జాతీయ వేల్ షార్క్ (సొర చేపలు) దినోత్సవం సందర్భంగా మంగళవారం గుంటూరులోని అటవీ శాఖ ప్రధాన కార్యాలయం నుంచి వెబినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ సొరచేపల మాంసం, తోలు, నూనెకు అంతర్జాతీయ మార్కెట్‌లో చాలా డిమాండ్ ఉందని చెప్పారు. సముద్రంలో నిర్లక్ష్యంగా వేట సాగించడం వల్ల సొర చేపలు ప్రమాదపు అంచుల్లో ఉన్నాయన్నారు. వన్య ప్రాణుల ట్రస్ట్, తూర్పుగోదావరి రివర్ ఇన్ వి భాగం, ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ సంయుక్తంగా వన్య, మత్స్య ప్రాణుల సంరక్షణకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. తీర ప్రాంతాల్లోని 40 గ్రామాల్లో వేలాది మంది ప్రజలను చైతన్య పరుస్తూ సాగుతున్న ఈ కార్యక్రమం అద్భుత ఫలితాలను ఇస్తోందన్నారు. రాష్ట్రంలోని తీర ప్రాంతంలో సొర చేపల పరిరక్షణకు అందరం కలసికట్టుగా పనిచేద్దామని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి అదనపు పీసీసీఎఫ్ శాంతిప్రియ పాండే అధ్యక్షత వహించగా పలువురు అధికారులు పాల్గొన్నారు.

సీపీఎస్ ఉద్యోగులపై వేధింపులు ఆపండి

- సీఎస్ సమీర్‌శర్మకు ప్రతిపక్ష నేత చంద్రబాబు లేఖ



సాక్షి, అమరావతి: సీపీఎస్ ఉద్యోగులను వేధించడం ఆపాలని ప్రతిపక్ష నేత చంద్రబాబు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్ శర్మకు ఆయన లేఖ రాశారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను తీసుకొస్తానని జగన్ ఎన్నికల హామీ ఇచ్చారని చంద్రబాబు గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన వారంలోనే సీపీఎస్‌ను రద్దు చేస్తానని ప్రకటించారన్నారు. కానీ ప్రభుత్వం వచ్చి మూడేళ్లు గడిచినా ఆ హామీ నెరవేరలేదని ఉద్యోగులు నిరసనల బాట పట్టారని తెలిపారు. శాంతియుత నిరసనలు ఉద్యోగులకు భారత రాజ్యాంగం ఇచ్చిన హక్కన్నారు. ఈ క్రమంలోనే ఉద్యోగులు సెప్టెంబర్ 1న విజయవాడలో శాంతియుత నిరసనకు పిలుపునిచ్చారని చెప్పారు. ప్రభుత్వం పోలీసులతో ఉద్యోగులపై బైండోవర్ కేసులు, నోటీసులు, పోలీస్‌స్టేషన్‌కు పిలిపించడం వంటి చర్యలతో వారిని వేధింపులకు గురి చేసిందని విమర్శించారు. ఉద్యోగులు తమ నిరసనను సెప్టెంబర్ 1 నుంచి 11కి వాయిదా వేసినా పోలీసుల బెదిరింపులు, వేధింపులు కొనసాగుతున్నాయన్నారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులపై వేధింపులు, బెదిరింపులను ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలన్నారు.

తెలుగు రాష్ట్రాలకు కేంద్రం సహకరిస్తోంది

- ఎంపీ జీవీఎల్ నరసింహారావు



ఎంవీపీకాలనీ (విశాఖ తూర్పు): రెండు తెలుగు రాష్ట్రాల సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం సహకరిస్తోందని ఎంపీ జీవీఎల్‌నరసింహారావు చెప్పారు. విశాఖపట్నంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. విద్యుత్ బకాయిలు చెల్లించేలా తెలంగాణ ప్రభుత్వానికి సూచించాలని సీఎం జగన్ కేంద్రమంత్రిని కోరిన వెంటనే తెలంగాణ ప్రభుత్వానికి ఆయన లేఖ రాశారని గుర్తుచేశారు. 2019 నుంచి రెండు రాష్ట్రాల సీఎంలు ఎన్నిసార్లు సమస్యలపై చర్చించారని ప్రశ్నించారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకొనే జగన్ రాష్ట్రంలో రైతులకు చేస్తున్న మేలు ఏమీ లేదన్నారు. ఈ ఏడాది కూడా రైతుల ఆత్మహత్యల్లో ఏపీ అగ్రస్థానంలో నిలిచిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై తమ పార్టీ పోరు కొనసాగుతుందన్నారు. ఇందుకోసం రూట్‌మ్యాప్ సిద్ధం చేసుకున్నట్లు తెలిపారు.

ఎంపీ రఘురామ కేసు వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: పోలీసు కస్టడీలో తన తండ్రిని చిత్రహింసలకు గురి చేశారని ఆరోపిస్తూ ఎంపీ రఘురామ కృష్ణరాజు కుమారుడు భరత్ దాఖలు చేసిన వ్యాజ్యం విచారణను సుప్రీంకోర్టు వచ్చే వారానికి వాయిదా వేసింది. ఈ పిటిషన్ మంగళవారం జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ సి.టి.రవి కుమార్ ధర్మాసనం ముందుకొచ్చింది.

గాలి జనార్దన్‌రెడ్డి పిటిషన్‌పై విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: బెయిలు షరతులు సడలించాలని కోరుతూ కర్ణాటక మాజీ మంత్రి గాలి జనార్దన్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు సెప్టెంబరు 14కు వాయిదా వేసింది. ఈ పిటిషన్ మంగళవారం జస్టిస్ ఎం.ఆర్.షా, జస్టిస్ కృష్ణమురారితో కూడిన ధర్మాసనం ముందుకొచ్చింది. కౌంటర్ అఫిడవిట్‌ను సెప్టెంబర్ 8లోగా దాఖలు చేయాలని సీబీఐని ధర్మాసనం ఆదేశించింది.

పండుగ వేళ.. కరెంటుతో జాగ్రత్త

వినాయక మండపాలకు తాత్కాలిక విద్యుత్ సర్వీసులు

- మండపాల వద్ద ప్రత్యేకంగా భద్రత చర్యలు
- అందుబాటులో విద్యుత్ సిబ్బంది ఉండేలా ఏర్పాట్లు
- నిర్వాహకులు, భక్తులకు అవగాహన కార్యక్రమాలు



సాక్షి, అమరావతి: ఊరూవాడా పూజలందుకునే వినాయకుడి పందిళ్ల వద్ద వేలాది రంగురంగుల విద్యుద్దీపాలు ఏర్పాటవుతున్నాయి. ఆయా పందిళ్ల వద్ద నిరంతరం స్వామి పాటలు వినిపించాలన్నా, పూజా మంత్రాలు భక్తులకు చేరాలన్నా.. లౌడ్ స్పీకర్లు, మైకులు తప్పనిసరి. అదేవిధంగా పెద్దపెద్ద మండపాల వద్ద ఏసీలు, ఫ్యాన్లు కూడా ఏర్పాటు చేస్తున్నారు. సాంస్కృతిక ప్రదర్శనలకు ప్రత్యేక విద్యుత్ ఏర్పాట్లు చేస్తున్నారు. వీటన్నిటికీ కరెంటు అవసరం. ఈ కరెంటు విషయంలో అందరూ ఎంతో జాగ్రత్తగా ఉండాలి. అందుకే వినాయక చవితికి విద్యుత్ శాఖ మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. భద్రతకు చర్యలు చేపట్టింది. ఆ వివరాలను ఆంధ్రప్రదేశ్ తూర్పు, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థల సీఎండీ కె.సంతోషరావు, మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ జె.పద్మాజనార్దనరెడ్డి 'సాక్షి ప్రతినిధి'కి వెల్లడించారు. వారు చెప్పినదాని ప్రకారం..

- వినాయక ఉత్సవాల్లో విద్యుత్ శాఖకు సంబంధించిన అన్నిరకాల సేవలను పర్యవేక్షించడానికి ప్రతి జిల్లాలోను డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లకు బాధ్యతలు అప్పగించారు. వీరు డివిజనల్ ఇంజనీర్లతో సమన్వయం చేసుకుంటారు.
- క్షేత్రస్థాయిలో నిర్వాహకులు, భక్తులకు సహకరించడం, విద్యుత్ సర్వీస్, ప్రమాదాలపై వారికి అవగాహన కల్పించడం కోసం ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓ అండ్ ఎం) సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ముగ్గురు సభ్యులతో ఏర్పాటైన బృందాలు ప్రతి మండపం వద్దకు తిరుగుతూ విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు చెబుతుంటాయి.
- ప్రతి మండలానికి ఒక సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ అందుబాటులో ఉంటారు. ఏదైనా పెద్ద సమస్య ఏర్పడితే ఆయన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతారు.
- మండపంలో విద్యుత్ కోసం ముందుగా విద్యుత్ శాఖ నుంచి లోడ్ ప్రకారం నిర్దేశిత రుసుము చెల్లించి అనుమతి పొందాలి. దరఖాస్తు చేసుకోవడానికి వచ్చిన వారికి ఎలక్ట్రికల్ ఇంజనీర్లు విద్యుత్ ప్రమాదాలపై పలు సూచనలు చేస్తున్నారు.
- మండపంలో ఉండే విద్యుత్ పరికరాల లోడ్‌కు తగిన నాణ్యమైన కేబుల్స్ వాడాలి. జాయింట్లు ఉన్న, ఇన్సులేషన్‌లేని వైర్లను వాడటం అపాయకరం. వైరింగ్‌ను లైసెన్స్ కలిగిన ఎలక్ట్రీషియన్ చేత మాత్రమే చేయించుకోవాలి. ముఖ్యంగా లోడ్‌కు తగిన కెపాసిటీ కలిగిన ఎంసీబీ (మినియేచర్ సర్క్యూట్ బ్రేకర్)లను తప్పనిసరిగా వాడాలి. ఒకవేళ ఎంసీబీలు ఓవర్ లోడ్ అయితే షార్ట్ సర్క్యూట్ అయి అగ్ని ప్రమాదాలు జరగవచ్చు.
- విద్యుత్ సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద గణేష్ మండపాలను ఏర్పాటు చేయరాదు. విద్యుత్ పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్ల దిమ్మెలను మండపాలకు సపోర్ట్ కోసం వాడరాదు. విద్యుత్ వైర్లు, పోల్స్, ఇతర ప్రమాదకర విద్యుత్ పరికరాలు మండపాల పరిసరాల్లో ఉంటే వాటిని పరిశీలించి వాటి నుంచి దూరంగా ఉండాలి.

> వినాయక మండపాలకు విద్యుత్ సరఫరా కనెక్షన్ కోసం విద్యుత్ స్తంభాలు ఎక్కకూడదు. విద్యుత్ శాఖ సిబ్బందిని సంప్రదిస్తే వారు మండపం వద్దకు వచ్చి పరిశీలించి కనెక్షన్ ఇస్తారు.

> ఒకవేళ ఎవరికైనా విద్యుత్ షాక్ తగిలినా, విద్యుత్ లైన్లు ఎక్కడైనా తెగిపడినా, ఇతర అత్యవసర పరిస్థితులు ఏర్పడినా వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1912కు గానీ, సమీప ఫ్యూజ్ ఆఫ్ కాల్‌కు గానీ కాల్‌చేసి విద్యుత్ సిబ్బందికి తెలియజేయాలి.

72.27 లక్షల మందికి ప్రికాషన్ టీకా

- రాష్ట్రంలో 18–59 ఏళ్ల వయసు ఉన్న 72.27 లక్షల మందికి పంపిణీ
- 76.94 శాతం మంది ఫ్రంట్‌లైన్, హెల్త్ కేర్ వర్కర్లు, వృద్ధులకు ప్రికాషన్ టీకా పంపిణీ పూర్తి
- రాష్ట్రంలో ఇప్పటివరకూ 10.55 కోట్ల డోసుల టీకా పంపిణీ చేసిన వైద్య శాఖ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 72,27,253 మందికి వైద్య శాఖ కరోనా ప్రికాషన్ టీకా పంపిణీ చేసింది. 18 నుంచి 59 ఏళ్ల వయసు వారికి సెప్టెంబర్ నెలాఖరు నాటికి 3.43 కోట్ల మందికి ప్రికాషన్ టీకా పంపిణీ చేయాలనేది లక్ష్యం. కాగా, ఇందులో 21.01 శాతం మందికి టీకా ప్రక్రియ పూర్తయింది. మరోవైపు ఫ్రంట్‌లైన్, హెల్త్ కేర్ వర్కర్లు, వృద్ధులకు ప్రికాషన్ టీకా పంపిణీ వేగంగా కొనసాగుతోంది. ఈ వర్గాలకు చెందిన 79,31,321 మందికి ఈ నెలాఖరు నాటికి రాష్ట్రంలో ప్రికాషన్ టీకా పంపిణీ చేయాల్సి ఉంది. ఇందులో 76.94 శాతం 61.03 లక్షల మందికి వైద్య శాఖ ప్రికాషన్ టీకా వేసింది.

10.55 కోట్ల డోసుల పంపిణీ

కరోనా టీకా పంపిణీ ప్రారంభించిన నాటి నుంచి నేటివరకు రాష్ట్రంలో 10,55,53,984 డోసుల టీకాను ప్రభుత్వం ప్రజలకు పంపిణీ చేసింది. 18 ఏళ్లు పైబడిన 4 కోట్ల మందికి పైగా ప్రజలకు రాష్ట్రంలో రెండు డోసుల వ్యాక్సినేషన్ పూర్తయింది. మరోవైపు 12–14 ఏళ్ల పిల్లలకు 14.90 లక్షల మందికి టీకా పంపిణీ లక్ష్యం కాగా... లక్ష్యానికి మించి 15.13 లక్షల మందికి తొలి డోసు టీకా వేశారు. తొలి డోసు వేసుకున్న వారిలో 97.93 శాతం 14.81 లక్షల మందికి రెండో డోసు టీకా వేశారు. అదేవిధంగా 15–18 ఏళ్ల యువతలో 25.26 లక్షల మందికి రెండు డోసుల టీకా పంపిణీ చేపట్టారు. కరోనా వ్యాప్తి తగ్గినప్పటికీ ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా టీకా పంపిణీలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. వైద్య సిబ్బంది ద్వారా ఇంటింటి సర్వే చేపట్టి టీకా వేసుకోని వారు ఉంటే గుర్తించి వారికి టీకా పంపిణీ చేపడుతున్నారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాల విడుదల

10లోగా రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు అవకాశం



ఫలితాలను విడుదల చేస్తున్న శేషగిరిబాబు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. గుంటూరు జిల్లా తాడేపల్లిలో ఇంటర్ బోర్డు కార్యదర్శి ఎంవీ శేషగిరిబాబు ప్రథమ, ద్వితీయ సంవత్సరాల సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను ప్రకటించారు. మొత్తం 3,66,543 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 1,28,705 మంది ఉత్తీర్ణులయ్యారు. మొదటి సంవత్సరం జనరల్ కేటగిరీలో 35 శాతం, ఒకేషనల్‌లో 42 శాతం, ద్వితీయ సంవత్సరం జనరల్ కేటగిరీలో 33 శాతం, ఒకేషనల్‌లో 46 శాతం ఉత్తీర్ణత నమోదైంది. బెటర్‌మెంట్ కోసం 1,50,550 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తే 1,29,567 మందికి మార్కులు పెరిగాయి. శేషగిరిబాబు మాట్లాడుతూ.. విద్యార్థులు సెప్టెంబర్ 10లోగా రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. 1,022 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా 429 మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదయ్యాయన్నారు. మార్చి, సప్లిమెంటరీ ఫలితాలతో కలుపుకుని 70.63 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు తెలిపారు. ఇందులో మొదటి సంవత్సరం జనరల్‌లో 68 శాతం, ఒకేషనల్‌లో 66 శాతం, ద్వితీయ సంవత్సరం జనరల్‌లో 73 శాతం, ఒకేషనల్‌లో 80 శాతం ఉత్తీర్ణత నమోదైందని చెప్పారు.

విద్యార్థుల ఉత్తీర్ణత ఇలా..

సంవత్సరం	హాజరైనవారు	ఉత్తీర్ణులు
జనరల్ విభాగంలో..		
మొదటి	1,76,942	61,410
రెండో	1,51,889	50,691
ఒకేషనల్ విభాగంలో..		
మొదటి	18,399	7,680
రెండో	19,313	8,924

విద్యార్థులకు ఐఎస్‌బీ స్కిల్లింగ్ కోర్సుల్లో శిక్షణ

- ఇంజనీరింగ్, డిగ్రీ, పాలిటెక్నిక్ విద్యార్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని యువతకు ఉపాధి మార్గాలు మెరుగుపడేలా విస్తృత ఉపాధి నైపుణ్యాలు అందజేసే ప్రక్రియలో భాగంగా విద్యార్థులకు ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) స్కిల్లింగ్ ప్రోగ్రామ్‌లో ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనుంది. పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ కళాశాలలు, ఫార్మసీ కాలేజీలతోపాటు పలు అటానమస్ కాలేజీల్లో చదువుకుంటున్న, పూర్వ విద్యార్థుల్లో ఆసక్తి గలవారు శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. వ్యాపార అక్షరాస్యత నైపుణ్యాలు (బిజినెస్ లిటరసీ స్కిల్స్), ప్రవర్తనా నైపుణ్యాలు (బిహేవియరల్ స్కిల్స్), డిజిటల్ అక్షరాస్యత నైపుణ్యాలు (డిజిటల్ లిటరసీ స్కిల్స్), వ్యవస్థాపక అక్షరాస్యత నైపుణ్యాలు (ఎంట్రప్రెన్యూరల్ లిటరసీ స్కిల్స్) కోర్సుల్లో ఒక్కొక్క కోర్సుకు 40 గంటలపాటు శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపింది. ఈ కోర్సులను ఐఎస్‌బీ, దాని అనుబంధ అధ్యాపకులు ఆన్‌లైన్‌లో బోధిస్తారు. విద్యార్థులకు తక్కువ ధరలో నాణ్యమైన శిక్షణ అందించాలన్న ఉద్దేశంతో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఐఎస్‌బీ కలిసి పనిచేస్తున్నాయని తెలిపింది. ఆయా కోర్సులకు సంబంధించిన ఫీజు, ఇతర వివరాల కోసం https://skillshub.isb.edu/apssdc/ ద్వారా తెలుసుకోవచ్చని స్కిల్ డెవలప్‌మెంట్–ట్రైనింగ్ శాఖ ముఖ్య కార్యదర్శి సౌరభ్ గౌర్ తెలిపారు. నిపుణుల సహకారంతో కార్పొరేషన్ రూపొందించిన స్కిల్ ట్రైనింగ్ ప్లాట్ ఫామ్స్‌ను యువత సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేషన్ ఎండీ సత్యనారాయణ కోరారు.

నిజానికి, అబద్ధానికి మధ్య పోరాటం

నిజం సీఎం వైఎస్ జగన్ వైపు ఉంది.. అబద్ధానికి బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు

- దుష్టచతుష్టయం దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి
- ఇచ్చిన హామీలకంటే సీఎం జగన్ ప్రజలకు అధికంగా మేలు చేస్తున్నారు.. ఈ విషయాన్ని ప్రజలకు వివరించాలి
- సోషల్ మీడియా కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల పిలుపు



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సజ్జల, మంత్రి అంబటి, పేర్ని నాని, తదితరులు

సాక్షి, అమరావతి/తాడేపల్లిరూరల్: రాష్ట్రంలో నిజానికి, అబద్ధానికి మధ్య పోరాటం జరుగుతోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. సీఎం వైఎస్ జగన్ వైపు నిజం ఉంటే.. అసత్యాలకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు వైపు అబద్ధం ఉందని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలకంటే సీఎం వైఎస్ జగన్ ప్రజలకు అధికంగా మేలు చేస్తున్నారని, ఈ విషయాన్ని ప్రజలకు వివరించాలని వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా విభాగం కార్యకర్తలకు ఉద్బోధించారు. జగన్‌పై చంద్రబాబు, రామోజీరావు, రాధాకృష్ణ టీవీ5 నాయుడుతో కూడిన దుష్టచతుష్టయం, చంద్రబాబు దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ చేస్తున్న దుష్ప్రచారాన్ని ఎక్కడికక్కడ తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా విభాగం కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం మంగళవారం తాడేపల్లిలో జరిగింది. ఈ సమావేశంలో సజ్జల మాట్లాడుతూ.. ఈ మూడేళ్లలో చరిత్ర సృష్టించామని, చంద్రబాబు చేసిన అప్పులు, కోవిడ్, రాష్ట్ర విభజన నేపథ్యం, అభివృద్ధికి ఆస్కారం లేని పరిస్థితులలో ఎవ్వరూ చేయలేనంతగా రాష్ట్రాన్ని వైఎస్ జగన్ అభివృద్ధి చేశారని వివరించారు. రాజకీయం అంటే రాజకీయం కోసం కాదని, ప్రజల కోసమన్నది సీఎం వైఎస్ జగన్ సిద్ధాంతమని చెప్పారు. సంప్రదాయ పద్ధతులను బ్రేక్ చేస్తూ పాలనలో, వ్యవహార శైలిలో, పార్టీ వ్యవహారాలలో, నేతల శైలిలో కూడా మాటల్లో కాకుండా చేతలలో చూపిస్తున్నారని గర్వంగా చెప్పగలనన్నారు. మనం అందరం కాలర్ ఎగరేసుకుని చెప్పుకొనేలా సంక్షేమాభివృద్ధి పథకాలు, సామాజిక న్యాయం, సుపరిపాలన అందిస్తున్నారని తెలిపారు. సీఎం వైఎస్ జగన్ పారదర్శకత, స్ట్రెయిట్ ఫార్వర్డ్‌నెస్ వల్లే వైఎస్సార్‌సీపీకి విశ్వసనీయత వచ్చిందన్నారు. సీఎం జగన్‌కు ఇంతలా నాయకత్వ లక్షణాలు ఉన్నాయి కాబట్టే ధైర్యంగా ముందుకెళ్తూ.. మారీచులను ఎదుర్కొంటూ సుపరిపాలన అందిస్తున్నారని చెప్పారు. అబద్ధాలను నిజమని, నిజాన్ని అబద్ధమని నమ్మించే వాళ్లు ప్రత్యర్థులుగా ఉన్నప్పుడు వారిని తట్టుకోవాలంటే చాలా జాగ్రత్తగా వారిపై దృష్టి పెట్టి పనిచేయాలని అన్నారు. వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ మీడియానే సర్వస్వం అని భావించదని స్పష్టంచేశారు. చంద్రబాబుకు చెప్పుకునేందుకు ఏమీ లేదు కాబట్టే.. ప్రభుత్వంపై అడ్డంగా బురదచల్లుతూ ప్రజలను అయోమయానికి గురిచేసే ప్రయత్నం చేస్తుంటారని అన్నారు. వాటిని కౌంటర్ చేయాలంటే మన పార్టీ సోషల్ మీడియా 2019లో పనిచేసిన విధంగా అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో జలవనరుల శాఖమంత్రి అంబటి రాంబాబు, మాజీ మంత్రి పేర్ని నాని, సోషల్ మీడియా విభాగం రాష్ట్ర అధ్యక్షులు చల్లా మధుసూధన్ రెడ్డి, గుర్రంపాటి దేవేందర్‌రెడ్డి, శివశంకర్, పి.మధు తదితరులు పాల్గొన్నారు.

నౌహీరాషేక్ ఖాతాలు పునరుద్ధరించండి

- హీరా గోల్డ్ స్కాంలో చెల్లింపులు వేగవంతం చేయాలన్న సుప్రీంకోర్టు



సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన హీరా గోల్డ్ కుంభకోణంలో నౌహీరా షేక్ బ్యాంకు ఖాతాలు పునరుద్ధరించి, చెల్లింపులు వేగవంతం చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. కేసు విచారణను నవంబరు 10కి వాయిదా వేసింది. నౌహీరా షేక్ బెయిలు రద్దు చేయాలంటూ సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ (ఎస్ఎఫ్ఐఓ) దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ అభయ్ ఎస్ ఓకాతో కూడిన ధర్మాసనం విచారించింది. డిపాజిటర్లు తన మొబైల్ ఫోనుకు వాట్సాప్ సందేశాలు పంపడంపై న్యాయమూర్తి జస్టిస్ కౌల్ తీవ్రంగా స్పందించారు. సందేశాలు పంపడం ఆపకపోతే విచారణ నుంచి వైదొలగుతానని హెచ్చరించారు. తన హెచ్చరికను డిపాజిటర్లకు తెలియజేయాలని ఎస్ఎఫ్ఐఓ తరఫు న్యాయవాదికి తెలిపారు.

వైట్ కాలర్ క్రిమినల్ రామోజీ

మార్గదర్శి ఫైనాన్స్ కుంభకోణంలో అది సుస్పష్టం: మంత్రి అంబటి

- మార్గదర్శి కుంభకోణంపై సుప్రీంకోర్టులోఎస్ఎల్‌పీకి సిద్ధం
- అందుకే రోజూ విషం కక్కుతూ విషపు రాతలు..
- తెలుగుదేశం పార్టీకి అసలు అధ్యక్షుడు రామోజీనే
- ప్రజాబలంతో మళ్లీ గెలిచేది సీఎం జగనే

సాక్షి, అమరావతి: మీడియా ముసుగులో చట్టాలను అతిక్రమించి అక్రమ వ్యాపారాలతో దక్షిణాదిలో అపర కుబేరుడిగా రూపాంతరం చెందిన చెరుకూరి రామోజీరావు ఓ వైట్ కాలర్ క్రిమినల్ అని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆర్బీఐ నిబంధనలకు విరుద్ధంగా మార్గదర్శి హిందూ అవిభక్త కుటుంబం కింద ఫైనాన్స్ వ్యాపారం చేస్తూ అనుమతి లేకుండా రూ.2,600 కోట్లు డిపాజిట్లు సేకరించిందని చెప్పారు. ఈ వ్యవహారంపై దర్యాప్తు జరిపించాలని దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ఉండవల్లి అరుణ్‌కుమార్ కోరారని గుర్తు చేశారు. మార్గదర్శి కుంభకోణంపై 540/2008 కేసు నమోదు చేసిన పోలీసులు సమగ్రంగా దర్యాప్తు చేసి కోర్టుకు నివేదించారన్నారు. వైఎస్సార్ మరణించిన తర్వాత ఈ కేసులో చాలా విచిత్రాలు జరిగాయని చెప్పారు. రాష్ట్ర విభజన అనంతరం ఉమ్మడి హైకోర్టును విభజించిన 2018 డిసెంబర్ 30న మూడో కంటికి తెలియకుండా జస్టిస్ రజనీ నేతృత్వంలోని సింగిల్ జడ్జి బెంచ్ కేసును కొట్టివేశారని తెలిపారు. ఈ అంశం చాలా కాలం ఎవరికీ తెలియదని, ఏ పత్రికలోనూ రాలేదని గుర్తు చేశారు. మార్గదర్శి ఫైనాన్స్ కుంభకోణంపై ఫిర్యాదు చేసిన ఉండవల్లి అరుణ్‌కుమార్ ఈ అంశాన్ని తెలుసుకుని సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్(ఎస్సెల్పీ) దాఖలు చేశారన్నారు. దీనిపై విచారణ చేపట్టాలని రామోజీరావు న్యాయవాది సీజేఐ బెంచ్ ముందు వాదించారని తెలిపారు. ఈ కేసు విచారణను సీజేఐ వాయిదా వేశాక.. ఎస్సెల్పీ దాఖలు చేస్తామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నివేదించడంతో దాన్ని కొట్టి వేయకుండా ఆపారని చెప్పారు.

విచారణకు వచ్చేలా చేశారనే కడుపుమంటతోనే

హైకోర్టులో తాను మూడో కంటికి తెలియకుండా కేసు కొట్టి వేయించుకుంటే దాన్ని సుప్రీం కోర్టులో విచారణకు వచ్చేలా చేశారనే కడుపుమంటతో సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వంపై 'ఈనాడు'లో రోజుకో అసత్య కథనాన్ని అచ్చేస్తూ రామోజీ బురద జల్లుతున్నారని అంబటి మండిపడ్డారు. వైట్ కాలర్ క్రిమినల్ అయిన రామోజీరావు తలకిందులుగా తపస్సు చేసినా సీఎం జగన్ ఎడమ కాలి గోటిని కూడా ఏమీ చేయలేరన్నారు. 'ప్రజాబలంతో వచ్చే ఎన్నికల్లో మళ్లీ గెలిచి సీఎంగా ప్రమాణ స్వీకారం చేసేది వైఎస్ జగనే. రామోజీరావ్ ఇది రాసుకో.. నీ ఈనాడు ఫ్రంట్ పేజీలో లేదా బ్యాక్ పేజీలో' అని అంబటి సవాల్ విసిరారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

దుష్టచతుష్టయంలో అగ్రగామి

దుష్టచతుష్టయంలో అగ్రగామిగా నిలిచే రామోజీరావు ఈనాడులో రోజూ ప్రభుత్వంపై వ్యతిరేకంగా ఒక వార్తను వండి వారుస్తూ విషపూరిత రాతలు రాస్తున్నారు. జర్నలిజం అంటే వాస్తవాలు చెప్పాలి. చంద్రబాబును అధికారంలోకి తెచ్చేందుకు విషం కక్కుతూ వార్తలు రాయడం జర్నలిజం అనిపించుకోదు. అందుకే మేం ఎప్పటికప్పుడు ప్రజలకు వాస్తవాలు చెబుతాం.

మళ్లీ ప్రశ్నిస్తున్నా.. జవాబు చెబుతారా?

నేను గతంలో మూడు ప్రశ్నలు అడిగితే రామోజీరావు కానీ చంద్రబాబు కానీ సమాధానం చెప్పలేదు. ఇప్పుడైనా జవాబు చెబుతారా?

- మీరు పోలవరం పనులను కేంద్రం నుంచి ఎందుకు తీసుకున్నారు?
- 2018 నాటికే పనులు పూర్తి చేస్తామని చెప్పి ఎందుకు చేయలేదు?
- ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా కాఫర్ డ్యామ్‌లు నిర్మించకుండా ఎర్త్ కమ్ రాక్ ఫిల్లింగ్ పునాదులు అయినటు వంటి డయాఫ్రమ్ వాల్ నిర్మించడం తప్పు కాదా?

మీడియా ముసుగులో దోపిడీ

హెచ్‌యూఎఫ్ కింద రూ.2600 కోట్ల డిపాజిట్లు సేకరించిన మార్గదర్శి ఫైనాన్స్‌ను రామోజీరావు నష్టాల్లో చూపారు. ఆయన మిగతా సంస్థల్లో లాభాలు చూపారు. అదే అగ్రిగోల్డ్ కంపెనీ యాజమాన్యాన్ని అరెస్టు చేసి జైలుకు కూడా పంపారు. మరి రామోజీ ఎన్ని నేరాలైనా చేయొచ్చా? ఆయనకు చట్టాలు వర్తించవా? చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం ముందుకు వెళ్తుంటే దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారు. మీడియా ముసుగులో దోపిడీ చేస్తానంటే కుదరదు. చంద్రబాబును అధికారంలోకి తీసుకురావాలన్న తాపత్రయంతో పాటు సీఎం జగన్ తనపై చట్టపరంగా చర్యలకు సిద్ధం అవుతున్నారని తెలియడంతోనే రామోజీరావు విషం కక్కుతున్నారు.

డీపీటీ విధానంలో దోపిడీ

ఎన్టీఆర్‌ను కుట్రపూరితంగా దించేసిన రామోజీరావు ప్రజాబలం లేని చంద్రబాబును గద్దె ఎక్కించాక డీపీటీ (దోచుకో, పంచుకో, తినుకో) పథకాన్ని యథేచ్ఛగా సాగించారు. చట్టాలను ఉల్లంఘించారు. పోలవరంలో ట్రాన్స్‌ట్రాయ్ నుంచి రూ.3,302 కోట్ల పనులను విడదీసి రామోజీ కుమారుడి వియ్యంకుడికి చెందిన నవయుగ సంస్థకు నామినేషన్ పద్ధతిలో చంద్రబాబు కట్టబెట్టారు. రూ.3,302 కోట్ల పనులను నామినేషన్ పద్ధతిలో కట్టబెట్టడం ప్రపంచంలోనే అతి పెద్ద స్కామ్. వైఎస్ జగన్ సీఎంకాగానే ఆ కుంభకోణం వివరాలు సేకరించి కాంట్రాక్టు రద్దు చేసి రివర్స్ టెండరింగ్ నిర్వహించారు. 12.6 శాతం తక్కువ ధరకు ప్రభుత్వానికి రూ.830 కోట్లు లాభం జరిగే విధంగా మేఘా సంస్థ ఆ పనులను దక్కించుకుంది. తమ దోపిడీకి సీఎం జగన్ అడ్డుకట్ట వేశారనే కడుపుమంటతో పోలవరంపై రామోజీరావు విషపు రాతలు రాస్తున్నారు.

రామోజీ సొంత ఆస్తి టీడీపీ

ఎన్టీఆర్ ముక్కుసూటి మనిషి. 1983 నుంచి 1995 వరకూ ఎన్టీఆర్ హయాంలో రామోజీని ఆయన లెక్క చేసేవారు కాదు. తన అక్రమ వ్యాపారాలకు సహకరించకపోవడంతో 1995లో ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి, శిష్యుడైన చంద్రబాబును సీఎంను చేయడంలో రామోజీ పాత్ర ప్రధానమైనది. ఆ తర్వాత టీడీపీని రామోజీరావు సొంత ఆస్తిలా మార్చుకున్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబైతే అసలైన అధ్యక్షుడు రామోజీనే. ఎమ్మెల్యే అభ్యర్థుల ఎంపిక నుంచి మంత్రివర్గంలో ఎవరుండాలనేది కూడా ఆయన సలహా మేరకే చంద్రబాబు వ్యవహరించారు. అప్పట్లో చంద్రబాబు మంత్రివర్గాన్ని విస్తరించాలన్నా, మార్చాలన్నా రామోజీరావుదే ప్రధాన పాత్ర.

ప్రజల మనిషి సీఎం జగన్..

వైఎస్ జగన్ వెన్నుపోటుతో సీఎం కాలేదు. మేనేజ్ చేసి, మోసం చేసి పదవులు పొందలేదు. వైఎస్సార్ మరణం తర్వాత చాలా కష్టాలు పడ్డారు. అన్యాయంగా 16 నెలలు జైలులో పెట్టినా తట్టుకున్నారు. ప్రజల్లోకి వెళ్లి వారితో మమేకం అయ్యారు. 175 సీట్లకు పోటీ చేసి ఒంటిచేత్తో 151 సీట్లు గెల్చుకుని అధికారంలోకి వచ్చారు. దుష్ట చతుష్టయంలో నెంబర్ వన్ చంద్రబాబు, నెంబర్ 2 రామోజీరావు, నెంబర్ 3 రాధాకృష్ణ, నెంబర్ 4 టీవీ 5 నాయుడు. ఇంకా వీరి దత్తపుత్రుడు కూడా.

ఏడాదిలో మహా ప్రధానమైన పర్వదినం గణేశ చతుర్థి. మహాగణపతి పార్వతీ తనయుడుగా ఆవిర్భవించిన రోజు. ఇంటిల్లిపాదీ, ఊరూ వాడా పూజించుకునే పర్వమిది. కొన్నిచోట్ల నవరాత్రులు చేసే సంప్రదాయం ఉంది. ఈ స్వామి ఆరాధన వల్ల అన్ని శుభాలు లభిస్తాయని ప్రతీతి. భక్తితో పూజిస్తే చాలు అపారమైన కృపావర్షం కురిపించే సులభ ప్రసన్నుడు విఘ్నరాజు గురించి కొన్ని విశేషాలు...

గణపతిం భజే

గణపతి పూజ ఆడంబరంగా సాగే క్రతువు కాదు. మనకి అందుబాటులో ఉన్న సామగ్రితో భగవంతుని కొలుచుకునే సందర్భం. బియ్యంతో చేసిన ఉండ్రాళ్లు, చెట్ల మీద పత్రి లాంటి సంబారాలే ఇందులో ప్రధానం. ఏదీ లేకపోతే మట్టి ప్రతిమను చేసి, పైన పాలవెల్లిని వేలాడదీసి, గరికతో పూజిస్తే చాలు. పండగ సజావుగా సాగిపోయినట్లే !

గణానాతాం త్వా గణపతిగ్ం హవామహే కవిం కవీనాముపమశ్రవస్తమమ్
జ్యేష్ఠరాజం బ్రహ్మణాం బ్రహ్మణస్పత అనశ్శృణ్వన్నూతి భిస్సీద సాధనమ్

గణపతి అంటే జ్ఞాన, మోక్షప్రదాత అని అర్థం. మనిషిని సన్మార్గంలో పయనింపజేసేది జ్ఞానమైతే, మరుజన్మ లేకుండా చేసేది మోక్షం. గణపతి ఆవిర్భావం, రూపురేఖా విలాసాల గురించి అనేక పురాణేతిహాసాలు అనేక విధాలుగా వర్ణించినప్పటికీ సకలశాస్త్రాలూ ఆయనను పరబ్రహ్మస్వరూపంగానూ, భవిష్యద్బ్రహ్మగానూ పేర్కొన్నాయి. సామాన్యులకు మాత్రం గణపతి విఘ్నసంహారకుడు. ఆయనను స్తుతిస్తే సర్వవిఘ్నాలూ ఉపశమిస్తాయి. అంతేకాదు ఆయన భక్త సులభుడు కూడా. బంకమట్టిని తెచ్చి దానికి గణపతి రూపు కల్పించి, ప్రాణప్రతిష్ఠ చేసిన అనంతరం గరికతోటీ, రకరకాల ఆకులు, పూవులతోటీ పూజించి, ఉండ్రాళ్లూ, పళ్లూ, పానకం, వడపప్పు, కుడుములు నివేదించి, అపరాధ క్షమాపణగా ఐదు గుంజిళ్లు తీస్తేచాలు – మన కోర్కెలన్నింటినీ తీర్చే మహాదయామూర్తి. గణం అంటే సమూహం అని అర్థం. ఈ సృష్టి యావత్తూ గణాలమయం. అనేకమైన గణాలతో కూడిన మహాగణం. ఈ విశ్వం, మనుష్యగణం, వృక్షగణం, గ్రహగణం– మళ్లీ ఇందులో వివిధ ధర్మాలను అనుసరించి మరెన్నో గణాలు– ఈ గణాలన్నింటిలో నూ అంతర్యామిగా వుంటూ, సృష్టిని శాసించే పరమేశ్వరుడు గణపతి. సమస్త యోగాలకు గణపతియే మూలాధారం. సమస్త విశ్వానికి ఆధారశక్తి గణపతి. ఇంద్రుడు, భగీరథుడు, శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, దమయంతి, సాంబుడు, ధర్మరాజు మొదలయిన వారు గణపతిని ఆరాధించినట్లు ఐతిహ్యాలున్నాయి. దేవతలకే పూజనీయుడైన గణపతి మనందరికీ కూడా ఆరాధనీయుడు కాబట్టి ఆయన ఆవిర్భవించిన వినాయక చవితినాడు ఎవరి శక్తికి తగ్గట్టు వారు పూజించి ఆయన కృపాకటాక్షాలతో విఘ్నాలను తొలగించుకుని సకల సంపదలనూ పొందవలసిందిగా శాస్త్రాలు చెబుతున్నాయి.



వినాయకుడికి, విద్యకు సంబంధం ఏమిటి?

చదువంటే గణపతికి ఇష్టం. నారదుడు, బృహస్పతి ద్వారా కేవలం అరవై నాలుగు రోజుల్లో విద్యలు నేర్చిన ఘనుడు. ఆయన సామర్థ్యం గురించి ఓ చిన్న ఇతివృత్తం ఉంది. వేద వ్యాసుడు భారతం రాయాలనుకున్నప్పుడు వేగంగా రాసే లేఖకుడు ఉంటే బావుండునని అనుకున్నాడట. గణపతి దగ్గరకు వచ్చాడట. 'లక్ష శ్లోకాలు చెబుతాను వేగంగా రాసిపెడతావా!' అని అడిగాడట.'అలాగే రాస్తాను కానీ, మీరు వెంట వెంటనే చెబుతుండాలి. చెప్పడం ఆపితే నేను మాయం అవుతా!' అన్నాడట గణపతి.

'సరే! నేను చెప్పే శ్లోకాలను అర్థం చేసుకుని రాయగలిగితే నేనూ వేగంగా చెబుతా!' అన్నాడట వ్యాసుడు. అలా సరస్వతి నది తీరాన మహాభారత రచన మొదలైంది. వ్యాసుడు ప్రతి వంద శ్లోకాల మధ్యలో అతి కఠినమైనవి చెబుతుండేవాడట. వినాయకుడు వాటిని అర్థం చేసుకుని రాసేలోపు మిగతా వంద గుర్తు తెచ్చుకునేవాడట. చివర్లో మరో పది శ్లోకాలు చెప్పాల్సి ఉండగా అనుకోకుండా వ్యాసుడి కవిత్వ ధార ఆగిపోయింది! తన నిబంధన ప్రకారం వినాయకుడు మాయమయ్యాడు. తన రచన ఆ మేరకు అసంపూర్ణంగా మిగిలిపోయిందని విచారించాడట వ్యాసుడు. సరే తానే రాస్తానని తాళపత్రాలు తీసి చూస్తే ఏముంది? ఆయన చెప్పాల్సిన పది శ్లోకాలు అక్కడే ఉన్నాయట. అంటే ఆ శ్లోకాలన్నీ విఘ్నాధిపతికి ముందే తెలిసుండాలి. అంటే వ్యాసుడు తన రచన ఎలా ముగిస్తాడో ముందుగానే వూహించాడు! వ్యాసుడు గణపతికి కృతజ్ఞతతో 'నీ పుట్టినరోజున పుస్తకాలను ఉంచి పూజించే విద్యార్థులు సర్వశుభాలూ పొందుతారు. వారికి సకల విద్యలు అబ్బుతాయి' అని ఆశీర్వదించాడట. నాటినుంచి వినాయక చవితినాడు చేసే పూజలో పిల్లలు తమ పుస్తకాలను, కలాలను ఉంచి, పుస్తకాలకు పసుపు కుంకుమలు అలంకరించి పూజించడం ఆచారంగా మారింది.

వినాయకుడినే మొదట ఎందుకు పూజించాలి?

ఏ పూజ చేసినా, తొలుత గణపతిని ప్రార్థించిన తర్వాతనే తక్కిన వారిని ఆరాధించాలని, లేకపోతే ఆ పూజ నిష్ఫలమవుతుందని, అదే గణపతిని పూజించినట్లయితే సిద్ధి బుద్ధితో బాటు క్షేమం, లాభం కూడా కలుగుతాయని స్వయంగా పార్వతీ పరమేశ్వరులే చెప్పినట్లు పురాణాలు చెబుతున్నాయి. అందుకనే ఏ కార్యాన్ని ప్రారంభించడానికయినా ముందుగా గణపతిని పూజించి, ఆ తర్వాతనే ఆ పనిని మొదలు పెట్టడం ఆచారంగా వస్తోంది.

వీటిలోని ఆంతర్యం ఇదే!

వినాయకుని నక్షత్రం 'హస్త'. ఈ నక్షత్రానికి అధిపతి చంద్రుడు. నవధాన్యాలలో చంద్రునికి బియ్యం. అందుకే బియ్యాన్ని భిన్నం చేసి, ఉండ్రాళ్లుగా తయారు చేసి చంద్ర నక్షత్రమైన హస్తా నక్షత్రంలో ఆవిర్భవించిన వినాయకునికి నివేదన చేస్తారు.

పత్రిపూజ: అదేవిధంగా వినాయకునిది కన్యారాశి. ఈ కన్యారాశికి అధిపతి బుధుడు. బుధునికి ఆకుపచ్చ రంగు ప్రీతికరమైనది. అందుకే వినాయక చవితి రోజున విఘ్నేశ్వరుని ఆకుపచ్చ రంగులో ఉన్న పత్రితో పూజ చేస్తారు.

మూషిక వాహనం: మూషికం అంటే ఎలుక వాసనామయ జంతువు. తినుబండారాల వాసనను బట్టి అది ఆ ప్రదేశానికి చేరుకుంటుంది. పంజరంలో చిక్కుకుంటుంది. ఆ విధంగానే మనిషి జన్మాంతర వాసనల వల్ల ఈ ప్రాకృతిక జీవితంలో చిక్కుకొని చెడు మార్గాలు పట్టినప్పుడు మూషిక వాహనుడుగా వాసనలను అనగా కోరికలను అణగద్రొక్కేవాడు – వినాయకుడు.



పాలవెల్లి అలంకరణమే ఒక చక్కని అనుభూతి. మొక్కజొన్న పొత్తులు, వెలగ, కమల మొదలైన పళ్ళు, కాయలు పాలవెల్లి నుండి వ్రేలాడదీసి, మామిడి తోరణాలు, చిన్న అరటి మొక్కలు మొదలైన వాటితో అలంకరించి సర్వసస్యాధిదేవునిగా సర్వ లోకేశ్వరునిగా వినాయకుని పూజిస్తారు. ఇంతకీ పాలవెల్లిని ఎందుకు కడతారంటే...

- గణపతి అంటే గణాలకు అధిపతి , తొలిపూజలందుకునే దేవత. మరి ఆ గణపతిని పూజించడం అంటే ముక్కోటి దేవతలనూ పూజించడమే కదా! ఆ దేవతలందరికీ సూచనగా పాలవెల్లిని నిలబెడుతున్నాం అన్నమాట.. అలా పాలవెల్లిని సమస్త దేవతలకూ ప్రతికగా భావించవచ్చు.
- పాలవెల్లి అంటే పాలపుంతే అని మరి అందులో నక్షత్రాలు ఏవి! అందుకే వెలగపండుని కడతాము. దాంతో పాటుగా మొక్కజొన్నపొత్తులు, మామిడి పిందెలు, జామ, మారేడు, దానిమ్మలాంటి పండ్లనీ కడతాము. ఇవన్నీ వివిధ ఖగోళ వస్తువులకు సూచన అన్నమాట.
- ఏ దేవతకైనా షోడశోపచార పూజలో భాగంగా ఛత్రాన్ని సమర్పించడం ఆనవాయితీ. కానీ వినాయకుడంటే సాక్షాత్తు ఓంకార స్వరూపుడు కదా! పైగా గాణపత్యం అనే శాఖ ప్రకారం ఆయనే ఈ ప్రపంచానికి అధిపతి. అలాంటి స్వామికి ఛత్రంగా ఆ పాలవెల్లిని అమర్చుతారు.

– డి.వి.ఆర్.

పచ్చగా నిను కొలిచేమయ్యా

చల్లగా చూడు మా బొజ్జ గణపయ్యా...

**వినాయక చవితి...
యువతరం గుండెల్లో పెట్టుకునే పండగ.
ఆనందం, ఆధ్యాత్మిక భావన...
వాడవాడల్లో నిండుగా వెలిగే పండగ.
కొంతకాలంగా 'పర్యావరణహితం' యూత్ ఎజెండాలో మొదటి వరుసలో చేరింది. రసాయన రహిత విగ్రహాలను కొనుగోలు చేయడానికే యువతరంలో ఎక్కువమంది ఇష్టపడుతున్నారు. కొందరు మరో అడుగు ముందుకు వేసి, మట్టితో విగ్రహాలను తయారు చేసి ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. పర్యావరణహిత సందేశానికి రెక్కలు ఇస్తున్నారు...**



వినాయక చవితి యువతరం సొంతం చేసుకునే పండగ. పండగ ముందు పందిరి గుంజలు పాతడం నుంచి నిమజ్జనం వరకు ప్రతిక్షణం ఆధ్యాత్మిక భావన, ఆనందం వారి సొంతం. అయితే గత కొద్దికాలంగా 'ఎకో–ఫ్రెండ్లీ గణేశ్ విగ్రహాల వైపు యూత్ మొగ్గు చూపుతోంది. వారిలో ఈ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది.

లక్నోలోని ఐటీ కళాశాల ముందు గత అయిదు సంవత్సరాలుగా వినాయకుడి విగ్రహాలను అమ్ముతున్నాడు ఆకాష్ కుమార్.

'గతంతో పోల్చితే మార్పు వచ్చిందనే చెప్పాలి. మట్టితో తయారు చేసిన గణేశుడి విగ్రహాలు కొనడానికి ప్రాధాన్యత ఇస్తున్న వారిలో యువత ఎక్కువ సంఖ్యలో ఉంది. కొద్దిపాటి కృత్రిమ రంగులు, ప్లాస్టిక్ అలంకరణను కూడా యువత ఇష్టపడడం లేదు' అంటున్నాడు ఆకాష్ కుమార్.

తనీష ఈసారి ఎకో–ఫ్రెండ్లీ గణేశుడి విగ్రహాన్ని కొనుగోలు చేసింది. గత సంవత్సరం కొనుగోలు చేసిన విగ్రహంతో పోల్చితే ఆకర్షణీయంగా లేకపోవచ్చుగాక, కాని తన మనసుకు మాత్రం తృప్తిగా ఉంది.

'ఆకర్షణీయమైన రసాయన రంగుల కంటే పర్యావరణం ముఖ్యం' అంటుంది తనీష.

మరో కస్టమర్ అనీష కూడా ఎకో–ఫ్రెండ్లీ విగ్రహాన్నే కొనుగోలు చేసింది.

'నేను కొనడమే కాదు, ఇతరులు కూడా కొనేలా నా వంతు ప్రచారాన్ని చేస్తున్నాను' అంటుంది అనీష.

సాధారణ విగ్రహాలతో పోల్చితే పర్యావరణహిత వినాయక విగ్రహాల ధర ఎక్కువగా ఉన్నప్పటికీ వాటిని కొనడానికి ఆసక్తి చూపడం విశేషం.

సాధారణంగా కోల్‌కతాలో మట్టితో తయారు చేసిన విగ్రహాలు ఎక్కువగా ఉంటాయి. ముంబైలో మాత్రం ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌ను ఉపయోగించి తయారు చేసే విగ్రహాలే ఎక్కువ.

అయితే బాంద్రాలోని పాలి హిల్‌కు చెందిన యువత మట్టిని ఉపయోగించి విగ్రహాలు తయారు చేయడమే కాదు, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, మట్టి విగ్రహాలకు మధ్య తేడా గురించి ప్రచారం చేస్తున్నారు.

'ఏదైనా మంచి విషయం చెబితే ఈ చెవిన విని ఆ చెవిన వదిలేస్తారు చాలామంది. కాని మేము చెప్పే విషయాలను చాలా ఆసక్తిగా వింటున్నారు. మార్పు వస్తుందనే నమ్మకం వచ్చింది' అంటున్నాడు మట్టితో వినాయక విగ్రహాలు తయారుచేసే సచిన్.

బాంద్రా నుంచి బెంగళూరు వచ్చేద్దాం.

బెంగళూరుకు చెందిన శ్రీ విద్యారణ్య యువక సంఘ, కర్ణాటక స్టేట్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్‌తో కలిసి ఔషధ గింజలతో కూడిన పదివేల మట్టి వినాయకుడి విగ్రహాలను పంపిణీ చేశారు.

జైపుర్‌కు చెందిన కెరీర్ కౌన్సెలర్ షల్లీ కపూర్ తన ఫ్రెండ్ శ్వేతతో కలిసి 'పర్యావరణహిత వినాయక చవితి' గురించి స్కూల్, కాలేజీలలో విస్తృతంగా ప్రచారం చేయడమే కాదు, మట్టితో చిన్న చిన్న వినాయక విగ్రహాలు ఎలా తయారు చేయాలో చేసి చూపిస్తుంది.

'మార్పు అనేది యువతరంతోనే మొదలవుతుందనే బలమైన నమ్మకం ఉంది. అందుకే ఈ ప్రయత్నం' అంటుంది శ్వేత.

'నేను సొంతంగా గణేశుడి విగ్రహాన్ని తయారు చేయడం సంతోషంగా అనిపించింది. వర్క్‌షాప్‌లో నేర్చుకున్న, విన్న విషయాలను తల్లిదండ్రులతో పంచుకున్నాను' అంటుంది అర్చనా గుప్తా.

పదిమంది నడిచే బాటే ఆ తరువాత ట్రెండ్ అవుతుంది.

యువతరంలో మొదలైన మార్పును చూస్తుంటే పర్యావరణహిత విగ్రహాలను ఇష్టపడే ధోరణి ట్రెండ్‌గా మారడానికి అట్టే కాలం పట్టకపోవచ్చు.





జిల్లేడు పూలు,
గణేశ్ నామ మాలతో వినాయకుడు



సహజసిద్ధమైన రంగులద్దుకున్న
మట్టి వినాయకుడు

వందనం గణేశా!

**'పండుగ వచ్చింది.
ఊరందరికీ పండుగ వచ్చింది.
మా బడికి ఒకరోజు ముందే
పండుగ వచ్చేసింది'.
గురుకుల పాఠశాల బాలికల సంబరం ఇది.
మట్టి గణేశుడిని తీర్చిదిద్దిన
చిట్టిచేతుల సంతోషం ఇది.
పండుగ పర్యావరణహితంగా ఉండాలనే
సందేశాన్ని వంద గణపతులతో చెప్తున్నారు.**



తాము తయారు చేసిన మట్టి వినాయకుడితో
పుదూరు గురుకుల పాఠశాల విద్యార్థినులు

తిరుపతి జిల్లా, నాయుడుపేట మండలం, పుదూరు గ్రామంలో ఉంది డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాల. వినాయక చవితి సందర్భంగా ఒక రోజు ముందు విగ్రహాల తయారీ మొదలైంది. మంగళవారం గణేశ విగ్రహాల వర్క్‌షాప్‌లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బాలికలు చిన్న చిన్న బృందాలుగా ఏర్పడి వంద విగ్రహాలకు రూపమిచ్చారు.

''బాదం ఆకులో వినాయకుడు, జిల్లేడు పూల దండల వినాయకుడు, దర్భల మాటున తొంగి చూస్తున్న వినాయకుడు, విష్ణుమూర్తిలా విశ్రాంతిగా పడుకున్న శయన వినాయకుడు... ఇలా రకరకాల రూపాల్లో గణేశుడిని తీర్చిదిద్దారు. నేరేడు ఆకులు, ఉమ్మెత్త, గరిక మామిడి తోరణాలతో మెరుగులు దిద్దారు. ఈ విగ్రహాల తయారీకి ఏ వస్తువునూ కొనలేదు. పాఠశాల ఆవరణలో ఉన్నవే. పిల్లలు స్వయంగా సేకరించారు. వినాయకుడి బొమ్మ చేయడానికి మట్టిని మూడు భాగాలుగా విభజించుకుని పెద్ద భాగాన్ని పొట్ట, చిన్న భాగాన్ని తల, మరో భాగాన్ని చేతులుగా, కాళ్లుగా అతికించడం వంటి ప్రధాన సూత్రం చెప్పి వదిలేశాం. ఎవరికి వాళ్లు తమ సృజనకి అనుగుణంగా గణేశుడికి రూపమిచ్చారు. సంతోషం ఏమిటంటే ఏ రెండు బొమ్మలూ ఒక నమూనాలో లేవు. స్టూడెంట్స్ ఎవరికి వాళ్లు మిగిలిన బొమ్మల కంటే తమ బొమ్మ ప్రత్యేకంగా ఉండాలని అప్పటికప్పుడు మార్పులు చేసుకుంటూ గణనాయకుని మూర్తిని తీర్చిదిద్దారు. బాల్యంలోనే పర్యావరణ పరిరక్షణ అనే బీజం పడితే జీవితాంతం వారిలో ఆ స్పృహ కొనసాగుతుంది. స్వయంగా బొమ్మ చేయడం వల్ల సృజనాత్మకతతోపాటు పిల్లల్లో నైపుణ్యాలు కూడా మెరుగవుతాయి. పద్నాలుగేళ్లుగా ఈ స్కూల్‌లో మట్టి గణపతులతో వర్క్‌షాప్ నిర్వహిస్తున్నాం. ఒక ఏడాది వెజిటబుల్ సీడ్ గణపతిని చేశాం. పండుగ తర్వాత ఆ గణపతి విగ్రహాలను కరిగించి కూరగాయల మడి చేశాం. ఈ ఏడాది 'మట్టి వినాయకుడిని పూజించండి– ప్రకృతిని కాపాడండి' అనే సందేశంతో వర్క్‌షాప్ నిర్వహించాం'' అని చెప్పారు గణిత ఉపాధ్యాయిని తన్నీరు శశి.

**ఆలోచనలు లలితం–
ఆచరణలో లాలిత్యం**

''పిల్లల మనసులు స్వచ్ఛంగా ఉంటాయి. వాళ్ల ఆలోచనలు కూడా లలితంగా ఉంటాయి. అందుకే వాళ్లు రూపొందించిన కళాకృతులలో ఆ లాలిత్యం ప్రతిబింబిస్తుంది. ఒకరితో ఒకరు కలిసిమెలసి చేయడంలో బాగా సంబరపడుతున్నారు. గురుకుల పాఠశాలలో పిల్లలు వాళ్ల తల్లిదండ్రులకు దూరంగా ఉంటారు. పండుగ రోజుల్లో వాళ్లకు అమ్మానాన్నలు మరీ మరీ గుర్తుకు వస్తుంటారు. ఇంటికి దూరంగా ఉన్నమనే బాధ ఉంటుంది. ఈరోజు అలాంటి భావన కలగనివ్వకుండా ఇంట్లో పండుగ చేసుకోవడానికంటే ఇంకా సంతోషంగా ఉన్నారు. వాళ్లు తయారు చేసిన బొమ్మలతో ఫొటోలు తీసుకుని పేరెంట్స్‌కి పంపిస్తున్నారు. ప్రతి బొమ్మనూ చేతులతోనే చేశారు. అచ్చులు వాడలేదు. అందుకే దేనికది విభిన్నంగా పద్మం, నెమలి, ఉండ్రాళ్లు ఇలా రకరకాలుగా... విద్యార్థుల సృజనాత్మకతకు ప్రతీకలుగా ఉన్నాయి. లీలాశ్రీ బృందం చేసిన బొమ్మను మార్కెట్‌లో కొనాలంటే కనీసం పన్నెండు వందలవుతుంది. మా స్టూడెంట్స్ తాము చేసిన బొమ్మలను టీచర్లకు కూడా బహూకరించారు'' అని చెప్పారు ప్రిన్సిపల్ పద్మజ.

ఆచరణాత్మక సందేశం

'మట్టి వినాయకుడిని పూజించండి– ప్రకృతిని కాపాడండి' అని సెలబ్రిటీలు నోటిమాటగా చెప్పడం కూడా సమాజాన్ని ప్రభావితం చేస్తుంది. అలాంటిది... స్వచ్ఛమైన మనసుతో లేత చేతులతో చేసిన మట్టి వినాయకుడి బొమ్మలు చూపిస్తూ ఈ బాలికలు ఇస్తున్న ఆచరణాత్మక సందేశం... సెలబ్రిటీల ప్రచారం కంటే ఎక్కువ ప్రభావితం చేసి తీరుతుంది.

– వాకా మంజులారెడ్డి



ప్రిక్వార్టర్స్‌లో ప్రణయ్

జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత అగ్రశ్రేణి ఆటగాడు ప్రణయ్ శుభారంభం చేశాడు. ప్రపంచ 12వ ర్యాంకర్ ఎన్జీ కా లాంగ్ అంగుస్ (హాంకాంగ్)తో మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రణయ్ గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. తొలి గేమ్‌లో ప్రణయ్ 11–10తో ఆధిక్యంలో ఉన్నపుడు లాంగ్ అంగుస్ గాయపడి మ్యాచ్ నుంచి వైదొలగడంతో ప్రణయ్‌ను విజేతగా ప్రకటించారు.


ప్రపంచ టేబుల్ టెన్నిస్ పోటీలకు శ్రీజ



వచ్చే నెలలో చైనాలో జరిగే ప్రపంచ టేబుల్ టెన్నిస్ (టీటీ) చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే భారత మహిళల జట్టులో తెలంగాణ ప్లేయర్, జాతీయ చాంపియన్ ఆకుల శ్రీజకు చోటు దక్కింది. స్టార్ ప్లేయర్ శరత్ కమల్ ఈ పోటీలకు దూరంగా ఉండనున్నాడు. పురుషుల జట్టులో సత్యన్, సానిల్ శెట్టి, హర్మీత్, మనుష్ షా, మానవ్ ఠక్కర్... మహిళల జట్టులో మనిక బత్రా, రీత్ రిష్యా, దియా చిటాలె, స్వస్తిక ఘోష్‌లకు స్థానం లభించింది.

‘లార్డ్స్’లో జులన్ వీడ్కోలు

- రిటైర్ కానున్న భారత బౌలింగ్ దిగ్గజం
- ఇంగ్లండ్‌తో చివరి వన్డేతో ముగింపు



బెంగళూరు: ‘చక్దా ఎక్స్‌ప్రెస్’ జులన్ గోస్వామి లార్డ్స్ మైదానంలో పరుగు ముగించనుంది. రెండు దశాబ్దాలకు పైగా భారత క్రికెట్‌కు మూలస్థంభంలా నిలిచిన పేస్ బౌలర్ జులన్ గోస్వామి ఇంగ్లండ్‌తో సిరీస్ తర్వాత రిటైర్ కానుంది. సెప్టెంబర్ 24న జరిగే మూడో వన్డే ఆమె కెరీర్‌లో చివరిది అవుతుంది. మార్చిలో జరిగిన వన్డే వరల్డ్‌కప్‌లో ఆడిన జులన్ పక్కటెముకల గాయంతో దక్షిణాఫ్రికాతో జరిగిన చివరి పోరులో బరిలోకి దిగలేకపోయింది. ఆ తర్వాత ఫిట్‌నెస్ సమస్యలతోనే శ్రీలంకతో సిరీస్‌కు దూరమైంది. అయితే జులన్‌లాంటి స్టార్‌కు గౌరవప్రదమైన వీడ్కోలు ఇవ్వాలని భావించిన బీసీసీఐ ఆమెను ఇప్పుడు ఇంగ్లండ్ పర్యటనకు ఎంపిక చేసింది. మహిళల వన్డేల్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా జులన్ ఆటకు తెర పడనుంది. 2002లో అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగు పెట్టిన 40 ఏళ్ల జులన్ 201 వన్డేల్లో 252 వికెట్లు, 68 టి20ల్లో 56 వికెట్లు తీసింది. మరో 12 టెస్టుల్లో 44 వికెట్లు కూడా పడగొట్టింది. ప్రస్తుత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 2009లో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసినప్పుడు ఆమె తొలి కెప్టెన్ జులన్ గోస్వామినే కావడం విశేషం. విజయంతో జులన్‌కు వీడ్కోలు పలుకుతామని హర్మన్ వ్యాఖ్యానించింది. ‘జులన్ చివరి మ్యాచ్‌కు నేను కెప్టెన్ కావడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నా. నేను వచ్చినప్పుడు ఆమెనుంచి ఎంతో నేర్చుకున్నాను. జులన్ స్థానాన్ని మరెవరూ భర్తీ చేయలేరు. ఆట పట్ల ఆమె అంకితభావం, పట్టుదల అసమానం. ప్రతీ మ్యాచ్‌లో బాగా ఆడేందుకు ఇప్పటికీ కొత్త ప్లేయర్‌గా ప్రతీరోజు 2–3 గంటలు బౌలింగ్ చేయడం మామూలు విషయం కాదు. ఆమె స్ఫూర్తితో ఎంతో మంది అమ్మాయిలు క్రికెట్‌లోకి వచ్చారు’ అని ఆమె తన గౌరవాన్ని ప్రదర్శించింది.

సెరెనా సాఫీగా...

- తొలి రౌండ్‌ను అలవోకగా దాటిన అమెరికా దిగ్గజం
- రెండో రౌండ్‌లో రెండో సీడ్ కొంటావీట్‌తో పోరు

న్యూయార్క్: కెరీర్‌లో చివరి గ్రాండ్‌స్లామ్ ఆడుతున్న అమెరికా మహిళా టెన్నిస్ దిగ్గజం సెరెనా విలియమ్స్ తొలి అడ్డంకిని సాఫీగా అధిగమించింది. యూఎస్ ఓపెన్ టోర్నీలో 40 ఏళ్ల సెరెనా రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టింది. భారత కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 605వ ర్యాంకర్ సెరెనా 6–3, 6–3తో ప్రపంచ 80వ ర్యాంకర్ డాంకా కొవినిచ్ (మోంటెనిగ్రో)పై గెలిచింది. 21వసారి యూఎస్ ఓపెన్‌లో ఆడుతున్న సెరెనా ఈ టోర్నీలో ఏనాడూ తొలి రౌండ్‌లో ఓడిపోలేదు. కొవినిచ్‌తో గంటా 40 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో సెరెనా తొమ్మిది ఏస్‌లు సంధించి, ఆరు డబుల్ ఫాల్ట్‌లు, 25 అనవసర తప్పిదాలు చేసింది. కొవినిచ్ సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసిన ఈ అమెరికా స్టార్ తన సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయింది. టెన్నిస్‌కు వీడ్కోలు పలికే సమయం ఆసన్నమైందని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్న సెరెనా తొలి రౌండ్ మ్యాచ్‌ను వీక్షించేందుకు కుటుంబసభ్యులతోపాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. భర్త అలెక్సిస్ ఒహానియన్, కూతురు ఒలింపియా, తల్లి ఒరాసిన్ ప్రైస్, సెరెనా సిస్టర్స్, అమెరికా మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్, బాక్సింగ్ దిగ్గజం మైక్ టైసన్, టెన్నిస్ దిగ్గజాలు బిల్లీజీన్ కింగ్, మార్టినా నవ్రతిలోవా తదితరులతోపాటు 29 వేల మంది ప్రేక్షకులు సెరెనా మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించారు. తొలి రౌండ్‌ను అధిగమించిన సెరెనాకు రెండో రౌండ్‌లో గట్టి ప్రత్యర్థి ఎదురుకానుంది. ప్రపంచ రెండో ర్యాంకర్, రెండో సీడ్ అనెట్ కొంటావీట్ (ఎస్తోనియా)తో సెరెనా తొలిసారి ఆడనుంది.

ఏడో సీడ్ హలెప్ అవుట్



మరోవైపు మహిళల సింగిల్స్‌లో ప్రపంచ మాజీ నంబర్‌వన్, ఏడో సీడ్ సిమోనా హలెప్ (రొమేనియా) తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టింది. క్వాలిఫయర్, ప్రపంచ 124వ ర్యాంకర్ దరియా స్నిగుర్ (ఉక్రెయిన్) 6–2, 0–6, 6–4తో హలెప్‌ను ఓడించి కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ విజయాన్ని నమోదు చేసుకుంది. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో ప్రపంచ నంబర్‌వన్ ఇగా స్వియాటెక్ (పోలాండ్) 6–3, 6–0తో జాస్మిన్ పావోలిని (ఇటలీ)పై, 2019 చాంపియన్ బియాంక ఆండ్రెస్కూ (కెనడా) 6–0, 3–6, 6–1తో హార్మనీ టాన్ (ఫ్రాన్స్)పై, గత ఏడాది రన్నరప్ లేలా ఫెర్నాండెజ్ (కెనడా) 6–3, 6–4తో ఒసీన్ డోడిన్ (ఫ్రాన్స్)పై, 12వ సీడ్ కోకో గాఫ్ (అమెరికా) 6–2, 6–3తో లియోలియా జీన్‌జీన్ (ఫ్రాన్స్)పై, ఐదో సీడ్ ఆన్స్ జబర్ (ట్యూనిషియా) 7–5, 6–2తో మాడిసన్ బ్రింగిల్ (అమెరికా)పై, 15వ సీడ్ బీట్రిజ్ హదద్ మాయ (బ్రెజిల్) 6–0, 6–0తో అనా కొంజు (క్రొయేషియా)పై గెలిచారు.



సెరెనా కూతురు ఒలింపియా, భర్త అలెక్సిస్

విజయానంతరం సెరెనా సంబరం

నాలుగో సీడ్ సిట్సిపాస్‌కు షాక్

పురుషుల సింగిల్స్‌లో నాలుగో సీడ్ సిట్సిపాస్ (గ్రీస్), పదో సీడ్ టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా) తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. డానియల్ ఇలాహి గలాన్ (కొలంబియా) 6–0, 6–1, 3–6, 7–5తో సిట్సిపాస్‌ను... బ్రాండన్ హోల్ట్ (అమెరికా) 6–7 (3/7), 7–6 (7/1), 6–3, 6–4తో ఫ్రిట్జ్‌ను ఓడించి రెండో రౌండ్‌కు చేరారు. మరో మ్యాచ్‌లో ఈ ఏడాది వింబుల్డన్ టోర్నీ రన్నరప్, ఆస్ట్రేలియా వివాదాస్పద ప్లేయర్ కిరియోస్ 6–3, 6–4, 7–6 (7/4)తో సహచరుడు కొకినాకిస్‌పై నెగ్గాడు.



సిట్సిపాస్



ముజీబ్

సూపర్‌-4కు అఫ్గానిస్తాన్

రెండో మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌పై విజయం

షార్జా: ఆసియా కప్ టి20 టోర్నీలో భాగంగా మంగళవారం బంగ్లాదేశ్‌తో జరిగిన గ్రూప్ ‘బి’ మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్ ఏడు వికెట్ల తేడాతో గెలిచింది. రెండు విజయాలతో అఫ్గానిస్తాన్ ‘సూపర్‌–4’ దశకు అర్హత సాధించిన తొలి జట్టుగా నిలిచింది. గురువారం శ్రీలంక, బంగ్లాదేశ్ జట్ల మధ్య మ్యాచ్‌లో గెలిచిన జట్టుకు ‘సూపర్‌–4’ రెండో బెర్త్ ఖరారవుతుంది. అఫ్గాన్‌తో మ్యాచ్‌లో మొదట బంగ్లాదేశ్ 20 ఓవర్లలో ఏడు వికెట్లకు 127 పరుగులు చేసింది. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ ముజీబ్ వుర్ రహ్మాన్ (3/16), రషీద్ ఖాన్ (3/22) తిప్పేశారు. ముసాదిక్ (31 బంతుల్లో 48 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. అనంతరం అఫ్గానిస్తాన్ 13 ఓవర్లలో 3 వికెట్లకు 62 పరుగులే చేసింది. లక్ష్యంలో సగం స్కోరైనా చేయలేదు. ఈ దశలో నజీబుల్లా (17 బంతుల్లో 43 నాటౌట్; 1 ఫోర్, 6 సిక్సర్లు) ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపించాడు. ఇబ్రహీమ్ (41 బంతుల్లో 42 నాటౌట్; 4 ఫోర్లు)తో కలిసి నాలుగో వికెట్‌కు 69 పరుగులు చేసి గెలిపించాడు.

ఐసీసీ టోర్నీల టీవీ హక్కులు ‘జీ’కి బదలాయింపు

- డిస్నీ–స్టార్ సంచలన నిర్ణయం
- ప్రసారాల్లో కొత్త ఒరవడి

న్యూఢిల్లీ: అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) నిర్వహించే టోర్నమెంట్‌లకు సంబంధించి భారత్‌లో టీవీ, డిజిటల్ ప్రసార హక్కులను మూడు రోజుల క్రితం సుమారు రూ. 24 వేల కోట్లకు డిస్నీ–స్టార్ సొంతం చేసుకుంది. అయితే మంగళవారం ఆ సంస్థ మరో అనూహ్య నిర్ణయం తీసుకుంది. క్రికెట్ మ్యాచ్ ప్రసారాల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది. తాము గెలుచుకున్న హక్కుల నుంచి టీవీ హక్కులు ‘జీ’ సంస్థకు (సబ్ లీజ్) బదలాయించింది. దీని ప్రకారం 2024–27 మధ్య కాలంలో ఐసీసీ పురుషుల క్రికెట్ టోర్నీలు, అండర్–19 టోర్నీలు ‘జీ’ చానల్స్‌లో ప్రసారం అవుతాయి. ఇదే కాలానికి డిజిటల్ హక్కులను మాత్రం స్టార్ తమ వద్దే అట్టిపెట్టుకుంది. మరోవైపు మహిళల వరల్డ్ కప్ హక్కులను (టీవీ, డిజిటల్) కూడా పూర్తిగా స్టార్ ఉంచుకుంది. వేలంలో తమతో పోటీ పడి ఓడిన ‘జీ’తో స్టార్ ఒప్పందం చేసుకోవడం విశేషం. భారత్‌లో టీవీ ప్రసారాల ద్వారా క్రికెట్ అభిమానులకు మరింత చేరువయ్యేందుకు ఇది తమకు లభించిన గొప్ప అవకాశమని ‘జీ’ సంస్థ సీఈఓ పునీత్ వ్యాఖ్యానించారు. ఒకే మార్కెట్‌ను ఇద్దరు పోటీదారులు పంచుకోవడం ఇదే మొదటిసారి. భారత్‌లో మ్యాచ్‌లకు సంబంధించి ఐసీసీ వేలం నిబంధనల్లో విజేత తమ హక్కులను మరొకరికి ఇచ్చుకోవచ్చనే క్లాజ్ కూడా ఉంది. దీనిని బట్టి చూస్తే వేలం ఖాయం కావడానికి ముందే స్టార్–జీ మధ్య ఒప్పందం జరిగి ఉండవచ్చని తెలుస్తోంది.


భారీ విజయమే లక్ష్యంగా...

- నేడు హాంకాంగ్‌తో భారత్ పోరు
- రాత్రి గం.7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్–1లో ప్రత్యక్ష ప్రసారం



దుబాయ్: హోరాహోరీగా సాగిన పోరులో పాకిస్తాన్‌ను ఓడించిన భారత జట్టు పసికూనతో తర్వాతి మ్యాచ్‌కు సిద్ధమైంది. ఆసియా కప్ టి20 టోర్నీలో భాగంగా గ్రూప్ ‘ఎ’ లీగ్ మ్యాచ్‌లో నేడు హాంకాంగ్‌తో భారత్ తలపడుతుంది. ఏ రకంగా చూసినా టీమిండియాతో పోలిస్తే కనీస పోటీ ఇచ్చే స్థాయిలో కూడా ప్రత్యర్థి జట్టు లేదు. సరిగ్గా చెప్పాలంటే నెట్స్‌లో కాకుండా మైదానంలో భారత్‌కు ఇది ప్రాక్టీస్ మ్యాచ్‌లాగా భావించవచ్చు. టాప్‌–3 రోహిత్, రాహుల్, కోహ్లి దూకుడుగా ఆడి లయ అందుకునేందుకు ఈ మ్యాచ్ అవకాశం కల్పిస్తోంది. గత మ్యాచ్‌లో తొలి బంతికే అవుటైన రాహుల్ కొద్దిసేపు క్రీజ్‌లో నిలిచేందుకు ఇది సరైన వేదిక. తొలి మ్యాచ్ ఫలితాన్ని బట్టి చూస్తే తుది జట్టులో మార్పులు ఉండరాదు. అయితే కెప్టెన్ రోహిత్ శర్మ తరచూ ప్రయోగాలు కొనసాగిస్తామని చెబుతున్నాడు కాబట్టి స్వల్ప మార్పులతో ఇతరులకు అవకాశం కల్పిస్తారా చూడాలి. పాక్‌తో మ్యాచ్‌లో కీపర్‌గా పంత్‌కు బదులు దినేశ్ కార్తీక్‌కు అవకాశం ఇవ్వడం ఆశ్చర్యం కలిగించింది. అదే కొనసాగిస్తారా లేక ఈ సారి పంత్‌ను ఆడిస్తారా అనేది ఆసక్తికరం. బౌలింగ్‌లో అవేశ్‌కు బదులుగా స్పిన్నర్లు అశ్విన్, రవి బిష్ణోయ్‌లలో ఒకరికి అవకాశం దక్కవచ్చు. ఓవరాల్‌గా భారత జట్టు ఫలితంపైనే కాకుండా వ్యక్తిగత ప్రదర్శనలపైన కూడా దృష్టి పెట్టింది.

మరోవైపు ఎక్కువగా భారత్, పాకిస్తాన్‌ల నుంచి వలస వచ్చిన వారితోనే హాంకాంగ్ జట్టు నిండి ఉంది. ఇరు జట్లు ఇప్పటి వరకు టి20ల్లో తలపడలేదు. రెండుసార్లు వన్డేల్లో ఆడగా రెండూ భారత్ గెలిచింది. అయితే 2018లో ఇదే ఆసియా కప్‌లో జరిగిన మ్యాచ్‌లో భారత్ విధించిన 286 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో చేరువగా వచ్చి 26 పరుగులతో ఓడింది. కొంత కాలంగా వరుసగా నమీబియా, ఉగాండా, జెర్సీలాంటి జట్లతోనే తలపడుతూ వచ్చిన హాంకాంగ్‌కు ప్రస్తుతం భారత్‌ను ఎదుర్కోవడమే వారికి లభించిన పెద్ద అవకాశం. హాంకాంగ్ విజయావకాశాలు కెప్టెన్ నిజాకత్ ఖాన్, బాబర్ హయత్, కించిత్ షా, ఆయుష్ శుక్లాలపై ఆధారపడి ఉన్నాయి.



వినాయకచవితి



● శ్రీ వినాయక విజయం



● భూకైలాస్




● దేవదాస్





● కూలీ నెం.1



● దేవుళ్ళు

వెండితెర వినాయకుడు

వినాయకుడు.. విఘ్నాధిపతి.. గణనాథుడు.. బొజ్జ గణపయ్య.. ఏకదంతుడు.. ఇలా ఏ పేరుతో స్వామిని కొలిచినా సకల విఘ్నాలు తొలగి జయం చేకూరుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అలాంటి వినాయకుడికి తెలుగు సినిమాల్లోనూ ప్రత్యేక స్థానం ఉంది. విఘ్నేశ్వరుడి నేపథ్యంలో ఎన్నో సినిమాలు వచ్చి, విజయాలు సాధించాయి. మరెన్నో చిత్రాల్లో స్వామిని కీర్తిస్తూ వచ్చిన సన్నివేశాలు, పాటలు కూడా ప్రేక్షకులను అలరించాయి. గణనాథుడి నేపథ్యంలో వచ్చిన కొన్ని సినిమాలు, పాటలపై ఓ లుక్కేద్దాం..

వినాయక చవితి

వినాయక చవితి రోజున వినాయక వ్రత కథ చదువుకుని, పూజ చేసుకోవడం ఆనవాయితీ. ఈ కథ ఆధారంగా సముద్రాల రాఘవాచార్య దర్శకత్వం వహించిన చిత్రం ‘వినాయక చవితి’. ఎన్టీఆర్, జమున, కృష్ణకుమారి, గుమ్మడి, రాజనాల తదితరులు నటించారు. కె. గోపాలరావు నిర్మించిన ఈ సినిమా 1957 ఆగస్టు 22న విడుదలైంది. ఇక ఈ చిత్రకథ విషయానికి వస్తే.. వినాయక చవితి నాడు శ్రీకృష్ణుడు పాలలో చంద్రుణ్ణి చూడటంవల్ల సత్రాజిత్తు సంపాదించిన శమంతకమణిని అపహరించాడన్న అపఖ్యాతి మూట గట్టుకుంటాడు. ఆ తర్వాత వినాయక వ్రతం ఆచరించి, నిర్దోషిగా తనను తాను నిరూపించుకుని బయటపడతాడు. అందరూ చవితి నాడు వినాయక వ్రతం ఆచరిస్తే, ఆ గజానుని ఆశీస్సులతో ఎలాంటి నీలాప నిందలపాలు కాకుండా ఉంటారనే కథతో ‘వినాయక చవితి’ చిత్రాన్ని రూపొందించారు. ఈ చిత్రం విడుదలై 65 ఏళ్లు అయింది.

భూ కైలాస్

పరమశివుని భక్తుడైన రావణాసురుడు తన తల్లి కోరిక మేరకు శివుని ఆత్మలింగం తెస్తానని శపథం చేసి తపస్సుకు వెళ్తాడు. ఆత్మలింగం సాధించి, అమరత్వం పొందాలన్నది రావణాసురుడి కోరిక. ఆయన తపస్సును మెచ్చుకున్న శివుడు ఆత్మలింగం ఇస్తూ, దీన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ నేలపై పెట్టకూడదని షరతు విధిస్తాడు. రావణాసురుడికి అమరత్వం వస్తే భూ మండలాన్ని సర్వనాశనం చేస్తాడని భావించిన నారదుడు ఆత్మలింగం లంకకు చేరకుండా అడ్డుకోవాలని వినాయకుణ్ణి ప్రార్థిస్తాడు. రావణాసురుడు సంధ్యా వందనం చేసే సమయంలో శివుడి ఆత్మలింగం రావణుడి పాలు కాకుండా చేస్తాడు వినాయకుడు. చివరకు ఆత్మార్పణకు సిద్ధపడిన రావణాసురుణ్ణి కైలాసపతి కరుణించి, ఆ ప్రదేశం ‘భూకైలాసం’గా మారుతుందని చెప్పి అనుగ్రహించడంతో కథ ముగుస్తుంది. ఎన్టీఆర్ రావణునిగా, ఏఎన్నార్ నారదుడిగా నటించిన ‘భూ కైలాస్’ చిత్ర కథ ఇది. కె. శంకర్ దర్శకత్వంలో ఏవీఎం సంస్థ నిర్మించిన ఈ సినిమా 1958 మార్చి 20న రిలీజైంది.

జై జై గణేశా...

తెలుగు సినిమాల్లో గణనాథుణ్ణి కీర్తిస్తూ ఎన్నో పాటలు వచ్చాయి. ఎన్టీఆర్, కృష్ణ హీరోలుగా తెరకెక్కిన ‘దేవుడు చేసిన మనుషులు’ సినిమాలో ‘దేవుడు చేసిన మనుషుల్లారా..’ అనే పాట వినాయక నిమజ్జనం నేపథ్యంలో సాగుతుంది. వెంకటేష్ నటించిన ‘కూలీ నెంబర్ 1’ సినిమాలోని ‘దండాలయ్యా ఉండ్రాలయ్యా..’ పాట ఇప్పటికీ ప్రతి వినాయక మండపంలో వినిపిస్తూ ఉంటుంది. చిరంజీవి హీరోగా తెరకెక్కిన ‘జై చిరంజీవ’ సినిమాలో ‘జై జై గణేశా.. జై కొడత గణేశా..’ పాట సూపర్‌హిట్‌గా నిలిచింది. బాలకృష్ణ ‘డిక్టేటర్’ మూవీలోని ‘గం గం గణేశా..’ అనే పాట కూడా ఆకట్టుకుంది. ‘దేవుళ్లు’ సినిమాలోని ‘జయ జయ శుభకర వినాయక..’ పాటని ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అద్భుతంగా పాడారు. మహేశ్‌బాబు ‘పోకిరి’ సినిమాలోని జగడమే పాటలో ‘గణపతి బప్పా మోరియా..’ అంటూ వచ్చే బిట్ సూపర్‌గా ఉంటుంది. రామ్ ‘గణేష్’ మూవీలో వినాయకుడిపై ఒక పాట ఉంది. ‘దేవదాస్’ సినిమాలో నాగార్జున, నాని వినాయకుణ్ణి కీర్తిస్తూ పాడే పాట పాపులర్ అయింది. నాని ‘భలే భలే మగాడివోయ్’, రవితేజ ‘పవర్’ సినిమాల్లో వినాయక చవితి ప్రస్తావన ఉంది. ఇవే కాదు.. మరికొన్ని సినిమాల్లోనూ గణేశుణ్ణి కీర్తిస్తూ పాటలున్నాయి.

శ్రీ వినాయక విజయం

వినాయకుడి జీవిత చరిత్రపై తెలుగులో పూర్తి స్థాయిలో వచ్చిన చిత్రం ‘శ్రీ వినాయక విజయం’. కమలాకర కామేశ్వరరావు దర్శకత్వం వహించిన ఈ సినిమాలో కృష్ణంరాజు, వాణిశ్రీ శివపార్వతులుగా నటించారు. శివదీక్షా వ్రతాన్ని ఆచరించడానికి పూనుకుని స్నానమాచరించబోతూ పిండితో ఒక బాలుని బొమ్మ తయారు చేసి, దానికి ప్రాణం పోసి, కాపలాగా ఉంచుతుంది పార్వతీదేవి. అప్పుడు వచ్చిన శివుణ్ణి లోనికి అనుమతించడు ఆ బాలుడు. ఆగ్రహించి బాలుని శిరస్సు ఖండిస్తాడు శివుడు. దీంతో పార్వతి తన బిడ్డను ఎలాగైనా బతికించమని శివుణ్ణి కోరుతుంది. ఆ బాలునికి ఏనుగు తలను అమర్చి ప్రాణం పోస్తాడు శివుడు. ఆ బాలుడు మూషికాసురున్ని సంహరించిన తీరు, మూషికాసురుని జన్మ వృత్తాంతం వంటి ఎన్నో విషయాలను ఈ సినిమాలో చూపించారు. 1979 డిసెంబరు 22న ఈ చిత్రం విడుదలైంది.

సినిమా

కొత్త తేదీ ఖరారు

సత్యదేవ్, తమన్నా జంటగా మేఘా ఆకాష్, కావ్యా శెట్టి, ప్రియదర్శి ముఖ్య తారలుగా నాగశేఖర్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం ‘గుర్తుందా...శీతాకాలం’. ఎమ్‌ఎస్ రెడ్డి, చినబాబు సమర్పణలో భావనా రవి, నాగశేఖర్, రామారావు చింతపల్లి నిర్మించిన చిత్రం ఇది. ఈ సినిమా సెప్టెంబర్ 9న విడుదల కావాల్సింది. అయితే తాజాగా కొత్త తేదీని ఖరారు చేశారు. ఈ సినిమాను సెప్టెంబరు 23న విడుదల చేస్తున్నట్లు చిత్ర యూనిట్ మంగళవారం ప్రకటించింది. ‘‘ప్రతి ఒక్కరూ వారి జీవితాల్లోని టీనేజ్, కాలేజ్ లైఫ్ సంఘటనలను అంత ఈజీగా మర్చిపోలేరు. ఈ విషయాలనే ఈ సినిమాలో చూపించాం. కన్నడ హిట్ ఫిల్మ్ ‘లవ్ మాక్‌టైల్’కు తెలుగు రీమేక్‌గా ‘గుర్తుందా.. శీతాకాలం’ రూపొందింది’’ అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: కాలభైరవ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: నవీన్ రెడ్డి.



● తమన్నా, సత్యదేవ్



● బాపినీడు, బీవీఎస్ఎన్ ప్రసాద్, వరుణ్ తేజ్, వైష్ణవ్ తేజ్, కేతిక, సాయిధరమ్ తేజ్, గిరీశాయ

హెల్మెట్ ధరించండి - సాయిధరమ్ తేజ్

‘‘రంగ రంగ వైభవంగా’ హిట్ అవుతుందా? బ్లాక్ బస్టర్ అవుతుందా? అనేది నాకు తెలియదు. కానీ నా తమ్ముణ్ణి (వైష్ణవ్ తేజ్) మీరు(ప్రేక్షకులు) హీరోగా యాక్సెప్ట్ చేశారు. అదే నా బిగ్గెస్ట్ సక్సెస్’’ అని హీరో సాయిధరమ్ తేజ్ అన్నారు. వైష్ణవ్ తేజ్, కేతికా శర్మ జంటగా గిరీశాయ దర్శకత్వంలో రూపొందిన చిత్రం ‘రంగ రంగ వైభవంగా..’. బి.బాపినీడు సమర్పణలో బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబరు 2న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో **సాయిధరమ్ తేజ్ మాట్లాడుతూ–** ‘‘మళ్లీ ఇలా స్టేజ్‌పైకి వస్తానని ఊహించలేదు. నేను బైక్ ప్రమాదానికి గురైనప్పుడు హెల్మెట్ ధరించడం వల్లే బతికాను. మీరు కూడా బైక్‌పై వెళ్లేటప్పుడు కచ్చితంగా హెల్మెట్ ధరించండి. వైష్ణవ్ తేజ్ తొలి చిత్రం ‘ఉప్పెన’ హిట్ అవడంతో ఆనందపడ్డాం. నా ‘రిపబ్లిక్’ సినిమా రిలీజ్‌కు రెడీ అవుతున్న టైమ్‌లో సెప్టెంబరు 10న నాకు బైక్ ప్రమాదం జరిగింది. హాస్పిటల్‌లో పడుకుని ఉన్నప్పుడు నా తమ్ముడు వచ్చి ‘అన్నా..’ అని నన్ను పిలిస్తే పలకలేకపోయాను(భావోద్వేగంతో..). ఆ సమయంలో అమ్మ, నాన్న, నా తమ్ముడు నాతో ఉన్నారు. వైష్ణవ్ నా పక్కన ఉంటే నాకు ధైర్యం. వీడు నా బలం. సెప్టెంబరు 2న నా గురువుగారి (పవన్‌కల్యాణ్‌ను ఉద్దేశిస్తూ..) బర్త్ డే. ఈ సినిమా చూసి గురువుగారి బర్త్ డే చేసుకోండి’’ అన్నారు. **హీరో వరుణ్ తేజ్ మాట్లాడుతూ –** ‘‘పెదనాన్న (చిరంజీవి), బాబాయ్(పవన్ కల్యాణ్) మాకు చెప్పింది ఒక్కటే.. ‘నీ కష్టాన్ని నువ్వు నమ్ముకో అని’. మూడు సినిమాలు చేసినా వైష్ణవ్ తన కష్టాన్నే నమ్ముకున్నాడు’’ అన్నారు. ‘‘గిరిగారు కథ చెప్పినప్పుడు చాలా ఎగ్జైట్ అయ్యాను’’ అన్నారు **వైష్ణవ్‌తేజ్.** ‘‘వైష్ణవ్‌గారు సెట్స్‌లో నాకు ఇచ్చిన రెస్పెక్ట్‌కి నా పదిహేనేళ్ల కష్టాన్ని మర్చిపోయాను’’ అన్నారు గిరీశాయ. ‘‘మెగా హీరోలతో నేను చేసిన సినిమాలన్నీ హిట్స్ సాధించాయి. ఈ సినిమా కూడా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది’’ అన్నారు **బీవీఎస్ఎన్ ప్రసాద్.** నటులు అలీ, నాగినీడు, కెమెరామేన్ శ్యామ్‌దత్ పాల్గొన్నారు.

క్రైమ్ థ్రిల్లర్



● కార్తీక్ రాజు, రవితేజ, సిమ్రాన్

కార్తీక్ రాజు హీరోగా, సిమ్రాన్ చౌదరి, ఐరా హీరోయిన్లుగా మహేష్ రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం ‘అథర్వ’. నూతలపాటి నరసింహం, అనసూయమ్మ సమర్పణలో సుభాష్ నూతలపాటి నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఏకకాలంలో రూపొందుతోన్న ఈ సినిమా తెలుగు టైటిల్ లోగో, మోషన్ పోస్టర్‌ని హీరో రవితేజ విడుదల చేశారు. ‘‘క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందుతోన్న చిత్రమిది. ఇప్పటివరకు వచ్చిన ఈ జానర్ సినిమాలతో పోల్చితే మా సినిమా ప్రేక్షకులకు వైవిధ్యమైన అనుభూతిని పంచుతుంది. శ్రీ చరణ్ పాకాల అద్భుతమైన బాణీలు అందించారు’’ అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: చరణ్ మాధవనేని, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: విజయ, ఝాన్సీ.

ఈ సినిమాతో నాకో జీవితం కనపడింది - కమలాక్షి

తేజ్ కూరపాటి, అఖిల ఆకర్షణ జంటగా వెంకట్ వందెల దర్శకత్వంలో ముల్లేటి నాగేశ్వరరావు నిర్మాణ సారథ్యంలో ముల్లేటి కమలాక్షి, గుబ్బల వెంకటేశ్వరరావు నిర్మించిన చిత్రం ‘నా వెంట పడుతున్న చిన్నాడెవడమ్మా’. ఈ సినిమా సెప్టెంబరు 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్‌కు ముఖ్య అతిథులుగా దర్శకులు కోదండ రామిరెడ్డి, సాగర్, ప్రొడ్యూసర్ కౌన్సిల్ సెక్రటరీ ప్రసన్నకుమార్ హాజరయ్యారు. కోదండ రామిరెడ్డి మాట్లాడుతూ – ‘‘మంచి కథతో వస్తున్న ఈ సినిమా నిర్మాతలకు బిగ్ హిట్ అవ్వాలి’’ అన్నారు. ‘‘నడవలేక ఇబ్బందిపడుతున్నప్పటికీ సినిమా తీయాలనే తపనను మా నాన్నలో చూశాను నేను. అందుకే ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని ఈ సినిమాతో నిర్మాతగా పరిచయమవుతున్నాను. ఈ ఒక్క సినిమాతో నాకు ఓ జీవితం కనపడింది. సినిమా చేయడం ఎంత కష్టమో తెలిసింది’’ అన్నారు నిర్మాత ముల్లేటి కమలాక్షి. ‘‘మంచి కథతో వస్తున్న ఈ సినిమాను ప్రేక్షకులు ఆదరించాలని కోరుకుంటున్నాను’’ అన్నారు దర్శకుడు వెంకట్. ‘‘ఈ సినిమాతో సోలో హీరోగా పరిచయం అవుతున్నందుకు సంతోషంగా ఉంది’’ అన్నారు తేజ్ కూరపాటి.



● అఖిల, కోదండ రామిరెడ్డి, వెంకట్, కమలాక్షి, ప్రసన్నకుమార్

సాక్షి బిజినెస్
బుధవారం
31-8-2022

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
1564	446
59,537	17,759

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి


విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 ముగింపు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	11,814	▽	205
డోజోన్స్	31,762	▽	337
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,362	▽	66
డాక్స్	12,961	△	68
షాంఘై	3,227	▽	14
నికాయ్	28,196	△	317

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఐశ్వర్యంలో అదానీ నంబర్-3

ప్రపంచ కుబేరుల్లో మూడో స్థానానికి • ఆసియాలో తొలి వ్యక్తిగా రికార్డు



న్యూఢిల్లీ: అదానీ గ్రూపు అధినేత గౌతమ్ అదానీ.. సంపద సృష్టిలో వాయువేగంతో దూసుకుపోతున్నారు. తాజాగా ఆయన ప్రపంచంలోనే మూడో అత్యంత సంపన్నుడిగా అవతరించారు. బ్లూంబర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ రియల్‌టైమ్ డేటా ప్రకారం.. గ్రూపు కంపెనీల్లో అదానీకి ఉన్న వాటాల రోజువారీ మార్కెట్ విలువ ఆధారంగా ఈ స్థానానికి చేరుకున్నారు. అంతేకాదు, ప్రపంచంలో టాప్-3 సంపన్నుల్లో ఒక ఆసియా వ్యక్తి చోటు సంపాదించడం ఇదే తొలిసారి. ఇటీవలి వరకు దేశీయంగానే కాకుండా, ఆసియాలోనూ కుబేరుడిగా కొనసాగిన రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ, చైనాకు చెందిన అలీబాబా గ్రూపు చీఫ్ జాక్‌మాకు సైతం ఇది సాధ్యపడలేదు. 137.4 బిలియన్ డాలర్ల నెట్‌వర్త్‌తో గౌతమ్ అదానీ ఫ్రాన్స్‌కు చెందిన బెర్నార్డ్ ఆర్నాల్ట్‌ను అధిగమించారు. ఇక ఇప్పుడు అమెరికాకు చెందిన టెస్లా చీఫ్ ఎలాన్ మస్క్ (251 బిలియన్ డాలర్లు), అమెజాన్ అధినేత జెఫ్ బెజోస్ (సుమారు 153 బిలియన్ డాలర్లు) తర్వాతి స్థానంలోకి వచ్చేశారు. అదానీ వేగం చూస్తుంటే, అమెజాన్ జెఫ్ బెజోస్‌ను సైతం వెనక్కి నెట్టేసే రోజు ఎంతో దూరంలో లేదని తెలుస్తోంది. బెర్నార్డ్ ఆర్నాల్ట్ 136 బిలియన్ డాలర్లతో నాలుగో స్థానానికి పరిమితం అయ్యారు. 117 బిలియన్ డాలర్లతో బిల్‌గేట్స్ ఐదో స్థానంలో ఉన్నారు. ముకేశ్ అంబానీ 91.9 బిలియన్ డాలర్ల నెట్‌వర్త్‌తో ప్రపంచ కుబేరుల్లో 11వ స్థానంలో ఉన్నారు.

వేగంగా వ్యాపారాల విస్తరణ

గౌతమ్ అదానీ (60) వ్యాపార విస్తరణలో చాలా దూకుడుగా వ్యవహరిస్తుండడం, ఆయన కంపెనీల మార్కెట్ విలువకు పెరుగుదలకు మద్దతుగా నిలుస్తోంది. ముఖ్యంగా 2020 తర్వాత అదానీ కంపెనీలు భారీ ర్యాలీ చేశాయి. దీంతో ఆయన నెట్‌వర్త్ (వాటాల విలువ/సంపద విలువ) రాకెట్లా దూసుకుపోయింది. బొగ్గు వ్యాపారం, విద్యుత్ ఉత్పత్తి, విద్యుత్ పంపిణీ, పోర్ట్‌లు, గ్యాస్ పంపిణీ, ఎయిర్‌పోర్ట్‌లు, డేటా సెంటర్లు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, రక్షణ ఉత్పత్తుల తయారీ, సోలార్ ప్యానెల్స్ తయారీ, గ్రీన్ ఎనర్జీ, అల్యూమినియం, స్టీల్, కెమికల్స్ ఇలా అడుగు పెట్టని చోటు అంటూ లేదనే విధంగా గౌతమ్ అదానీ నూతన వ్యాపారాల్లోకి ప్రవేశిస్తున్నారు. ప్రధానంగా రుణాలతో ఆయన వ్యాపారాన్ని విస్తరిస్తుండడం గమనార్హం. అధిక రుణాలు ఒత్తిళ్లకు దారితీయవచ్చనే అభిప్రాయాన్ని పలు రేటింగ్ సంస్థలు ఇటీవలే వ్యక్తం చేశాయి.

2030 నాటికి 5 కోట్ల ఈవీలు

- చార్జింగ్ సదుపాయాలకు భారీ డిమాండ్
- దేశీ మార్కెట్‌పై కేపీఎంజీ అంచనా



న్యూఢిల్లీ: భారత రహదారులపై ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీలు) 2030 నాటికి 5 కోట్లకు చేరుకుంటాయని కన్సల్టెన్సీ సంస్థ కేపీఎంజీ అంచనా వేసింది. చార్జింగ్ ఎకోసిస్టమ్ ఏర్పాటు చేసే సంస్థలకు అపార అవకాశాలున్నాయని పేర్కొంది. ప్రస్తుతం మొత్తం వాహనాల్లో ఈవీల వాటా 1%గానే ఉన్నప్పటికీ.. డిమాండ్, సరఫరా, నియంత్రణ పరమైన సానుకూలతలు ఉన్నట్టు తెలిపింది. 'ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ – తదుపరి భారీ అవకాశాలు' పేరుతో కేపీఎంజీ ఓ నివేదిక విడుదల చేసింది. 'దేశీ ఎలక్ట్రిక్ వాహన రంగం వేగంగా వృద్ధి చెందుతోంది. ఈవీ ప్రధాన విభాగంగా అవతరిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో ఈవీల విక్రయాలు 3 రెట్లు పెరగడమే ఇందుకు నిదర్శనం. 2022 మార్చికి భారత రోడ్లపై ఈవీల సంఖ్య 10 లక్షలు దాటింది. ఈ సంఖ్య 2030 నాటికి 4.5–5 కోట్లకు చేరుతుంది. ఇది చార్జింగ్ సదుపాయాలకు భారీ డిమాండ్‌ను తెస్తుంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 1,700 బహిరంగ చార్జింగ్ స్టేషన్ల వరకే అందుబాటులో ఉన్నాయి. ఈవీల వృద్ధికి ఈ సంఖ్య ఏ మాత్రం చాలదు''అని కేపీఎంజీ నివేదిక తెలిపింది.

బులియన్ రూ.లలో



ముంబై			
బంగారం (99.9 స్వచ్ఛత)	51,188	▼	77
బంగారం (99.5 స్వచ్ఛత)	50,983	▼	77
వెండి (కిలో)	54,350	▲	34

బుల్ బౌన్స్ బ్యాక్



- ఈ ఏడాదిలో రెండో అతిపెద్ద ర్యాలీ
- సెన్సెక్స్ లాభం 1564 పాయింట్లు
- 446 పాయింట్లు పెరిగిన నిఫ్టీ
- రూ.5.68 లక్షల కోట్ల సంపద సృష్టి

ముంబై: బుల్ బౌన్స్‌బ్యాక్ ర్యాలీతో స్టాక్ సూచీలు క్రితం రోజు భారీ నష్టాల నుంచి బలంగా పుంజుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల రికవరీతో ఇన్వెస్టర్లు దిగువ స్థాయిలో కొనుగోళ్లకు మొగ్గుచూపారు. ఫలితంగా బెంచ్‌మార్క్ సూచీలు మంగళవారం ఈ ఏడాదిలో రెండో అతిపెద్ద లాభాన్ని ఆర్జించాయి. సెన్సెక్స్ 1,564 పాయింట్లు లాభపడి 59,537 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 446 పాయింట్లు పెరిగి 17,759 వద్ద నిలిచింది. సెన్సెక్స్‌లోని 30 షేర్లూ, నిఫ్టీలోని 50 షేర్లూ లాభపడ్డాయి. విస్తృత స్థాయి మార్కెట్లో చిన్న, మధ్య తరహా షేర్లు రాణించడంతో బీఎస్‌ఈ మిడ్, స్మాల్‌క్యాప్ ఇండెక్స్‌లు 2%, ఒకటిన్నర శాతం పెరిగాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.4166 కోట్ల షేర్లు కొన్నారు. దేశీయ ఇన్వెస్టర్లు రూ.657 కోట్ల షేర్లను అమ్మేశారు. క్రూడాయిల్ ధరలు దిగిరావడంతో డాలర్ మారకంలో రూపాయి విలువ 39 పైసలు బలపడి రెండు వారాల గరిష్టం 79.52 వద్ద స్థిరపడింది.

ఆద్యంతం కొనుగోళ్ల పర్వం

ప్రపంచ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు అందుకున్న దేశీయ మార్కెట్ ఉదయం లాభంతో మొదలైంది. సెన్సెక్స్ 287 పాయింట్లు ఎగసి 58,260 వద్ద, నిఫ్టీ 102 పాయింట్లు పెరిగి 17,415 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. అన్ని రంగాల షేర్లలో కొనుగోళ్ల పర్వం కొనసాగడంతో ట్రేడింగ్ గడిచే కొద్ది సూచీలు లాభాలను గడించసాగాయి. ఒక దశలో సెన్సెక్స్ 1627 పాయింట్లు దూసుకెళ్లి 52,792 59,600, నిఫ్టీ 465 పాయింట్లు పెరిగి 17,778 వద్ద ఇంట్రాడే గరిష్టాలను నమోదుచేశాయి. సెన్సెక్స్ దాదాపు మూడుశాతం ర్యాలీతో స్టాక్ మార్కెట్లో రూ.5.68 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.280 లక్షల కోట్లకు చేరింది. వినాయక చవితి సందర్భంగా బుధవారం బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈ ఎక్స్ఛేంజీలు పనిచేయవు. అయితే కమోడిటీ, ఫారెక్స్ మార్కెట్లు ఉదయం సెషన్‌లో మాత్రమే సెలవును పాటిస్తాయి. సాయంత్రం సెషన్‌లో ట్రేడింగ్ జరుగుతుంది.

లాభాలు ఇందుకే..

- అధిక వెయిటేజీ బ్యాంకింగ్, ఆర్థిక షేర్లు రాణించి సూచీల ర్యాలీకి మద్దతుగా నిలిచాయి. హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం, బజాజ్ ఫైనాన్స్, ఫిన్ సర్వ్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్‌బీఐ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు 5% నుంచి మూడుశాతం ర్యాలీ చేశాయి.
- ఫెడ్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పావెల్ ప్రసంగం తర్వాత నష్టాల పాలైన ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు రికవరీ అయ్యాయి. ఆసియాలో చైనా, హాంగ్‌కాంగ్ మినహా అన్ని దేశాల స్టాక్ సూచీలు ఒకశాతం లాభపడ్డాయి. యూరప్ మార్కెట్లు 0.50% బలపడ్డాయి. అమెరికా సూచీలు స్వల్ప నష్టాలతో ట్రేడ్ అవుతున్నాయి. దేశీయ మార్కెట్ ఇక్కడి నుంచి సానుకూల సంకేతాలు అందిపుచ్చుకున్నాయి.
- ఫెడ్ వడ్డీరేట్ల పెంపు ఖాయమని పావెల్ ప్రకటన తర్వాత ఆర్థిక మాంద్యం భయాలతో బ్రెంట్ క్రూడాయిల్ ధరలు దిగివచ్చాయి. యూరో కరెన్సీ బలపడటంతో డాలర్ ఇండెక్స్ 20 ఏళ్ల గరిష్ట స్థాయి నుంచి దిగివచ్చింది. ఈ అంశాలు సెంటిమెంట్‌ను మరింత బలోపేతం చేశాయి.

ధనాధన్ అదానీ...

- మార్కెట్ విలువ పరంగా అదానీ ట్రాన్స్‌మిషన్ దేశంలో టాప్–10 కంపెనీల్లో చోటు దక్కించుకుంది. ఇటీవల అదానీ గ్రూప్ షేర్ల ర్యాలీలో భాగంగా ఇంట్రాడేలో ఈ కంపెనీ షేరు ఐదుశాతం ఎగసి రూ.4,041 వద్ద ఏడాది గరిష్ట స్థాయిని తాకింది. షేరు దూకుడుతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.4.43 లక్షల కోట్లకు చేరింది. దీంతో దేశీయంగా తొమ్మిదో అత్యంత విలువైన కంపెనీగా అవతరించింది.

వచ్చే నెలలో ఐడీబీఐ విక్రయం

ప్రాథమిక బిడ్ల ఆహ్వానానికి ప్రభుత్వ యోచన

ప్రభుత్వం ఐడీబీఐ బ్యాంక్‌లో వాటా విక్రయానికి వీలుగా వచ్చే నెలలో ప్రాథమిక బిడ్లకు ఆహ్వానం పలకనున్నట్లు తెలుస్తోంది. ఇందుకు ఆర్‌బీఐతో చర్చలు తుది దశకు చేరినట్లు ప్రభుత్వ అధికారి ఒకరు పేర్కొన్నారు. వాటా విక్రయ అంశంపై కొన్ని అపరిష్కృత సమస్యలున్నట్లు తెలియజేశారు. వీటిపై ఆర్‌బీఐతోపాటు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీతో చర్చించవలసి ఉన్నట్లు వెల్లడించారు. వెరసి సెప్టెంబర్‌కల్లా ఆసక్తి వ్యక్తీకరణ బిడ్స్(ఈవోఐ) జారీకి వీలుంటుందని వివరించారు. అయితే ఆర్‌బీఐ, సెబీతో చర్చించవలసిన అంశాలను ప్రస్తావించలేదు. బ్యాంకింగ్ రంగంలో ఐడీబీఐ బ్యాంక్ ప్రైవేటీకరణకు 2021 మే నెలలోనే ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదముద్ర వేసింది. బ్యాంకులో వ్యూహాత్మక వాటా విక్రయానికితోడు యాజమాన్య నియంత్రణను సైతం బదిలీ చేసేందుకు అనుమతించింది. ప్రస్తుతం బ్యాంకులో ప్రభుత్వానికి 45.48% వాటా ఉంది. మరోవైపు ప్రమోటర్‌గా వ్యవహరిస్తున్న ఎల్‌ఐసీ మరింత అధికంగా 49.24 శాతం వాటాను పొందింది.

జీఆర్‌టీ జ్యువెలర్స్ నుంచి వెడ్డింగ్ కలెక్షన్



హైదరాబాద్: వివాహ వేడుకల కోసం జీఆర్‌టీ జ్యువెలర్స్ సాటిలేని హస్తకళతో ఆభరణాల డిజైన్లను విడుదల చేసింది. బంగారం, వజ్రాలు, ప్లాటినం, వెండి, విలువైన రత్నాలతో రూపొందిచిన ఉంగరాలు, గాజులు, చెవిదిద్దులు, నెక్లెస్‌లు, హారాలు, వడ్డాణాలు, మంకీలు వంటివి ఈ విస్తృత శ్రేణి కలక్షన్‌లో ఉన్నాయి. సంప్రదాయ ఆభరణాలకు బంగారు స్పర్శ, ట్రెండ్ జోడించిన ఈ ప్రత్యేక డిజైన్లు వివాహ వేడుకలను మరుపురాని క్షణాలుగా చిరస్మరణీయం చేస్తాయని కంపెనీ ఎండీ జీఆర్ అనంత పద్మనాభన్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

31-8-2022	
విశాఖ	425–00
చిత్తూరు	423–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	405–00
విజయవాడ	405–00
రిటైల్ ధర (డజను)	60.00
30-8-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	370–00
వరంగల్	372–00
రిటైల్ ధర	4.30

భవిత

టీఎస్ కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్ష-2022 కొశ్చన్ పేపర్ - ప్రాథమిక 'కీ' కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

• ప్రభుత్వ ఉద్యోగాల సమాచారం- జాబ్ పాయింట్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

ఏపీ ప్రభుత్వ జడ్పీ, ఎంపీ పాఠశాలల్లో 214 టీచర్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ..ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపల్/మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లో పరిమితంగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది. డిపార్ట్‌మెంట్ సెలక్షన్ కమిటీ(డీఎస్సీ)ద్వారా స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జీటీ, సంగీత ఉపాధ్యాయుల పోస్టులను భర్తీచేయనున్నారు.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 214; » **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, డిప్లొమా, ఇంటర్మీడియట్, డిగ్రీ, డీఈడీ, బీఈడీ ఉత్తీర్ణులై ఉండాలి.స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు ఏపీ టెట్ అర్హత తప్పనిసరిగా ఉండాలి.»**వయసు:** 44ఏళ్లలోపు ఉండాలి. ఎస్సీ/ఎస్టీ/బీసీలకు 49ఏళ్లు.

ఎంపిక విధానం

» **స్కూల్ అసిస్టెంట్:** టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్(టీఆర్‌టీ), ఏపీ టెట్ వెయిటేజీ ఆధారంగా ఎంపికచేస్తారు.» **మ్యూజిక్ టీచర్:** టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్(టీఆర్‌టీ), స్కిల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఎస్‌జీటీ:** టెట్ కమ్ టీఆర్‌టీ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 18.09.2022
» **పరీక్ష ప్రారంభం:** 23.10.2022 నుంచి;
» **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** http://cse.ap.gov.in

ఏపీ మోడల్ స్కూల్స్‌లో 207 టీచర్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాష్ట్ర ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ.. ఆదర్శ పాఠశాలలు, మహాత్మా జ్యోతిబాపులే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల సంస్థల్లోని వివిధ విభాగాల్లో పరిమితంగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది. డీఎస్సీ ద్వారా..పీజీటీ, టీజీటీ, ఆర్ట్ ఉపాధ్యాయుల పోస్టులను భర్తీచేస్తారు. » **మొత్తం పోస్టుల సంఖ్య:** 207

పోస్టుల వివరాలు

» **పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్లు(పీజీటీ)-176; సబ్జెక్టులు:** ఇంగ్లిష్, హిందీ, సివిక్స్, కామర్స్, ఎకనామిక్స్, మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, ఫిజికల్ సైన్స్, సోషల్ స్టడీస్. » **ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్లు(టీజీటీ)-31; సబ్జెక్టులు:**ఇంగ్లిష్,తెలుగు, గణితం, సైన్స్, సోషల్ స్టడీస్.
» **అర్హత:** ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ, బీఈడీ ఉత్తీర్ణులై ఉండాలి. టీజీటీ పోస్టులకు ఏపీ టెట్ అర్హత సాధించి ఉండాలి. **వయసు:** 44ఏళ్లలోపు ఉండాలి. ఎస్సీ/ఎస్టీ/బీసీలకు 49ఏళ్లు.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు. » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 18.09.2022
» **వెబ్‌సైట్:** http://cse.ap.gov.in

టీఎస్‌పీఎస్సీ-181 ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ పోస్టులు

తెలంగాణ రాష్ట్రంలోని మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలో.. ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్(సూపర్‌వైజర్) గ్రేడ్–1 పోస్టుల భర్తీకి టీఎస్‌పీఎస్సీ.. అర్హత కలిగిన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 181 » **అర్హత:** సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీఉత్తీర్ణులవ్వాలి.**వయసు:**44ఏళ్లు,ఎస్సీ/ఎస్టీ/బీసీలు 49ఏళ్లు ఉండాలి.
» **జీతం:** నెలకు రూ.35,720 నుంచి రూ.1,04,430 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష(ఆబ్జెక్టివ్ టైప్) ఆధారంగా
» **ఆన్‌లైన్ దరఖాస్తులు:** 08.09.2022 నుంచి 29.09.2022
» **పరీక్ష తేది:** డిసెంబర్ 2022.
» **వెబ్‌సైట్:** www.tspsc.gov.in

విదేశీ విద్యకు దీవెన

విదేశాల్లో ఉన్నత విద్య.. ప్రతి విద్యార్థి స్వప్నం! కాని అమెరికా, బ్రిటన్ లాంటి దేశాల్లోని అత్యున్నత శ్రేణి యూనివర్సిటీల్లో అడుగుపెట్టాలంటే.. రూ.50లక్షల నుంచి రూ.కోటి వరకు ఫీజులు, ఇతరత్రా వ్యయాలకు వెచ్చించాలి! దాంతో ఎందరో ప్రతిభావంతులు తమకు వచ్చిన అవకాశాలను సైతం వదులుకుంటున్న పరిస్థితి! ఇలాంటి విద్యార్థులకు అండగా నిలిచేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'జగనన్న విదేశీ విద్యా దీవెన' పథకం ప్రవేశ పెట్టింది. ఈ స్కాలర్‌షిప్ పథకం ద్వారా అంతర్జాతీయంగా ప్రతిష్టాత్మక యూనివర్సిటీల్లో ఉచితంగా ఉన్నత విద్యను పూర్తి చేసుకోవచ్చు. 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి ఫాల్ సెషన్ ప్రవేశాలు పొందే విద్యార్థులకు దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో.. జగనన్న విదేశీ విద్యా దీవెన పథకంతో ప్రయోజనాలు, లక్షిత వర్గాలు, కోర్సులు, ఎంపిక విధానం గురించి తెలుసుకుందాం..



» అంతర్జాతీయ స్థాయిలో టాప్ 200 వర్సిటీల్లో ఉచిత ఉన్నత విద్య
» ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అగ్రవర్ణ పేదలకు ఉచిత విదేశీ విద్య
» టాప్-100 వర్సిటీల్లో చేరితే పూర్తి ట్యూషన్ ఫీజు చెల్లింపు
» 101-200 వర్సిటీల్లో చేరితే రూ.50 లక్షల వరకు చేయూత
» క్యూఎస్ ర్యాంకింగ్స్ ప్రామాణికంగా వర్సిటీల గుర్తింపు
» ప్రతి ఏటా స్ప్రింగ్, ఫాల్ సెషన్ ప్రవేశాలు పొందిన వారికి స్కాలర్‌షిప్
» ఫాల్ సెషన్‌కు సెప్టెంబర్ 30 వరకు దరఖాస్తుకు అవకాశం

'విదేశీ విద్య..అందులోనూ..ఎంఐటీ, కేంబ్రిడ్జ్, స్టాన్‌ఫర్డ్, హార్వర్డ్ వంటి అత్యున్నత శ్రేణి యూనివర్సిటీల్లో అడుగుపెట్టాలంటే లక్షలు వెచ్చించాల్సిందే.దీంతో ఎంత ప్రతిభ ఉన్నా.. అంతర్జాతీయంగా టాప్ యూనివర్సిటీల్లో చదువుకోవాలనే కల..కలగానే మిగిలిపోతోంది. ఇలాంటి పరిస్థితుల్లో విద్యార్థులకు అండగా నిలుస్తూ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న విదేశీ విద్యా దీవెన' పథకాన్ని ప్రవేశ పెట్టింది. ఈ స్కాలర్‌షిప్ పథకాన్ని 2022-23 నుంచి అమలు చేయనున్నారు.

100 శాతం ట్యూషన్ ఫీజు చెల్లింపు

- జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం ద్వారా.. క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్‌లో టాప్-200 జాబితాలో నిలిచిన యూనివర్సిటీల్లో.. ఎంబీబీఎస్, పీజీ, పీహెచ్‌డీ స్థాయి కోర్సుల్లో ప్రవేశం ఖరారు చేసుకున్న వారికి ప్రభుత్వ ఆర్థిక సాయం అందిస్తారు.
- క్యూఎస్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్ ప్రకారం-టాప్-100 జాబితాలో ఉన్న యూనివర్సిటీల్లో ప్రవేశం పొందితే మొత్తం ట్యూషన్ ఫీజు(100శాతం)ను చెల్లిస్తారు.
- క్యూఎస్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్ ప్రకారం-101-200 జాబితాలోని యూనివర్సిటీల్లో ప్రవేశం పొందితే.. ట్యూషన్ ఫీజు మొత్తంలో యాభై శాతం లేదా రూ.50 లక్షలు(ఈ రెండింటిలో ఏది తక్కువైతే ఆ మొత్తాన్ని)సాయంగా అందజేస్తారు.
- అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న సమయానికి అందుబాటులో ఉన్న జాబితా ప్రకారం-క్యూఎస్ వరల్డ్‌యూనివర్సిటీ ర్యాంకులను పరిగణనలోకి తీసుకుంటారు.

పేద వర్గాలకు.. అండగా

జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం ప్రధాన ఉద్దేశం.. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బీసీ, ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణ పేద వర్గాలకు చెందిన విద్యార్థులు ప్రపంచంలోని టాప్ యూనివర్సిటీల్లో ఉన్నత విద్య కోర్సులు పూర్తి చేసుకునేలా.. అవసరమైన ఆర్థిక సాయం అందించడం.

అర్హత ప్రమాణాలు

- ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బీసీ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెంది ఉండాలి.
- కుటుంబ వార్షికాదాయం రూ.ఎనిమిది లక్షలు దాటకూడదు. • దరఖాస్తు నోటిఫికేషన్ తేదీ నాటికి 35 ఏళ్లలోపు ఉండాలి.
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నివాసితులై ఉండాలి.

విద్యార్హతలు

- **పీజీ కోర్సులు అర్హత:** ఇంజనీరింగ్/మేనేజ్‌మెంట్/ప్యూర్ సైన్సెస్/అగ్రికల్చర్ సైన్సెస్/మెడిసిన్ అండ్ నర్సిగ్/సోషల్ సైన్సెస్/హ్యుమానిటీస్ విభాగాల్లో బ్యాచిలర్ డిగ్రీలో 60% మార్కులతో ఉత్తీర్ణత ఉండాలి.
- **పీహెచ్‌డీకి అర్హత:** ఇంజనీరింగ్/మేనేజ్‌మెంట్/ప్యూర్ సైన్సెస్/అగ్రికల్చర్ సైన్సెస్/ మెడిసిన్ అండ్ నర్సిగ్/సోషల్ సైన్సెస్/హ్యుమానిటీస్ విభాగాల్లో పీజీలో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి.
- **ఎంబీబీఎస్ కోర్సుకు అర్హత:** 60 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణతతో పాటు నీట్‌లో ర్యాంకు సాధించాలి.
- టోఫెల్/ఐఈఎల్‌టీఎస్/జీఆర్‌ఈ/జీమ్యాట్ స్కోర్.
- చెల్లుబాటులో ఉన్న పాస్‌పోర్ట్, వీసా.
- క్యూఎస్ టాప్-200 జాబితాలోని యూనివర్సిటీల్లోనే ప్రవేశం ఖరారు చేసుకోవాలి.
- పథకం ద్వారా ఎంపికైన అభ్యర్థులు ఎంపికైన తేదీ నుంచి ఆరు నెలలోపు సంబంధిత యూనివర్సిటీ/ఇన్‌స్టిట్యూట్‌లో చేరాలి.

అనుమతించే కోర్సులివే

- జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం మార్గదర్శకాల ప్రకారం-ఉచిత విదేశీ విద్యకు అర్హమైన కోర్సులను పేర్కొన్నారు. అవి...
- ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, ప్యూర్ సైన్సెస్, అగ్రికల్చర్ సైన్సెస్, మెడిసిన్ అండ్ నర్సింగ్, సోషల్ సైన్సెస్, హ్యుమానిటీస్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులు.
- ఇవే విభాగాల్లో పీహెచ్‌డీ. బ్యాచిలర్ డిగ్రీ స్థాయిలో ఎంబీబీఎస్ కోర్సు.

ఏటా రెండుసార్లు దరఖాస్తుల స్వీకరణ

విదేశాల్లోని యూనివర్సిటీలు.. ప్రతి విద్యా సంవత్సరంలో.. సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు ఫాల్ సెషన్ పేరుతో; అదే విధంగా జనవరి నుంచి మే వరకు స్ప్రింగ్ సెషన్ పేరుతో ప్రవేశాలు కల్పిస్తుంటాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా జగనన్న విదేశీ విద్యా దీవెనకు అర్హులైన అభ్యర్థులకు ఆర్థిక సాయం అందించేందుకు ప్రతి ఏటా రెండుసార్లు దరఖాస్తులు స్వీకరించాలని నిర్ణయించింది. అంటే.. విద్యార్థులు ఏ సెషన్‌లో ప్రవేశాలు ఖరారు చేసుకున్నా.. ఆర్థిక సాయం పొందొచ్చు. 2022-23 విద్యా సంవత్సరంలో.. ఫాల్ సెషన్ ప్రవేశాలు పొందిన విద్యార్థులు ఈ ఏడాది సెప్టెంబర్ 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. అదే విధంగా స్ప్రింగ్ సెషన్ ప్రవేశాల విషయంలో.. జనవరి 1 నుంచి ఫిబ్రవరి చివరి రోజు వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఆన్‌లైన్ దరఖాస్తు ఇలా

జగనన్న విదేశీ విద్యా దీవెన పథకానికి అర్హులైన అభ్యర్థులు.. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. నిర్దేశిత డాక్యుమెంట్లను https://jnanabhumi.ap.gov.in పోర్టల్ ద్వారా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఈ దరఖాస్తు ప్రక్రియ పూర్తయిన తర్వాత.. సంబంధిత వివరాలు.. ముందుగా జిల్లా స్థాయిలో ఆయా సంక్షేమ శాఖకు చెందిన జిల్లా అధికారులకు ఆన్‌లైన్‌లో కనిపిస్తాయి. వీటిని సదరు అధికారులు పరిశీలించి.. అన్ని డాక్యుమెంట్లు, ఇతర వివరాలు పథకం మార్గదర్శకాల మేరకు.. సరిగా ఉన్నాయని ధ్రువీకరిస్తే.. సంబంధిత సంక్షేమ శాఖలు/కార్పొరేషన్‌కు చెందిన రాష్ట్ర స్థాయి అధికారికి ఆన్‌లైన్‌లో కనిపిస్తాయి. ఆ తర్వాత వాటిని సదరు అధికారి.. ఈ పథకం కోసం ప్రత్యేకంగా నియమించిన రాష్ట్ర స్థాయి కమిటీకి అందజేస్తారు.

రాష్ట్ర స్థాయి కమిటీ ముందు హాజరు

ఆయా సంక్షేమ శాఖలు/కార్పొరేషన్‌కు సంబంధించిన అధికారులు.. జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం రాష్ట్ర స్థాయి కమిటీకి దరఖాస్తులను పంపిన తర్వాత.. కమిటీ పేర్కొన్న తేదీన సదరు విద్యార్థులు కమిటీ ముందు హాజరుకావల్సి ఉంటుంది. సంబంధిత శాఖ ముఖ్య కార్యదర్శి/కార్యదర్శి చైర్మన్‌గా వ్యవహరించే ఈ కమిటీలో ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి కార్యదర్శి, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్‌లు సభ్యులుగా, సంబంధిత సంక్షేమ శాఖ కమిషన్/డైరెక్టర్ మెంబర్-కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు ప్రక్రియలో అర్హులైన విద్యార్థుల దరఖాస్తులను ఈ కమిటీ పరిశీలించి.. తుది ఎంపిక చేపడుతుంది.

నాలుగు విడతలుగా చెల్లింపు

- జగనన్న విదేశీ విద్యా దీవెన పథకానికి ఎంపికైన అభ్యర్థులకు స్కాలర్‌షిప్ మొత్తాన్ని నాలుగు విడతల్లో చెల్లిస్తారు.
- సదరు దేశంలో అడుగు పెట్టేందుకు ల్యాండింగ్ పర్మిట్ అందించిన తర్వాత మొదటి వాయిదాను చెల్లిస్తారు.
- రెండో వాయిదాను అభ్యర్థులు చదువుతున్న కోర్సు మొదటి సెమిస్టర్ లేదా టర్మ్ ఫలితాలు చూపాక.. మూడో వాయిదాను రెండో సెమిస్టర్ లేదా టర్మ్ ఫలితాలు అందించాక.. కోర్సు నాలుగో సెమిస్టర్/చివరి సెమిస్టర్ పూర్తి చేసుకుని.. వాటి మార్క్‌షీట్‌ను ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేశాక.. చివరి విడత నిధులు అందిస్తారు.
- పీహెచ్‌డీ, ఎంబీబీఎస్ విద్యార్థుల విషయంలో ప్రతి విడత నిధులను అంతకు ముందు వార్షిక లేదా సెమిస్టర్ ఫలితాల ఆధారంగా విడుదల చేస్తారు.
- ఈ పథకంలో భాగంగా.. ప్రవేశం పొందిన దేశానికి వెళ్లేందుకు విమానయాన వ్యయం, వీసా ఫీజురీయింబర్స్‌మెంట్ కూడా లభిస్తుంది.

రాష్ట్ర కమిటీ నిరంతర పరిశీలన

దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు సాయం అందించడంలో ఎలాంటి జాప్యం జరగకుండా.. రాష్ట్ర స్థాయి కమిటీ దరఖాస్తులను నిరంతర పరిశీలించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దీనివల్ల అర్హులైన విద్యార్థులకు సకాలంలో స్కాలర్‌షిప్ అనుమతులు మంజూరవుతాయి. తద్వారా వారు ఎలాంటి ఆందోళన లేకుండా.. తమ విదేశీ విద్య స్వప్నాన్ని సాకారం చేసుకునే అవకాశం లభించనుంది.

ఫాల్ సెషన్ దరఖాస్తులు

ఆన్‌లైన్‌లో సెప్టెంబర్ 30లోపు జ్ఞానభూమి పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఆన్‌లైన్ దరఖాస్తుతోపాటు నిర్దేశిత డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అవి..

- గ్రామ/వార్డ్ సచివాలయం జారీ చేసిన కుల ధ్రువీకరణ పత్రం.
- గ్రామ/వార్డ్ సచివాలయం మంజూరు చేసి.. జిల్లా కలెక్టర్ ప్రత్యక్షంగా ధ్రువీకరించిన ఇన్‌కం సర్టిఫికెట్.
- వయో పరిమితిని నిర్ధారించేందుకు పదో తరగతి/పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం.
- ఆధార్ కార్డ్.
- మీ సేవ/రెవెన్యూ శాఖ జారీ చేసిన స్థానికత సర్టిఫికెట్. • నిర్దేశిత విద్యార్హతల సర్టిఫికెట్లు, మార్క్ షీట్లు.
- నీట్ స్కోర్ కార్డ్(ఎంబీబీఎస్ కోర్సులో ప్రవేశానికి)
- టోఫెల్/ఐటీఎల్‌టీఎస్/జీఆర్‌ఈ/జీమ్యాట్ స్కోర్ షీట్.
- సంబంధిత విదేశీ యూనివర్సిటీ నుంచి అడ్మిషన్ ఆఫర్ లెటర్.
- కుటుంబ సభ్యుల ఆదాయం పన్ను రిటర్న్ కాపీలు(అవసరమైన సందర్భాల్లో).
- కుటుంబంలో తాను, మరెవరూ ఇలాంటి పథకం ద్వారా లబ్ధి పొందట్లేదని తెలియజేస్తూ స్వీయ ధ్రువీకరణ.
- వీటితోపాటు పాస్‌పోర్ట్‌సైజ్ ఫోటోగ్రాఫ్, స్కాన్ చేసిన సంతకాన్ని కూడా ఆన్‌లైన్ దరఖాస్తులో అప్‌లోడ్ చేయాలి.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://jnanabhumi.ap.gov.in

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798.



వినాయక చవితి శుభాకాంక్షలతో...
Cell Point
గణపతి బప్ప మోరియా
22 Years
MOST TRUSTED BRAND
CASH BACK
Smart TV 32" (80cms)
EASY EMI
₹99* NECKBAND
₹199* AIR PODS
₹15,999
₹9,999
upto ₹6000 CASH BACK
₹499* SMART WATCH
₹999* SMART CALLING WATCH
vivo
X80 ₹5000 CASH BACK
V25Pro ₹3000 CASH BACK
V23E ₹2500 CASH BACK
Y75 ₹1500 CASH BACK
oppo
Reno 8 pro ₹4000 CASH BACK
F21 Pro ₹2000 CASH BACK
A96 ₹1000 CASH BACK
A57 ₹1000 CASH BACK
iphone 12 | 13
Pay ₹1 Get iphone Easy EMI
K50i upto ₹3000 CASH BACK
NOTE 11 PRO PLUS upto ₹3000 CASH BACK
9A SPORT upto ₹1000 CASH BACK
ONEPLUS
10 PRO upto ₹11000 CASH BACK
NORD 2T upto ₹1500 CASH BACK
SAMSUNG
Z FLIP 4
Z FOLD 4
Galaxy Watch 4 Classic Worth
₹34,999
₹2,999
upto ₹8000 CASH BACK
upto ₹8000 UP GRADE
realme
C21Y
FREE AIR PODS
₹2,499
SPECIAL OFFER
micromax
IN2C (3+32GB)
IN2B (4+64GB)
FREE SMART WATCH
₹2,999
SPECIAL OFFER
Cell Point
IDFC FIRST Bank
HDB
BAJAJ FINSERV
HDFC BANK
zest
HOME CREDIT
Pine Labs
* Conditional Apply
శ్రీకాకుళం 08942 228383 • 7 రోడ్ల జంక్షన్ • SBI ఎదురుగా, జి.టి రోడ్ విజయనగరం 90322 15143 • పూల్‌భాగ్ రోడ్, మూడులాంతర్ల జంక్షన్ • హోటల్ వైట్ల రెసిడెన్సీ, ఆర్.టి.సి కాంప్లెక్స్
• స్వామి కాంప్లెక్స్, వాసు ఆప్టికల్స్ ఎదురుగా • గణేష్ బేకరీ ఎదురుగా, మూడులాంతర్ల జంక్షన్. • ఎస్.కోట రాజాం • షాప్ నెం.7, తిరుమల కాంప్లెక్స్, సంపత్ భవన్ ఎదురుగా.
పార్వతీపురం • సూర్యకళ కాంప్లెక్స్, మెయిన్ రోడ్ • షాప్ నెం.13-462, వల్లభరావ్ కాంప్లెక్స్, సూపర్ మార్కెట్ దగ్గర, కరూర్ వైశ్యాబ్యాంక్ ప్రక్కన, మెయిన్ రోడ్.
బొబ్బిలి • షాప్ నెం.16, మున్సిపల్ కాంప్లెక్స్, పాత బస్‌స్టాండ్, డా॥ రెడ్డి సత్యారావు హాస్పిటల్ ఎదురుగా.